www.visalaandhra.com
స్థాపితం : 1952
విశాలాంధ్ర
VISALAANDHRA Regd No.VJ/042/2018-20
అక్షరాక్షరం అభ్యుదయం

సంపుటి : 68 సంచిక : 215 | సోమవారం 28-01-2019 | Simultaneously published from Vijayawada, Hyderabad, Visakapatnam, Kurnool, Tirupathi, Karimnagar, Khammam | వెల: రూ.4.00 | పేజీలు: 12+ టాబ్లాయిడ్ | విజయవాడ ప్రచురణ

దాచేస్తున్నారు

మోడీ సర్కార్ దాగుడు మూతలు

- సమాచారం ఇచ్చేందుకు నిరాకరణ
- నల్లధనంపై ఆర్థికశాఖకు అంచనా కరవు
- 7 శాతానికి చేరుకున్న నిరుద్యోగం
- లేబర్‌బ్యూరో నివేదికనూ దాచేసిన కేంద్రం

మోడీ సర్కార్ పారదర్శకతకు పాతరేస్తోంది. అధికారిక రికార్డుల విషయంలో దాపరికాన్ని పాటిస్తోంది. పైకి పాలనంతా పారదర్శకంగా ఉందని కబుర్లు చెబుతూ, గణాంకాల వెల్లడిలో దాగుడు మూతలాడుతోంది. నాలుగున్నరేళ్ల పాలనలో ప్రధాని మోడీ ఎంతో అభివృద్ధిని సాధించారంటూ అనుంగు అనుచరగణం ప్రచారం చేస్తోంది. కానీ, వారి ప్రచారానికి, అధికారిక గణాంకాలకు ఏమాత్రం పొంతనే ఉండటం లేదు. దీంతో వాస్తవాలు బయటకు పొక్కకుండా కేంద్రం జాగ్రత్తపడుతోంది.



న్యూఢిల్లీ : గత యూపీఏ ప్రభుత్వంలో అధికారిక రికార్డులైనా ఎంతోకొంత పారదర్శకంగా ఉండేవి. మోడీ పాలనలో అది పూర్తిగా కొరవడింది. దేశ దశ, దిశను నిర్దేశించే కీలక అంశాలను సైతం ప్రజలకు తెలియనీయకుండా దాచేయటం పలు విమర్శలకు తావిస్తోంది. 2014లో అధికారంలోకి వచ్చినప్పటి నుంచి ఇప్పటి వరకు మోడీ పాలన, ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలలో ఎన్ని నెరవేర్చారోనని ఆరా తీయటంతోపాటు సర్వేలు నిర్వహించేవారుంటారనే ఉద్దేశంతోనే అధికారిక రికార్డులను అతి రహస్యంగా దాచేశారనే

- మిగతా 2 లో


గుంటూరు జనసేన శంఖారావంలో పవన్, హాజరైన జనసైనికులు

మార్పు కోసం పోరు

- వారసత్వ, అవినీతి రాజకీయాలకు స్వస్తి
- అమరావతిలో జనసేన జెండా రెపరెపలాడుతుంది
- ప్రత్యేక హోదాపై సమైక్య పోరు
- ఉత్తరాది అహంకారం దించుతాం
- జనసేన శంఖారావ సభలో పవన్ కల్యాణ్

విశాలాంధ్రబ్యూరో-గుంటూరు : 'సమాజంలో అవినీతి వ్యవస్థను మార్చడానికి నేను సిద్ధం. మీరూ సిద్ధమా' అని జనసేన అధినేత పవన్ కల్యాణ్ ప్రజలను ప్రశ్నించారు. జనసేన పార్టీ గుంటూరు జిల్లా కార్యాలయ ప్రారంభానికి విచ్చేసిన పవన్ ఎల్‌ఈఎం స్కూల్ గ్రౌండ్‌లో ఆదివారం జరిగిన జనసేన శంఖారావ సభలో మాట్లాడారు. 'నేను బాపట్లలో పుట్టిన వాడిని. దశాబ్దం తరువాత గుంటూరు సభకు వచ్చాను. దెబ్బతిని వచ్చాను. కడుపు మండి ఉన్నాను. అవినీతి, వారసత్వ రాజకీయాలతో విసిగిపోయాను. రాష్ట్రంలో అవినీతి ప్రక్షాళన జరగాల్సిందే. అందుకే సినిమాను వదిలి రాజకీయాలలోకి వచ్చాను' అని పవన్ చెప్పారు. 2003లోనే రాజకీయ ప్రవేశంపై నిర్ణయం తీసుకున్నానని అన్నారు. 'బాధలలో ఉన్న అన్నదమ్ములు, అక్కచెల్లెళ్లకు అండగా ఉండేందుకే వచ్చాను. నా దగ్గర డబ్బులు లేవు.. కానీ నన్ను నమ్మి నా వెంట నడిచే వారు లక్షల మంది వస్తారన్నదే నా ధైర్యం' అని అన్నారు. 'మా నాన్న సీఎం కాబట్టి

- మిగతా 11 లో

వైసీపీ గూటికి దగ్గుబాటి

త్వరలో కుమారుడి చేరిక


3లో

మరో 24 గంటలు వర్షాలే


2లో

కోట్లాది కేసుల పెండింగ్

9లో హైకోర్టుల్లో 47.68 లక్షల కేసులు

రైతులకు మేలు చేయని ఫసల్‌బీమా

9లో కేజ్రీవాల్ విమర్శ


విజయవాడ చేరిన జనఘోష రైలు యాత్రకు స్వాగతం పలుకుతున్న రామకృష్ణ. చిత్రంలో కొణతాల, బాబ్జీ, దోనేపూడి తదితరులు

ఉద్యమం ఉధృతం

- విభజన హామీలు నెరవేర్చాల్సిందే..
- సిగ్గులేకుండా రూ. 350 కోట్లు వెనక్కు తీసుకున్న కేంద్రం
- జనఘోష రైలు యాత్రకు రామకృష్ణ సంఘీభావం
- మోడీ, బీజేపీ వ్యతిరేక నినాదాలతో హోరెత్తిన బెజవాడ రైల్వేస్టేషన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : మోడీ ప్రభుత్వం ఇప్పటికైనా దిగివచ్చి రాష్ట్రానికి ప్రత్యేక హోదాతోపాటు విభజన హామీలను నెరవేర్చాలని, లేకుంటే ఉద్యమం మరింత తీవ్రంగా ఉంటుందని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ హెచ్చరించారు. బీజేపీ అధికారం చేపట్టి నాలుగేళ్ల తొమ్మిది నెలలు గడచినా రాష్ట్రానికి ఏ విషయంలోనూ న్యాయం చేయలేదని ఆయన

- మిగతా 2 లో

బీసీలకు పెద్దన్నలా...

- చట్టబద్ధతతో సబ్ ప్లాన్,
- పారిశ్రామికవేత్తలుగా ప్రోత్సాహం
- బడ్జెట్‌లో రూ. 3 వేల కోట్ల కేటాయింపు
- శెట్టిబలిజ, యాదవ, అగ్నికుల, క్షత్రియులకూ కార్పొరేషన్లు
- 25 పార్లమెంటు, 150 ఎమ్మెల్యే స్థానాల్లో గెలుస్తాం
- జయహో బీసీ సభలో సీఎం

విశాలాంధ్ర - రాజమహేంద్రవరం : ఎస్సీ, ఎస్టీ సబ్‌ప్లాన్ మాదిరిగానే బీసీలకూ సబ్ ప్లాన్‌ను తెచ్చి చట్టబద్దత కల్పిస్తామని సీఎం చంద్రబాబు చెప్పారు. బీసీలుసైతం పారిశ్రామిక వేత్తలుగా ఎదిగేందుకు ప్రభుత్వపరంగా ప్రోత్సాహం కల్పిస్తామని తెలిపారు. టీడీపీ ఆధ్వర్యంలో తూర్పు గోదావరి జిల్లా రాజమహేం ద్రవరం ఆర్ట్స్ కళాశాల మైదానంలో 'జయహో బీసీ' సభ ఆదివారం జరిగింది. ఈ సభకు ముఖ్య అతిధిగా హాజరైన సీఎం చంద్రబాబు బీసీలకు వరాల జల్లు కురిపించారు. మొదటి నుంచి టీడీపీని ఆదరిస్తున్న బీసీల హామీలను నెరవేర్చేందుకు బడ్జెట్‌లో రూ.3 వేల కోట్ల నిధులు కేటాయిస్తామని చెప్పారు. అగ్నికుల క్షత్రియులను ఎస్సీల్లో చేర్చేందుకు ఇప్పటికే కమిషన్ వేశామని, నివేదిక రాగానే ఢిల్లీ పంపిస్తామన్నారు. వారికి కూడా ప్రత్యేకంగా కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు. శెట్టిబలిజ, ఈడిగ, శ్రీశయన కులాలకు ఒక కార్పొరేషన్, యాదవులు, తూర్పుకాపులు, కొప్పుల వెలమ, చేనేతలకు, కాళింగులు, గవర్లు, రజకులు, గాండ్లకు ప్రత్యేకంగా కార్పొరేషన్‌లను ఏర్పాటు చేస్తామని హామీ ఇచ్చారు. అలాగే విశ్వబ్రాహ్మణ, మేదర, వడ్డెర, నాయీ బ్రాహ్మణుల ఫెడరేషన్‌లను కార్పొరేషన్లుగా మారుస్తామన్నారు. వారి షాపులకు 150 యూనిట్ల విద్యుత్‌ను ఉచితంగా సరఫరా చేస్తామని చెప్పారు. రాజధాని అమరావతిలో ఆదర్శవంతమైన మ్యూజిక్ కాలేజీని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ప్రభుత్వాసుపత్రులు, జైళ్లు, పోలీసుశాఖలో నాయి బ్రాహ్మణులకు పని కల్పించేందుకు జీఓ నంబర్

- మిగతా 11 లో


రాజమహేంద్రవరం జయహో బీసీ సభలో శంఖం ఊదుతున్న చంద్రబాబు



ఆస్ట్రేలియా ఓపెన్ విజేత జకోవిచ్

నాదల్‌పై సంచలన విజయం

జకో ఖాతాలో 15వ గ్రాండ్‌స్లామ్

12లో



'ఇండో మాస్టర్స్' విజేత సైనా

ఈ ఏడాది తొలి టైటిల్

కరోలినా మారిన్‌పై అనూహ్య విజయం

12లో

ఆ నివేదికలన్నీ

బుట్టదాఖిలు

- జయతిఘోష్, స్వామినాథన్, రాధాకృష్ణ కమిషన్ నివేదికలు ఏమయ్యాయి?
- రైతులపై పాలకుల కపట ప్రేమ
- పంటలకు కనీస మద్దతు ధర లేదు
- కల్తీ విత్తనాలు, ఎరువుల నియంత్రణలో వైఫల్యం
- జేఎన్‌యూ ప్రొఫెసర్ జయతిఘోష్


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న జయతిఘోష్. పక్కన రైతు నాయకులు

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : రైతు సమస్యల పరిష్కారానికి కమిషన్‌లు వేస్తున్నారుగానీ, ఆ కమిషన్‌లు ఇచ్చే నివేదికలను ప్రభుత్వాలు అమలు చేయడం లేదని ప్రముఖ ఆర్థికవేత్త, జేఎన్‌యూ ఢిల్లీ ప్రొఫెసర్ జయతిఘోష్ ఆవేదన వ్యక్తం చేశారు. విజయవాడ ఎంబీ భవన్‌లో ఆదివారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ 15ఏళ్ల క్రితం అప్పటి సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి హయాంలో రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై అధ్యయనం చేయడానికి తన అధ్యక్షతన జయతిఘోష్ కమిషన్ ఏర్పడిందన్నారు. కొన్నినెలలు రాష్ట్రంలో పర్యటించి రైతు సమస్యలను గుర్తించి, వాటి పరిష్కార మార్గాలు చూపుతూ నివేదిక ఇచ్చామన్నారు. ఆ నివేదికను అమలు చేయలేదన్నారు. ఎంఎస్ స్వామినాథన్

- మిగతా 2 లో

ఇదీ లోకం!



హమ్మయ్యా ఇంట్లో అందరం తలా ఒక పార్టీలో చేరిపోయాం..ఇక ఎవరెవరు ఎమ్మెల్యే అవుతారో చూద్దాం..

31 నుంచి పార్లమెంట్ సమావేశాలు



న్యూఢిల్లీ : పార్లమెంట్ బడ్జెట్ సమావేశాలు ఈనెల 31 నుంచి ఫిబ్రవరి 13 వరకు జరగనున్నాయి. సమావేశాలకు సంబంధించి చర్చించేందుకు రాజ్యసభ ఛైర్మన్, లోక్‌సభ స్పీకర్ అన్ని పార్టీల నాయకులతో భేటీకానున్నారు. ఈనెల 30వ తేదీన లోక్‌సభ స్పీకర్ సుమిత్రా మహాజన్ అధ్యక్షతన అఖిలపక్ష సమావేశం జరగనుంది. 31న రాజ్యసభ ఛైర్మన్ వెంకయ్య నాయుడు అన్ని పార్టీల ఫ్లోర్ లీడర్లలో సమావేశం అవుతారు. లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో కేంద్ర ప్రభుత్వం ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనుంది. ఫిబ్రవరి 1న కేంద్ర మంత్రి పీయూష్ గోయల్ లోక్‌సభలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెట్టనున్నారు.

సిలబస్ పరేషాన్

- పరీక్షల పొడిగింపు ఏది..?
- దరఖాస్తు గడువు పెంపుతోనే సరి..!
- అయోమయంలో అభ్యర్థులు
- విస్తృత సిలబస్‌తో అవస్థలు

APPSC

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న గ్రూప్-1,2 ప్రిలిమ్స్ (స్క్రీనింగ్ టెస్ట్) దరఖాస్తులకు గడువు పెంచి, పరీక్షల వ్యవధిని పొడిగించకపోవడంపై సర్వత్రా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. యూపీఎస్సీ తరహాగా ఈ విడత గ్రూప్-1 సిలబస్‌ను రూపొందించారు. పేపర్-1తోపాటు కొత్తగా పేపర్-2 ప్రవేశపెట్టారు. ఈ రెండు పేపర్ల సిలబస్‌ను అధ్యయనం చేయడానికి దాదాపు ఆరు నెలల నుంచి ఏడాదిపాటు సమయం అవసరమవుతుందని అభ్యర్థులు చెబుతున్నారు. గ్రూప్-1 ప్రిలిమ్స్ పేపర్-2లోని సైన్స్ అండ్ టెక్నాలజీ, మెంటల్ ఎబిలిటీని 150మార్కులకు కేటాయించారు. ఇది ఆర్ట్స్ అభ్యర్థులకు కష్టతరంగా మారిందని పలువురు వాపోతున్నారు. సైన్స్, మ్యాథ్స్ బ్యాక్‌గ్రౌండ్ ఉన్నవారే.. పేపర్-2లో అత్యధికంగా మార్కులు స్కోర్‌చేసే అవకాశముందని అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. దాదాపు రెండేళ్ల గడువుతో ప్రిలిమ్స్ పరీక్షలు నిర్వహించడం వల్ల సీరియస్‌గా ప్రిపేర్ వారంతా అన్యాయానికి గురవుతారనే వాదనలున్నాయి. ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న ఉద్యోగాల్లో గ్రూప్-1,2,3 పోస్టులకు అభ్యర్థులు అధికంగా దరఖాస్తు చేశారు. ఈ పరీక్షలను ఆన్‌లైన్లో నిర్వహించడం వల్ల అభ్యర్థులకు అన్యాయం

- మిగతా 2 లో

బ్రెజిల్ ప్రమాదంలో 34కు పెరిగిన మృతులు

బ్రసీలియా : బ్రెజిల్‌లో ఇనుప ఖనిజం గనికి సమీపంలో తెగిపోయిన ఆనకట్ట ప్రమాదంలో మృతుల సంఖ్య 34కు పెరిగింది. ఆనకట్ట తెగిపోవడం వల్ల ఒక్కసారి నీరు వరదలాగా ప్రవహించి గనిలో పనిచేస్తున్న వారితో సహా సమీప ఇళ్లలో నివశిస్తున్న వారుకూడా అనేక మంది చనిపోయారు. వందలాదిమంది కనిపించడం లేదని, వారికోసం ఆదివారం ఉదయం నుంచి గాలింపు జరుపుతున్నట్లు గని యాజమాన్య సంస్థ వలే ఎస్‌ఏ తెలిపింది.

రెండు రోజుల క్రితం ఆనకట్ట తెగిపోయి గనిలో వచ్చిన వ్యర్థాల కింద పడి అనేకమంది చనిపోయారు. యాజమాన్య సంస్థకు చెందిన భవనాలు తదితర వసతి ప్రాంతాలను కూడా ఈ నీరు ముంచెత్తింది. ఆనకట్ట నుంచి బురద ప్రవాహం ఉధృతంగా వచ్చి, ప్రజలను ముంచెత్తింది. ఇంతవరకు 34 మంది చనిపోయారని, 23 మందిని ఆసుపత్రిలో చేర్చారని, 250 మందికి పైగా కనిపించడం లేదని మినాస్ గెరియాస్ రాష్ట్ర అగ్నిమాపకదళ విభాగం ధృవీకరించింది. కనిపించకుండా పోయిన వారంతా యాజమాన్య సంస్థ ఉద్యోగులు లేదా కాంట్రాక్టర్లేనని పోలీసులు తెలియచేశారు. వరద ప్రవాహంలో చిక్కుకున్న బస్సులో ట్రైన్‌లో ప్రయాణిస్తున్న వారిలో ఎక్కువ మంది బ్రతికి బయటపడ్డారని సమీపంలోని ఇళ్లలో ఉన్నవారు బురదలో ఇరుక్కుపోయి మరణించారని అగ్నిమాపక దళం తెలిపింది. ఈ ప్రమాదంతో భీతావహులైన సమీప ఇళ్లలో నివశిస్తున్న కనిపించకుండా పోయిన వారి కుటుంబీకులు యాజమాన్య సంస్థ గిడ్డంగిలో తలదాచుకున్నారు. ఆప్రాంతంలో జీవించి ఉన్న వారికోసం డజనుకు పైగా హెలికాప్టర్లు గాలించాయని అయితే ఇంతవరకు జీవించి ఉన్నవారి ఆచూకీ తెలియలేదని, మినాస్ గెరియాస్ రాష్ట్ర గవర్నర్ రొమిజెమ తెలిపారు.



ప్రపంచం

వెనుజులాలోనే అమెరికా దౌత్యవేత్తలు

ఉద్రిక్తతల సడలింపునకు మదురో ప్రకటన

కారకాస్ : ప్రతిపక్షనాయకుడు జాన్ గుయ్‌డొ తిరుగుబాటుకు యత్నించిన నేపథ్యంలో అమెరికా, వెనుజులా మధ్య ఏర్పడిని ఉద్రిక్తతలను సడలించేందుకు ఆ దేశ అధ్యక్షుడు నికొలస్ మదురొ చర్యలు తీసుకున్నారు. అమెరికా దౌత్యవేత్తలు 72 గంటల్లో దేశాన్ని విడిచి వెళ్లాలని మొదట చేసిన ప్రకటనను ఆయన తాజాగా ఉపసంహరించుకున్నారు. అమెరికా అండదండలతో గుయ్‌డొ తిరుగుబాటుకు యత్నించారు. తానే తాత్కాలిక దేశాధ్యక్షుడినని ప్రకటించుకున్నారు. గయ్‌డొకి అన్ని విధాలుగా సహాయ పడుతున్న అమెరికా వెంటనే ఆయన నాయకత్వాన్ని గుర్తిస్తున్నట్లు ప్రకటించింది. ట్రంప్‌తోపాటు అమెరికా అనుంగు దేశాలు కొన్ని గుయ్‌డొను గుర్తించాయి. మదురోకు రష్యా, చైనా, క్యూబా, మెక్సికో, టర్కీ తదితర దేశాలు తమ మద్దతును ప్రకటించాయి. దీంతో అమెరికాతో ఏర్పడిన విభేదాలు తీవ్రతరం అయ్యాయి. మదురొ ఆదేశాలను తాము పట్టించుకోమని అమెరికా ప్రకటించింది. మదురొకి ఆదేశ సైన్యం పూర్తి అండదండలను ప్రకటించింది. అమెరికా జోక్యాన్ని నిరసిస్తూ మదురొకి అనుకూలంగా ప్రదర్శనలు జరిగాయి. గుయ్‌డొ నాయకత్వంలో దేశవ్యాప్తంగా జరిగిన ప్రదర్శనలు హింసాత్మకంగా మారాయి. మదురోను అధ్యక్షుడిగా తాము గుర్తించడం లేదని అమెరికా ప్రకటించింది. తిరుగుబాటుకు బరితెగించిన అమెరికానే రెచ్చగొట్టింది. దాదాపు ఐదారేళ్లుగా వెనుజులాలో ప్రభుత్వాన్ని మార్చివేసి తమ కీలుబొమ్మ ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసుకోవాలని అమెరికా ప్రయత్నిస్తోంది. తాజా పరిస్థితుల్లో పెద్ద మార్పు లేకపోయినప్పటికీ వెనుజుల విదేశాంగ శాఖ బహిష్కారానికి గురైన అమెరికా దౌత్యవేత్తలు ఇక్కడే ఉండవచ్చునని ప్రకటించింది. 30 రోజుల లోపు తమ దేశంలో 'అమెరికా ప్రయోజనాల కార్యాలయం' అలాగే,



వాషింగ్టన్‌లో వెనుజులా కార్యాలయం ఏర్పాటుకు చర్చలు జరపాలని విదేశాంగ శాఖ గడువు విధించింది. గతంలో అమెరికా క్యూబా మధ్యకూడా అనేక దశాబ్దాలపాటు ఇలాంటి ఏర్పాటే జరిగింది. ఈ అంశాన్ని అమెరికా విదేశాంగ శాఖ ధృవీకరించలేదు. తమ సిబ్బంది భద్రతనే తాము కోరుకుంటున్నామని తెలిపింది.

భద్రతామండలిలో చర్చ

వెనుజులా సమస్యమైన భద్రతామండలిలో చర్చ జరిగింది. రష్యా రాయబారి వస్లీ నెబెంజియా మాట్లాడుతూ మదురోకు వ్యతిరేకంగా తిరుగుబాటుకు ట్రంప్ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని విమర్శించారు. వెనుజులా అంతర్జాతీయ శాంతి, భద్రతలకు ఎలాంటి ముప్పు కలిగించలేదని అయినప్పటికీ తిరుగుబాటును సమర్థించడం ఏమిటని ప్రశ్నించారు. మదురొ ప్రభుత్వంపై తీవ్రవాద ప్రతిపక్షాలు గరిష్టంగా సంఘర్షణ మార్గాన్ని ఎన్నుకున్నారని అలాగే, సమాంతర ప్రభుత్వం ఏర్పటినట్టుగా సృష్టించారని విమర్శించారు. అమెరికా సైన్యాన్ని ఉపయోగిస్తుందా స్పష్టం చేయాలని ట్రంప్ ప్రభుత్వ విదేశాంగ ప్రతినిధి మైక్ పాంపియోను కోరారు. తాను ఊహించి చెప్పలేనని పాంపియో సమాధానం చెప్పారు. అన్ని దేశాలు గుయ్‌డొను సమర్థించాలని పాంపియో విజ్ఞప్తి చేశారు. ఇప్పుడు ఏదో ఒకవైపు ఉండవలసిన అవసరం అవసరం వచ్చిందని పాంపియో అన్నారు. వెనుజులాలో కల్లోల్లాన్ని తొలగించాలని కోరారు.

అమెరికా జోక్యం నిలిపి వేయాలి

వెనుజులాలో తిరుగుబాటకు అండదండలు ప్రకటించడం ద్వారా ఆదేశ వ్యవహారాల్లో జోక్యం చేసుకున్న అమెరికా తక్షణం తన ప్రయత్నాన్ని నిలిపివేయాలని సుప్రసిద్ధ ఆర్థికశాస్త్రవేత్త నోమ్‌చామ్‌స్కీ తదితర ప్రముఖులు దాదాపు 70 మంది అమెరికాలో ట్రంప్ ప్రభుత్వానికి లేఖ రాశారు. స్వతంత్ర దేశాల్లో అమెరికా జోక్యం ఎంతమాత్రం తగదని వారు పేర్కొన్నారు. ప్రజలు ఎన్నుకున్న ప్రభుత్వాలను కూలదోసేందుకు అమెరికా పన్నుతున్న కుట్రలను వారు నిరసించారు. ఈ లేఖరాసిన వారిలో వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు ఉన్నారు.

కల్నల్ జోస్ దేశద్రోహి

వాషింగ్టన్‌లోని తమ రాయబార కార్యాలయం సైనిక విభాగంలో పనిచేస్తున్న కల్నల్ జోస్ లూయిస్ సిల్వ దేశద్రోహానికి పాల్పడి తిరుగుబాటు చేసిన గుయ్‌డొను అధికారికంగా గుర్తించడానికి అమెరికాకు సహకరించారని వెనుజులా విదేశాంగ శాఖ ఆదివారం ఒక ప్రకటనలో ఖండించింది. జోస్ స్పెయిన్ చెందిన ఎల్ నూయేవొ హెరాల్డ్ పత్రికా విలేకరితో మాట్లాడుతూ మదురొను తాను గుర్తించడం లేదన్నారు. గుయ్‌డొను గుర్తిస్తున్నట్లు ప్రకటించారు.

అమెరికా అధ్యక్షపదవి రేసులో తులసి



వాషింగ్టన్ : భారతదేశ మూలాలున్న తులసిగబ్బార్డ్ అమెరికా అధ్యక్షపదవికి పోటీ చేయనున్నట్లు టెలివిజన్ ఇంటర్వ్యూలో ఇంతక్రితమే ప్రకటించారు. ఫిబ్రవరి 2 నుంచి ఎన్నికల ప్రచారం ప్రారంభిస్తానని తులసి తాజాగా వెల్లడించారు. ప్రతినిధుల సభ సభ్యురాలిగా తులసి మూడుసార్లు ఎన్నికయ్యారు. జాతి వివక్షకు వ్యతిరేకంగా, పౌరహక్కులకు అనుకూలంగా 1960లలో గొప్ప పోరాటం నిర్వహించిన మార్టిన్ లూథర్ కింగ్ జూనియర్ తనకు స్ఫూర్తినిచ్చారని హవాయి రాష్ట్ర శాసనసభ వద్ద చెప్పారు. జాతుల మధ్య సామరస్యాన్ని సాధించేందుకు లూథర్‌కింగ్ చెప్పిన అంశాలు తనను ఎంతో ఉత్తేజపరిచాయని తులసి అన్నారు. ప్రజలందరి స్వేచ్ఛను, గౌరవాన్ని కాపాడాలని లూథర్‌కింగ్ ఇచ్చిన స్ఫూర్తితో అధ్యక్షురాలిగా తాను పనిచేస్తానని తన మద్దతుదార్లకు రాసిన లేఖలో తులసి పేర్కొన్నారు. ఫిబ్రవరి 2న తన అభ్యర్థిత్వాన్ని బహిరంగంగా ప్రకటిస్తానని, అదేరోజు తన ఆశయాలు, లక్ష్యాలను వెల్లడిస్తానని తులసి తెలియచేశారు. భారత- అమెరికా పౌరులు 40 లక్షల మంది ఇక్కడ ఉన్నారని, అధ్యక్షురాలిగా గెలుపొందేందుకు ఈ సంఖ్య సరిపోదని అన్నారు. అయితే వీరిసంఖ్యకంటే వారు నిర్వహించే రాజకీయ క్రియాశీలక, వారి రచనసామర్థ్యం ఎంతో ఎక్కువగా ఉంటుందని ఆమె అన్నారు. 2016లో ట్రంప్ ప్రజలవద్దకు వెళ్లి తన అభ్యర్థిత్వాన్ని ప్రకటించేందుకు ముందుగా భారత- అమెరికా పౌరులకే విజ్ఞప్తి చేశారని ఆమె తెలిపారు.

ఫిలిప్పీన్స్ చర్చిలో బాంబుల మోత

27 మంది మృతి, 80 మందికి గాయాలు



మనీల : ఫిలిప్పీన్స్‌లో ఆదివారం రోమన్ కేథలిక్ కెథడ్రల్‌ల్లో రెండు బాంబులు పేలి 27 మంది చనిపోగా, 80 మందికి పైగా గాయపడినట్టు అధికారులు తెలియచేశారు. దేశ దక్షిణ ప్రాంతంలోని చర్చిలో విశ్వాసులు ప్రార్థనలు చేస్తుండగా, ఈ బాంబులు పేలినట్టు అధికారులు తెలిపారు. చర్చిఉన్న ప్రాంతంలో ముస్లిం తీవ్రవాదులు చురుకుగా పనిచేస్తున్నారు.

మొదటి బాంబు జోలో కెథడ్రల్ సమీపంలో పేలింది. రెండవ బాంబు కెథడ్రల్ ప్రహరీగోడకు వెలుపల పేలినట్టు అధికారులు తెలియచేశారు. బాంబులు పేలిన సంఘటన జరగగానే భద్రతా సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకున్నారు. మృతుల్లో ఐదుగురు సైనికులు కూడా ఉన్నారని పోలీసులు తెలియచేశారు. జోలో ఐలాండు ప్రాంతంలో అబుసయ్యఫ్ మిలీషియాలు ఎక్కువగా దాడులకు పూనుకుంటున్నారు. వీరిని అమెరికా నిషేధిత జాబితాలో చేర్చింది. ఈ టెర్రరిస్టులు అనేక సంవత్సరాలుగా బాంబుదాడులు, కిడ్నాపులు, హత్యలకు పాల్పడుతున్నాయి. ఆదివారం జరిగిన దాడికి తామే కారణమని ఇంతవరకు ఎవరూ ప్రకటించలేదు. ఫిలిప్పీన్స్‌లో దాదాపు ఐదుదశాబ్దాలుగా వేర్పాటువాద తిరుగుబాటుదార్లు- ప్రభుత్వానికి మధ్య తీవ్ర పోరాటం జరుగుతోంది. ఈ ఘర్షణల్లో లక్షన్నర మందికి పైగా చనిపోయినట్లు అంచనా.. సులు రాష్ట్రంలో ప్రజలు ఉగ్రవాదాన్ని తీవ్రంగా నిరశిస్తున్నారు. ఈ ప్రాంతంలోనే తిరుగుబాటుదారుల గ్రూపులు క్రియాశీలకంగా పనిచేస్తున్నాయి.

ట్రంప్ సన్నిహితుడు స్టోన్ నిందితుడే

వాషింగ్టన్ : అధ్యక్షుడిగా పోటీచేసేందుకు 2016లో ట్రంప్ ఎన్నికల ప్రచారం సందర్భంగా ఆయనకు రష్యా సహకరించిందన్న అభియోగంపై విచారణ జరుపుతున్న రాబర్ట్ ముల్లర్ ట్రంప్ సన్నిహితుడు రోగర్‌స్టోన్ నిందితుడేనని తెలిపారు.ఎన్నికల్లో ట్రంప్ గెలవడానికి రష్యా సహకరించిందన్న ఆరోపణలపై ముల్లర్ విచారణ జరుపుతున్నారు. స్టోన్ ఈ వ్యవహారంలో అబద్దాలు చెప్పడమే కాకుండా సాక్ష్యాలను కూడా మాయం చేశారని ముల్లర్ అభిప్రాయపడుతున్నారు. అయితే దీనివెనుక కుట్ర ఉందా లేదా అన్న అంశాన్ని ఆయన నిర్ధారించలేదు. అమెరికాలో వాటర్‌గేట్ కుంభకోణం నుంచి వైట్‌వాటర్ కుంభకోణం నుంచి అనేక కుంభకోణాల్లో అధ్యక్షకార్యాలయం నేరాలకు పాల్పడినట్లు ఆరోపణలు ఉన్నప్పటికీ వాటిని రహస్యంగా ఉంచేందుకే దర్యాప్తు సంస్థలు కూడా ప్రయత్నించి ప్రజలను తప్పుదోవ పట్టించాయి కాని, నిజనిర్ధారణకు పూనుకోలేదు. ట్రంప్ గెలుపునకు రష్యా సహకరించిందా లేదా అన్న అంశంపై విచారణ జరుపుతున్న ముల్లర్‌కూడా పైన తెలిపిన కుంభకోణాల్లో అధికారులు వ్యవహరించిన తీరును అనుసరిస్తున్నాడు. స్టోన్ విచారణ అధికారుల వద్ద అబద్దాలు చెప్పడమే కాక, ఇతర సాక్షులను కూడా అదేవిధంగా చెప్పమని ప్రోత్స హిస్తున్నట్లు ముల్లర్ తెలిపారు. ట్రంప్ సహాయకులకు రష్యాకు మధ్య నేరపూరితమైన సమన్వయం ఉన్నట్లుగా ముల్లర్ వద్ద సాక్ష్యాదారాలు ఉండవచ్చునని అయితే వాటిని ఇంతవరకు బహిర్గతం చేయటేదని భావిస్తున్నారు.



ట్రంప్‌పై పోటీ చేసిన డెమొక్రటిక్ అభ్యర్థి హిల్లరీ క్లింటన్ ఈ మెయిల్స్‌ను రష్యా హ్యాక్ చేయగా, వాటిని ట్రంప్ తరపున ప్రచారం చేసిన వారు ఉపయోగించుకున్నారా లేదా అనేది నిర్ధారణ కావాల్సి ఉంది. దర్యాప్తు ఫలితాలను రెండు విధాలుగా ఊహించవచ్చు. ట్రంప్‌కు అనుకూలంగా ఫలితం రావడానికి రష్యా కుట్రపన్నిందా ? లేక రష్యా అధికారులతో ట్రంప్ ప్రచారకులు కుమ్మక్కయ్యారా ? అనే నిర్ధారణ ఒకటి రావచ్చు.

ట్రంప్‌కు రష్యా సహకరించేందుకు నిజంగా అవకాశాలు ఉన్నప్పటికీ ముల్లర్ వీటిని రహస్యంగానే ఉంచవచ్చు. ట్రంప్ మాజీ న్యాయవాది మైఖేల్ కోహెన్‌ను కాంగ్రెస్ విచారణ జరిపిన సమయంలో కూడా ఆయన అబద్దాలే చెప్పాడన్న ఆరోపణలు ఉన్నాయి. అలాగే వైట్ హౌస్‌లో జాతీయ భద్రతా సలహాదారుగా పనిచేసిన మైఖేల్ ఫ్లిన్ మాస్కోతో తనకు గల సంబంధాల విషయంలో అబద్దాలు చెప్పాడన్న ఆరోపణలు ఉన్నాయి. విచారణ జరిపిన దర్యాప్తు అధికారులు సాక్షులకు సంబంధించి ఎవరినీ ఇంతవరకు నేరస్తులుగా ధృవీకరించకపోవడం విశేషం.

దాచేస్తున్నారు

(మొదటిపేజీ తరువాయి)

వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి. త్వరలో సాధారణ ఎన్నికల జరగనుండగా అనేక సంస్థలు సర్వేలు చేస్తున్నాయి. ఇప్పటికే బీజేపీ పాలనపై ప్రజలలో వ్యతిరేకత పెరగటంతోపాటు ప్రజలు మోడీని మరోసారి ప్రధానిగా చూసేందుకు నిరాకరిస్తున్నారు. అందుకే అధికారిక రికార్డుల విషయంలో కేంద్రం దాగుడు మూతల ధోరణిని అవలంభిస్తోందనే వ్యాఖ్యలు వినిపిస్తున్నాయి.

రెండళ్లుగా వెల్లడికాని ఎన్‌సీఆర్‌బీ నివేదిక

మోడీ పాలనలో దేశంలో వ్యవసాయం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. అప్పుల బాధలు తాళలేక రైతులు ఆత్మహత్యలకు పాల్పడుతున్నారు. మరోవైపు మహిళలు, దళితులు, ముస్లిం మైనార్టీలపై దాడులు పెచ్చరిల్లుతున్నాయి. వాస్తవానికి ఇవన్నీ నేషనల్ క్రై రికార్డ్స్ బ్యూరో (ఎన్‌సీఆర్‌బీ)లో పొందుపరచాలి. 1953 నుంచి ఏటా ఎన్‌సీఆర్‌బీ నివేదికను కేంద్రం విడుదల చేస్తూ వస్తోంది. రెండేళ్లుగా మోడీ సర్కార్ ఈ నివేదికను వెల్లడించలేదు. ఆ నివేదికలో పలు రాష్ట్రాలలో నేర గణాంకాలతోపాటు రైతుల ఆత్మహత్యలు, చిన్నారులు, మహిళలపై జరిగిన దాడులు, హింస, ఎస్సీ, ఎస్టీ, బీసీలపై దాడులు, మానవ అక్రమ రవాణా, అవినీతి తదితర వివరాలను వెల్లడించాల్సి ఉంది. వీటిని అదుపు చేయటంలో సర్కార్ వైఫల్యం చెందిన కారణంగానే నివేదికను రెండళ్లులగా తొక్కిపెట్టినట్లు తెలుస్తోంది. సంక్షోభంలో కూరుకున్న వ్యవసాయరంగాన్ని బయట పడేసేలా చర్యలు చేపట్టాలంటే ఒక విధాన నిర్ణయానికి రావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో రైతు ఆత్మహత్యల వివరాలను వెల్లడించాల్సిన అవసరం ఉందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

నిరుద్యోగం పెరగటం వల్లే

దేశంలో ఏటా నిరుద్యోగ సమస్య పెరుగుతోంది. ఏటా రెండు కోట్ల మందికి ఉద్యోగాలిస్తామని బీజేపీ ఎన్నికలకు ముందు హామీ ఇచ్చింది. కానీ, నాలుగున్నర సంవత్సరాలలో ఈ హామీ కార్యరూపం దాల్చలేదు. పైపెచ్చు నిరుద్యోగ సమస్య 7 శాతానికి చేరింది. 2013-14లో 3.4 శాతంగా ఉన్న నిరుద్యోగం, 2015-16లో 3.7, 2016-17లో 3.9 శాతానికి, తాజాగా ఏకంగా ఏడు శాతానికి పెరిగినట్లు వెల్లడైంది. 2016 నవంబరు ఎనిమిదిన పెద్ద నోట్ల రద్దు తర్వాత నిరుద్యోగుల సంఖ్య విపరీతంగా పెరిగినట్లు వెల్లడైంది. దీంతో ఒక్కసారిగా మోడీ సర్కార్ ఆ నివేదికను దాచేసినట్లు సమాచారం. ఉద్యోగాల కల్పనపై నీతి ఆయోగ్ వైస్ చైర్మన్ నేతృత్వంలో ఒక టాస్క్‌ఫోర్స్‌ను మోడీ సర్కార్ 2017 మే 11న ఏర్పాటు చేసింది. దీంతో గతంలో ఐదేళ్లకు ఒకసారి ఉద్యోగులు, నిరుద్యోగులపై లెక్కలు సేకరించే నేషనల్ శాంపిల్ సర్వే ఆర్గనైజేషన్ (ఎన్‌ఎస్‌ఎస్‌ఓ)ను టాస్క్‌ఫోర్స్ బుట్టదాఖలు చేసింది. ఎన్‌ఎస్‌ఎస్‌ఓ చివరిసారిగా 2014 జూన్‌లో 2011-12 సంవత్సరానికి నివేదికలను వెల్లడించింది. మరోవైపు లేబర్ సర్వే నివేదికలను కూడా కేంద్రం విడుదల చేయకుండా నిలిపివేయటం శోచనీయం.

ఓబీసీ అధికారిక లెక్కలూ లేవు

కేంద్ర ప్రభుత్వం వద్ద ఇతర వెనుకబడిన కులాల (ఓబీసీ) అధికారిక లెక్కలూ లేకపోవటం పలు అనుమానాలకు తావిస్తోంది. బ్రిటిష్ పాలనలో దేశంలో తొలిసారిగా 1931లో కులగణన జరిగింది. అప్పటి నివేదిక ప్రకారం దేశంలో 52 శాతం ఓబీసీలు ఉన్నారు. ఆ తర్వాత 2011లో కులగణన నిర్వహించారు. అయితే, ఆ నివేదికను గత యూపీఏగానీ, ప్రస్తుత ఎన్‌డీఏ సర్కార్‌గానీ వెల్లడించకపోవటం గమనార్హం. తమ వద్ద ఓబీసీల అధికారిక లెక్కలు లేవని మోడీ ప్రభుత్వం ఈ నెలలో పార్లమెంట్‌లో అడిగిన ఒక ప్రశ్నకు సమాధానంగా చెప్పింది. అధికారిక లెక్కలు వెల్లడిస్తే అందుకు అనుగుణంగా రిజర్వేషన్లు పెంచాలని ఓబీసీలు డిమాండు చేస్తారన్న భయం మోడీ సర్కార్‌ను వెంటాడుతోంది.

నల్లధనంలోనూ...

దేశానికి చెందిన కుబేరులు విదేశాల్లో దాచిన నల్లధనాన్ని వెనక్కి రప్పిస్తామని, ఆ మొత్తాన్ని ఒక్కో పౌరుడి ఖాతాలో రూ.15 లక్షల చొప్పున జమ చేస్తామని 2014 ఎన్నికల సందర్భంగా మోడీ హామీ ఇచ్చారు. ఆ తర్వాత పెద్ద నోట్ల రద్దు సమయంలోనూ నల్లధనాన్ని వెలికి తీసేందుకే అంటూ బీరాలు పలికారు. కానీ, నల్లధనం దేశంలోకి రాకపోగా బ్యాంకులకు వేల కోట్లు ఎగవేసిన విజయ మాల్యా, నీరవ్‌మోడీ తదితరులు విదేశాలకు పారిపోయి ప్రధాని మోడీని వెక్కిరిస్తున్న దుస్థితి. దేశంలోపల, విదేశాల్లో ఎంత నల్లధనం ఉందో కేంద్ర ఆర్థికశాఖకు కూడా అంచనాకు అందని లెక్కని పార్లమెంట్ సాక్షిగా గతేడాది ఫిబ్రవరిలో సదరు మంత్రే వెల్లడించటం గమనార్హం.

జర్నలిస్టులపైనా దాడులు

దేశంలో జర్నలిస్టులపైనా దాడులు విపరీతంగా పెరుగుతున్నాయి. గతేడాది డిసెంబర్ 18న జర్నలిస్టులపై దాడులు, నిందితులపై కేసుల నమోదుపై అడిగిన ప్రశ్నకు కేంద్ర హోంశాఖ సహాయమంత్రి హన్స్‌రాజ్ గంగారాం ఇచ్చిన సమాధానం చూస్తే మోడీ సర్కార్ నిర్లక్ష్యం ఎలాంటిదో అర్థమవుతుంది. ఐపీసీలోని పలు సెక్షన్ల కింద 2014 నుంచి 2016 వరకు నమోదైన కేసులకు సంబంధించి మాత్రమే ఎన్‌సీఆర్‌బీ రికార్డులున్నాయని మంత్రి సమాధానమిచ్చారు. రాష్ట్రాలవారీగా ఇచ్చిన ఆ వివరాలను పరిశీలిస్తే చాలా రాష్ట్రాల్లో కేసులే నమోదు కాలేదని స్పష్టమైంది. 2014లో యూపీలో అత్యధికంగా 63, ఆ తర్వాత బీహార్‌లో 22, మొత్తం మీద 114 కేసులు జర్నలిస్టులపై దాడులకు సంబంధించి నమోదయ్యాయి. ఆంధ్రప్రదేశ్‌లో 4 నమోదు కాగా, తెలంగాణలో ఒక్క కేసూ నమోదు కాలేదు. 2015లో 28, 2016లో 47 కేసులు నమోదయ్యాయి. ప్రపంచ మీడియా స్వేచ్ఛా సూచీలో రిపోర్టర్స్ వితవుట్ బోర్డర్స్ భారత్‌కు ఇచ్చిన ర్యాంక్ 138. అంటే మీడియా స్వేచ్ఛ దేశంలో ఏమేరకున్నదో ఈ సూచీలోనే అర్థమవుతోంది. ఆ సంస్థ తన నివేదికలో కర్ణాకలో హత్యకు గురైన గౌరీ లంకేశ్ ఉదంతాన్ని ప్రస్తావించింది. జర్నలిస్టుల భావప్రకటనా స్వేచ్ఛపై జరిగిన విద్వేష దాడికి అది నిదర్శనమని ఆ నివేదిక పేర్కొంది.

ఉద్యమం ఉధృతం

(మొదటిపేజీ తరువాయి)

తీవ్రంగా విమర్శించారు. ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్, మాజీ ఎంపీ కొణతాల రామకృష్ణ ఆధ్వర్యంలో విభజన హామీల అమలు కోసం విశాఖపట్నం-న్యూఢిల్లీ ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో జనఘోష రైలు యాత్ర చేపట్టారు. రైలు ఆదివారం విజయవాడ రైల్వేస్టేషన్‌కు చేరుకోగా కొణతాల రామకృష్ణకు రామకృష్ణ సంఘీభావం తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలు అమలు చేయాలని అన్ని రాజకీయపార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు, స్వతంత్ర, స్వచ్ఛంద సంస్థలు మోడీ ప్రభుత్వాన్ని కోరుతూనే ఉన్నాయని రామకృష్ణ అన్నారు. ఇంతవరకూ విశాఖ కేంద్రంగా రైల్వేజోన్‌ను ప్రకటించలేదని, కడపకు ఉక్కు కర్మాగారం, రామాయపట్నం పోర్టును ఇవ్వలేదన్నారు. విద్యా, వైద్య సంస్థలకు నిధులు మంజూరు చేయలేదని తెలిపారు. వెనుకబడిన జిల్లాల అభివృద్ధి కోసం ఇచ్చిన రూ. 350 కోట్లను సిగ్గులేకుండా తిరిగి వెనక్కు తీసుకున్నారని బీజేపీ పాలకులను దుయ్యబట్టారు. పార్లమెంటు చివరి సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్‌ను ప్రవేశపెడుతున్నందున జనఘోష రైలు యాత్ర ఢిల్లీకి బయలుదేరడం ముదావహమన్నారు. ఈ యాత్రకు సీపీఐ, సీపీఎం రాష్ట్ర కమిటీలు, జనసేన పార్టీ తరపున ఆయన సంపూర్ణంగా సంఘీభావాన్ని తెలిపారు. ఈ యాత్ర సఫలీకృతమై తిరిగి రావాలని రామకృష్ణ ఆకాంక్షించారు.

రాయితీతో కూడిన ప్రత్యేక హోదా ఇవ్వాలి: కొణతాల

ఆంధ్రుల హక్కు అయిన ప్రత్యేక హోదాను పన్నుల రాయితీతో మంజూరు చేయాలని కొణతాల రామకృష్ణ డిమాండు చేశారు. పార్లమెంటు సమావేశాలు జరుగుతున్న నేపథ్యంలో ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో ఛలో ఢిల్లీ కార్యక్రమం ద్వారా ఆంధ్రుల జన ఘోషను కేంద్రానికి వినిపించేందుకు రైలు యాత్రను చేపట్టినట్లు ఆయన వివరించారు. రాష్ట్రంలోని అన్ని సంస్థలు, సంఘాలు రాజకీయాలను పక్కనపెట్టి హక్కుల కోసం పోరాటం సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. విభజన వల్ల రాష్ట్రం కొంత నష్టపోతే.. విభజన హామీలను అమలు చేయపోవడం వల్ల మరింత నష్టపోయిందన్నారు. ప్రమాణ స్వీకార సమయంలో పార్లమెంటు దేవాలయంగా కొనియాడిన ప్రధాని మోడీ కేవలం గుజరాత్‌కు సీఎంగా మాత్రమే వ్యవహరిస్తున్నారని విమర్శించారు. ప్రజాస్వామ్యానికి పూర్తిగా తిలోదకాలిచ్చి, పార్లమెంటులో చేసిన పునర్విభజన చట్టాన్ని అమలు చేయకుండా చాలా నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన మండిపడ్డారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్ ఇవ్వడానికి తమకు అభ్యంతరం లేదని ఒడిశా స్పష్టం చేసినప్పటికీ కేవలం రాజకీయ కక్షతో మోడీ ప్రభుత్వం రాష్ట్రానికి అన్యాయం చేస్తోందన్నారు. ఓటాన్ ఎకౌంట్ బడ్జెట్ తర్వాత ఢిల్లీలో మేధావులు, వివిధ రాజకీయపార్టీలతో సమావేశమై భవిష్య కార్యాచరణ రూపొందిస్తామన్నారు. అలాగే ఏపీభవన్‌లో ఈనెల 31వ తేదీన ఎంపీలను ఆహ్వానించి ప్రత్యేక హోదాపై పవర్‌పాయింట్ ప్రజంటేషన్ ఇస్తున్నట్లు ఆయన చెప్పారు. పార్టీలకు అతీతంగా అంతా ఐక్యంగా పోరాటాలు సాగించి కేంద్రం మెడలు వంచితేనే విభజన హామీలను సాధించుకోగలమని కొణతాల స్పష్టం చేశారు. విశాఖపట్నం నుంచి 40 మంది వేదిక ప్రతినిధులు నల్లని దుస్తులు ధరించి బయలుదేరగా, అన్ని బోగీలపై జన ఘోష రైలు యాత్ర ప్రధాన డిమాండ్లతో కూడిన ఫ్లెక్సీలను అతికించారు. కళాకారులు ప్లాట్‌ఫారంపై ప్రత్యేక హోదా గీతాలను ఆలపించారు. సీపీఐ, సీపీఎం శ్రేణులు పార్టీ పతాకాలతో మోడీ, బీజేపీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా చేసిన నినాదాలతో రైల్వేస్టేషన్ హోరెత్తింది. ఈ కార్యక్రమంలో సీపీఐ విజయవాడ నగర కార్యదర్శి దోనేపూడి శంకర్, ఏఐటీయూసీ నేత మనోహర మాణిక్యం, ఏఐవైఎఫ్ నాయకులు సయ్యద్ అఫ్సర్, ఎస్.లెనిన్‌బాబు, ఏఐఎస్ఎఫ్ నాయకుడు చరణ్‌సాయి, నగర మహిళా సమాఖ్య అధ్యక్షురాలు ఓర్సు భారతి, ప్రజానాట్యమండలి కళాకారుడు ఆర్.పిచ్చయ్య, సీపీఎం నాయకులు నాగోతి ప్రసాద్, బోయ సత్యబాబు వి.వి.నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సిలబస్ పరేషాన్

(మొదటిపేజీ తరువాయి)

జరుగుతోందని పలువురు వ్యతిరేకిస్తున్నారు. ప్రిలిమ్స్‌లో నెగ్గిన వారిని మెయిన్ పరీక్షలకు అర్హతగా పరిగణిస్తారు. ఒక్కో అభ్యర్థి వారి అర్హతల ఆధారంగా నాలుగైదు ఉద్యోగాలకు దరఖాస్తు చేశారు. ఫీజుల రూపంలో ఏపీపీఎస్సీకి కోట్లాది రూపాయల ఆదాయం వచ్చింది. కొందరు అన్ని పరీక్షలపైనా, మిగిలిన వారంతా ఒకటి రెండు పోస్టులపైనా దృష్టి పెడుతున్నారు.

నిరుద్యోగులతో సర్కారు మైండ్ గేమ్

నిరుద్యోగులతో సర్కారు మైండ్‌గేమ్ ఆడుతుందని పలువురు మండిపడుతున్నారు. ఏపీపీఎస్సీ నిర్వహిస్తున్న ఉద్యోగాల భర్తీలో రిజర్వుడులో మెరిట్ అభ్యర్థులను ఓపెన్ కేటగిరీలోకి అనుమతించకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు వ్యక్తమవుతున్నాయి. ఇప్పటికే ఏపీపీఎస్సీ చైర్మన్ ఉదయ్‌భాస్కర్‌కు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి లేఖ రాసినా స్పందన లేదు. అటు ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కారెం శివాజీ ఈనెల 31వ తేదీన వివరణీయాలని ఏపీపీఎస్సీకి ఆదేశించారు. విద్యార్థి, యువజన, కేవీపీఎస్, పలు సామాజిక సంఘాల ఆధ్వర్యంలో ఏపీపీఎస్సీ కార్యాలయం ఎదుట ఆందోళన నిర్వహించారు. ఓపెన్‌కేటగిరీలో రిజర్వుడు మెరిట్ అభ్యర్థులను అనుమతించాలని, పరీక్షలను వాయిదా వేయాలని డిమాండు చేశారు. ఇదేబాటలో రాష్ట్ర వ్యాప్తంగా రిజర్వుడు అభ్యర్థులు ఉద్యమిస్తున్నారు.

ఏపీపీఎస్సీ చైర్మన్‌కు ప్రభుత్వ అండదండలు..?

ప్రభుత్వ అండదండలతోనే ఏపీపీఎస్సీ చైర్మన్ ఒంటెద్దుపోకడలు పోతున్నారని అభ్యర్థులు విమర్శిస్తున్నారు. రిజర్వేషన్ల వ్యవహారంపై ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రాసిన లేఖను ఎందుకు అమలు చేయట్లేదనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నిజంగా ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే ఏపీపీఎస్సీ వైఖరిపై సీఎం చంద్రబాబు స్పందించే వారని అంటున్నారు. రాజ్యాంగ విధానాలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్న వారిపై తక్షణమే చర్యలు తీసుకోవాలని యువజన, విద్యార్థి సంఘాలు డిమాండు చేస్తున్నాయి.

అధికార ప్రజాప్రతినిధుల మౌనం..

ఓపెన్‌కోటాలో ప్రతిభగల రిజర్వుడు అభ్యర్థులను అనుమతించాలనే డిమాండుపై అధికార టీడీపీ ప్రభుత్వానికి చెందిన వివిధ రిజర్వుడు కేటగిరీ ప్రజాప్రతినిధులు మౌనంగా ఉండటం విమర్శలకు దారితీస్తోంది. మెరిట్‌రిజర్వుడు అభ్యర్థులకు ఓపెన్‌కోటాలో అవకాశం కల్పించాలని సీఎం చంద్రబాబుకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ లేఖ రాశారు. విద్యార్థి, యువజన, పలు సామాజిక సంఘాలు ఏపీపీఎస్సీ ముట్టడికి యత్నించాయి. ఫిబ్రవరి 2న విజయవాడలో రౌండుటేబుల్ సమావేశానికి పిలుపునిచ్చాయి. ఏపీపీఎస్సీ వ్యవహారంపై ఇంతవరకూ రాష్ట్ర సాంఘిక సంక్షేమశాఖ మంత్రి నక్కా ఆనందబాబు స్పందించలేదు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ జూపూడి ప్రభాకర్‌రావు, ఎమ్మెల్సీ డొక్కా మాణిక్యవరప్రసాద్, ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ తదితర నేతలంతా మౌనంగా ఉన్నారు. గ్రూప్-1,2 పరీక్షల తేదీల పొడిగింపునకు, ఓపెన్‌లో రిజర్వుడు మెరిట్ అభ్యర్థులకు అవకాశం కల్పించేలా ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని పలువురు అభ్యర్థులు డిమాండు చేస్తున్నారు.

మరో 24 గంటలు వర్షాలే

హైదరాబాద్: మహారాష్ట్రలో ఏర్పడిన ఉపరితల ద్రోణి ప్రభావంతో తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా, కోస్తాంధ్రలో వర్షాలు కురుస్తున్నాయి. మరో 24 గంటల పాటు అక్కడక్కడా వర్షాలు పడే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ శాఖ అధికారులు తెలిపారు. విదర్భ తూర్పు ప్రాంతంలో 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. దీని వల్ల తెలంగాణ మీదుగా కర్ణాటక వరకూ మరో ఉపరితల ద్రోణి ఏర్పడింది. సోమవారం కూడా దక్షిణ తెలంగాణలో అక్కడక్కడా వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అధికారి తెలిపారు.

బుట్టదాఖలు

(మొదటిపేజీ తరువాయి)

కమిషన్, రాధాకృష్ణ కమిషన్ నివేదికలు సైతం బుట్టదాఖలయ్యాయని ఆమె విమర్శించారు. రైతు సమస్యలపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం వహిస్తున్నాయని ఆరోపించారు. రైతులపై పాలకులది కపటప్రేమ మాత్రమేనని నిందించారు. పంటలకు పెట్టుబడులు పెరుగుతున్నప్పటికీ వాటికి కనీస మద్దతు ధర లభించడం లేదన్నారు. దీనివలన రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కల్తీ విత్తనాలు, కల్తీ ఎరువులు, కల్తీ పురుగు మందుల వలన రైతులు నష్టపోతున్నారన్నారు. కల్తీని నియంత్రించడంలోనూ ప్రభుత్వాలు పూర్తిగా విఫలమవుతున్నాయని విమర్శించారు. ప్రైవేటు కంపెనీలు నిర్దేశించిన ఎరువులు, విత్తనాలు రైతులకు అంటకడుతున్నారని, ప్రభుత్వం ఒక నియమావళిని పాటించడం లేదని అన్నారు. కల్తీ విత్తనాల నియంత్రణకు జాతీయ విత్తన చట్టాన్ని సవరించాల్సిన అవశ్యకత ఉందన్నారు. తాను అధ్యయనం చేసిన సమయంలో క్షేత్రస్థాయిలో వ్యవసాయ సేవలు అందించే వ్యవసాయ విస్తరణాధికారుల కొరత తీవ్రంగా ఉండేదని గుర్తుచేశారు. 33 గ్రామాలకు ఒకే వ్యవసాయ విస్తరణాధికారి సేవలు అందించడాన్ని గుర్తించామన్నారు. ఇంకా అనేక సమస్యలను గుర్తించి నివేదిక ఇచ్చామని పేర్కొన్నారు. ఏపీలో రైతులకు రుణమాఫీ పథకం అమలు చేశారుగానీ..దాని వలన రైతులకు ఎంత వరకు ప్రయోజనం చేకూరుతుందని ప్రశ్నించారు. రైతులు ఎక్కువగా ప్రైవేటు వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తీసుకున్నారని, రుణమాఫీ వలన అలాంటి వారికి ఉపయోగం లేదన్నారు. కేరళ ప్రభుత్వ తరహాలో డెట్ కమిషన్ వేసి తద్వారా అర్హులైన రైతులకు రుణమాఫీ చేస్తే బాగుంటుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్‌లో గత ఐదేళ్ల నుంచి వ్యవసాయ వ్యతిరేక విధానాలు అమలు జరుగుతున్నాయని ధ్వజమెత్తారు. దేశంలో కౌలు రైతుల హక్కులను పరిరక్షించాల్సిన అవసరం ఉందన్నారు. బ్యాంకులు కౌలురైతులకు రుణాలివ్వకపోవడం వలన వారు ప్రైవేటు వడ్డీవ్యాపారులను ఆశ్రయించి నష్టపోతున్నారని చెప్పారు. భూమి యజమానే బ్యాంకు రుణాలు తీసుకుంటున్నాడని చెప్పారు. గత ఏడాది దేశంలో వ్యవసాయంలో అధిక దిగుబడులు సాధించినప్పటికీ కనీస మద్దతు ధర లేకపోవడంతో రైతులకు ప్రయోజనం చేకూరలేదన్నారు. ప్రభుత్వం పంట ఉత్పత్తులు సేకరించడానికి ముందుకు రావడం లేదన్నారు. సమావేశంలో ఏపీరైతు సంఘం రాష్ట్రకార్యదర్శి మర్నేడి యలమందారావు, ఏపీ రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వై.కేశవరావు, ఏపీరైతు సంఘం ఉపాధ్యక్షులు ఎం.సూర్యనారాయణ, పి.నరసింహారావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

బీసీలను అణగదొక్కిన చంద్రబాబు

వైసీపీ నేత భరత్ విమర్శ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : నాలుగున్నరేళ్ల కాలంలో బీసీలను అణగదొక్కేలా ప్రవర్తించి ఇప్పుడు జయహో బీసీల సభ నిర్వహించే నైతిక అర్హత ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబుకు, టీడీపీకి లేదని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాజమండ్రి పార్లమెంటు నియోజకవర్గ సమన్వయకర్త మార్గాని భరత్ అన్నారు. బీసీలంటే చంద్రబాబు బిజినెస్ క్లాస్ గానే పరిగణిస్తున్నారన్నారు. హైదరాబాద్‌లోని పార్టీ కేంద్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ చంద్రబాబు నాయుడు బీసీలకు ఐదు సంవత్సరాల్లో రూ. 50 వేల కోట్లు ఇస్తానని ప్రకటించారనీ, వాస్తవంలో మొత్తం ఐదేళ్ల కాలానికి కలిపి ఖర్చు చేసింది రూ. 15 వేల కోట్లు కూడా లేదంటేనే చిత్తశుద్ధి ఏమిటో అర్థం చేసుకోవచ్చన్నారు. చంద్రబాబు నాయుడు ఏమొహం పెట్టుకుని జయహో బీసీ సభను నిర్వహిస్తున్నారో రాష్ట్ర ప్రజలకు సమధానం చెప్పాలని డిమాండు చేశారు. బీసీలకు చేసిన అన్యాయానికి క్షమాపణ చెప్పిన తరువాతనే సభలు నిర్వహించాలన్నారు. రజక, నాయిబ్రాహ్మణులను ఎస్సీల్లో చేరుస్తామని చెప్పారనీ, కేంద్రంలో నాలుగేళ్లు భాగస్వామిగా ఉన్నప్పుడు ఆ దిశగా ఎందుకు చర్యలు చేపట్టలేదని ప్రశ్నిచారు. గడిచిన నాలుగు సంవత్సరాలలో బీసీలకిచ్చిన హామీలను ఎందుకు నెరవేర్చలేకపోయారో వివరించాలని ఆయన డిమాండు చేశారు. ఎన్నికలకు ముందు అనేకానేక అంశాలతో దాదాపు 119 హామీలనిచ్చి బీసీలందరినీ మోసం చేశారన్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకాన్ని నీరుగార్చి బీసీ విద్యార్థుల అవకాశాలు లేకుండా చేశారని, దాదాపు 2 కోట్ల మంది ఉన్న బీసీల్లో 50 వేల మందికి మాత్రమే ఆదరణ పథకం కింద ఎంతో చేశామని ప్రచారంతో మభ్యపెడుతున్నారన్నారు. చేనేత రంగం పూర్తిగా కూనారిల్లేలే చేసింది చంద్రబాబు ప్రభుత్వమేనని అన్నారు. చంద్రబాబుకు బుద్ధి చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని భరత్ హెచ్చరించారు.

రాజధానిలో సీఎం పర్యటన

విశాలాంధ్ర - అమరావతి : రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నవ్యాంధ్ర రాజధానిలో జరుగుతున్న అభివృద్ధి పనులను ఆదివారం పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో జోరుగా సాగుతున్న భవన నిర్మాణాలను సందర్శించారు. నిర్మాణం పూర్తయిన అఖిల భారత సర్వీసు అధికారుల భవన లోపలి భాగాన్ని మరోసారి ప్రత్యక్షంగా పరిశీలించారు. ఫిబ్రవరి 3న రాజధాని పరిధిలో విధులు నిర్వహించడానికి సిద్ధమైన కోర్టు భవనాలను సైతం సందర్శించారు. ప్రభుత్వ ఉద్యోగుల క్వార్టర్లను బయట నుంచే పరిశీలించారు. అమరావతి కోర్ క్యాపిటల్ ఏరియాలో వేగంగా జరుగుతున్న నిర్మాణ పనులపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సీఎం సతీమణి నారా భువనేశ్వరి ,మరికొంతమంది బంధువులతో కలిసి సీఎం ఈ పర్యటన కొనసాగించారు.



రాష్ట్రానికి ఆదర్శం కొమరవోలు

- మాతృభూమి అభివృద్ధికి నడుం బిగిద్దాం
- జన్మభూమి రుణం తీర్చుకుందాం
- ముఖ్యమంత్రి చంద్రబాబు



కార్యక్రమంలో మాట్లాడుతున్న చంద్రబాబు

విశాలాంధ్ర - గుడివాడ :
కన్నతల్లిలాంటి గ్రామాలు స్వచ్ఛమైన గాలి, నీరు, ఆరోగాన్ని ఇస్తాయని, అటువంటి గ్రామాలను అన్ని విధాలుగా అభివృద్ధి పరచడంలో గ్రామ ప్రజలు సహకరించాలని రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు పిలుపు నిచ్చారు. కృష్ణాజిల్లా పామర్రు మండలం కొమరవోలు గ్రామంలో రూ. 10కోట్లతో చేపట్టిన గ్రామపంచాయితీ కార్యాలయం, ప్రధాన రహదారి, శివాలయం పునర్ని ర్మాణం, మహిళ సాధికార భవనం, నారా దేవాన్ష్ కాలనీ, అభివృద్ధికి చిహ్నంగా ఏర్పాటు చేసిన పైలాన్ లను సతీమణి భువనేశ్వరీతో కలిసి చంద్రబాబు ప్రారం భించారు. అనంతరం బహిరంగ సభలో ఆయన ప్రసంగిస్తూ పుట్టిన గ్రామాన్ని, ప్రాంతాలను అభివృద్ధి పరచడానికి ప్రతి ఒక్కరూ నడుంబిగించి జన్మభూమి రుణం తీర్చుకోవాలని కోరారు. తెలుగుదేశం పార్టీ వ్యవస్థాపకులు నందమూరి తారకరామారావు సతీమణి బసవతారకం ఈ గ్రామంలో జన్మించడం గ్రామ అదృష్టమన్నారు. ఆమె సహకారంతోనే ఎన్‌టీఆర్ యుగపురుషుడుగా చరిత్రకు ఎక్కారన్నారు. నారా భువనేశ్వరీ తన తల్లి గ్రామమైన కొమరవోలును దత్తతు తీసుకుని అభివృద్ధి పరచడంలో విజయం సాధించారన్నారు. రాష్ట్రంలో కొమరవోలు ఆదర్శ గ్రామంగా నిలుస్తుందనీ, దీన్ని స్ఫూర్తిగా తీసుకుని రాష్ట్ర ప్రజలు గ్రామాల అభివృద్ధికి సహకరించాలని కోరారు. కేవలం నిమ్మకూరు, కొమరవోలులో మాత్రమే అభివృద్ధి జరుగుతోందని కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారనీ, రాష్ట్రమంతా తిరిగి చూస్తే ప్రతి గ్రామంలో అభివృద్ధి ఏ స్థాయిలో జరిగిందో తెలుస్తుందన్నారు. రాష్ట్ర విభజన తరువాత తీవ్ర సంక్షోభంలో ఉన్న సమయంలో తనపై నమ్మకంతో రాష్ట్ర ప్రజలు అవకాశం కల్పించారన్నారు. రాజధాని నిర్మాణానికి రైతులు స్వచ్ఛంధంగా సహకరించి 34వేల ఎకరాలను యిచ్చారని గుర్తు చేశారు. అదే రీతిలో రాజధాని నిర్మాణం శరవేగంగా సాగుతోందన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులు అందుతాయన్నారు. గ్రామీణ టూరిజాన్ని ప్రోత్సహిస్తున్నామన్నారు. పట్టిసీమ ద్వారా కృష్ణా డెల్టాలో బంగారం పండుతోందన్నారు. పామర్రులో ఐటీఐ కళాశాల ఏర్పాటుకు సీఎం గ్రీన్ సిగ్నల్ యిచ్చారు. సభ ప్రారంభంలో ప్రభుత్వ పథకాలను అనర్గళంగా వివరించిన పామర్రు నియోజకవర్గం గురుకుల పాఠశాలకు చెందిన 6వ తరగతి విద్యార్థి శశికుమార్‌కు ముఖ్యమంత్రి చంద్రబాబు రూ. 2లక్షలు యిస్తున్నట్లు ప్రకటించారు. అనంతరం గ్రామ రైతులు చంద్రబాబును గజమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో శాసనసభ ఉపసభాపతి మండలి బుద్ధప్రసాద్, మచిలీపట్నం పార్లమెంట్ సభ్యులు కొనకళ్ళ నారాయణరావు, ఆప్కాబ్ ఛైర్మన్ పిన్నమనేని వెంకటేశ్వరరావు, ఎమ్మెల్యే ఉప్పులేటి కల్పన, ముడా ఛైర్మన్ బూరగడ్డ వేదవ్యాస్, జడ్‌పి ఛైర్మన్ గద్దె అనురాధ, ఎమ్మెల్సీ వైవీబీ రాజేంద్రప్రసాద్, జిల్లా కలెక్టర్ బి.లక్ష్మీకాంతం, తూర్పు కృష్ణా డెల్టా ప్రాజెక్టు కమిటీ ఛైర్మన్ గుత్తా శివరామ కృష్ణ(చంటి), మాజీ ఎమ్మెల్యే రావి వెంకటేశ్వరరావు, మున్సిపల్ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు పొట్లూరి కృష్ణబాబు, జడ్పీటీసీలు పొట్లూరి శశి, మూల్పూరి హరీష్, మాజీ ఐ.ఆర్.ఎస్ ఉప్పులేటి దేవిప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ ఓట్ల కోసం 'బాబు' జిమ్మిక్కులు

వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే.పార్థసారథి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: బీసీ ఓట్ల కోసం సీఎం చంద్రబాబు వివిధ పథకాల పేరుతో జిమ్మిక్కులకు పాల్పడుతున్నారని వైసీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కే.పార్థసారథి విమర్శించారు. విజయవాడ వైసీపీ రాష్ట్ర కార్యాలయంలో ఆదివారం ఆయన విలేకరుల సమావేశాన్ని నిర్వహించారు. ప్రతి బీసీ కులాన్ని నమ్మించి మోసగించిన ఘనత చంద్రబాబుకే దక్కిందని దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్‌మెంట్, సబ్‌ప్లాన్, బీసీ స్కాలర్‌షిప్, విదేశీవిద్య అన్నింటా బీసీలకు అన్యాయం కొనసాగుతోందని విమర్శించారు. విదేశీ విద్యకోసం వేయిమంది బీసీ విద్యార్థులకు కేవలం రూ. 11.33కోట్లు మాత్రమే కేటాయించారని, బీసీలకు పోస్ట్ మెట్రిక్ స్కాలర్‌షిప్‌ల కింద రూ. 274కోట్లు కేటాయించి, కేలం రూ. 124మాత్రమే విడుదల చేశారని విమర్శించారు. మత్స్యకారుల బోట్లకు డీజిల్ సబ్సిడీపై సరఫరా చేస్తామని ఇంతవరకూ ఇవ్వలేదని, చేపల మార్కెటింగ్‌కు సరైన సౌకర్యాలు కల్పించలేదని దుయ్యబట్టారు. జన్మభూమి కమిటీల ఆధ్వర్యంలో ఇష్టానుసారంగా సంక్షేమ పథకాలను పంపిణీ చేస్తూ, బీసీలకు ప్రభుత్వం తీవ్ర అన్యాయం చేస్తోందని దుయ్యబట్టారు. ఈ ప్రభుత్వానికి బుద్ధిచెప్పేందుకు బీసీలు సిద్ధంగా ఉన్నారని పేర్కొన్నారు.

ఆర్టీసీ కార్మికులకు సీపీఎం మద్దతు : మధు

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఏపీఎస్‌ఆర్టీసీ) కార్మిక సంఘాల డిమాండ్ల సాధన ఉద్యమానికి సీపీఎం రాష్ట్ర కమిటీ పూర్తి మద్దతును ప్రకటించింది. ఈమేరకు ఆపార్టీ రాష్ట్ర కార్యదర్శి పి.మధు ఆదివారం ప్రకటన చేశారు. రాష్ట్ర ప్రభుత్వం కార్మిక సంఘాలతో సంప్రదింపులు జరిపి ఆమోదయోగ్యమైన ఒప్పందానికి రావడానికి చొరవ చూపాలని ఆయన డిమాండు చేశారు. ఆర్టీసీకి బడ్జెట్‌లో తగిన కేటాయింపులు జరిపి నష్టాలను భర్తీ చేయడం, కార్మికుల వేతన సవరణకు మార్గం సుగమం చేయడం, కార్మికులపై వేధింపుల నిబంధనలు సడలించడం, ప్రైవేటు ఆపరేటర్లకు విచ్చలవిడిగా ఇచ్చిన అనుమతులు రద్దు చేయడం వంటివి న్యాయమైన డిమాండ్లన్నారు.

104 సమ్మెను తక్షణం పరిష్కరించాలి

రాష్ట్రవ్యాప్తంగా 104 మెడికల్ సర్వీసులలో పనిచేస్తున్న కార్మికులు నాలుగు రోజులు నుంచి సమ్మె చేస్తున్నారని, ప్రభుత్వం తక్షణం స్పందించి పరిష్కరించాలని మధు విజ్ఞప్తి చేశారు. గ్రామీణ ప్రాంతాల ప్రజలకు అందాల్సిన అత్యవసర వైద్య సేవలు నిలిచిపోయాయన్నారు. పీఎఫ్ చట్ట ప్రకారం యాజమాన్యం వాటాను యాజమాన్యం చెల్లించాలని, అలా కాకుండా యాజమాన్యం వాటాను కూడా కార్మికుల వేతనంలో కోత కోయడం వల్లే సమ్మె అనివార్యమైందన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి సమ్మె విరమించేందుకు తగు చర్యలు చేపట్టాలన్నారు.

పంచగ్రామాల భూ సమస్యపై సీఎంకు లేఖ

విశాఖపట్నం జిల్లా సింహాచలం పంచగ్రామాల భూ సమస్యను వెంటనే పరిష్కరించాలని మధు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు ఆదివారం సీఎం చంద్రబాబుకు ఆయన లేఖ రాశారు. ఈ సమస్యను వంద రోజుల్లో పరిష్కరిస్తామని 2014 జూన్ 12న విశాఖలో జరిగిన మొదటి కేబినెట్ మీటింగ్‌లో నిర్ణయించిన విషయాన్ని గుర్తు చేశారు. అయితే ఈ సమావేశం జరిగి 1600 రోజులు దాటినా సమస్యకు పరిష్కారం లభించలేదన్నారు. సమస్యకు మూలమైన 1996 సంవత్సరంలో దేవస్థానంకు ఇచ్చిన రైత్వారీ పట్టాలు చెల్లవని త్రిసభ్య కమిటీ నివేదికలో తెలిపినా ప్రభుత్వం ఏ విధమైన చర్య చేపట్టకపోవడం వల్లే ఈ పరిస్థితి తలెత్తిందని మధు వివరించారు.

వైద్యారోగ్యశాఖ అవినీతిపై గవర్నరు దృష్టి పెట్టాలి

పీసీసీ డాక్టర్స్ సెల్ కో-చైర్మన్ అంబటి

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి: రాష్ట్ర వైద్యారోగ్యశాఖపై గవర్నరు నరసింహన్ చదివిన ప్రసంగంలో ప్రభుత్వం అసత్యాలను పొందుపరిచిందని, ఈ శాఖలో కొనసాగుతున్న భారీ అవినీతిపై గవర్నరు నివేదికలు తెప్పించుకోవాలని పీసీసీ డాక్టర్స్‌సెల్ కో-చైర్మన్ అంబటి నాగరాధాకృష్ణ విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రజలకు విషయాలు తెలిపేముందు వాస్తవాలను తెలుసుకుని, గవర్నరు ప్రసంగ పాఠం కొనసాగితే బాగుండేదని సూచించారు. విశాఖపట్నంలోని ఆంధ్రప్రదేశ్ మెడ్‌టెక్ జోన్ వ్యవహారాన్ని తీసుకుంటే..కేపీఎంజీ అనే ప్రతిష్టాత్మక సంస్థ డీపీఆర్ సిద్ధం చేసిందని పేర్కొన్నారు. ఇందులో పెద్దఎత్తున అవినీతి నెలకొందని, నిజ నిర్ధారణ కమిటీతో నివేదికలు తెప్పించుకోవాలని డిమాండు చేశారు.

మూఢ నమ్మకాల నిర్మూలన చట్టం చేయాలి

హేతువాద సంఘం రాష్ట్రఅధ్యక్షులు వెంకటసుబ్బయ్య

విశాలాంధ్ర బ్యూరో-అమరావతి : సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢ నమ్మకాల నిర్మూలన కోసం ఉభయ తెలుగురాష్ట్రాల శాసనసభల్లో చట్టాలు రూపొందించే విధంగా ఎమ్మెల్యేలపై ఒత్తిడి తీసుకురావాలని ఏపీ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎన్. వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. విజయవాడ గవర్నర్‌పేటలో స్వాతంత్ర్య సమరయోధుల సంఘం భవనంలో ఆదివారం మూఢనమ్మకాల నిర్మూలన చట్ట సాధన రాష్ట్ర కమిటీ సమావేశం జరిగింది. ఆధునిక సమాజంలో చేతబడులు, క్షుద్రపూజలు, దొంగస్వాముల బాగోతాలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఇటీవల కాలంలో అనేక మంది దొంగబాబాలు, పాస్టర్లు దైవత్వం ముసుగులో చేసిన అత్యాచారాలు బట్టబయలై జైలుకెళ్లడం చూశామన్నారు. ఈనేపథ్యంలో మూఢ నమ్మకాల నిర్మూలనకు సమిష్టిగా కృషి చేయాలన్నారు. జనవిజ్ఞానవేదిక రాష్ట్ర అధ్యక్షులు జే.కృష్ణకిషోర్, నాస్తికసమాజం రాష్ట్ర కార్యదర్శి అరుణ కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు రామకృష్ణ, ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చంద్రానాయక్, నాయకులు రామన్న, గణేష్ పాల్గొన్నారు.

టీడీపీ హోదా దీక్షకు మద్దతు : ఆర్ఎస్‌పీ

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రత్యేక హోదా సాధన, విభజన చట్టంలో పేర్కొన్న అంశాల అమలు కోసం ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు తలపెట్టిన దీక్షకు సంపూర్ణ మద్ధతు ఇస్తున్నట్లు రివల్యూషనరీ సోషలిస్ట్ పార్టీ (ఆర్ఎస్‌పీ) ఆంధ్రప్రదేశ్, తెలంగాణ ఉమ్మడి రాష్ట్రాల కార్యదర్శి జానకిరాములు జూపల్లి తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సమస్యలను పరిష్కరించడంలో కేంద్రంలోని మోడీ సర్కార్ విఫలమైనందునే చంద్రబాబునాయుడు పార్లమెంటు సమావేశల సందర్భంగా ఒక రోజు దీక్షకు ఉపక్రమించారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, విభజన చట్టం 2014లో పేర్కొన్న అన్ని అంశాలు పరిష్కరించాలని కోరారు. చంద్రబాబునాయుడు వివిధ రూపాల్లో కేంద్రంపై చేస్తున్న పోరాటంలో భాగంగా ఢిల్లీలో చేస్తున్న ఒక రోజు దీక్షకు ఆర్‌ఎస్‌పి పక్షాన సంఘీభావం తెలుపుతున్నట్లు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ పట్ల కేంద్ర ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష వైఖరిని ప్రదర్శిస్తూ వస్తోందని విమర్శించారు. ధర్మపోరాటానికి అన్ని రాజకీయ పార్టీలు బాసటగా ఉండాలని కోరారు. చంద్రబాబు 23 జాతీయ, ప్రాం తీయ పార్టీలను ఏకం చేసి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తున్నారని పేర్కొ న్నారు. ఆర్‌ఎస్‌పితో పాటు జాతీయ, ప్రాంతీయ పార్టీల నాయకులు సైతం చంద్రబాబు న్యాయపోరాటానికి అండగా నిలిచి ఏపీకి న్యాయం చేయాలని జానకిరాములు కోరారు.

వైసీపీ గూటికి దగ్గుబాటి

- జగన్‌తో వెంకటేశ్వరరావు భేటీ
- బాబు పాలన గాడితప్పిందని విమర్శ



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పనితీరు గాడి తప్పిందని మాజీమంత్రి దగ్గుబాటి వెంకటేశ్వరరావు అన్నారు. ప్రభుత్వ డబ్బుతో చంద్రబాబు దొంగ దీక్షలు చేస్తున్నారని విమర్శించారు. కోట్లు ఖర్చుచేసి జనాన్ని తరలిస్తున్నారన్నారు. డ్వాక్రా మహి ళలకు పోస్టు డేటెడ్ చెక్‌లు ఇవ్వడం విచిత్రమన్నారు. ఆ చెక్కులతో రుణమాఫీనా అంటూ ప్రశ్నించారు. తన రాజకీయ జీవితంలో ఇలాంటి విడ్డూరం ఇంతవరకు చూడలేదన్నారు. నాలుగో, ఐదో విడత రైతుల రుణ మాఫీకి ఇంకా డబ్బులు విడుదల చేయలేదని అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో మరో కీలక పరిణామం చోటుచేసుకుంది. దగ్గుబాటి వెంకటేశ్వర రావు ఆదివారం ప్రతిపక్ష నేత, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో లోటస్ పాండ్‌లో సమావేశమయ్యారు. తన కుమారుడు హితేష్‌తో కలిసి జగన్ నివాసానికి చేరుకున్న దగ్గుబాటికి వైసీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి విజయ సాయిరెడ్డి సాదర స్వాగతం పలికారు. కొంతకాలంగా దగ్గుబాటి కుటుంబం..వైసీపీలో చేరే అవకాశం ఉందని ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో జగన్‌తో దగ్గుబాటి సమావేశం కావడం ప్రాధాన్యతను సంతరించుకుంది. దగ్గుబాటి వెంకటేశ్వరరావు భార్య పురందేశ్వరి బీజేపీ మ్యానిఫెస్టో కమిటీ చైర్మన్‌గా కొనసాగుతున్నారు. జగన్‌తో భేటీ అనంతరం వెంకటేశ్వరరావు విలేకరులతో మాట్లాడుతూ వైసీపీలో చేరడానికి నిర్ణయం తీసుకున్నామని, తమ నిర్ణయాన్ని జగన్ స్వాగతించారని తెలిపారు. కుమారుడు హితేజ్ జగన్‌తో కలిసి పనిచేస్తారన్నారు. పార్టీ ఆదేశాల మేరకు నడుచుకుంటామని తెలిపారు. రెండేళ్లుగా జగన్ వ్యక్తిత్వాన్ని, పాదయాత్రను, ఆయన ఇస్తున్న ఇంటర్వ్యూలను గమనిస్తున్నానని, ఆయన కష్టానికి దేవుడు తగిన ప్రతిఫలం చూపిస్తాడని ఆకాంక్షిస్తున్నానన్నారు. పురందేశ్వరి బీజేపీలో ఉన్నట్టు జగన్‌కు చెప్పానని, కుటుంబం మొత్తం ఒకే పార్టీలో ఉండాలని లేదన్నారు. తన కుమారుడు హితేష్ రాజకీయ భవిష్యత్తుకు అడ్డంకిగా మారే పరిస్థితి తలెత్తినా ఎదుర్కోవడానికి పురందేశ్వరి సిద్ధంగా ఉన్నారన్నారు. తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె బీజేపీకి రాజీనామా చేసి రాజకీయాల నుంచి వైదొలగుతారని, అంతేకానీ వేరే పార్టీలో చేరబోరని దగ్గుబాటి వెంకటేశ్వరరావు స్పష్టం చేశారు. పార్టీతో కలిసి పనిచేసే అంశంపై మాత్రమే చర్చించామని, ఎప్పుడు చేరేది త్వరలో వెల్లడిస్తామని వివరించారు. ప్రకాశం జిల్లా పర్చూరు టికెట్ గురించి చర్చించారా అని ఓ విలేకరి అడుగగా పార్టీనే నిర్ణయం తీసుకుంటుందని చెప్పారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో దగ్గుబాటి వెంకటేశ్వర రావు కుటుంబం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. పురందేశ్వరితో చర్చించిన అనంతరం కుమారుడిని రాజకీయాల్లోకి తీసుకురావాలని వెంకటేశ్వరరావు భావించారు. ఈ క్రమంలో తన కుమారుడికి వైసీపీ సీటు అడిగేందుకు లోటస్ పాండ్‌కు వెళ్లి జగన్‌తో చర్చలు జరిపారు.

చంద్రన్న పెళ్లి కానుక పంపిణీకి సన్నాహాలు

- నియోజకవర్గాల్లో ప్రత్యేక ఏర్పాట్లు
- 29,385 మంది అర్హులుగా గుర్తింపు



విశాలాంధ్ర- అమరావతి : చంద్రన్న పెళ్లి కానుకలు పండగ వాతావరణంలో అందించేందుకు ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. సర్కార్ పెళ్లి కానుకలను ఇటీవల అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించింది. కొత్త జంటలకు అతిధుల సమక్షంలో కానుకలు అందించాలని నిర్ణయించి వేడుకగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ఏప్రిల్ 20 నుంచి అక్టోబరు 30 మధ్య వివాహం చేసుకొని చంద్రన్న పెళ్లి కానుక పొందని వారికి ప్రత్యేక కార్యక్రమం ద్వారా అందించేందుకు అధికారులు కసరత్తులు చేస్తున్నారు. ప్రభుత్వం నిర్దేశించిన కాలంలో వివాహం చేసుకొని పథకానికి ఆన్ లైన్ లో దరఖాస్తు చేసుకోలేక పోయిన వారు, పెళ్లి కానుక లబ్ధి పొందలేని వారికి ప్రయోజనం కల్పించేందుకు నమోదు ప్రక్రియ చేపట్టింది. గత నవంబరు 1వ తేదీ నుంచి 31 వరకు నమోదు కొనసాగించారు. ఆయా మండలాల పరిధిలో దాదాపుగా 30 వేల దరఖాస్తులు వచ్చాయి. వచ్చిన దరఖాస్తులను వెరిఫికేషన్ చేయగా 28.385 దరఖాస్తులు అర్హమైనవిగా గుర్తించినట్టు అధికారిక గణాంకాలు తెలుపుతున్నాయి.

ప్రజాప్రతినిధులు సమక్షంలో

రానున్నది ఎన్నికల కాలం కావటంతో ప్రతి అంశాన్ని అందిపుచ్చుకునేందుకు సర్కారు ప్రణాళికలు సిద్ధం చేసుకుంటోంది. సంక్షేమ పథకాలను ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న ప్రభుత్వం అదే స్థాయిలో చంద్రన్న పెళ్లి కానుకను అమలు చేస్తోంది. అందులో భాగంగానే దరఖాస్తు చేసుకోలేని వారి కోసం ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. అటువంటి వారిని గుర్తించిన ప్రభుత్వం రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో వేడుకగా కానుకలు పంపిణీ చేయాలని నిర్ణయించింది. గుర్తించిన 28,385 మంది లబ్ధిదారులకు నియోజకవర్గ కేంద్రాలలో ప్రజా ప్రతినిధులు చేతి మీదగా సాయాన్ని అందించేలా ప్రణాళికలు సిద్ధం చేశారు. ఈ కానుకల కోసం దాదాపు రూ. 120 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేస్తున్నారు.

సాయమిలా..

చంద్రన్న పెళ్లికానుక క్రింద బీసీ సామాజికవర్గానికి చెందిన వారికి రూ. 35 వేలు, ఎస్టీలు, మైనారిటీలకు రూ.50 వేలు, ఎస్సీ సామాజిక వర్గం వారికి రూ. 40 వేలు , దివ్యాంగులకు రూ. లక్ష రూపాయల చొప్పున ప్రభుత్వం అందచేస్తుంది. లబ్ధిదారుల వివరాలు పరిశీలిస్తే ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన వారు 1,830, ఎస్టీ సామాజికవర్గం నుంచి 8,548, బీసీల నుంచి అత్యధికంగా 14,884 మంది ఉండగా, దుల్హన్ పథకంలో 3,441, దివ్యాంగులు 607, భవన నిర్మాణ కార్మికులు 75 మంది ఉన్నట్లు అధికారిక గణాంకాల ద్వారా తెలుస్తోంది. ప్రజల్లోకి ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలను మరింతగా తీసుకెళ్లాలన్న ముఖ్యమంత్రి ఆదేశానుసారం సంబంధిత అధికారులు ఈ విధమైన ప్రణాళికలు రచిస్తున్నారు. లబ్ధిదారులందరికి నియోజకవర్గ కేంద్రంలో చంద్రన్న పెళ్లి కానుక అందించనున్నారు.

విస్మరిస్తే గద్దె దించుతాం

- ఇచ్చిన హామీలు అమలు చేయాలి
- రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరిక
- అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్ల భారీ ర్యాలీ



సమావేశంలో మాట్లాడుతున్న రవీంద్రనాథ్

విశాలాంధ్ర - పీలేరు : కార్మికహక్కులు కాలరాసే ఏ ప్రభుత్వమూ మనజాలదని ఏఐటీయూసీ రాష్ట్ర అధ్యక్షుడు రావులపల్లి రవీంద్రనాథ్ హెచ్చరించారు. ఏఐటీయూసీ అనుబంధ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ చిత్తూరు జిల్లా నాలుగవ మహాసభలు పీలేరులో ఆదివారం ప్రారంభమయ్యాయి. రెండురోజులు జరిగే జిల్లా మహాసభలకు ఏఐటీయూసీ నేతలు, ఏపీ అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ అసోషియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు. తొలుత పట్టణంలో అంగన్‌వాడీలు భారీ ప్రదర్శన నిర్వహించారు. కోలాటాలు, బళ్లారి డ్రమ్స్‌తో పీలేరు దద్దరిల్లేలా ర్యాలీ పురవీధుల గుండా సాగింది. ఇది స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపం వరకూ సాగింది. ఏఐటీయూసీ జెండాలతో పురవీధులు ఎరుపెక్కాయి. రావులపల్లి రవీంద్రనాథ్ సహా అంగన్‌వాడీ వర్కర్స్, హెల్పర్స్ అసోషియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లలిత, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ప్రేమ, చిన్నమ్మ, ఏఐటీయూసీ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చిన్నయల్లప్ప, మురళి పాల్గొన్నారు. అనంతరం రావులపల్లి రవీంద్రనాథ్ మాట్లాడుతూ స్త్రీ, శిశు సంక్షేమశాఖలో అంగన్‌వాడీ కేంద్రాలు ఏర్పాటు చేసి 43 సంవత్సరాలైందని, అయినా పోషకాహార లోపంతో తల్లీబిడ్డలు అనేక జబ్బులతో బాధపడుతున్నారని అన్నారు. మాతృమరణాలు, శిశు మరణాలు ఇంకా ఆగడం లేదన్నారు. ఐసీడీఎస్ పరిరక్షణ కోసం అసోషియేషన్ అనేక పోరాటాలు చేసిందని, ఆ సంస్థను కాపాడుకున్నామన్నారు. అందులో ఏఐటీయూసీ ముఖ్యపాత్ర పోషించిందన్నారు. లలిత మాట్లాడుతూ ఏఐటీయూసీ, అసోసియేషన్‌ల పోరాట ఫలితంగా అంగన్‌వాడీల వేతనాలు కొంత మేరకైనా పెరిగాయన్నారు. పోరాటాల కారణంగానే నేడు రూ. 10,500 వేతనం తీసుకుంటున్నామని అన్నారు. రూ. 18వేల కనీస వేతనం పెంచుతామన్న కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు కాలయాపన చేస్తున్నాయని ఆమె దుయ్యబట్టారు. ముఖ్యమంత్రి చంద్రబాబు అంగన్‌వాడీలకు ఇచ్చిన హామీలను అమలు చేయని సచివాలయం ముట్టడి తప్పదని లలిత హెచ్చరించారు. మురళి మాట్లాడుతూ పెంచిన వేతనాన్ని 2018 అక్టోబరు నుంచి చెల్లించాలని డిమాండు చేశారు. ప్రతినెలా 5వ తేదీలోపు వేతనాలు చెల్లించాలని, సిలిండర్‌కు రూ. 900 చొప్పున గ్యాస్ బిల్లులు ఇవ్వాలన్నారు. జిల్లాలోని అంగన్‌వాడీ వర్కర్లు, హెల్పర్లు అధికసంఖ్యలో పాల్గొన్నారు. ఏఐటీయూసీ నాయకులు శ్రీధర్, కోదండం, నరసింహులు, శివ, సాయినాథ్, శివకుమార్, నౌషాద్, భాస్కర్‌రెడ్డి, జానం గంగిరెడ్డి హాజరయ్యారు.

దళిత, మైనార్టీలకు రక్షణ కల్పించాలి: జల్లి విల్సన్



మాట్లాడుతున్న జల్లి విల్సన్

విశాలాంధ్ర బ్యూరో - అమరావతి: పశుమాంసం తింటున్నారని కొన్ని అరాచక మూకలు దళితులు, ముస్లింలు, గిరిజనులపై దాడులు, దౌర్జన్యాలకు పాల్పడుతున్నారని మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్ అన్నారు. ఈ మూకదాడుల నుంచి రక్షణ కల్పించేందుకు చర్యలు చేపట్టాలని ఆయన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండు చేశారు. 'దళిత ఆదివాసీ మానిఫెస్టో - 2019'పై దళిత బహుజన రిసోర్స్ సెంటర్ రాష్ట్ర కార్యదర్శి అల్లాడి దేవకుమార్ అధ్యక్షతన విజయవాడలోని హోటల్‌లో ఆదివారం రాష్ట్రస్థాయి వర్క్‌షాప్ జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన విల్సన్ మాట్లాడుతూ దళిత, గిరిజన, మైనార్టీల రక్షణ కోసం పలు సూచనలు, సలహాలను అందచేశారు. దళితులు, గిరిజనులు, మైనార్టీలు నివసించే ప్రాంతాల్లో రక్షిత త్రాగు నీరుతోపాటు మౌలిక సదుపాయాలను కల్పించాలన్నారు. ఎస్సీ,ఎస్టీ సబ్ ప్లాన్ల కోసం వెచ్చించే నిధుల వివరాలపై ఏటా శ్వేతపత్రాలు విడుదల చేయాలన్నారు. అర్హులైన దళిత, గిరిజన కుటుంబాలకు నెలకు సరిపడా సరుకులకు రూ. 2వేలు చౌక ధరల దుకాణాల ద్వారా అందించాలన్నారు. నిరుద్యోగ యువతీ, యువకులకు నెలకు రూ. 5వేలు భృతి, 50 ఏళ్లు నిండిన వృద్ధులు, వితంతులు, సఫాయి కర్మచారులకు నెలకు రూ. 5వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. కోనేరు రంగారావు భూ కమిటీ సిఫార్సులను బహిర్గతం చేసి అమలు పరచాలన్నారు. అలాగే 2013 భూసేకరణ చట్టంలో ఏవిధమైన మార్పులు చేయకుండా యధావిధిగా అమలు చేయాలన్నారు. కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, రాజధానిలో విజయవాడ కేంద్రంగా అంబేద్కర్ స్టడీ సర్కిల్‌ను ఏర్పాటు చేసి ఐఏఎస్, ఐపీఎస్, ఐఎఫ్ఎస్, ఐఆర్ఎస్ పోటీ పరీక్షలకు కోచింగ్ ఇవ్వాలని విల్సన్ సూచించారు. ప్రధాన వక్తగా హాజరైన సీనియర్ జర్నలిస్ట్ సతీష్‌చంద్ర దళితుల సంక్షేమం, అభివృద్ధి, సామాజిక న్యాయం, ప్రభుత్వాలు కల్పించాల్సిన సౌకర్యాలపై పలు సూచనలు చేశారు. ఇంకా దళిత బహుజన ఫ్రంట్ జాతీయ ప్రధాన కార్యదర్శి మేళం భాగ్యారావు, ఎస్సీ, ఎస్టీ ఉద్యోగుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ చుక్కా నాగభూషణరావు తదితరులు పలు సూచనలు చేశారు. తొలుత అంబేద్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

సాహితి



ప్రతి ప్రకృతి

తల్లి భాషలో
దిక్కులు తెలియనితనం,
ఆపై తూర్పూ, పడమరా,
ఉత్తరం, దక్షిణం అని పలకలేనితనం ఓ వైపు,
వాటి అర్థాలు ఇంకో భాషలో తెలియనితనం ఓ వైపు,
వెరసి
మార్కెట్నే మొనగాడిగా నిలబెడుతూ
మనిషిని మాత్రం నామమాత్రంగా నైనా
ఉచ్చరించని సాంఘిక విద్య సాగుతుందిక్కడ,
రాజకీయ క్రీడలాడుతున్నారిక్కడ !
మనిషి భాషని మూగ పరుస్తున్నారిక్కడ !
నకార తివాచీలతో ఆతిథ్యాలిస్తున్నారిక్కడ !
కళ్యాణమండపం ఖరీదు ఓ రాష్ట్ర బడ్జెట్ అయిన చోట
కోట్ల అనారోగ్యాలు కొండల్లా
కొలువుదీరడం ఓ ప్రతి ప్రకృతి చర్య !
త్రాసులు తూచలేని తులాభారం !
పూలూ పత్రాలూ, తులసీ దళాలూ
గరికార్చనలూ, ఫల పూజలూ
దేహాలు కాంతివంతమవ్వాలనే !
దెయ్యాల మార్కెట్లు వర్ధిల్లాలని కాదు !
రూపు దిద్దుకున్న చట్టాలన్నీ
తుఫానులోని పూరిళ్లలా, పంటచేలలా, మూగ జీవాల్లా
పై కప్పులూడి తిరగబడుతూ, బంగారు వన్నెలు కోల్పోతూ,
ప్రాణాలు వదిలేస్తూ
పునరావృతమయిన ఆరోగ్య తృణధాన్యాల మేలు కలయిక భోజనాలు
రుచులు అందించే అందమయిన అరటాకుల్లో ఆరగించి
హరిత హరిత ఉత్పత్త సంతతి నిరతం నిగ నిగ లాడాలని
నీలకంఠుని మెడలో నేత్ర పుష్పార్చనల
సాలోచనతో ప్లాట్ఫాం మీద మనిషి !

- ఒబ్బిని, ✆ :9849558842

గురజాడకలం - ముత్యాలసరం

ప్రొఫెసర్ వెలమల సిమ్మన్న, ✆ :94406 41617

"ముక్కుపచ్చలారని బాలికల దుస్థితిని, విరుచుకుపడ్డ జీవనభారంతో పుడమి కంటా అంటుకొని పోయిన అనాథలను చూచి, వలవలా వాపోయి మొరకు మానవుల మీద గుడ్లెర్రజేసి నాడు అప్పారావు. ఆ ఎరుపు మంటలో నుంచే కన్యాశుల్కం ధమ్మని పేలింది. ఆ ధ్వనితో ఆంధ్రదేశం దద్దరిల్లింది. ఈ దెబ్బ దేశానికే కాకుండా ఇనుప గొలుసులతో కట్టిన తెలుగు సారస్వతం మీద కూడా పడి లింకులను వదులుచేసింది. ఒక్కసారి అందరూ ఆ దిక్కుకేసి చూశారు. అప్పారాయ కవీంద్రుని చేతులలో ముత్యాల సరాలు తళతళ మెరిసినవి. ఇవే నవ్యాంధ్ర వాఙ్మయమునకు తలకట్టులు, మేలుబంతులు, విజ్ఞానకోశములు".

- ఇంద్రగంటి హనుమచ్ఛాస్త్రి

కళకి ఆనందంతో పాటు, సామాజిక ప్రయోజనం కూడా ఉండాలని ప్రపంచ మేధావులు ఆలోచిస్తూ, ఆచరణ రూపంలో కళల్ని ఉపయోగిస్తున్నారు. భారతీయులు మాత్రం మూఢ విశ్వాసాలతో ఉన్నారు. సతీ సహగమనం, బాల్య వివాహాలు, వృద్ధ వివాహాలు, కన్యాశుల్కం.. ఇలా అనేక సమస్యలతో భారతదేశం సతమతమవుతుంది. సాహిత్యం కూడా సత్యదర్శనం చేయాలనే దృక్పథంతో ప్రపంచ సాహిత్యాన్ని అధ్యయనం చేసిన గురజాడ భావనలోనూ, భాషలోనూ నూతనత్వాన్ని ప్రదర్శించి మహాకవిగా మార్గదర్శి అయ్యారు. అందుకే శ్రీశ్రీ గారు "ప్రపంచ కవి సమ్మేళనంలో, తెలుగువారి తరపున పాల్గొన దగిన ఒకే మహాకవి గురజాడ" అని అన్నారు.

అక్టోబర్‌లో 1913 విశాలాంధ్ర వారి "ముత్యాలసరాలు" అనే కవితాసంపుటిలో ఈ ఖండికలు చోటు చేసుకున్నాయి. 1. ముత్యాల సరములు 2. కాసులు 3. లవణరాజుకల 4. కన్యక 5. డామన్, పితియన్ 6. పూర్ణమ్మ 7. మనిషి 8. దేశభక్తి 9. దించులంగరు 10. లంగరెత్తుము 11. మిణుగురులు 12. బొట్టు 13. నీలగిరి పాటలు 14. ఊటి చోద్యమేమిచెపుదు 15. ఉమాపతియర్చన 16.నాటిమాట 17. లేవాకో మంత్రములు 18. చిత్తరువని చూడ 19. మాటలమబ్బులు 20. పుష్పలావికలు 21. మెరుపులు 22. సుభద్ర23. సత్యవతీశతకం. ఆంగ్లంలోకూడా కొన్నికవితలు ఉన్నాయి.

ముత్యాల సరాలు :

"గుత్తునా ముత్యాల సరములు/కూర్చుకొని తేటైన మాటలు
కొత్తపాతల మేలు కలయిక/క్రొమ్మెరుంగులు జిమ్మగా"

సరళమైన ఛందస్సులో, ప్రాసయతులు లేకుండా ముత్యాల సరాల్ని సృష్టించిన స్రష్ట గురజాడ. కొత్త పాతల కలయికలతో, కొత్త కాంతులతో కూడుకున్న 'ముత్యాలసరాల' దండను కూర్చారు అప్పారావుగారు. అందుకే శ్రీశ్రీ గారు "అడుగు జాడ గురజాడ. భావికిబాట. మహాకవి గురజాడ ముత్యాలసరాలు కూర్చిన నాడే. అంటే 1910లోనే తెలుగు కవిత్వంలో విప్లవ శకం ఆరంభమయింది" అని అన్నారు.

"నవ్యాంధ్ర కవిత్వ శుభోదయానికి గురజాడ అప్పారావు వేగుచుక్క" అని అంటారు ఆంధ్ర శేషగిరిరావు గారు. కాబట్టి గురజాడ వారి సాహితీ ప్రతిభ ఎలాంటిదో మనకు అర్థమవుతుంది. గురజాడ వారు "ముత్యాలసరాలు" రాసి నవ్యకవితకు నాంది పలికారు. అప్పారావుగారు ఆధునిక సాహిత్యానికి మూల పురుషుడు. వీరి రచనలు అభ్యుదయ సాహిత్యానికి మార్గదర్శకంగా నిలిచాయి. సాహిత్యం కేవలం ప్రజల్ని ఆనందింపజేయటమేకాక, సమాజంలోని దురాచారాలన్నింటినీ రూపుమాపి, మంచి మార్గాన్ని చూపాలనిఆయన అభిప్రాయపడ్డారు. ఈ అభిప్రాయంతోనే ఆయన "ముత్యాలసరములు" అనే గేయసంపుటిని రాశారు. ఈ సంపుటి లోని గేయాలన్నీ సమాజంలోని ఏదో ఒక దురాచారంపైన రాసినవే.

కాసులు : "కాసులు గేయంలో గురజాడ వారు పవిత్రమైన దాంపత్య ప్రేమకుపట్టాభిషేకంచేశారు".- ఆచార్య సి.నారాయణరెడ్డి

దాంపత్య బంధం ఏది? బంగారమా? ప్రేమా? అనే రెండు ప్రశ్నలు ఈ గేయంలో కనిపిస్తాయి. బంగారం కంటే ప్రేమ శాశ్వతమైనదనీ, గొప్పదనీ గురజాడ వారు తెలియజేశారు. మానవ జీవితంలోని ఉన్నత శిఖరాన్ని అందుకోవడానికి ప్రేమ మంచిదారి చూపుతుందని గురజాడ అభిప్రాయపడ్డారు. అందుకే "ఆరాధించదగ్గ నిజమైన ప్రేమ మానవ ప్రేమ" అని ముని సుబ్రహ్మణ్యం గారికి రాసిన ఉత్తరంలో గురజాడ చెప్పారు.


స్వార్థ త్యాగానికి దారి తీయగల ప్రేరణ ప్రేమకు మించి ఉందా? అని ప్రశ్నించి, "మానవాత్మ పూసిన అత్యంత ఉజ్జ్వలమైన పుష్పం ప్రేమ. వెర్రి ప్రేమ కాదు. వ్యామోహం కాదు, అందమైన ఆత్మ సౌందర్యాన్నీ, స్ఫటిక స్వచ్ఛతనూ మెచ్చుకోవడం, పరోప కారమూ, దయా, శాంతీ, నిశ్చలత్వమూ, మనోహరమైన రూపు రేఖల ద్వారా తొణికిసలాడే సౌందర్యం" అంటూ వివరించారు గురజాడ. గురజాడ ప్రేమ తత్వానికి 'కాసులు' గేయం దర్పణం పడుతోంది. ఈ గేయంలో నగలు తేలేదని అలిగిన భార్యను లాలిస్తూ, అన్ని సంపదలకన్నా కోరదగింది ప్రేమ అని అది లేకపోతే బ్రతుకు చీకటి అని భర్త వివరిస్తాడు. బ్రతుకు సుఖానికి, ప్రేమ మహోన్నతమైనదని గురజాడ వర్ణించారు.

లవణరాజుకల : సమాజంలో బహుళ ప్రచారంలో వున్న లవణరాజు వృత్తాంతాన్ని గ్రహించి అభ్యుదయాత్మక భావాల్ని చెబుతూ గురజాడ 'లవణరాజుకల'ను అద్భుతంగా రాశారు. మూలకథలోని లవణరాజు వివాహంలో కులవ్యత్యాసాలూ, అంతస్థుల తేడాలూ కనిపించవు. అయితే లవణుడు అక్కడ ఆపద్ధర్మంగ మాలెతను పెళ్ళాడటానికి ఒప్పుకుంటాడు. అలా కాకుండా ప్రేమ ప్రాతిపదికగా లవణరాజు, మాలెతల వివాహం జరిగితే అన్ని కాలాలకూ ఆదర్శప్రాయమైన కళ్యాణమవుతుందని గురజాడ భావించారు. అందుకే 'లవణరాజుకల'లో ప్రేమ ప్రధానంగా, లవణుని వివాహాన్ని జరిపించి, కథకు ఉదాత్తతను చేకూర్చారు గురజాడవారు. మూలకథలోని జగత్ మిథ్యావాదాన్ని ప్రశ్నించి, అనుభవజ్ఞానానికి ప్రాముఖ్యం ఇచ్చి పట్టం కట్టారు. ఈ మార్పులు గురజాడ మానవతావాద దృక్పథానికి నిదర్శనం.

కన్యక : 'కన్య' గేయానికి మూలం చరిత్ర ప్రసిద్ధమైన "కన్యక" వృత్తాంతం. చారిత్రకంగా వున్న మూలకథాంశాన్ని మాత్రమే గురజాడ తీసుకున్నారు. గురజాడ చేతిలో కన్యక కథ పూర్తిగా క్రొత్త రూపును సంతరించుకుంది. కన్యక తండ్రి వర్తకుడు. ఆ నగరాన్ని పాలించే రాజు, దేవతార్చనకై దేవాలయానికి వెళుతున్న కన్యకను చూచి రాజు మనసు పారేసుకుంటాడు. రాజు ప్రవర్తన మూలకథలో కన్నా గేయంలో మరింత చెడ్డగా ఉంది. కన్యక పాత్రను గురజాడ ఉదాత్తంగా చిత్రీకరించాడు.

ఎక్కడైతే కన్యక మాన సంరక్షణకై అగ్నికి ఆహుతి అయిందో అక్కడే ఆకాశాన్నంటే సౌధం లేచిందనడం, రాజు గర్వం అణిగిపోయినట్లు, అతని కోట పేటలు నక్కలకు ఆటపట్టైనట్లు, రాయడం ద్వారా గురజాడ మంచిని కీర్తించడం, చెడును దూషించడం చేశారు. ఎప్పుడైనా, ఎక్కడైనా చెడుకు నాశనం తప్పదని గురజాడ మంచి సందేశం ఇచ్చారు. కన్యక గేయంలో గురజాడ నీతికి పట్టం కట్టారు. నీతివంతమైన ప్రవర్తన మాత్రమే మనిషిని ఉన్నతునిగా, ఆదర్శప్రాయుడిగా చేస్తుంది. సాంఘికంగా, ఆర్థికంగా, ఉన్నత స్థానాన్ని పొందినా, రాజులో నీతి లోపించింది. అందుకే రాజు పూర్తిగా పతనమయ్యాడు. గురజాడ, ఈ గేయంలో అన్యాయాన్ని ప్రతిఘటించాలని నొక్కి వక్కాణించారు. ఈ గేయం గురజాడకు మంచి పేరు ప్రఖ్యాతులు తెచ్చి పెట్టింది. దుర్మార్గులైన ప్రభువులు, అందమైన అమ్మాయిలపై నీచమైన ప్రవర్తన చేసినప్పుడు ప్రతిఘటించిన కన్యకను చిత్రించడంలో గురజాడ స్త్రీ ఆత్మగౌరవ సంరక్షణనే ప్రధానం చేసుకున్నాడు.

డామన్, పితియన్ : కళాశాల విద్యార్థులకు గ్రీసు దేశ చరిత్రను తత్వశాస్త్రాన్ని బోధిస్తున్నప్పుడు డామన్, పితియస్ అనే ఇద్దరు గ్రీకు యువకుల స్నేహగాథ అప్పారావు దృష్టిని ఆకట్టుకుంది. ఆర్.ఎడ్వర్డు రాసిన నాటిక, ఈ గేయకథకు మూలం, గురజాడ నాటకీయంగా కథను మలచారు. అప్పారావులోని నాటకీయత, కథన నైపుణ్యం, ఈ గేయ కథకు ప్రాణం పోశాయి. డబ్బు, అధికారంతో రాజు, డామన్‌కు మరణ శిక్షను విధిస్తాడు. అతనిలోని ప్రేమ మేల్కొనగానే, అహంకారం నశిస్తుంది. తత్ఫలితంగా వేసిన శిక్షను కూడా రద్దు చేసి, తన తప్పును అంగీకరిస్తాడు. మానవతావాదపు విలువలైన నీతి, జ్ఞానం, ప్రేమల విశిష్టత ఈ కథాగేయంలో కనబడతాయి.



పూర్ణమ్మ : "పూర్ణమ్మ కథ కాలగర్భంలో కాదు కావ్య గర్భంలో కలిసింది. అందుకే శాశ్వతంగా నిలిచింది". - ఆరుద్ర

"పూర్ణమ్మ" అనే శీర్షికతో చక్కని కథను రాసి సమాజం కళ్ళు తెరిపించారు గురజాడ. కాసుల కోసం తమ పిల్లల భావి జీవితాన్ని మంట గలిపే తల్లిదండ్రులకి కనువిప్పు కలిగించే రచన ఇది. కన్యాశుల్కం కోసం తల్లిదండ్రులు ముక్కు పచ్చలారని తమ కూతుళ్ళను వృద్ధులకైనా, నిత్య పెళ్ళి కొడుకుకైనా అంటగట్టేవారు. ఈ దురాచారానికి తిరుగుబాటే "పూర్ణమ్మ" కథ. ఈ గేయంలో మానవ ప్రేమ, భావనాశక్తి, శిల్పదృష్టి కనిపిస్తాయి. బాల్యవివాహాన్ని, దాని వల్ల కలిగిన నష్టాన్ని కరుణ రసంతో రాసిన కథాగేయం 'పూర్ణమ్మ'. ఈ గేయాన్ని గురజాడ చతురస్ర (కిటతక) గతిలో రాశారు.

"పూర్ణమ్మ" కథలో పూర్ణమ్మలాగ, సంఘ దురాచారానికి గురైన ముక్కుపచ్చలారని బాలిక ఆత్మహుతిని, అంతకుముందు తెలుగు కవులు ఎవ్వరూ ఇతివృత్తంగా కావ్య రచనకు పూనుకోలేదు. అదే ఈ గేయం ప్రాముఖ్యం.

"కన్నుల కాంతులు కలువల చేరెను/మేలిమి జేరెను మేని పసల్!
హంసల జేరెను నడకల బెడగులు/దుర్గను జేరెను పూర్ణమ్మ".

ఆమె ప్రకృతిలో కలిసిపోయింది. కలువలలాంటి కళ్ళ కాంతులు కలువలలోనేకలిశాయి. బంగారం లాంటి దేహకాంతి, బంగారంలో కలిసిపోయింది. హంసల లాంటి అందమైన నడకలు హంసలలోనే కలిసిపోయాయి. చివరకుఆమె ఏ దుర్గను మొదటి నుంచి పూజించి నదో ఆ దుర్గలోనే కలిసిపోయింది పూర్ణమ్మ అని అద్భుతమైన ముగింపుఇచ్చారు గురజాడవారు.అందుకేశ్రీశ్రీ "పూర్ణమ్మ ముగింపు ఒక మహాకావ్యం చదివినంత అనుభూతి కలుగుతుంది" అని అన్నారు.

'పూర్ణమ్మ చనిపోలేదు. ఆమెది ఆత్మహత్యకాదు.
భర్తయింటికి పోవడానికి మారుగా, లోకేశ్వరి
ఇంటికి పోయింది అనడం యదార్థం - కె.వి. రమణారెడ్డి.

ఈ రెండు కథలకు ఎన్నో సామ్యాలున్నాయి. ప్రధానంగా ఈ రెండుకథలు స్త్రీలకు సంబంధించినవి. స్త్రీలంటే గురజాడవారికి అమితమయిన గౌరవం. స్త్రీల సమస్యలంటే గురజాడకు వల్ల మాలిన సానుభూతి. ఈ రెండు కథలు విషాదాంతాలు. కన్యక, పూర్ణమ్మలిద్దరూ ఆత్మాహుతి చేసుకున్నవారే.

మనిషి : 'మనిషి' అనే గేయం అన్నింటికంటే చిన్నది. కాని, వజ్రపు తునక. సమాజంలో మనిషికుండవలసిన సరైన స్థానాన్ని, మనిషికివ్వవలసిన గౌరవాన్ని, మనకు గుర్తుచేస్తుంది. 'మనిషి' గేయం ద్వారా అప్పారావుగారి మతభావన ఎలాంటిదో మనకు తెలుస్తుందని' కె.వి. రమణారెడ్డి అభిప్రాయపడ్డారు.

అప్పారావు దృష్టిలో దైవం అంటే ఏమిటో వ్యక్తం చేస్తుంది ఈ గేయం. మనిషిలోనే దైవం అంతర్గతుడై ఉన్నాడని ప్రబోధిస్తుంది. రాయిరప్పల్లోనూ, చెట్లు చేమల్లోనూ, గట్టుపుట్టల్లోనూ దైవాన్ని వెదికే అవివేకులకు కనువిప్పు కలిగిస్తుంది ఈ గేయం.

రాతి నుంచి, మనిషి మలచిన, విగ్రహాన్ని దేవుడనీ, మహిమ కలదనీ మొక్కుతున్నారు. మామూలు రాయినీ, రప్పనీ కూడా ఇల్లు కట్టడానికో, మరోదానికో జాగ్రత్తగా భద్రపరచుకుంటున్నారు. కాని సాటి మనుషుల జీవితాల్ని నిర్లక్ష్యం చేస్తున్నారు. మనుషుల్లో స్వార్థం, సంకుచితత్వం, అమానుషత్వం మనిషిని హీనుడిగా, దీనుడిగా దిగజారుస్తున్నాయి.

'మనిషి చేసిన రాయి రప్పకి/మహిమ కలదని సాగి మొక్కుతు/
మనుషులంటే రాయి రప్పల/ కన్న కనిష్టం/గాను చూస్తావేల బేలా?'
- అని ఈ గేయంలో గురజాడ మానవాళిని నిలదీసి ప్రశ్నిస్తున్నారు.

దేశభక్తి : గురజాడ రచనలన్నీ నష్టమైపోయి ఒక్క దేశభక్తి గీతం మిగిలినా చాలును. అతడు ప్రపంచకవుల్లో ఒక్కడుగా లెక్కించదగిన మహాకవి అని రుజువు కావడానికి. ఎందువల్లనంటే దేశభక్తి గీతం సమస్త ప్రపంచ మహాజనుల జాతీయగీతం'.-శ్రీశ్రీ.

గురజాడ రచనల్లో ఒక ఆణిముత్యం 'దేశమును ప్రేమించు మన్నా' అనే 'దేశభక్తి' గేయం, గురజాడ వారి దేశభక్తి గేయం పరిధి చాలా విశాలమైంది. దేశంలో జాతీయభావాలూ, స్వదేశాభి మానమూ బలంపుంజుకుంటున్న రోజుల్లో బంకించంద్రుని వందే మాతరం గేయంతో, ప్రజలు ఉప్పొంగుతున్న రోజుల్లో వెలువడింది అప్పారావుగారి ఈ రచన.

'దేశమంటే మట్టికాదోయి/ దేశమంటే మనుషులోయి!'

దేశమంటే కొన్ని ఎల్లల మధ్య పరుచుకున్న సువిశాల భూభాగం కాదు. దేశమనగానే మొదట స్ఫురణకు రావలసింది మనుషులు. కష్టించి పంటలు పండించి పదిమందికి తిండి పెట్టగలిగే వాళ్ళు, ఖనిజాల్ని శోధించి సాధించి దేశాన్ని సుసంపన్నం చేసేవాళ్లు. చేతనాచేతనమైన ప్రకృతికి సార్థకత నిచ్చేది మనుషులు. దేశమంటే మట్టి కాదయ్యా మనుషులు అని గురజాడ నిర్వచించి 'దేశమును ప్రేమించుమన్నా/మంచి అన్నది పెంచుమన్నా' అని ప్రబోధించారు. దేశాన్ని ప్రేమించడమంటే మనుషుల్ని ప్రేమించడమే. గురజాడ దృష్టిలో మనిషి అంటే సాటి మనిషే. సాటివారిని ప్రేమిస్తూ, మంచి తనాన్ని పెంచుతూ, జీవనం సాగించడమే ప్రతి వ్యక్తి లక్ష్యమూ అయ్యుండాలి. అదేఅసలైనప్రేమతత్వంఅని గురజాడ అభిప్రాయపడ్డారు.

దేశభక్తి గేయంలో గురజాడ విశ్వమానవ ప్రేమను ప్రబోధిం చారు. అడ్డుగోడల్ని తొలగించి మానవజాతిని ఒక తాటిమీద నిలపగలిగే మహాశక్తి ప్రేమ ఒకటే అని గురజాడ ప్రగాఢనమ్మకం. మనిషిని మనిషిగా చూసేటప్పుడు, ప్రేమించే టప్పుడు వైషమ్యాలన్నీ పటాపంచలవుతాయి. కులం, జాతి, మతం, దేశం మొదలైన వాటిని పురస్కరించుకుని చేసే యుద్ధాలకూ, అనర్థాలకూ తావే ఉండదన్నారు. అందుకే గురజాడ ప్రజల మనిషి అయ్యారు. ప్రజలకు మార్గదర్శి అయ్యారు. మహాకవి అనిపించుకున్నారు. ఆధునిక యుగానికి యుగకర్త అయ్యారు.

గురజాడకు పూర్వం, గురజాడ కాలంలోనూ, గురజాడకు తర్వాత తెలుగులోనూ, ఇతర భాషల్లోనూ చాలా దేశభక్తి గేయాలు వచ్చాయి. ఆ గేయాలన్నింటిలోనూ విలక్షణత్వాన్ని సంతరించు కుంది గురజాడ దేశభక్తి గేయం. అందుకే ఈ గేయాన్ని ప్రముఖులు ఎందరో ప్రశంసించారు.

'రాగూర్' గారు రాసిన 'జనగణమన' కంటే గురజాడ వారి 'దేశభక్తి' గీతం ఎన్నో రెట్లు మిన్న'.- రోణంకి అప్పలస్వామి.

'అప్పారావు రాసిన కాలానికీ, దేశానికీ ఇంతకంటే నిండుగా సమాజ పథాన్ని గురించి, ఆదేశించిన జాతీయగీతం మరొకటి లేకపోవచ్చు'. - కె.వి.ఆర్.

దించులంగరు: దించులంగరు గేయం మొదటి ప్రపంచయుద్ధం ప్రారంభమైన తర్వాత రాయబడింది. మానవతకు మాయనిమచ్చ ఈ యుద్ధమని గురజాడ భావన.

గురజాడలో యుద్ధవ్యతిరేకత ఎంత బలంగా ఉన్నదో, ప్రపంచ శాంతిని ఆయన ఎంత గాఢంగా ఆకాంక్షించారో 'దించు లంగరు' గేయంలో మనకు తెలుస్తుంది.

లంగరెత్తుము: గురజాడ వారి జీవితాన్ని ప్రతిబింబింపజేస్తుంది ఈ గేయం. ఇది విషాదభరితమైన గేయం. గురజాడగారు ఇంకా రెండు మూడునెలలలో మరణిస్తారనగా ఈ గేయాన్ని రాశారు. సంసారసాగరంలో, తన జీవితనౌక ప్రయాణం ముగింపు అవుతుందని భావం వచ్చేలా 'లంగరెత్తుము' అనే శీర్షికతో చిత్రీకరించారు.

'లంగరెత్తుము' గేయం ఆత్మనాయకాశ్రిత మైంది. అప్పారావుగారు 1915 నవంబరు 30వ తేదీన మరణించారు. ఆ సంవత్సరం అక్టోబరులో ఈ గేయ రచన జరిగింది. అనారోగ్యంతో బాధ పడుతూ, మృత్యువు ఆసన్నమైనట్లు గ్రహించి, గడిచిన తన జీవితాన్ని గూర్చి చేసిన గేయం లంగరెత్తుము'.

ఈ గేయంలో గురజాడ తన జీవితంలో స్నేహానికీ, స్వేచ్ఛకూ ఉన్నతమైన స్థానంఇచ్చారు. జీవిత సాఫల్యం ఆ రెంటినీ పొందడంలోనే ఉందని గురజాడ భావించారు. స్వేచ్ఛనూ, స్నేహాన్ని కోరడం, అనుభవజ్ఞానంతో జీవితాన్ని చక్కదిద్దుకుని, అర్థవంతం చేసుకోవాలని గురజాడ భావించారు.

మిణుగురులు: గురజాడ రాసిన 'మిణుగురులు' సరళమైన భాషలో సాగింది. దీనిలో 'అరటికాయబజ్జి మినపప్పు, సొజ్జి, కలసి మెలసి తిందాం, లాంటి బాలగేయాలు మనోహరంగా దర్శన మిస్తాయి. మిణుగురులు అంటే బాలబాలికలకు ఎంత ఇష్టమో అంతబాగా ఈ గేయాన్ని బాలలకు అందించారు గురజాడవారు.

నీలగిరిపాటలు : గురజాడవారు మహారాజా కుమారికా సాహెబా శ్రీ అప్పలకొండయాంబా ఆఫ్ విజయనగరం, మహారాణి ఆఫ్ మాథోగడ్ (రీవాస్టేట్) వారి అనుజ్ఞను అంటూ వారి కోరికమేరకు 'నీలగిరి పాటలు' రాసి ఆనంద గజపతి మహారాజా గారికి అంకితం ఇచ్చారు. 1907లో ఈ పాటలు వెలువడ్డాయి. ఈ పాటల్ని దేశీయ సంప్రదాయ పద్ధతిలో రాశారు.

నీలగిరికి ఉదకమండలమని మరోపేరు. వేసవికాలంలో రాజ కుటుంబీకులు ఉదకమండలంలో గడిపేవారు. అంతరంగిక కార్యదర్శి అయిన గురజాడ వారు కూడా విజయనగరం సంస్థాన ఆజ్ఞానుసారంగా వెళ్ళేవారు. నీలగిరి కొండలు, అక్కడి ప్రకృతి సౌందర్యాన్ని వర్ణించారు గురజాడవారు.

మాటలమబ్బులు: 'మాట తప్పిన అధికారులున్నార'ని ఈ మాటల మబ్బుల వల్ల తెలుస్తుంది. ఒక చంపకమాల, మూడు కంద పద్యాలతో రాశారు. ఇది ముక్తక ప్రక్రియకు సంబంధించింది.

పుష్పలావికలు : 'పుష్పలావికలు' అనే పేరుతో గురజాడ తొమ్మిది పద్యాలు రాశారు. పుష్పలావికల 'వర్ణన' ప్రబంధ లక్షణాల్లో ఒకటి. ఈ వర్ణన ప్రధాన కథకు సంబంధం వున్నా లేకపోయినా కవులు వర్ణించారు. పదాలు ద్వంద్వార్థాలు కలిగి ఉంటాయి. 'ఆముక్త మాల్యద'లోని పద్యాల్ని అనుసరించి గురజాడ 'పుష్ప లావికలు' వర్ణన చేశారు. ఇందులో ఐదు ఉత్పలమాలలు, నాలుగు కంద పద్యాలు ఉన్నాయి. విటులు, పువ్వులిన అమ్మే స్త్రీలకు మధ్య జరిగిన సంభాషణల్ని పద్యాల్లో చెప్పారు గురజాడ వారు.

మెరుపులు : గురజాడ సంస్కృత సాహిత్యాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేశారు. కావ్య, నాటక, తర్క అలంకారాది శాస్త్రాల్ని విమర్శనాత్మకంగా చదివారు. ఆయనకు నచ్చిన కొన్ని శ్లోకాల్ని తెలుగులోనికి అనువదించారు. ఆరు కంద పద్యాల్ని రాశారు.

సుభద్ర : ఛందోబద్ధంగా రాయటానికి ఆయనకు శక్తి వున్నదనీ, అప్పకవీయం మొదలైన గ్రంథాలు గురజాడ పఠించారనీ నిరూపించడానికి 'సుభద్ర' అనే పద్య కావ్యం రాశారని విమర్శకులు సభల్లోనూ, పండిత గోష్ఠుల్లోనూ అప్పుడప్పుడు 'సుభద్ర'లోని పద్యాలు చదివి వినిపించేవారు. అప్పారావు చనిపోయిన తర్వాత ఆయన కుమారుడు వేంకటరామదాసుగారు సుభద్ర కావ్యాన్ని రామానుజాచార్య విద్యా సమితి గ్రంథమాలలో ముద్రించారు. ఈ కావ్యం పూర్తి కాలేదు. ఇది సంప్రదాయపద్ధతిలో ఉంది. ఇందులో ప్రబంధకవుల వలె వర్ణనలు చోటు చేసుకున్నాయి.

సత్యవతి శతకం : గురజాడ సత్యవతి శతకాన్ని రాశారు. అయితే శతకం నూరు పద్యాలు లభ్యం కాలేదు. అవసరాల సూర్యారావు గారు ఈ శతక పద్యాల్ని సేకరించి పరిష్కరించారు. ఈ శతకానికి 'ఋుతు శతకం అని' పేరు కూడా ఉంది. ఇచ్చిన సమస్య కందపద్య పాదం. 'త' కార ప్రాసగా ఉంది. ఆ కారణంచే 'త' కారప్రాసలో ఈ పద్యాలు వున్నాయి.

వైతాళికులనే మేల్కొలిపిన వైతాళికుడు గురజాడ. సమాజా భ్యున్నతి, దేశ శ్రేయస్సు, ప్రధాన లక్ష్యాలుగా భావించిన మహా మనిషి గురజాడ. సామాన్య ప్రజల దైనందిన జీవితానికీ, సమస్య లకూ సాహిత్యంలో ప్రధాన స్థానం ఇచ్చిన కవి గురజాడ వారు.

'వైతాళికులనే మేలుకొలిపినవాడు. మార్గదర్శి, మేధావి. ఈయన గీతాలలో గౌరవాశయాలు, నూతన స్వచ్ఛత, స్వేచ్ఛ ప్రత్యేకత ఉన్నవి. కవిత్వాన్ని కళగా గ్రహించకపోలేదు. కాని సంఘ సంస్కారానికి కొంత సాధనగా ఉపయోగించారు. కవిత్వం పండితుల ప్రత్యేక నిధి కాకుండా అందరికీ పంచిపెట్టే మార్గాన్ని నిరూపించాడు. ముందు రాగలవారికి స్వేచ్ఛాపత్ర (మాగ్నా కార్టా) సంపాదించాడు'. - సామినేని ముద్దుకృష్ణ



అరే...

అరే
అప్పుడప్పుడూ మనల్ని మనమే
కరపత్రంలా పంచి పెట్టుకోవాలి
చెరువు నీటిలో బుడుబుంగలా
తల బయట పెట్టి తేరిపార చూడాలి
కీర్తి దారాలేమయినా
గాలిలో వేలాడుతున్నాయేమో
చేతులతో గాలించాలి
మనాడెవడో పక్కాడెవడో
దుమ్ము పేరుకుపోయిన
మనసు అద్దంమ్మీద నీళ్ల చిలకరించి
పాత పేపరు ముక్కతో తుడిచి
కళ్లు చిట్లించి చూడాలి
మనల్ని వొత్తి గట్టిదనాన్ని
పరిశీలించేవాడి జోలి మనకక్కరలేదు
గట్టి ధాన్యంకోసం
తూర్పారబట్టే రైతులాంటి చేతులను
మన అక్షరాల రాశి వద్దకు
అసలే రానియ్యొద్దు
ఏమీలేని మన పేజీలను తిరగేసి
ఎంతో వుందని అందమైన అబద్ధాలు చెప్పే
భుజాల మీద
కాస్త ఖరీదయినా ఫర్వాలేదు
ఓ మెరుపుల గుడ్డ పరచి
చిన్నదో పెద్దదో ఓ దండ వేయాలి
మన అక్షరాలను ఊరేగించే వాడి కోసం
మనం కుక్క పిల్లలా తోకాడించాలి
కొత్తగా అచ్చేసిన ఆంబోతులా
ఊరు మీద పడాలి
అడ్డమయిన వాడి నోటి కింద గడ్డానికి
మన చేతులానించి
నోట్లోకి నాలుగు
రంగు కాగితాలు కూడా కుక్కి
మనకనుకూలంగా
నాలుగు కూతలు కూయమనాలి
నిఖార్సయిన కవిత్వం ఎక్కడున్నా
ఎవరూ ఊదని
నిప్పు మీది నివురులా పడివుండేలా
మంచి కవిత్వాన్ని ఆస్వాదించే
ఊపిరితిత్తులను
ఎప్పటికప్పుడు కత్తిరిస్తూ
ఎంతో జాగ్రత్త పడాలి
అది నిప్పులా ఎగిస్తే
అడ్డ దిడ్డంగా పెరిగిన పిచ్చి మొక్కల్లాంటి
మన వాక్యాలు
ఆ మంటల్లో తగలబడిపోతాయనే
కొత్త నీతి సూత్రం తప్పక
గుర్తుంచుకోవాలి
మన పందిని నందని పదిమందితో
గట్టిగా అనిపించాలి
పరిచయాలక్కరలేని కొందరి పదాలు
మొగలి పట్టాలా ముడుచుకుని
ఎవరూ తెరవని పాత సందుకలో
పదిలంగా గుడ్డలో మూట కట్టి
వుండాలని బలంగా కోరుకోవాలి
పరిమళం వెంట నడిచి
పాత తలుపులను తెరిచే
ఓపికెవరికున్నది గనక
ఈలోపే ఏ లాలూచీనో పడి
ఒకటో రెండో
ఎవరికీ తెలియని అవార్డులను
మనమే డబ్బుల వలేసి
చేప పిల్లల్లా దొరకబుచ్చుకోవాలి
నాలుగు పుస్తకాలతోపాటు
మన డబ్బాలో మనమే
గులకరాళ్లు వేసి
ఊరంతా మారు మోగించాలి
పరిమళాన్నెవరూ పెట్టెలో
బంధించలేరనే పాత మాటలెందుగ్గాని
డబ్బులకమ్ముడు పోయే
నాలుగు కుక్కలను
ఇతరుల పెట్టె దగ్గర
ఎవరూ తెరవకుండా కాపలా పెట్టాలి
మన అక్రమ సంపాదనలో
ఎంతో కొంత
భజన బృందాలకు
కుక్క బిస్కట్లలా విసురుతూ
భజన గీతాల్లో నిత్యం మన పేరు
మారు మోగేలా చూసుకోవాలి
అరే
అప్పుడప్పుడూ మనల్ని మనమే
ప్లకార్డులా ఊరేగించుకోవాలి!

- నిరంతర, ✆ : 8247432521

జన రంజక కవి ప్రతిభా పురస్కార ఫలితాలు

'జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు' కోసం రావి రంగారావు సాహిత్య పీఠం ప్రకటనకు స్పందించి కవులు 186 కవిత్వ గ్రంథాలు పంపించారు. అందులో నాలుగు గ్రంథాలను "జనరంజక కవి ప్రతిభా పురస్కారాలు" కోసం ఎంపిక చేయటం జరిగింది. వివరాలు ఇవి.

1."మట్టి రంగు బొమ్మలు"(వచన కవితలు)- శ్రీ సిరికి స్వామినాయుడు (పార్వతీపురం, విజయనగరం జిల్లా)
2. "నల్ల చామంతి" (వచన కవితలు) - శ్రీ చిత్తలూరి సత్యనారాయణ (అడ్డ గూడూరు, యాదగిరి భువనగిరి జిల్లా)
3. "సవ్వడి" (గజళ్ళు) - శ్రీమతి ఖైరి ఇందిర (ఇల్లందు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా)
4. "మా ఇంటి దేవతలు" (బాలగేయాలు) - శ్రీ బెలగాం భీమేశ్వరరావు (పార్వతీపురం, విజయనగరం జిల్లా).

గుంటూరు బృందావన్ గార్డెన్స్ శ్రీవెంకటేశ్వరస్వామి దేవాలయ ప్రాంగణం, అన్నమయ్య కళావేదిక మీద ఫిబ్రవరి 11 సోమవారం సాయంత్రం 6 గం.కు జరిగే సభలో ఈ పుస్తకాలు రాసిన కవులకు ఒక్కొక్కరికి 2000 రూ. నగదుతో, శాలువాతో, జ్ఞాపికతో పురస్కార ప్రదానం జరుగుతుంది. స్పందించి సహకరించిన కవులకు, పత్రికలకు కృతజ్ఞతలు.

-నర్రా ప్రభావతి, కన్వీనర్, రావి రంగారావు సాహిత్య పీఠం.

'నారంశెట్టి బాలసాహిత్య పురస్కార' ప్రధానం

విజయనగరం జిల్లా పార్వతీపురానికి చెందిన 'నారంశెట్టి బాల సాహిత్య పీఠం' 2018 సంవత్సరానికి బాల సాహిత్య పురస్కారాలకు శ్రీవాణి పలుకు సంపాదకుడు ఎం.వి.వి.సత్యనారాయణ, మొలక పిల్లల పత్రిక సంపాదకుడు టి. వేదాంత సూరిలను ఎంపిక చేసింది. పురస్కార ప్రధాన సభ విశాఖపట్టణం పౌర గ్రంథాలయంలో **ఫిబ్రవరి 3, 2019** ఉదయం జరుగుతుంది. కేంద్ర సాహిత్య అకాడమీ బాల సాహిత్య పురస్కార గ్రహీత నారంశెట్టి ఉమామహేశ్వరరావు సభాధ్యక్షుడుగా, జానపద కళలు, సృజనాత్మక అకాడమీ చైర్మన్ 'కళారత్న' పొట్లూరి హరికృష్ణ ముఖ్య అతిధిగా, కొల్లూరు స్వరాజ్యమ్మ , సిరేల సన్యాసిరావు అతిథులుగా పాల్గొంటారని, మరో పదిమంది ప్రముఖులకు, ఐదుగురు బాల రచయితలకు గౌరవ పురస్కారం ప్రదానం జరుగుతుందని సంస్థ ప్రధాన కార్యదర్శి గుడ్ల అమ్మాజి ప్రకటించారు.

-నారంశెట్టి ఉమామహేశ్వరరావు, అధ్యక్షుడు,
నారంశెట్టి బాలసాహిత్య పీఠం, పార్వతీపురం, 8328642583.

విశాలాంధ్ర
బతుకు
The Life
సోమవారం
28 జనవరి 2019



చికన్‌కారీ వర్క్

చూడడానికి లేసులా ఉంటుంది కానీ లేసు కాదు. ఆధునిక ప్రింటులా కనిపిస్తుంది కానీ ప్రింట్ కాదు. మెరుపు ఉంటుంది కానీ అది మిషన్ వల్ల వచ్చింది కాదు. అదే చికన్ కారీ వర్క్. దారాల కలనేత, అద్దాల అద్దకం కలగలసిన ప్రత్యేక వర్క్ ఈ చికన్‌కారీ వర్క్. ఈ డిజైనే కాదు ఇందుకు ఎన్నుకునే రంగులూ విభిన్నంగా ఉంటాయి. చికన్‌కారీ వర్క్ చూడగానే దాని ప్రత్యేకత ఇట్టే తెలిసిపోతుంది. హుందాగా, సింపుల్‌గా, ఆకర్షణీయంగా అన్నివిధాలుగా ఆకట్టుకునే, అందరూ మెచ్చుకునే ఈ చికన్‌కారీ వస్త్రశ్రేణి మీ దగ్గరా ఉందా మరి!

కమ్మని నెయ్యితో
శరీరానికి ఎంతో మేలు

నెయ్యిని ఇష్టపడని వారు ఉండరు. 'కడు ముద్దపప్పు, కమ్మని నెయ్యి' అంటారందుకే. వేడి వేడి అన్నంలో ఒక స్పూన్ నెయ్యి వేసుకుంటే ఆ రుచే వేరు. నెయ్యి లేని ఇడ్లీలకు రుచే రాదు. పప్పులో ఒక చుక్క నెయ్యి పడితే తప్ప ముద్ద గొంతు దిగదు.



మసాలా దోసెపై టీస్పూన్ నెయ్యి జిమ్మితే కమ్మని వాసన ఉంటుంది. ఇక హల్వాల వంటి తీపి డిజర్టులకు నెయ్యి ప్రధాన ఆదరువు. నెయ్యి వేసి చేసే హల్వాల ఘుమఘుమలు ఆమడ దూరం వ్యాపిస్తాయి. నేతి అరిసెలకు ప్రపంచమంతటా గుర్తింపు ఉంది.

ఇన్ని రుచుల నేతిని ఆహారంలో భాగం చేసుకోకుండా ఉండలేకపోతున్నప్పటికీ శరీరంలో కొవ్వు పేరుకుంటుందేమోనన్న చిన్న సందేహం మనసు లోతుల్లో ఎక్కడో చాలామందిని వేధిస్తుంటుంది. అటువంటి సందేహాలను ఇక వీడవచ్చు.

నెయ్యి 'ఫ్యాట్ ఫ్యామిలీ'లో లేదన్నది తీపి నిజం. నెయ్యి నాజూకుతనాన్ని ఇస్తుంది. సమతౌత్య మార్గాలలో ఫ్యాట్స్ శరీరానికి అవసరం. అవి శరీరానికి శక్తిని అందిస్తాయి.

విటమిన్ 'ఇ' గుండెకు ప్రయోజనకారి. ఈ విటమిన్‌ను శరీరం గ్రహించడానికి నెయ్యి అవసరం. అందుకే మన పెద్దలు నెయ్యి లేకపోతే చర్మం పొడిబారిపోతుందని చెప్పేవారు. ఇది శాస్త్రీయ బద్ధంగా కూడా నిజం. శిరోజాలకు, కళ్ళకు, చర్మానికి అవసరమయ్యే విటమిన్ 'ఎ'ని శరీరం గ్రహించడానికి కొవ్వు అవసరం.

నెయ్యి మూలం దక్షిణాసియా. భారత్, బంగ్లాదేశ్, నేపాల్, పాకిస్థానీ వంటకాలలో నేతిని విస్తృతంగా వాడతారు. 'ఘీ' అన్న పదం సంస్కృత మూలాధారం.

నెయ్యి లక్షణాలు

నెయ్యిలో లాక్టోజ్ ఉండదు. చెడు కొలెస్టరాలైన ఎల్‌డిఎల్ కొలెస్టరాల్ ప్లాస్మాను తగ్గిస్తుంది. కొలెస్టరాల్ పెరుగుతుందేమోనన్న భయంగలవారు నెయ్యిని తగుమాత్రంగా వాడుకోవచ్చు. యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉండి, శరీరంలోని అన్ని టిష్యూల లేయర్లకు వాటిని అందించి, రోగ నిరోధక వ్యవస్థను దృఢంగా ఉంచుతుంది. నెయ్యిలో ఔషధ విలువలు కూడా ఉన్నాయి.

బ్యుటిరిక్ యాసిడ్ కాన్‌సెంట్రేషన్ నెయ్యిలో అత్యధికంగా ఉంటుంది. ఈ ఫ్యాటీయాసిడ్‌లో క్యాన్సరస్ ట్యూమర్ల ఎదుగుదలను అడ్డుకోగల యాంటీ-వైరల్ గుణాలు నెయ్యిలో అనేకం ఉంటాయి.

ప్రయోజనాలు :

ఆవునెయ్యి తిరుగులేని సాత్విక ఆహారమని ఆయుర్వేద నిపుణులు చెప్తారు. ఇది అందాన్ని, నాజూకుదనాన్నిస్తుందని, తలనొప్పిని, అజీర్ణాన్ని తొలగిస్తుందని, ఎసిడిటీని తగ్గిస్తుందని, శక్తిని ఇస్తుందని సూచిస్తున్నారు. వైదిక, హైందవ కార్యకలాపాల్లో నెయ్యికి విస్తృత స్థానం ఉంది.

నెలలు నిండకముందే జనించే శిశువులను కాపాడటానికి ఇప్పుడయితే ఇన్‌క్యుబేటర్లు ఉన్నాయి కాని, ఒకప్పుడు అలా పుట్టిన శిశువును నేతి కుండలో భద్రపరిచేవారట. నెయ్యి ఈనాటికీ సంక్షేమ చిహ్నంగానే ఉంది.

ఔషధ గుణాలు :

కాలిన గాయాలు, బ్లిస్టర్లు, ఇతర దెబ్బలకు ఆల్కహాలిజానికి సైతం నెయ్యిలోని ఔషధ గుణాలు ఎంతో మేలు చేస్తాయి. దీనిలోని విటమిన్ 'ఇ', విటమిన్ 'ఎ'ల వల్ల దీనికి యాంటీ క్యాన్సర్ గుణాలు, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ-వైరల్ గుణాలున్నాయి.

గొంతులో ఇబ్బందిగా ఉన్నప్పుడు వేడి నీళ్లలో పసుపు, నెయ్యి వేసుకుని తాగితే ఉపశమనం కలుగుతుంది. మొలలు, మలబద్ధకంతో బాధపడేవారు రోజూ నెయ్యి తీసుకుంటే విరేచనం సాఫీగా అవుతుంది. జాయింట్ నొప్పుల నుంచి ఉపశమనం లభిస్తుంది.

దీనిలో ట్రాన్స్‌ఫ్యాట్స్ లేదా హైడ్రోజనరేటెడ్ ఫ్యాట్స్ ఉండవు. ప్రతిరోజూ కొద్దికొద్దిగా అవసరమయ్యే మంచి నాణ్యతగల సాచ్యురేటెడ్ ఫ్యాట్ ఉంటుంది. అంతేకాదు నెయ్యి ఒక అద్భుతమైన ప్రిజర్వేటివ్ కూడా. దీనిలో కలిపిన పదార్థాలను తాజాగా ఉంచుతుంది.

చక్కని వంటకాల మాధ్యమం :

నెయ్యి వెన్నకంటే సురక్షితమైనది. నూనెకంటే పోషకభరితమైనది. మిగతా వెజిటబుల్ నూనెల్లోకంటే స్మోకింగ్ పాయింట్ పైస్థాయిలో ఉంటుంది. కాబట్టి వేపుడులకు సరైనది. అత్యధిక సెగలో సైతం దీనిలోని రసాయనగుణం ఏమాత్రం మారదు.

నెయ్యి త్వరగా మాడదు. ఫ్రిజ్‌లో పెట్టాల్సిన అవసరం లేకుండానే దీర్ఘకాలం నిల్వ ఉంటుంది. కాబట్టి నిల్వ పదార్థాల తయారీకి సరైన ప్రత్యామ్నాయమిది.

ఎలా తయారుచేయాలి :

రెండురోజులు పాలపై మీగడ తీసి తోడుపెట్టాలి. తోడుకున్న పెరుగులో తగినన్ని చల్లని నీళ్ల పోసి ఐదు, పది నిముషాలు కవ్వంతో లెడా బ్లెండర్‌తో చిలకాలి. పేరుకున్న వెన్నపూసను నీటిలో రెండుమూడుసార్లు కడగాలి. స్టెయిన్‌లెస్ స్టీల్ పాత్రలో వేసి మధ్యస్థంగా ఉండే సన్నని సెగపై బంగారు వన్నెలోకి మారేవరకు ఉంచాలి. వ్యర్థాలు అడుగున పేరుకుంటాయి. పైకి నెయ్యి స్పష్టంగా, మంచి వాసనతో ఉంటుంది. నేతి రంగు, రుచి పాల నాణ్యత, కాచే తీరుపై ఆధారపడి ఉంటాయి. ఆవుపాల మీగడనుండి తయారయ్యే ఆవునెయ్యిని మత సంబంధ కార్యక్రమాలకు వినియోగిస్తుం టారు. పంచామృతాలలో ఆవునెయ్యి ఒకటి.

భారత్, పాకిస్థాన్‌లలో అనేక ప్రాంతాలలో, ఆంధ్ర, పంజాబ్, హర్యానా, గుజరాత్, మహారాష్ట్ర, బెంగాల్, ఒడిశాలలో భోజనంలో నెయ్యి తప్పనిసరి. ఒక చెమ్చా నెయ్యి వాడి చేసే రోటీలు మంచి వాసనతో, రుచిగా ఉంటాయి. కిచిడీలో నెయ్యి లేకపోతే రుచే రాదు. పొంగల్‌కూ ఇదే ప్రధాన ఆదరువు. ఇన్ని రకాలుగా రుచి, ఆరోగ్యాన్ని అందించే నెయ్యిని ఇకనుంచైనా ఆహారంలో భాగంగా చేసుకుందాం.

కటింగ్ బోర్డు ఏది మంచిది ?

ఆహారానికి సంబంధించిన అనారోగ్యాల నివారణకు ఉడెన్ కటింగ్ బోర్డు మంచిదా ? లేక ప్లాస్టిక్ బోర్డు వాడాలా ? అని అనేకమంది ఎల్లప్పుడూ సందేహపడుతుంటారు. నిజానికి ఈ ప్రశ్నకు ఇదీ అని స్పష్టంగా సమాధానం చెప్పడానికి లేదు.

కటింగ్ బోర్డ్ ఏదైనా తగిన జాగ్రత్తలు, పరిశుభ్రత పాటించకపోతే దేనికదే ఇతరత్రా సమస్యలకు కారణమవుతుంది. వాడిన ప్రతిసారీ కటింగ్‌బోర్డ్‌ను వేడి, సబ్బు నీళ్లతో బాగా కడిగి ఆరబెట్టాలి.

పరిశుభ్రమైన వస్త్రం లేదా పేపర్ టవల్‌తో శుభ్రంగా తుడవాలి. పూర్తిగా ఆరేదాకా లోపల సర్దేయకూడదు. కొత్త కటింగ్ బోర్డ్స్ కొన్నప్పుడు వాటిపై ఉండే క్లీనింగ్ సూచనలు తప్పక పాటించాలి.



అదనపు జాగ్రత్తల కోసం ఉడెన్, ప్లాస్టిక్ కటింగ్ బోర్డ్స్‌పై తేలికపాటి బ్లీచ్ సొల్యుషన్‌ను (ఒక టేబుల్‌స్పూన్ అన్‌సెంటెడ్ బ్లీచ్‌ను నాలుగు లీటర్ల నీటిలో కలిపి) పోసి, కొద్ది నిముషాలాగి కడిగేసి ఆరబెట్టాలి.

కటింగ్ బోర్డుకు క్రాక్‌లు, చిప్స్, ఇతరత్రా పగుళ్లు, గీతలు ఏమైనా ఉంటే వాటిలో బ్యాక్టీరియా చిక్కుకునే అవకాశాలు ఉంటాయి. కాబట్టి అటువంటి దానిని తీసివేసి కొత్తది కొనాలి.

క్రాస్ కంటామినేషన్ జరగకుండా మీట్, పౌల్ట్రీ, సీఫుడ్ వంటివాటికి విడిగా ఒక కటింగ్ బోర్డ్, ఇతర కూరగాయల పండ్లకు ఒక కటింగ్ బోర్డ్ వాడుకోవాలి.

సైకిల్ తొక్కితే చాలు

వ్యాయామాలు ఏవిధంగా, ఎలా చేసినా ఆరోగ్యకరమైనవే. సైక్లింగ్ వల్ల ఒనగూడే ప్రయోజనాలు ఎన్నో ఉంటాయన్నది మంచివార్త. సైకిల్ తొక్కడం వల్ల గుండెకు, దీర్ఘకాలిక ఆరోగ్యానికి ఎంతగానో ప్రయోజనం చేకూరుతుంది.

ఇతరత్రా వాహనాలపై కాక, సైకిల్‌పై ప్రయాణించడం వల్ల కలిగే ప్రయోజనాలను గుర్తెరిగి చాలా ఇతర దేశాల్లో కారు బదులు సైకిల్ తొక్కుతూ వెళ్లడానికి ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారు. ఇందువల్ల మంచి ఆరోగ్యం ఇవ్వడమేకాక, వాతావరణంలో కాలుష్యాన్ని కలిగించని ఉత్తమ వాహనమిది. సైకిల్ తొక్కడాన్ని చిన్నతనంగా భావించక, వీలైనప్పుడల్లా సైకిల్‌పై ప్రయాణిస్తుండటం ఎంతో మంచిది.



ద్రాక్ష పండ్లా.. రైజన్లా..
ఏవి ఎక్కువ పోషకాలనిస్తాయి ?



ద్రాక్షపండ్లు మంచివా ? ఎండు ద్రాక్ష (రైజన్) మంచివా? అని చాలామంది సమీక్షలు చేస్తుంటారు. గ్రాము గ్రాము లెక్కలు కడితే ఎరుపు లేదా ఆకుపచ్చ ద్రాక్ష కంటే ఎండు ద్రాక్షలో మూడురెట్లు ఎక్కువగా యాంటీ ఆక్సిడెంట్లు లభిస్తాయి. నిజానికి ఇతర పదార్థాలతో పోల్చితే ఇవి యాంటీ ఆక్సిడెంట్స్‌కు అత్యంత అధిక ఆధారం. పండ్లను ఎండబెట్టాక వాటిలోని పదార్థాలు బాగా గాఢత పొందటం సహజం. 30 గ్రాముల రైజన్ల తయారీకి 170 గ్రాములకు మించి ద్రాక్ష పండ్లు కావాల్సి ఉంటుంది.

ద్రాక్షలోని విటమిన్ 'సి'లో ఎక్కువ భాగం, వేడికి సున్నితంగా ఉండే కొన్ని ఫిటో కెమికల్స్ ఎండబెట్టే ప్రక్రియలో నశిస్తాయి. అయితే ఎండుద్రాక్షలో యాంటీ ఆక్సిడెంట్స్ సమృద్ధిగా ఉంటాయి.

పీచు, పొటాషియం, ఐరన్, ఇతర ఖనిజాలు వీటిలో ఎక్కువగా లభిస్తాయి. అయితే ఎండబెట్టే ప్రక్రియ చక్కెరల గాఢతను పెంచుతుంది కనుక క్యాలరీలు కూడా ఎక్కువగానే ఉంటాయి.

అరకప్పు ఎండుద్రాక్షలో 220 క్యాలరీలు ఉంటే అదే అరకప్పు ఎరుపు లేదా ఆకుపచ్చ ద్రాక్షలో కేవలం 50 క్యాలరీలు మాత్రమే ఉంటాయి. కనుక మంచిదనే సమీక్షతో నిమిత్తం లేకుండా అవసరాన్ని బట్టి తగు మోతాదులో దేన్నయినా తీసుకుంటుండాలి.

సహోద్యోగుల సరసన ఉంటే...

ఆహారంలో పలానావి తినాలి, పలానావి తినకూడదు అని ఎంత కఠిన నిబంధనలు విధించుకున్నా ఒక్కోసారి వాటికి తిలోదకాలు ఇవ్వాల్సి వస్తుంది. ఇందుకు కారణం సహోద్యోగులేనని పరిశోధకులు సైతం గుర్తించారు. ఎంత ఆరోగ్యవంతమైన డైట్‌ను ఎంచుకున్నా చాలాసార్లు కొలీగ్స్ చిరుతిండ్ల వైపునకు టెంప్ట్ చేస్తుంటారు.

ఆహారం చాయిస్‌లలో ప్రతికూల ప్రభావం చూపడంలో వీరు ముందుంటారు. మధ్యాహ్నం లంచ్ బ్రేక్‌లో, సాయంత్రం వేళ స్నాక్స్ సమయంలో వీరు పక్కనే ఉంటే ఇతరత్రా తిండివైపునకు ప్రోత్సహిస్తారు. ఎంత 'విల్‌పవర్'తో పోషకాహారానికే పెద్దపీట వేస్తున్నా ఒక్కోసారి ఈ బలవంతపు తిండ్లు, మొహమాటపు తిండ్లు తప్పనిసరి అవుతుంటాయి.

మొహమాటం ఎక్కువ ఉన్నవారు లంచ్, స్నాక్స్ బ్రేక్స్‌లో సహోద్యోగులతో కలిసి వెళ్లకపోవడం మంచిది. తినే విషయంలో మొహమాటాలు, టెంప్టింగ్‌లకు ప్రాధాన్యం అనేది ఇవ్వకూడదు.



ఓ 15, 20 రోజులపాటు తిరస్కరించడాన్ని అలవాటు చేసుకోగలిగితే ఆపైన ఎవరూ దేనికీ టెంప్ట్ చెయ్యరు. మొహమాటపెట్టరు. ఈ క్రమంలో జోకులు, నిష్ఠూరాలు ఉంటాయి. వాటిని మౌనం, చిరునవ్వుల సమాధానంతో పక్కనపెడితే ఏ ఇబ్బందీ రాదు.

నేను - సుడిగుండం

(నవల) 28

పి.చంద్రశేఖర అజాద్
సెల్: 92465 73575



నిన్నటి సంచిక తరువాయి

"ఎప్పుడు నీకు అవసరం వచ్చినా మా దగ్గరకు రావచ్చు. మా ఫ్యాక్టరీలో నీకోసం ఎప్పుడూ ఖాళీగా ఉద్యోగం వుంటుంది"

****

స్కూల్‌ని, పిల్లల్ని చూస్తుంటే ఎందుకో కన్నీళ్లు వచ్చాయి. ఈ ఉద్యోగంలో చేరాకే నాకు పెళ్లి అయింది. పాప పుట్టింది. నేను రేపటి గురించి ఆలోచన లేకుండా వస్తున్న దాంతో తృప్తి పడుతున్నాను.

ఇంటికి వెళ్లాను. వెన్నెల పాపను ఆడిస్తోంది. పాప నవ్వుతోంది. ఈ నవ్వులు ఎంత కాలం అనుకున్నాను. దగ్గరకు వెళ్లి పాపను ఎత్తుకుని ముద్దు పెట్టాను. అప్పుడు మెల్లగా వెన్నెలతో అన్నాను.

"మన బడిని అమ్మేస్తున్నారు!"

"అదేంటి బావా?" అంది.

అసలు విషయం చెప్పాను. తన ముఖంలో పెద్ద షాక్ లాంటిది నాకు కనిపించలేదు.

"అందుకే నిన్ను చదువుకో అన్నాను. ఇలాంటి పరిస్థితులు వస్తాయనే. నువ్వు ఆ పని చేయలేదు. పిల్ల పుట్టాక తనతోనే నీకు సమయం గడిచిపోతోంది. అవునూ... నీకు బాధ, భయం కలగటం లేదా!"

"బడి అమ్మేయటం బాధగా వుంది. భయం ఎందుకు బావా! నాన్న వరసగా పొలం అమ్ముతున్నప్పుడే నాకు భయం అనిపించలేదు. నేను నువ్వనుకున్నది చదవలేదు. ఈ చదువుకీ చిన్న ఉద్యోగం వస్తుంది"

నాకు ఆశ్చర్యం కలిగింది. ఈ వార్త తెలిసాక, ఈ వార్త విన్నాక కృంగి పోతుందనుకున్నాను. నిజానికి నేను జీర్ణం చేసుకోవటానికి సమయం పట్టింది. ఇంకా నేను ధీమాగా వుండలేకపోతున్నాను.

"అయినా అమితగారున్నారు. ఆమె నీకు ఏదొకటి చూస్తారు బావా" అంది. ఇప్పటివరకు నాకు అమిత గుర్తు రాలేదు. వెన్నెల నమ్మకానికి మళ్లీ నాలో ఓ ప్రకంపన.

అయినా నా జీవిత మంతా అమిత సహకారం కావల్సిందేనా? ఇప్పుడయినా నేను స్వంతంగా ఏదొకటి చేయలేనా?

****

అమితకు ఫోన్ చేసి ఈ విషయం చెప్పాను.

"మంచిదో, చెడుదో మన బతుకుల్లో ఏదొక కుదుపు రావాలి ప్రభాత్. అప్పుడే ఇంకో మార్గంలోకి వెళ్లాం. నువ్వు ఢిల్లీ వస్తావా?"

"రావాలని వుంది. ఇప్పుడు కాదు. ఏదొక రోజు తప్పకుండా వస్తాను"

"జీవితం మళ్లీ మొదటికి వచ్చింది అనుకోవద్దు. నీకు ఓ పాప వుంది. సమస్యలు వున్నాయి. నువ్వు ఇంతవరకు ఫర్వాలేదు అన్న స్థితికి చేరుకోలేదు. ఇవన్నీ దృష్టిలో ఉంచుకో.... నాకు కొంత మంది తెలుసు. మొదట్లో ఆర్థిక యిబ్బందుల గురించి వారు పట్టించు కోలేదు. తర్వాత అనారోగ్యమో, కుటుంబ పరిస్థితులు కుదిపేస్తున్నప్పుడో మిగతా ఆశయాల్ని వదులుకుని డబ్బు సంపాదనలో పడిపోయారు" అంది.

నేను మౌనంగా వింటున్నాను.

"నువ్వు ఢిల్లీ ఎప్పుడయినా రావచ్చు. మై లవ్ టు వెన్నెల అండ్ యువర్ స్వీటీ... పాపకు పేరేం పెట్టావు?"

"ఇంకా పెట్టలేదు. ఆలోచిస్తున్నా. నువ్వు మంచి పేరు సజెస్ట్ చేస్తే సంతోషిస్తా"

"అనిందిత. ఎలా వుంది?"

"బాగానే వుంది"

"నీకు అంతగా నచ్చలేదేమో. 'నిదా' ఎలా వుంది?"

"ఆ పేరుకి అర్థం ఏమిటి?"

"అరబిక్ భాషలో 'నిదా' అంటే భూమి అని ఎవరో చెప్పారు. మన ఇండియన్ నేమ్‌లా అనిపించక పోవచ్చు. ఆలోచించు"

"నా వరకు బాగుంది. వెన్నెలకూ నచ్చితే ఆ పేరు పెడతాను. ఎలాంటి పేరు పెట్టినా నేను పాపని నిదా అనే పిలుచుకుంటాను" అన్నాను

ఈ విషయం అమ్మకు, మావయ్యకు కూడా మేం చెప్పలేదు.

ఓ రోజు సులోచన గారు వచ్చారు. ఆమె స్కూల్ దగ్గరకు వెళ్తే అసలు విషయం తెలిసింది.

ఆమె ఇంటికి వచ్చారు.

"ఇప్పుడేం చేయాలనుకుంటున్నారు?" అన్నారు.

"అదే ఆలోచిస్తున్నాను" అన్నాను

"మీరు పత్రికల్లో చేరవచ్చు కదా"

"పత్రికల్లోనా!"

"అవును. బేసికల్‌గా మీరు మంచి క్రిటిక్. ప్రింట్ మీడియా ద్వారా కూడా చాలా చేయవచ్చు. అయితే అక్కడ అద్భుతాలు చేయగలం అనుకుంటే నిరాశ పడవలసి వుంటుందనుకోండి" అన్నారు. నాలో కొత్త ఆలోచనను ఆమె రగిలించారు!

****

జర్నలిస్ట్‌గా

శంకర్ ఉదంతం తర్వాత నేను ఎప్పుడూ సభలకు వెళ్లలేదు. ముందు నాకు సమయం సరిపోయేది కాదు. అయితే అప్పుడప్పుడు సమీక్షలు రాయటం మానలేదు.

యూనివర్సిటీ అనుభవాలు నాలాంటి ఇంకొందరికి వున్నాయి. అందులో కొందరు పత్రికల్లో పని చేయటానికి ఉత్సాహం చూపించారు. అవన్నీ నేను గమనించాను.



ఇది వరకు వేరు. తక్కువ పత్రికలు వుండేవి. ఇప్పుడలా కాదు. చాలా పత్రికలు వచ్చాయి. నేను ఉద్యోగంలో చేరేముందు కొంతకాలం ఖాళీగా వున్నాను. అదంతా అధ్యయనానికి ఉపయోగించుకున్నాను. అప్పటికీ సర్వీస్ కమిషన్ ఎగ్జామ్స్ రాయవచ్చు కదా అనే సూచనలు వచ్చాయి.

నేను అంగీకరించలేకపోయాను. అక్కడ ఓసారి జాబ్‌లో చేరితే రిటైర్ అయ్యేదాకా దాన్నుండి బయటపడలేం. నా వరకు నేను నిజాయితీగా వుండటానికి ప్రయత్నం చేయవచ్చు. వ్యవస్థ అలా లేదు. అదో విష వలయం. అందుకే అలాంటి నిర్ణయం తీసుకోలేదు.

ఓ పెద్ద పత్రికలో ఉద్యోగం వచ్చింది. ముందు నాకు ఓ శీర్షికని యిచ్చారు. అది నిర్వహించాలి. అందులో సాహిత్య, కళారంగాలున్నాయి. మా పత్రికకి 'మధు' సంపాదకుడు. అతను నన్ను అభిమానించాడు.

నన్ను కేవలం కొన్ని పనులకు పరిమితం చేయలేదు. నన్ను ముఖ్యమైన సమయాల్లో రిపోర్టింగ్‌కి వాడుకునేవాడు. ప్రత్యేక ఇంటర్వ్యూలకు నన్ను పంపించేవాడు. నా బ్యాగ్‌లో పుస్తకాలూ, కెమెరా ఎప్పుడూ వుండేవి.

క్రమంగా నన్ను ప్రత్యేక పేజీల ఇన్‌ఛార్జ్‌గా కాకుండా దాదాపు మొత్తం పత్రికకు చెంది అసోసియేట్ ఎడిటర్ స్థాయికి తీసుకు రావటం జరిగింది.

నేను రాజకీయ పార్టీల నుండి, అధికార పార్టీ ఎం.ఎల్.ఎ, ఎం.పీలకూ పరిచయం అవుతున్నాను. సెలబ్రిటీలను ఇంటర్వ్యూ చేయటనికి మధు నన్నే పంపించేవాడు.

ఈలోగా అర్చనను గ్రాడ్యుయేషన్ చేయటానికి తిరుపతిలో యస్.వి. యూనివర్సిటీకి పంపించాను. ఒకప్పుడు మావయ్య కోరిక అది. దానికి ముందు మావయ్య అర్చన పెళ్లి చేస్తే బాగుంటుందేమో అన్నాడు.

నేను తీవ్రంగా వ్యతిరేకించాను. ఒకప్పుడు నన్ను బలవంతంగా చదివించి, ఇప్పుడు అర్చనకి పెళ్లి చేయాలనటం సరయింది కాదు. మీరు అన్ని విషయాల్లో రాజీ పడుతున్నారా? మీ దృష్టిలో అర్చన పెళ్లి ఓ సమస్యగా వుంటే ఇప్పుడు చెబుతున్నాను. అర్చన పెళ్లి బాధ్యత మాదే అంటూ.

అలా తను అక్కడ చదువుకుంటోంది.

****

మధ్యలో అమిత మాట్లాడుతోంది.

"నీ జీవితం ఎలా వుంది?" అని అడిగాను.

"నావరకు రెండు ప్రాజెక్టుల మీద వర్క్ చేస్తున్నాను. రీసెర్చ్ స్టేజ్‌లో వుంది. రావుగారి ప్రపంచం రావు గారిది. పెద్ద కుదుపులు లేవు, ఆయనకేమో పిల్లలు కావాలని వుంది"

"నీకు లేదా అమితా!"

"నేను ఏమీ అనుకోలేదు. ఇప్పటి వరకు కన్సీవ్ కాలేదు. ఇప్పుడే తొందరేముందని అంటున్నాను"

"మెడికల్ టెస్టులు చేయించుకోవాల్సింది అమితా"

"చూద్దాం. కొంతమందికి పిల్లలు ఆలస్యంగా పుడతారు. అంతగా అయితే ఓ అమ్మాయిని పెంచుకుంటాం"

"అందుకు రావుగారు ఒప్పుకుంటారా?"

"ఏమో! అలాంటి సంక్షోభం యింకా రాలేదు. చర్చ కూడా లేదు. నిజంగా అలాంటి పరిస్థితి వచ్చినప్పుడు ఆలోచిద్దాం" అంది.

****

నా ఈ ఉద్యోగ జీవితంలో నేను గుర్తుంచుకోదగ్గ సంఘటనలు వున్నాయి. అందులో ఓ నక్సలైట్ నాయకుడితో రహస్యంగా నేను జరిపిన ఇంటర్వ్యూ..

అదెప్పుడూ థ్రిల్లింగ్‌గా వుంటుంది. నాకు ముందు ఓ ఫోన్ వచ్చింది. మీద్వారా, మీ పత్రిక ద్వారా ఫలానా వ్యక్తి కొన్ని విషయాలు చెప్పాలనుకుంటున్నారని.

అప్పుడు నేను ఈ విషయం మేనేజ్‌మెంట్‌కి తెలియ చేయాలా వద్దా అని మథన పడ్డాను. వాళ్లు ఏమంటారో తెలియదు. కొంతవరకు వాళ్లు స్వేచ్ఛనిచ్చారు. ఇంతకుముందు చిన్న చిన్న స్టింగ్ ఆపరేషన్లు చేయటం జరిగింది. అవన్నీ నేనూ, మధు కలిసి ముందు మాట్లాడుకుని జాగ్రత్తగా ప్లాన్ చేసుకునేవాళ్లం.


అయితే ఎప్పుడూ నా పేరు వుండేది కాదు. ప్రత్యేక ప్రతినిధి పేరుతో ప్రచురించేవారు. నాకు కూడా నా పేరు ప్రచురించాలని వుండేది కాదు. కొన్నిసార్లు పేరు వుండటం వలన ప్రమాదాలు వున్నాయి. అంటే దాడులు జరుగుతాయనే ప్రమాదం కాదు.

మనం ఎవరో తెలిస్తే ముందు ఎవరూ మనసు విప్పి మాట్లాడరు. కొందరు భయపడతారు. పత్రికల వారిని కొంతమంది పోలీసుల్తో పోలుస్తుంటారు. ఆ కత్తులకు రెండు పక్కలా పదును వుంటుంది. ఎప్పుడు ఏరకంగా ఉపయోగిస్తుంటారో తెలియదు.

(ఇంకా ఉంది)

కమ్యూనికేషన్ వృద్ధితో భాషాశాస్త్రానికి పెరుగుతున్న డిమాండ్

ఈ రంగంలోనూ ఉద్యోగాలూ అనేకం



ఎవరైనా ఒక భాష నేర్చుకోవాలంటే శాస్త్రీయమైన మార్గాలు ఉండాలి. పదాల పుట్టుక, అభివృద్ధి, ఇతర భాషలతో ఉన్న సంబంధం తదితరాలు తెలియాలి. ఇలాంటి వాటన్నింటినీ అధ్యయనం చేసేదే భాషాశాస్త్రం (లింగ్విస్టిక్స్). ప్రతి రంగంలోనూ భాషా శాస్త్ర నిపుణుల అవసరం ఉంటోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వంటి ఆధునిక సాంకేతిక టెక్నాలజీల వినియోగంలో కూడా లింగ్విస్టిక్స్ తెలిసినవారి అవసరం పెరుగుతోంది. అందుకే మనిషి ఉన్నంత వరకూ మాట ఉంటుంది. మాట ఉన్నంత కాలం భాష ఉంటుంది. భాష బతికినంత వరకూ ఈ ఉద్యోగాలూ ఉంటాయి.

మనం కొంచెం గమనిస్తే భాషల మధ్య కొన్ని పోలికలు, తేడాలు కనిపిస్తాయి. అలా వాటిని అధ్యయనం చేయడానికి ఒక శాస్త్రం ఉంది. అదే భాషాశాస్త్రం (లింగ్విస్టిక్స్). ఇది భాషల్లోని భేదభావాలు, సారూప్యతలను తెలుసుకుని వాటికి అర్థాలను వివరిస్తుంది. ఇలా అధ్యయనాలు సాగించే వారినే భాషాశాస్త్రవేత్తలు అంటారు. ఇప్పుడు ఇదో మంచి కెరీర్‌గా వేగంగా ఎదుగుతోంది. ప్రపంచ వ్యాప్తంగా కమ్యూనికేషన్ రంగం వృద్ధి చెందుతుండటంతో భాషాశాస్త్రానికి డిమాండ్ పెరుగుతోంది. సునిశితంగా పరిశీలించే గుణం, కొత్త సంస్కృతి, సంప్రదాయాలను, భాషలను తెలుసుకోవాలనే ఆసక్తి ఉంటే ఈ రంగంలో స్థిరపడవచ్చు.

ప్రపంచం బహు భాషల నిలయం. ఒకరి భావాలను మరొకరితో పంచుకోవడానికి ఉపయోగపడే సాధనమే భాష. భాషకు సంబంధించి ఏ సందేహమొచ్చినా వెంటనే మనం డిక్షనరీ చూస్తాం. అయితే అందులోని పదాలకు అర్థాలను ఎవరు పొందుపరిచారు. ఆ శబ్దాలను పలికే విధానాన్ని ఎవరు మనకందించారు? విద్యార్థులుగా మనం చదివిన పాఠ్యపుస్తకాల్లోని భాషా విధానం ఒకేలా ఎందుకుంటుంది? మనం టీవీలో వార్తలు చూస్తుంటాం. వారి పదజాలం మన వాడుక భాషలా కాకుండా ఎందుకంత సౌమ్యంగా ఉంటుంది? ప్రపంచంలో ఇన్ని భాషలు ఎలా వచ్చాయి? మనందరికీ సుపరిచితమైన ఇంగ్లిష్‌ను ఒక్కో దేశంలో ఒక్కో విధంగా ఎందుకు ఉచ్చరిస్తారు? చాలా భాషల్లో ఎన్నో పదాల్లో సారూప్యత ఎందుకుంటుంది? భిన్న భాషలు, మాండలికాలకు మధ్య భేదమేమిటి? సాఫ్ట్‌వేర్ కంపెనీల్లో సిబ్బందికి ప్రత్యేక భాషా ట్రెయినర్లు ఎందుకుంటారు? ఇలా అనేక సందేహాలకు సమాధానం భాషాశాస్త్రం. దీన్ని అధ్యయనం చేసేవారే భాషాశాస్త్రవేత్తలు.

శాస్త్రీయ అధ్యయనం

భాషాశాస్త్రం అనేది భాషకు సంబంధించిన శాస్త్రీయ పరిశీలన. దీన్ని ఆంగ్లంలో లింగ్విస్టిక్స్ అంటారు. ఒక భాష నిర్మాణం, దాని అభివృద్ధి, ఇతర భాషలతో ఉండే సంబంధాన్ని లింగ్విస్టిక్స్ తెలియజేస్తుంది. ఇందులో భాష, దాని ధ్వని, నిర్మాణం, అర్థం, క్రియల తీరు తదితరాలను అధ్యయనం చేస్తారు. భాషా శాస్త్రవేత్త భాషకు సంబంధించిన అన్ని అంశాలపై, ప్రపంచంలోని అన్ని భాషలపైనా ఆసక్తిని కలిగి ఉంటాడు. ప్రధానంగా సామాజిక వ్యవస్థ (సామాజిక ఆధార భాషాశాస్త్రం), భౌగోళిక ప్రాంతాలు (మాండలిక ఆధార భాషాశాస్త్రం), సమయ వ్యవధులు (చారిత్రక ఆధార భాషాశాస్త్రం), భాష – మనసు (మానసిక విశ్లేషణ)కు మధ్య సంబంధం ఇలా అనేక అంశాలను వీరు అధ్యయనం చేస్తారు.

అర్హత : ప్రభుత్వ గుర్తింపు పొందిన విశ్వవిద్యాలయం నుంచి ఏదైనా డిగ్రీ పూర్తిచేసిన వారెవరైనా యూనివర్సిటీలు నిర్వహించే ప్రవేశపరీక్ష ఉత్తీర్ణులై ఎంఏ లింగ్విస్టిక్స్ చేయవచ్చు. కొన్ని విశ్వవిద్యాలయాలకు డిగ్రీలో 55శాతం మార్కులు తప్పనిసరి. ఆపై ఆసక్తి ఉంటే ఎంఫిల్, పీహెచ్‌డీ చేసుకోవచ్చు. డిప్లొమాలు కూడా ఉన్నాయి.

కోర్సులు :

◆ డిప్లొమా కాలవ్యవధి సంవత్సరం. గుజరాత్, కర్ణాటక, ముంబయి తదితర విశ్వవిద్యాలయాలు ఈ కోర్సును అందిస్తున్నాయి.

◆ ఎంఏ నాలుగు సెమిస్టర్లతో రెండు సంవత్సరాలు ఉంటుంది. ఇందులో వీరు ఫొనెటిక్స్, ఫొనాలజీ, సింటాక్స్, సిమాంటిక్స్, ప్రాగ్మాటిక్స్ గురించి అధ్యయనం చేస్తారు. ఇండో-యూరోపియన్, హిస్టారికల్, ఇండో-ఆర్యన్, సోషియో, అడ్వాన్స్‌డ్ ఇండో-యూరోపియన్, అప్లైడ్, కంప్యూటేషనల్ లింగ్విస్టిక్స్ మొదలైనవాటిలో స్పెషలైజేషన్‌లు ఉంటాయి.

జనవరి నెలాఖరు నుంచి మేలోపు అడ్మిషన్స్‌కు సంబంధించిన విశ్వవిద్యాలయాల నోటిఫికేషన్లు విడుదలవుతాయి.

వివిధ పరిశ్రమల్లోనూ..

సమర్థ భాషాశాస్త్రవేత్తలకు ఇటీవలి కాలంలో వివిధ పరిశ్రమల నుంచి డిమాండ్ పెరిగింది. ఎడ్యుకేషన్, పబ్లిషింగ్, మీడియా, సోషల్ సర్వీస్, కమ్యూనికేషన్, కంప్యూటర్ లాంగ్వేజెస్, వాయిస్ అనాలిసిస్ రిసర్చ్, కమ్యూనికేటివ్ డిజార్డర్స్ తదితరాలతోపాటు ఇతర భాషా సంబంధ రంగాల్లోనూ అనేక ఉద్యోగాలు ఉన్నాయి. ఇన్‌ఫర్మేషన్ సైన్సెస్, ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, కమ్యూనికేషన్ సైన్సెస్ కంప్యూటర్ అప్లికేషన్స్‌ల్లోనూ భాషాశాస్త్రవేత్తల పాత్ర పెరిగింది.

◆ బోధనా రంగంలో స్కూళ్లు, కాలేజీలు, ఫారన్ లాంగ్వేజెస్ ట్రెయినింగ్/టీచింగ్ ప్రోగ్రామ్స్‌ను అందించే వివిధ సంస్థల్లో ఉద్యోగాలు ఉన్నాయి

◆ ప్రభుత్వ రంగంలో లాంగ్వేజ్ ట్రెయినింగ్ ప్రోగ్రామ్ పర్యవేక్షకులు, వివిధ భాషలపై పరిశోధకులు, మ్యాపింగ్‌కు సంబంధించిన నిపుణులుగా భాషాశాస్త్రవేత్తలకు అవకాశాలు లభిస్తున్నాయి..

◆ భాషా నిఘంటువుల, పాఠ్యపుస్తకాల ప్రచురణలో పదాల ఉచ్చారణ, వ్యాకరణ పదాల నిర్వచనం, వివిధ భాషల మాండలిక వైవిధ్యం, శబ్ద వ్యుత్పత్తి వంటి అంశాలకు సంబంధించి లెక్సికోగ్రాఫర్ల అవసరం ఉంటుంది.

◆ స్పీచ్ పాథాలజీ అండ్ ఆడియాలజీ విభాగాల్లో భాషాశాస్త్రవేత్తలకు భాషా సమస్యలను విశ్లేషించడం, మూల్యాంకనం చేయడం, మార్గాలను సూచించడం, పిల్లల భాష అభివృద్ధి, సమస్యలకు సంబంధించిన ఉద్యోగాలుంటాయి. ఈ మధ్యకాలంలో దీనికి డిమాండ్ పెరుగుతోంది.

◆ ఇన్వెస్టిగేటింగ్ ఏజెన్సీల్లో క్రిమినల్ కేసులను పరిష్కరించడానికి ఫొనెటిక్స్ విభాగంలో భాషాశాస్త్రవేత్తలు సాయపడతారు.

◆ కాల్ సెంటర్లలో ట్రెయినింగ్ మాడ్యూల్స్‌ని తయారు చేయడంతోపాటు అక్కడి సిబ్బందికి ప్రొఫెషనల్ శిక్షణను ఇవ్వడంలోనూ కీలకపాత్ర పోషిస్తారు.

◆ సైంటిస్టులు, ఇంజినీర్లు, అకౌంటెంట్ల బృందాలతో కలసి పనిచేస్తారు. వారు చేసే సాంకేతిక రచనల (మాన్యువల్స్, ఇన్‌స్ట్రక్షనల్ మెటీరియల్స్ అండ్ ఇంజినీరింగ్ రిపోర్ట్స్)ను అందరికీ అర్థమయ్యేట్లు భాషాశాస్త్రవేత్తలు రూపొందిస్తారు.

◆ అనువాద అధ్యయనాలు భాషాశాస్త్రంలో ఒక భాగం కావడంతో వివిధ ప్రభుత్వ, ప్రైవేట్ సెక్టార్‌లలో ట్రాన్స్‌లేటర్‌లుగా చేరవచ్చు.

◆ వీటితోపాటు బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ రంగంలో అక్కడి ఉన్నతాధికారులకు కస్టమర్స్‌తో భాషాసంబంధ విషయంలో సాయపడటానికి అవకాశాలు వస్తున్నాయి.

అందిస్తున్న సంస్థలు.. కోర్సులు

◆ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లిష్ అండ్ ఫారిన్ లాంగ్వేజెస్ యూనివర్సిటీ, హైదరాబాద్ (ఎంఏ లింగ్విస్టిక్స్, కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్)

◆ ఉస్మానియా విశ్వవిద్యాలయం (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమా ఇన్ అప్లైడ్ లింగ్విస్టిక్స్)

◆ హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, సెంటర్ ఫర్ అప్లైడ్ లింగ్విస్టిక్స్ అండ్ ట్రాన్స్‌లేషన్ స్టడీస్, హైదరాబాద్ (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ ఇన్ అప్లైడ్ లింగ్విస్టిక్స్, పీజీ డిప్లొమా ఇన్ సాంస్క్రిటిక్ కాంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్)

◆ ఐఐఐటీ, హైదరాబాద్ (ఎంఎస్ కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్, ఈ కోర్సుకు మాత్రం కంప్యూటర్ సైన్స్‌లో బీటెక్/బీఈ తప్పనిసరి. ఎంఫిల్ ఇన్ కంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్)

◆ ఐఐటీ – హైదరాబాద్ (ఎంఫిల్ ఇన్ లింగ్విస్టిక్స్)

◆ పొట్టిశ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ అప్లైడ్ లింగ్విస్టిక్స్),

◆ అలీగఢ్ ముస్లిం యూనివర్సిటీ (బీఏ ఆనర్స్, ఎంఏ, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమా)

◆ కలకత్తా యూనివర్సిటీ (ఎంఏ, పీహెచ్‌డీ),

◆ డెక్కన్ కాలేజ్ పోస్ట్-గ్రాడ్యుయేట్ అండ్ రిసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ)

◆ డాక్టర్ హరిసింగ్ గౌర్ సెంట్రల్ యూనివర్శిటీ, మధ్యప్రదేశ్ (బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ లింగ్విస్టిక్స్)

◆ ఐఐటీ కాన్పూర్ (పీహెచ్‌డీ)

◆ డాక్టర్ బీమ్‌రావు అంబేడ్కర్ విశ్వవిద్యాలయం, ఆగ్రా (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ)

◆ జాదవ్‌పూర్ విశ్వవిద్యాలయం (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, డిప్లొమా)

◆ లఖ్‌నవూ విశ్వవిద్యాలయం (బీఏ, ఎంఏ, పీహెచ్‌డీ, డిప్లొమా)

◆ పంజాబ్ విశ్వవిద్యాలయం (ఎంఏ ఎంఫిల్, పీహెచ్‌డీ)

◆ తేజ్‌పూర్ విశ్వవిద్యాలయం (ఎంఏ లింగ్విస్టిక్స్ అండ్ ఎండేంజర్డ్ లాంగ్వేజ్, ఎంఏ లింగ్విస్టిక్స్ అండ్ లాంగ్వేజ్ టెక్నాలజీ, పీహెచ్‌డీ)

◆ మహారాజా సయాజీరావు యూనివర్సిటీ ఆఫ్ బరోడా (బీఏ, ఎంఏ)

◆ ఢిల్లీ విశ్వవిద్యాలయం (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, పోస్ట్ ఎంఏ డిప్లొమా, అడ్వాన్స్‌డ్ డిప్లొమా ఇన్ అప్లైడ్ లింగ్విస్టిక్స్)

◆ కేరళ విశ్వవిద్యాలయం (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ); మైసూరు విశ్వవిద్యాలయం (ఎంఏ, పీహెచ్‌డీ)

◆ జవహర్‌లాల్ నెహ్రూ విశ్వవిద్యాలయం, న్యూఢిల్లీ (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ)

◆ భారతీయార్ విశ్వవిద్యాలయం, తమిళనాడు (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ)

◆ అన్నామలై విశ్వవిద్యాలయం, అన్నామలై నగర్ (ఎంఏ, ఎంఫిల్, పీహెచ్‌డీ, పీజీ డిప్లొమా ఇన్ లెక్సికోగ్రఫీ, కాంప్యుటేషనల్ లింగ్విస్టిక్స్, ఫొనెటిక్స్)

◆ భారతదేశంలోని దాదాపు అన్ని సెంట్రల్ యూనివర్సిటీలూ లింగ్విస్టిక్స్‌లో ఎంఏ/ ఎంఫిల్/ పీహెచ్‌డీలను అందిస్తున్నాయి.

ఉద్యోగావకాశాలు

లింగ్విస్టిక్స్‌లో డిప్లొమా, ఎంఏ పూర్తిచేసినవారికి అడ్వర్‌టైజింగ్ ఇండస్ట్రీ, కాల్ సెంటర్లు, ఆంత్రోపొలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియన్ లాంగ్వేజెస్, మైసూరు, సింథసిస్ ఆఫ్ స్పీచ్, కార్పొరేట్ కమ్యూనికేషన్స్, ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిందీ లాంగ్వేజ్, న్యూఢిల్లీ, జర్నలిజమ్, న్యూస్ అండ్ మీడియా, చైల్డ్ లాంగ్వేజ్, మెడికల్ ట్రాన్స్‌క్రిప్షన్ సెంటర్స్, స్పీచ్ అండ్ లాంగ్వేజ్ థెరపీ సెంటర్స్‌లో ఉద్యోగావకాశాలుంటాయి. ఇందులో వీరు డిక్షనరీ కంపైలర్‌గా, ఎడిటర్, కాల్‌సెంటర్ స్పీచ్ ట్రెయినర్, లింగ్విస్ట్, న్యూరో లింగ్విస్ట్, ప్రూఫ్ రీడర్, హాస్పిటల్ స్పీచ్ థెరపిస్ట్, టీచర్‌గా పని చేయవచ్చు.



◆ ఎంఫిల్ వ్యవధి రెండేళ్లు. ఎంఏ లింగ్విస్టిక్స్ కనీసం 55%తో పూర్తి చేసిన వారు అర్హులు. వీరు సోషియో లింగ్విస్టిక్స్, లాంగ్వేజ్ టీచింగ్ అండ్ టెస్టింగ్, లెక్సియోగ్రఫీ, సైకోలింగ్విస్టిక్స్, ఇండియన్ గ్రమాటికల్ ట్రెడిషన్ మొదలైన అంశాల గురించి అధ్యయనం చేస్తారు. ఇది చేసిన వారికి గవర్నమెంట్ డిపార్ట్‌మెంట్స్ అండ్ ఏజెన్సీస్, విద్య-ఆరోగ్య సెక్టార్, ట్రావెల్ అండ్ టూరిజమ్, జర్నలిజమ్ అండ్ మాస్ కమ్యూనికేషన్ సంబంధ సంస్థలు, సాఫ్ట్‌వేర్ అండ్ కంప్యుటేషనల్ కంపెనీలు, పబ్లిషింగ్ హౌసెస్, ఇంటర్‌ప్రిటింగ్ అండ్ ట్రాన్స్‌లేషన్ సర్వీసెస్, లైబ్రరీ, బిజినెస్ అండ్ ఇన్‌ఫర్మేషన్ మేనేజ్‌మెంట్ సర్వీసెస్, మీడియా అండ్ అడ్వర్‌టైజింగ్, ఇంటర్‌నేషనల్ ఆర్గనైజేషన్స్, మార్కెట్ రిసర్చ్ అండ్ పబ్లిక్ రిలేషన్ కంపెనీలలో ఉద్యోగావకాశాలు ఉంటాయి. ఇందులో వీరు టెక్నికల్ రైటర్, ఎడిటర్, కాపీరైటర్, లెక్సికోగ్రాఫర్‌లుగా విధులు నిర్వహిస్తారు.

◆ పీహెచ్‌డీ కాలవ్యవధి మూడేళ్లు. అయితే అయిదు నుంచి ఆరేళ్లలోపు పూర్తవుతుంది. ఎంఏ లింగ్విస్టిక్స్ తర్వాత ఎంఫిల్ కూడా విజయవంతంగా పూర్తి చేసినవారు విశ్వవిద్యాలయాలు నిర్వహించే కామన్ ఎంట్రన్స్ పరీక్షలో ఉత్తీర్ణులై పీహెచ్‌డీ చేయవచ్చు. ఇందులో అప్లైడ్ లింగ్విస్టిక్స్, కంప్యుటేషనల్, సోషియో, థియరిటికల్ లింగ్విస్టిక్స్ గురించి అధ్యయనం చేస్తారు. పీహెచ్‌డీ చేసిన వారికి విద్యాసంస్థలు, డేటా కేంద్రాలు, న్యూస్ అండ్ మీడియా, ట్రాన్స్‌లేషన్ డిపార్ట్‌మెంట్స్, హియరింగ్ సెంటర్లలో ఉద్యోగాలు లభిస్తాయి. ఆడియాలజిస్ట్, కమ్యూనికేషన్ డిజార్డర్ స్పెషలిస్ట్, బ్రాడ్‌కాస్టర్ లేదా న్యూస్ రీడర్, కాపీ రైటర్, ఎడిటర్, టెక్నికల్ రైటర్, ట్రాన్స్‌లేటర్, పబ్లిషర్, ఇంటర్‌ప్రిటర్, లాంగ్వేజ్ ప్లానర్, టీచర్, లెక్సికోగ్రాఫర్, సైకోలింగ్విస్ట్, టూర్ ఆపరేటర్, రిసర్చర్‌గా చేరవచ్చు.

దేశాభివృద్ధిలోనూ...

ఆధునిక కాలంలో భాషాశాస్త్రం ప్రాధాన్యం పెరుగుతోంది. ఇష్టంగా చదివితే ఈ రంగంలో అవకాశాలు అపారం. ప్రస్తుతం మల్టీనేషనల్ కంపెనీలు, సీక్రెట్ ఏజెన్సీలు, కాల్‌సెంటర్‌లలో వీరి అవసరం ఎక్కువగా ఉంది. దేశాభివృద్ధిలోనూ వీరి పాత్ర అధికం. అంతరించిపోతున్న భాషలన్నీ సజీవంగా ఉండాలంటే భాషాశాస్త్రవేత్తల అవసరం ఎంతైనా ఉంది. ఆంగ్లేయుల కాలంలో భారతదేశంలో చేపట్టిన లింగ్విస్టిక్స్ సర్వేను మళ్లీ ప్రారంభించే అవకాశాలు ఉండటంతో భాషాశాస్త్రం ప్రాముఖ్యాన్ని సంతరించుకుంటోంది. దేశరాజకీయాలను ప్రభావితం చేయడంలో లింగ్విస్టిక్స్ పాత్ర చాలా ఉంది. ప్రపంచ దేశాల్లో అమెరికా అంత ఆధిపత్యాన్ని చెలాయించడానికి కారణం భాషాశాస్త్రవేత్తలను సద్వినియోగం చేసుకోవడమేనని నిపుణులు పేర్కొంటున్నారు.

రంపం పొట్టు నుంచి పెట్రోలు



రంపం పొట్టు నుంచి పెట్రోల్‌ను తయారు చేసే ఓ నూతన విధానాన్ని శాస్త్రవేత్తలు అభివృద్ధి చేశారు. ప్రస్తుతం ఉనన చమురు శుద్ధి కేంద్రాలు.. పర్యావరణహితమైన ఇంధనాన్ని ఉత్పత్తి చేసేందుకు ఇది దోహదపడనుంది. బెల్జియంలోని క్యాథోలిక్ వర్సిటీ పరిశోధకులు.. రంపం పొట్టులో ఉండే సెల్యులోజ్‌ను హైడ్రోకార్బన్ గొలుసులుగా మార్చే రసాయన పద్ధతిని కనిపెట్టారు. ఈ హైడ్రోకార్బన్లను పెట్రోల్‌లో ఓ మిశ్రమంగా ఉపయోగించుకోవచ్చని వారు చెప్పారు. అసలు పెట్రోల్‌కు, దీనికి తేడా ఉండదని.. కార్బన్ డేటింగ్ చేస్తేగానీ అవి భిన్నమైన ఉత్పత్తులని గుర్తించలేమని అన్నారు. ఈ కొత్త పద్ధతిని ప్రస్తుతం ఉన్న చమురు శుద్ధి కేంద్రాల్లో అమలు చేయవచ్చని.. ఇంధన నాణ్యతలోనూ ఎలాంటి మార్పు ఉండదని పేర్కొన్నారు. అయితే అసలు పెట్రోల్‌తో కలపకుండా పూర్తిగా సెల్యులోజ్ పెట్రోల్‌నే తయారు చేసే వీలు లేదని వివరించారు.

బటర్‌ఫ్లై నెబ్యులా రహస్యం తెలిసింది


రోదసీలోని అనేకానేక నక్షత్ర మేఘాల్లో ఒకటైన బటర్‌ఫ్లై నెబ్యులాలో కీలక భాగాల్ని భారత శాస్త్రవేత్తలు గుర్తించారు. భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో)కు చెందిన ఆస్ట్రోశాట్ ఉపగ్రహం పంపిన సమాచారాన్ని విశ్లేషించడం ద్వారా బెంగళూరులోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఆస్ట్రోఫిజిక్స్ (ఐఐఏ) పరిశోధకులు ఈ ఘనత సాధించారు.

కోటానుకోట్ల నక్షత్ర కుటుంబాల సముదాయమే నెబ్యులా. మన సౌర కుటుంబం పాలపుంత (మిల్కీవే) అనే నెబ్యులాలో ఉండగా, దానికి ఆవల స్కార్పియన్ నక్షత్ర కూటమికి 3,800 కాంతి సంవత్సరాల దూరంలో ఎన్‌జీసీ-6302 నక్షత్ర మేఘం ఒకటి. దీనినే బటర్‌ఫ్లై నెబ్యులా అని పిలుస్తున్నారు. వాస్తవానికి ఇది ఒక గ్రహనీహారిక (ప్లానెటరీ నెబ్యులా). సూర్యుడిలాంటి ఒక నక్షత్రం అంతరించిపోయే స్థితిలో గ్రహనీహారికగా మారుతుంది.

దానిని అల్ట్రావయలెట్ ఇమేజింగ్ టెలిస్కోప్ ద్వారా ఆస్ట్రోశాట్ ఉపగ్రహం ఫొటోలను చిత్రీకరించింది. వాటిని ఐఐఏ పరిశోధకులు మరింత లోతుగా విశ్లేషించారు. సీతాకోకచిలుక ఆకారంలో ఉండే ఈ నెబ్యులాకు సంబంధించి రెండు పెద్ద రెక్కల్లాంటి అతినీలలోహిత భాగాలను, దానిచుట్టూ ఎగసిపడుతున్న చల్లని వాయువులను గుర్తించారు. అంతరించిపోతున్న ఓ నక్షత్ర సమూహం నుంచి ఇవి ఏర్పడి ఉండవచ్చని భావిస్తున్నారు.

స్వదేశీ పరిజ్ఞానంతో తొలి మైక్రోప్రాసెసర్ అభివృద్ధి

సెల్‌ఫోన్లు, నిఘా కెమెరాలు లాంటి ఎలక్ట్రానిక్ పరికరాలను నడిపించేందుకు త్వరలో స్వదేశీ మైక్రోప్రాసెసర్లు రాబోతున్నాయి. వీటికి బాటలు పరిచే 'శక్తి'ని ఐఐటీ-మద్రాస్ నిపుణులు సిద్ధం చేశారు. సైబర్ దాడుల ముప్పు తగ్గించడానికి ఈ తొలి స్వదేశీ మైక్రోప్రాసెసర్ తోడ్పడనుంది. మైక్రోప్రాసెసర్ల దిగుమతి కష్టాలనూ కొంత వరకు ఇది తప్పించే అవకాశముంది. మన రక్షణ, కమ్యూనికేషన్ రంగ అవసరాలకు సరిపడేలా దీన్ని తీర్చిదిద్దడం విశేషం. చండీగఢ్‌లోని భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో)కు చెందిన సెమీకండక్టర్ ప్రయోగశాలలో ఈ ప్రాసెసర్‌ను అభివృద్ధి చేశారు. దీనిలో ఆర్‌ఐఎస్‌సీ-వీ 'ఓపెన్ సోర్స్' ఇన్‌స్ట్రక్షన్ సెట్ ఆర్కిటెక్చర్ (ఐఎస్‌ఏ)ను



ఉపయోగించారు. ప్రాసెసర్లు పనిచేసేందుకు అవసరమైన ఆదేశాలనే ఐఎస్‌ఏగా పిలుస్తారు. ఇవి హార్డ్‌వేర్, సాఫ్ట్‌వేర్‌ల మధ్య వంతెనలా పని చేస్తాయి. ఓపెన్ సోర్స్ ఐఎస్‌ఏలను ఉపయోగించడంతో ఎలక్ట్రానిక్ పరికరానికి తగినట్లుగా దీనిలో మార్పులు చేసుకునే అవకాశం ఉంది.

కలిసిపోనున్న మూడు యాప్‌లు



ముంబై : వాట్సాప్, ఫేస్‌బుక్ మెసెంజర్, ఇన్‌స్టాగ్రాం.. వేర్వేరు యాప్స్. ఫేస్‌బుక్‌కే చెందినప్పటికీ వేర్వేరుగానే కొనసాగుతున్నాయి. దేని ఫీచర్లు దానివి. దేని యూజర్లు దానికే ఉన్నారు. అయితే ఇప్పుడు ఈ మూడు యాప్స్ తాలూకా మేసేజింగ్ ఇన్‌ఫ్రాస్టక్చర్‌ను అనుసంధానం చేసేందుకు సన్నాహాలు జరుగుతున్నాయి. దీంతో పాటు ఇప్పటి వరకు కేవలం వాట్సాప్‌కే ప్రత్యేకమైన ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్‌ను మిగిలిన యాప్స్‌కు కూడా తీసుకొచ్చేందుకు ఫేస్‌బుక్ సన్నాహాలు చేస్తోంది. ఈ మేరకు ఫేస్‌బుక్ అధినేత జుకర్ బర్గ్ ఇందుకు రంగం సిద్ధం చేశారని న్యూయార్క్ టైమ్స్ ఓ కథనం వెలువరించింది. ఈ మూడు యాప్స్ ఒక్కటైనప్పటికీ దేనికదే పనిచేస్తాయి. అయితే, ఫేస్‌బుక్ అకౌంట్ కలిగిన వ్యక్తి నేరుగా వాట్సాప్ అకౌంట్ కలిగిన వ్యక్తితో చాట్ చేయొచ్చు. ఇప్పటి వరకు ఇలాంటి సదుపాయం లేదు. కేవలం ఫేస్‌బుక్, వాట్సాప్, ఇన్‌స్టాగ్రాం యూజర్లు ఎవరి పరిధిలో వారే మెసేజ్ చేసుకునే వెసులుబాటు ఉంది. ఇప్పటికే దీనికి సంబంధించిన పనులు ప్రారంభమయ్యాయని, 2019 చివరి నాటికి గానీ, 2020 ప్రథమార్ధానికి గానీ పూర్తి అవ్వొచ్చని భావిస్తున్నారు. ఈ మూడు యాప్స్‌ను అనుసంధానం చేయడం ద్వారా ఫేస్‌బుక్ పని సులువు కానుంది. ఒకసారి ఇది గనుక జరిగితే వీటిలో అధునాతన ఫీచర్లను వేటికవి కాకుండా ఒక్కసారే అందుబాటులోకి తీసుకురావడం వీలవు తుంది. దీంతో పాటు ఈ మూడు ప్లాట్‌ఫాంలపై ఉన్న డేటాను పరస్పరం మార్చుకోవడంతో పాటు యూజర్లను ఎక్కువసేపు యాప్స్‌పై గడిపేలా చేసేం దుకు అవకాశం కలుగుతుందని ఫేస్‌బుక్ భావి స్తోంది. దీనిపై కొన్ని అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఒకరు పంపించిన సందేశాలను ఇంకొకరు చదవడానికి వీల్లేకుండా ఎండ్-టు-ఎండ్ ఎన్‌క్రిప్షన్ సదుపాయం వాట్సాప్‌లో మాత్రమే ఉంది. అయితే, ఈ మూడు యాప్స్ మేసేజింగ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అనుసంధానం వల్ల దీని అసలు లక్ష్యానికి గండిపడే అవకాశం ఉందని పలువురు టెక్ నిపుణులు అభిప్రాయపడుతున్నారు. ఒకసారి ఇతర యాప్స్‌కు కూడా సందేశాలను పంపించుకునే వీలున్నప్పుడు ఎన్‌క్రిప్షన్‌కు అవకాశం ఉండదని, అలాంటప్పుడు ఈ సదుపాయానికి అర్థం లేదని పేర్కొంటున్నారు.

సీబీఐ అధికారి బదిలీ

చందాకొచ్చర్‌పై కేసు నమోదు చేసిన మరుసటిరోజే పరిణామం



న్యూఢిల్లీ : ఐసీఐసీఐ బ్యాంక్ మాజీ సీఈవో చందాకొచ్చర్, ఇతరులపై ఎఫ్ఐఆర్ నమోదు చేసిన సీబీఐ అధికారి బదిలీ అయ్యారు. చందాకొచ్చర్, ఆమె భర్త దీపక్ కొచ్చర్, వీడియోకాన్ అధినేత వేణుగోపాల్ ధూత్‌పై సీబీఐ కేసు నమోదు చేసిన మరుసటి రోజే ఈ పరిణామం చోటుచేసుకోవడం గమనార్హం. సుధాన్షు ధార్ మిశ్రా సీబీఐలో బ్యాంకింగ్, సెక్యూరిటీస్ ఫ్రాడ్ సెల్‌లో ఎస్పీ హోదాలో బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. ఈ అధికారిని తాజాగా ఝార్ఖండ్‌లోని రాంచీ శాఖకు బదిలీ చేశారు. ఐసీఐసీఐ-వీడియోకాన్ కేసులో చందాకొచ్చర్, దీపక్ కొచ్చర్, వేణుగోపాల్ ధూత్‌తోపాటు ఇతరులపై ఈ నెల 22న నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌పై సుధాన్షు ధార్ సంతకం చేశారు. ఆ మరుసటి రోజే ఆ అధికారిని బదిలీ చేస్తున్నట్లు సీబీఐ ఉత్తర్వులు జారీ చేయడం చర్చనీయాంశంగా మారింది. ఈ కేసులో 24న చందాకొచ్చర్ తదితరులపై సీబీఐ కేసు నమోదు చేసింది. చందా కొచ్చర్ అధ్యక్షతన గల కమిటీ వీడియోకాన్ ఇంటర్నేషనల్ ఎలక్ట్రానిక్స్‌కు 2009లో రూ.300 కోట్లు, 2011లో రూ.750 కోట్లు రుణంగా మంజూరు చేసిందని, ఈ విషయంలో నిబంధనలు పాటించలేదని సీబీఐ పేర్కొంది. ఇచ్చిన రుణాల్లో చాలావరకు తిరిగి వసూలుకాకపోవడంతో బ్యాంకుకు రూ.1,730 కోట్లు నష్టం వచ్చినట్లు ఆరోపించింది. రుణాలు మంజూరుకు ప్రతిఫలంగా వీడియోకాన్ వ్యవస్థాపకుడు వేణుగోపాల్ ధూత్...సూపర్ ఎనర్జీ పేరుతో చందా కొచ్చర్ భర్త దీపక్ కొచ్చర్‌కు చెందిన నూపవర్ కంపెనీలో రూ.64 కోట్లు పెట్టుబడి పెట్టారని తెలిపింది. ఈ పెట్టుబడి అవినీతి కిందికే వస్తుందని ఆరోపిస్తూ కేసు నమోదు చేసింది.

పీఎస్‌బీలతో నేడు ఆర్థికమంత్రి సమావేశం



న్యూఢిల్లీ : బ్యాంకింగ్ వ్యవస్థను మరింత బలోపేతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యల గురించి చర్చించేందుకు సోమవారం పీఎస్‌బీ (ప్రభుత్వ రంగం బ్యాంకులు)లతో ఆర్థిక మంత్రి పీయూష్ గోయల్ సమావేశం కానున్నారు. సార్వ త్రిక ఎన్నికలు దగ్గర పడుతుండటం, మధ్యంతర బడ్జెట్‌కు కేవలం మూడు రోజుల ముందు ఈ సమావేశం జరుగుతుండటం ఇప్పుడు ప్రాధాన్యం సంతరించు కుంది. రోజంతా జరిగే ఈ సమావేశానికి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా గవర్నర్ శక్తికాంతదాస్ హాజరు కానున్నారు. ఎంఎస్ఎంఈ (మధ్య, సూక్ష్మ తరహా పరిశ్రమలు)లకు రుణాల మంజూరు, మొండి బకాయిల సమస్య, బ్యాంకుల ఆర్థిక పరిస్థితి వంటి అంశాలపై మంత్రి చర్చించనున్నారు. అంతే కాకుండా ప్రభుత్వ పథకాల అమలు తీరు, గడిచిన తొమ్మిది నెలల దేశ ఆర్థిక స్థితి గురించి సమీక్షించనున్నారు. ప్రభుత్వం తీసుకున్న చర్యల వల్ల పీఎస్‌బీలు మార్చి 2018 నాటికి రూ. 23వేలకోట్ల మొండి బకాయిలను రికవరీ చేయగలిగాయి. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం తొలి అర్ధ భాగం ముగిసే సరికి రికార్డు స్థాయిలో రూ.60,700 కోట్ల మొండి బకాయిలను వసూలు చేశాయి. అంతకు ముందు పీయూష్ గోయల్ వంద రోజులపాటు ఆర్థిక మంత్రిగా ఉన్నప్పుడు పంజాబ్ నేషనల్ బ్యాంకు నాన్ ఎగ్జిక్యూటివ్ చైర్మన్ సునీల్ మెహతా నేతృత్వంలో సమస్యాత్మకంగా పరిణమించిన బకాయిలను వేగంగా వసూలు చేసేందుకు ఉన్న మార్గాలను అన్వేషించేందుకు కమిటీని నియమించారు. అయితే ఆర్థిక మంత్రి అరుణ్ జైట్లీ అనారోగ్యంతో అమె రికాలో చికిత్స పొందుతున్న కారణంగా పీయూష్ గోయల్ ఆర్థిక మంత్రిగా అదనపు బాధ్యతలు చేపట్టిన విషయం తెలిసిందే.

చోక్సీ, మెహతాల కోసం..

వెస్టిండీస్‌లో వేట

- ⁕ కరేబియన్ దీవులకు సీబీఐ, ఈడీ?
- ⁕ ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో వెళ్లనున్న అధికారులు



న్యూఢిల్లీ: వేలాది కోట్ల రూపాయల బ్యాంక్ రుణాలను ఎగ్గొట్టి విదేశాలకు పారిపోయిన కార్పొరేట్ మోసగాళ్ల భరతం పట్టే దిశగా అడుగులు వేస్తున్నాయి కేంద్ర దర్యాప్తు సంస్థలు. ఇందులో భాగంగానే రత్నాల వ్యాపారి మెహుల్ చోక్సీని, వజ్రాల వర్తకుడు జతిన్ మెహతాలను తిరిగి భారత్‌కు ఎలాగైనా తీసుకురావాలని సీబీఐ, ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) కృషి చేస్తున్నాయి. పంజాబ్ నేషనల్ బ్యాంక్ (పీఎన్‌బీ) రూ.14,000 కోట్ల కుంభకోణంలో గీతాంజలి జెమ్స్ అధినేత మెహుల్ చోక్సీ ప్రధాన నిందితుల్లో ఒకరిగా ఉన్న విషయం తెలిసిందే. దేశీయ బ్యాంకింగ్ చరిత్రలోనే అతిపెద్దదిగా చెప్పుకోబడుతున్న పీఎన్‌బీ స్కాంలో చోక్సీ మేనల్లుడు, వజ్రాల వ్యాపార సంస్థ ఫైర్‌స్టార్ డైమండ్ అధిపతి నీరవ్ మోదీ కూడా ప్రధాన నిందితుడేనన్న సంగతీ విదితమే. ఇక విన్సమ్ డైమండ్స్ అండ్ జ్యుయెలరీ యజమాని జతిన్ మెహతా కూడా బ్యాంకులకు రూ.7,000 కోట్లు ఎగవేసి విదేశాలకు పారిపోయాడు. బాధిత బ్యాంకుల్లో పీఎన్‌బీ కూడా ఉండగా, దీనికే అత్యధికంగా రూ.1,700 కోట్లకుపైగా నష్టం వాటిల్లింది. ఈ క్రమంలో చోక్సీ, మెహతాలు ప్రస్తుతం వెస్టిండీస్‌లో ఉన్నారు. దీంతో వీరిని భారత్‌కు రప్పించేందుకు సీబీఐ, ఈడీ అధికారులు ప్రభుత్వ రంగ విమానయాన సంస్థ ఎయిర్ ఇండియా ప్రత్యేక విమానంలో కరేబియన్ దీవులకు వెళ్లనున్నారు. ఈ మేరకు ప్రభుత్వ వర్గాలు ధ్రువీకరించాయి.

ఆర్థిక నేరగాళ్లకు అడ్డాలు

వెస్టిండీస్‌సహా కరేబియన్ దీవుల్లోని చాలా దేశాలు ఆర్థిక నేరగాళ్లకు అడ్డాగా మారుతున్నాయి. పెట్టుబడులు, ఇతరత్రా ఆర్థిక లావాదేవీలకు ఏకంగా తమ దేశ పౌరసత్వాన్నే ఇచ్చేస్తున్నాయి. ఇది భారతీయ కార్పొరేట్ మోసగాళ్లకు కలిసొస్తుండగా, సెయింట్ కిట్స్-నెవీస్ పౌరసత్వాన్ని మెహెతా, ఆంటిగ్వా-బార్బుడా పౌరసత్వాన్ని చోక్సీ పొందారు. ఇక్కడి ప్రభుత్వాలు జారీ చేసిన పాస్‌పోర్టులపై వీరు ప్రపంచంలోని 132 దేశాలకు ప్రయాణం కూడా చేస్తుండటం గమనార్హం. ఈ క్రమంలోనే కరేబియన్ దీవులకు సీబీఐ, ఈడీలు పయనమవుతుండగా, తమ ఈ ఆపరేషన్ ప్రధాన లక్ష్యం చోక్సీ, నీరవ్‌లేనని, అయితే నీరవ్ ఈ దీవుల్లో ఉన్నాడా? లేడా? అన్నదానిపై స్పష్టత లేదన్న ఓ అధికారి.. ఐరోపా దేశాల్లో ఉన్నాడన్న అనుమా నాలపై పనిలోపనిగా తిరుగు ప్రయాణంలో నీరవ్ కోసం ఆయా దేశాల్లో గాలింపులు చేపడుతామన్నారు.

ఇదే అసలు సమస్య

కరేబియన్ దీవుల్లోని చిన్నచిన్న దేశాలతో భారత్‌కున్న సంబంధాలు చాలా చాలా తక్కువ. ముఖ్యంగా నేరగాళ్ల అప్పగింత ఒప్పందాలు లేవు. దీంతో భారత్‌లో ఆర్థిక మోసాలకు తెగబడుతున్నవారికి కరేబియన్ దేశాలు స్వర్గధామాలుగా తయారయ్యాయి. గ్రెనెడా, సెయింట్ లూసియా, డొమినికా దేశాలు తమ దేశాల్లో స్వల్ప పెట్టుబడులు పెడితే చాలు పౌరసత్వాన్ని కట్టబెట్టేస్తున్నాయి. ముఖ్యంగా డొమినికా, సెయింట్ లూసియాలు కేవలం లక్ష డాలర్ల (భారత కరెన్సీలో రూ.71 లక్షలు) పెట్టుబడులకే భారతీయులకు తమ దేశ పౌరసత్వాన్ని అందిస్తున్నాయి. గ్రెనెడా 2 లక్షల డాలర్లకు ఇస్తున్నది. ఒకవేళ తమ జీవిత భాగస్వాములకూ పౌరసత్వం ఆధారిత పాస్‌పోర్టులు కావాలనుకుంటే సెయింట్ లూసియాలో 1.65 లక్షల డాలర్లు, డొమినికాలో 1.75 లక్షల డాలర్ల పెట్టుబడులు పెడుతున్నారు. వేల కోట్ల రూపాయల మోసాలకు పాల్పడిన వారికి ఈ పెట్టుబడులు అతిస్వల్పం కావడంతో అంతా కుటుంబాలతోసహా తప్పించుకుంటున్నారు. చివరకు ఇంటర్‌పోల్‌సహా అంతర్జాతీయ దర్యాప్తు సంస్థలను భారత అధికారులు ఆశ్రయించిన ఫలితం శూన్యం.

స్వచ్ఛతపై ప్రత్యేక దృష్టి

- ▸ చెత్తకు 'ఈ-చలాన్'
- ▸ చెల్లించని వారి ఆస్తిపన్నుకు లింకు
- ▸ పన్ను కట్టకుంటే ఇల్లు సీజ్
- ▸ 'స్వచ్ఛ' నిబంధనలు కఠినతరం
- ▸ పర్యవేక్షణకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్



హైదరాబాద్: గ్రేటర్ హైదరాబాద్‌లో స్వచ్ఛతపై బల్దియా ప్రత్యేక దృష్టి సారించింది. నిబంధనలను కఠినతరం చేసే పనిలో నిమగ్నమైంది. నగరంలో గార్బేజ్ బిల్‌ను ఎత్తేయాలని నిర్ణయించింది. రోడ్లు, ఇతర ప్రాంతాల్లో చెత్త వేస్తే తొలగించడం కాదు.. ఎవరు వేశారో గుర్తించడంతో పాటు భారీ స్థాయిలో జరిమానా వేయాలని భావిస్తున్నది. జరిమానా నగదు రూపంలో కాకుండా 'ఈ-చలాన్' రూపంలో వేయాలని యోచిస్తోంది. స్వచ్ఛ హైదరాబాద్ కార్యక్రమంలో భాగంగా జీహెచ్‌ఎంసీ అనేక చర్యలు తీసుకుంది. నగరంలోని 30 సర్కిళ్లలో సుమారు 22 లక్షల కుటుంబాలున్నాయి. సుమారు రూ.40 కోట్లతో ఒక్కో ఇంటికి తడి, పొడి చెత్తను వేర్వేరుగా వేయడానికి రెండు చొప్పున 44 లక్షల డబ్బాలు పంపిణీ చేశారు. చెత్తను సేకరించడానికి 2400 స్వచ్ఛ ఆటోలు కూడా పెట్టారు. ఈ నేపథ్యంలో నగరంలో ఎక్కడా డస్ట్‌బిన్ ఉండకూడదని నిర్ణయించింది. అయినా ఎక్కడపడితే అక్కడ చెత్త వేస్తున్నారు. 2017లో 2000 చెత్త వేసే కేంద్రాలుంటే, ప్రస్తుతం సుమారు 5000కు పెరిగాయని అధికారులు అంచనా వేశారు. దీనంతటికి చెక్ పెట్టాలని జీహెచ్‌ఎంసీ నిర్ణయించింది. అందులో భాగంగానే స్వచ్ఛ నిబంధనలను రూపొందించే పనిలో నిమగ్నమైంది.

జీపీఎస్ పర్యవేక్షణ

గేటర్‌లో ప్రతి రోజూ 5వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉత్పత్తి అవుతోంది. ఇంటింటికీ కచ్చితంగా చెత్త సేకరించడంతో పాటు హోటళ్లు, రెస్టారెంట్లు, ఫంక్షన్‌హాల్స్, ఇతర సంస్థలను కలిపితే ఎక్కువ మోతాదులో చెత్త పెరిగే అవకాశముంది. ఆహార సంబంధిత సంస్థల్లో కంపోస్ట్ యూనిట్లను ఏర్పాటు చేసుకుంటే చెత్త ఉత్పత్తి తగ్గే అవకాశముంది. ప్రతి రోజూ చెత్త ఎత్తే విధంగా స్వచ్ఛ ఆటోలను 5వేలకు పెంచనున్నారు. ప్రస్తుతం 2400 మాత్రమే ఉన్నాయి. వీటితో నగరమంతా చెత్తను సేకరించలేకపోతున్నారు. కాలనీ సంక్షేమ సంఘాలతో సమావేశాలు ఏర్పాటు చేసి చెత్త పేరుకుపోవడానికి కారణాలను విశ్లేషించనున్నారు. చెత్త సేకరించినందుకుగాను ప్రతి ఇంటి యజమాని రూ.50 చెల్లించాలి. మురికివాడల్లో రూ.50 ఇవ్వడానికి ముందుకు రావడం లేదు. దీంతో చెత్త డంపింగ్ చేస్తున్నారు. మురికివాడల్లో చెత్తసేకరించేందుకు కార్పొరేట్ సోషల్ రెస్పాన్స్(సీఎస్‌ఆర్) కింద స్పాన్సర్‌తో ఆటోలకు డబ్బులు చెల్లించాలని కసరత్తు చేస్తున్నారు. వాణిజ్య, వ్యాపార సముదాయాలు ఉండే ప్రాంతాల్లో రోజుకు 3-4సార్లైనా చెత్త సేకరించాలని అధికారులు భావిస్తున్నారు. ప్రతి ఇంటికీ స్వచ్ఛ ఆటో వస్తుందా? లేదా? చెత్త సేకరిస్తున్నారా? అనేది గూగుల్ పొజిషనింగ్ సిస్టం(జీపీఎస్) ద్వారా కమాండ్ కంట్రోల్ రూమ్‌కు అనుసంధానం చేసి పర్యవేక్షించనున్నారు.

స్వచ్ఛ సేన నిఘా..

పెనాల్టీ వేసేందుకు ప్రత్యేక ఎన్‌ఫోర్స్‌మెంట్'(స్వచ్ఛ సేన) ద్వారా నిఘా పెట్టనున్నారు. 30 సర్కిళ్ల పరిధిలోని వార్డు, గల్లీ స్థాయిలోనూ స్వచ్ఛసేనను నియమించనున్నారు. వీటితోపాటు పోలీసు శాఖ ఏర్పాటు చేసిన సీసీటీవీ ఫుటేజీలను ఉపయోగించుకోనున్నారు. జోనల్ స్థాయిలో 'నానో మానిటరింగ్' పేరుతో ప్రత్యేక వాహనాలను ఏర్పాటు చేస్తున్నారు. అక్కడక్కడ డ్రోన్ కెమెరాలను వినియోగించాలని బల్దియా భావిస్తున్నది. స్వచ్ఛ ఆటోలు, సీసీటీవీ ఫుటేజీ, నానో మానిటరింగ్ వాహనాలు, స్వచ్ఛ సేన నిఘా, ఇతర ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగాలను జీహెచ్‌ఎంసీ ప్రధాన కార్యాలయంలో ఏర్పాటు చేసిన కమాండ్ కంట్రోల్ సెంట ర్‌కు అనుసంధానం చేయనున్నారు. పెనాల్టీ ఉద్దేశం ప్రజలను ఇబ్బందిపెట్టేందుకు కాదనీ, హైదరా బాద్ 'క్లీన్ అండ్ గ్రీన్' సిటీగా మార్చేందుకే అనీ ఓ సీనియర్ అధికారి అన్నారు.

ఆస్తిపన్నుతో అనుసంధానం

ఇప్పటి వరకు రోడ్లపై చెత్తవేస్తే ఎత్తేస్తున్న జీహెచ్‌ఎంసీ.. చెత్తవేసే వారికి భారీగా (రూ.5,000-10,000) పెనాల్టీ వేయాలని భావిస్తున్నది. దీన్ని నగదు రూపంలో కాకుండా 'ఈ-చలాన్' ద్వారా చెల్లించే విధంగా చర్యలు తీసుకుంటున్నారు. వెంటనే చెల్లించకపోతే సంబంధిత వ్యక్తి ఇంటి ఆస్తి పన్నుకు అనుసంధానం చేయనున్నారు. ఎన్నిసార్లు నిబంధనలు ఉల్లంఘిస్తే అన్నిసార్లు ఆస్తిపన్నుకు కలుపుతారు. అయినా వినకుంటే ఇంటిని సీజ్ చేయడంతో పాటు కేసులు కూడా నమోదు చేసేవిధంగా ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నారు.

మారుతికి గట్టి ఎదురుదెబ్బ

★ క్యూ3లో 17 శాతం తగ్గిన లాభం ★ ఐదేళ్లలో ఇదే అతిపెద్ద పతనం



న్యూఢిల్లీ: దేశంలో అతిపెద్ద కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం వరుసగా రెండు త్రైమాసికాల్లో నిరాశాజనక ఆర్థిక ఫలితాలను ప్రకటించిన సంస్థ..మూడో త్రైమాసికంలోనూ నికర లాభం 17. 21 శాతం పడిపోయింది. గడిచిన ఐదేండ్లలో ఇంతటి భారీ స్థాయిలో లాభాలు పడిపోవడం ఇదే తొలిసారి. గడిచిన పండుగ సీజన్‌లో అమ్మకాలు అంతంత మాత్రంగానే ఉండటం, మరో వైపు కమోడిటీ ఉత్పత్తులు భగ్గుమనడం, విదేశీ మారకం రేట్లలో అనిశ్చిత పరిస్థితి మొత్తం ఆర్థిక ఫలితాలపై ప్రభావం చూపాయి. అక్టోబర్- డిసెంబర్ మధ్యకాలానికి గాను కంపెనీ రూ.1,489.30 కోట్ల నికర లాభాన్ని ఆర్జించింది. క్రితం ఏడాది ఇదే సమయంలో రూ.1,799 కోట్లుగా ఉన్నది. లాభాల్లో ఎదురుదెబ్బ తగిలిన సంస్థకు..ఆదాయంలో మాత్రం కాస్త ఊరట లభించింది. సమీక్షకాలంలో కంపెనీ ఆదాయం రూ.19,528.10 కోట్ల నుం చి రూ.20,585.60 కోట్లకు చేరుకున్నది. వృద్ధి 5.41 శాతంగా ఉన్నది. గడిచిన మూడు నెలల్లో సంస్థ 4,28, 643 యూనిట్ల వాహనాలను మాత్రమే విక్రయించింది. అంతక్రితం ఏడాది విక్రయించిన దాంతో పోలిస్తే 0.6 శాతం తగ్గాయి. మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటం, అమ్మకాలను పెంచుకోవడానికి అధికంగా నిధులు వెచ్చించడం వంటి పరిణామాలు ఫలితాలపై ప్రతికూల ప్రభావం చూపాయని కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఖర్చులను తగ్గించుకోవడానికి పాక్షిక చర్యలను ప్రారంభించిన సంస్థ..ఉద్యోగులు, సరఫరాదారుల నుంచి సూచనలను ఆహ్వానించింది. గడిచిన పండుగ సీజన్‌లో దేశీయంగా ఉన్న 90 వేల డీలర్లు అంచనాలకు చేరుకోలేకపోయ్యాయని తెలిపిం ది. లాభాలు పతనమవడం వరుసగా ఇది రెండో త్రై మాసికం. జూలై-సెప్టెంబర్ మధ్యకాలంలోనే 9.8 శా తం తగ్గి రూ. 2,240.4 కోట్లకు పరిమితమైంది. 20 13-14 ఆర్థిక సంవత్సరం నాలుగో త్రైమాసికానికిగా ను సంస్థ నికర లాభం 35.46 శాతం పతనమై రూ. 800.1 కోట్లుగా ఉన్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ప్యాసింజర్ వాహన విక్రయాల్లో వృద్ధి 8-10 శాతం మధ్యలో ఉంటుందని భారత ఆటోమొబైల్ తయారీదారుల సంఘం(సియామ్) అంచనావేయగా, ఇండస్ట్రీ వృద్ధి మాత్రం 4.4 శాతానికి పరిమితమైంది. ఇదే సమయంలో కంపెనీ 7.2 శాతం పెరుగుదల కనిపించింది.

కంపెనీ షేరు ఢమాల్

నిరాశాజనక ఆర్థిక ఫలితాలు ప్రకటించడంతో కంపెనీ షేరు భారీగా పడిపోయింది. ఒక దశలో 8 శాతానికి పై గా పడిపోయిన షేరు ధర 52 వారాల కనిష్ఠ స్థాయికి జారుకున్నది. చివరకు స్వల్పంగా కోలుకొని 7.40 శాతం పతనంతో రూ.6,516.35 వద్ద ముగిసింది. బీఎస్ఈ 30 బ్లూచిప్ కంపెనీల్లో ఇదే భారీ పతనం. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ.15,739.06 కోట్లు తగ్గి రూ.1,96,845.94 కోట్లకు పడిపోయింది.

ఎగుమతుల రెట్టింపు లక్ష్యం

సురేష్ ప్రభు

పానాజీ (గోవా) : ఎగుమతులను రెట్టింపు చేయాలనే లక్ష్యంతో కేంద్రం ఉన్నట్లు వాణిజ్య, పరిశ్రమలశాఖ మంత్రి సురేష్ ప్రభాకర్ ప్రభు చెప్పారు. ప్రస్తుతం 321 బిలియన్ అమెరికన్ డాలర్లుగా ఉన్న ఎగుమతులను రానున్న సంవత్సరాలలో 642 యూఎస్ బిలియన్ డాలర్లకు పెంచాలని యోచిస్తున్నట్లు చెప్పారు. దక్షిణ గోవాలోని మార్గోలో నూతనంగా నిర్మించిన ఎగుమతుల తనిఖీ సంస్థ (ఈఐఏ) కార్యాలయం, లేబోరేటరీ కాంప్లెక్స్‌ను మంత్రి ప్రభు ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 'దేశం నుంచి విదేశాలకు ప్రస్తుతం ఉన్న 321 యూఎస్ డాలర్ల ఎగుమతులను రెట్టింపు చేసేందుకు ప్రయత్నిస్తున్నాం. అందులో మత్స్యశాఖ ప్రధానమైంది. వ్యవసాయ, అనుబంధ రంగాల ఉత్పత్తులను ఎగుమతి చేసేందుకు తొలిసారిగా ఎగుమతులకు అనుకూలంగా వ్యవసాయ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించాం' అని చెప్పారు. వ్యవసాయ, ఉద్యాన, ప్లాంటేషన్, మత్స్య, మాంసం ఉత్పత్తులపై ప్రత్యేకంగా దృష్టి కేంద్రీకరించేందుకు ఈ విధానాన్ని తెస్తున్నట్లు పేర్కొన్నారు. ఆయా రంగాలలో ఎగుమతుల విలువ ప్రస్తుతం 30 యూఎస్ బిలియన్ డాలర్లుగా ఉందన్నారు. చేపల ఎగుమతులను మరింతగా ప్రోత్సహిందుకు కేంద్రం, గోవా ప్రభుత్వం సమష్టిగా క్లస్టర్స్‌ను ఏర్పాటు చేస్తోందని తెలిపారు.

రైతు కడగండ్లు

- అకాల వర్షంతో అపారనష్టం
- పంటలన్నీ నీటిపాలు
- నేలకొండపల్లి మార్కెట్ యార్డులోకి నీరు
- మరో 24 గంటల వర్షాలు



విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : కష్టపడి పండించిన పంట కళ్లముందే చేజారిపోతుంటే రైతన్న కన్నీళ్లు ఆగడం లేదు. కల్లాల్లో ఆరబోసి రేపోమాపో మార్కెట్‌కు తరలిస్తే కష్టాలు తీరుతాయని కలలు కన్న రైతన్న ఆగమవుతున్నాడు. తెలంగాణలో రెండు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలతో రైతులకు తీవ్ర నష్టం వాటిల్లింది. అకాల వర్షాలతో కంది, మిరప, మామిడి, పెసర, పత్తి, వరి పంటలు దెబ్బతిన్నాయి. చివరి దశ ఏరేందుకు సిద్ధంగా ఉన్న పత్తి మొత్తం వానకు తడిసి నేలరాలింది. పీచు దశలో ఉన్న మొక్కజొన్న నేలకొరిగింది. మామిడి చెట్లకు ఇప్పుడే వస్తున్న పూత రాలిపోయింది. పలుచోట్ల ఈదురుగాలులు, భారీ వర్షానికి చెట్లు, విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. ఉపరితల ద్రోణి ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి అన్ని జిల్లాల్లో చిరు జల్లులతో పాటు.. కొన్నిచోట్ల భారీ వర్షాలు పడ్డాయి. ఆకాశం మేఘావృతమై ఉండటంతో మధ్యాహ్నం దాటినా ఎక్కడా భానుడు కనిపించలేదు. భారీ వర్షాలకు మహబూబ్‌నగర్, మంచిర్యాల, ఆదిలాబాద్, కుమురం భీం జిల్లాల్లో పంటలు దెబ్బతినడంతో రైతులు లబోదిబోమంటున్నారు. వరంగల్ జిల్లా పరకాలలో అకాల వర్షానికి కల్లాల్లో ఆరబోసిన మిర్చి వంట తడిసి ముద్దవడమే కాకుండా భారీ వరదనీరు వచ్చి చేరడంతో పంటంతా రైతన్న కళ్ల ముందటే నీళ్లలో కొట్టుకుపోయింది. జయశంకర్ భూపాలపల్లి జిల్లా టేకుమట్ల, మొగుళ్లపల్లి, ఏటూరునాగారం, మంగపేట మండలాల్లో కురిసిన వర్షానికి మిర్చి, పత్తి పంటలు తడిసి ముద్దయ్యాయి. ఈదురుగాలులతో కూడిన వర్షాలకు చాలాచోట్ల పంటలు దెబ్బతిన్నాయి. చెట్లు, స్తంభాలు కూలిపోయాయి. జిగిత్యాల జిల్లా ధర్మపురిలో అత్యధికంగా 5 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఉమ్మడి ఆదిలాబాద్, మహబూబ్ నగర్, కరీంనగర్, సిద్ధిపేట, వరంగల్ జిల్లాల్లో ఉదయం నుంచి వర్షం కురిసింది. లోతట్టు ప్రాంతాలు జలమయమయ్యాయి. కాలనీల్లోకి నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు. అకాల వర్షానికి బొప్పాయి చెట్లు విరిగిపోయాయి. కరీంనగర్ జిల్లా చొప్పదండి మండలంలో 115 ఎకరాలు, గంగాధరలో 20 ఎకరాలు, మానుకొండూరులో 15 ఎకరాల్లో మొక్కజొన్న, పత్తి, వేరుశనగ పంటలు దెబ్బతిన్నాయి. పెద్దపల్లి, కొమురం భీం అసిఫాబాద్, సిద్దిపేట, నల్లగొండ, సూర్యాపేట, ఖమ్మం, ఉమ్మడి వరంగల్ జిల్లాల్లో వర్షాలు పడ్డాయి. ఖమ్మం జిల్లా నేలకొండపల్లిలో అకాల వర్షానికి మార్కెట్ యార్డులోని ధాన్యం తడిసింది. రామడుగు మండలం తిర్మలాపూర్‌లో పొన్ను దేవయ్యకు చెందిన కోళ్లఫామ్ రేకుల షెడ్డు కూలిపోవడంతో 2,500 కోడిపిల్లలు చనిపోయి రూ.3 లక్షల వరకు నష్టం జరిగినట్లు తెలుస్తోంది. గంగాధర వ్యవసాయ మార్కెట్ యార్డులోని కొనుగోలు కేంద్రంలో రైతులు అమ్మకానికి తెచ్చిన కందులు తడిసిపోయాయి. జగిత్యాల జిల్లా మేడిపెల్లి మండలం దమ్మన్నపేటలో నిమ్మ మోహన్‌రెడ్డికి చెందిన బొప్పాయితోటలో దాదాపు 200 చెట్లు విరిగిపోయాయి. జయశంకర్ భుపాలపల్లి జిల్లాలోని సింగరేణి ఓపెన్ కాస్ట్ గనుల్లోకి వరద నీరు చేరింది. దీంతో బొగ్గు ఉత్పత్తికి అంతరాయం ఏర్పడింది. 6 వేల టన్నుల బొగ్గు ఉత్పత్తికి ఆటంకం కలిగింది. సంగారెడ్డి జిల్లా హత్నూర్‌లో 4, పెద్దపల్లి జిల్లా జూలపల్లె, కామారెడ్డి జిల్లా మాచారెడ్డిలో 3 సెంటీమీటర్ల వర్షపాతం రికార్డయింది. జగిత్యాల జిల్లా మల్యాల, సారంగపూర్, మెదక్ జిల్లా చేగుంట, రామాయంపేట, మంచిర్యాల జిల్లా కోటపల్లి, భీమిని, కొమురం భీం జిల్లా బెజ్జూరు, రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావు పేటలో రెండు సెంటీమీటర్ల వర్షం కురిసింది. రాజధాని హైదరాబాద్‌లోనూ శనివారం రాత్రి భారీ వర్షం కురవగా, ఆదివారం ఉదయం నుంచి చిరుజల్లులు పడ్డాయి. గోల్కొండ, లంగర్ హౌజ్, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, మెహిదీపట్నం, పంజాగుట్ట, ఖైరతాబాద్ తదితర ప్రాంతాల్లో రోడ్లపై నీరు నిలిచిపోయి చెరువులను తలపిస్తున్నాయి. కొన్ని చోట్ల ఇళ్లలోకి వర్షపు నీరు చేరడంతో జనం ఇబ్బందులు పడ్డారు. వర్షాలకు తోడు చలిగాలులతో ప్రజలు బయటకు రాలేదు. ఉపరితల ద్రోణితో ఆది, సోమవారాల్లో అక్కడక్కడ వర్షాలు కురుస్తాయని హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. విదర్భ తూర్పు ప్రాంతంలో 1500 మీటర్ల ఎత్తున ఉపరితల ఆవర్తనం ఏర్పడింది. తెలంగాణ మీదుగా కర్ణాటక వరకూ మరో ఉపరితల ద్రోణి ఏర్పడింది. ఉపరితల ద్రోణి ప్రభావంతో.. కొన్నిచోట్ల వడగండ్ల వాన పడే అవకాశం ఉందని అధికారులు పేర్కొన్నారు.

రైతులను ఆదుకోవాలి

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర వ్యాపితంగా కురుస్తున్న అకాల వర్షాల కారణంగా రైతాంగం తీవ్రంగా నష్టపోయిందని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి చాడ వెంకటరెడ్డి తెలిపారు. సోమవారం వరకు వర్షాలు కురిసే అవకాశముందని వాతావరణ శాఖ తెలియజేసిందని, ఇప్పటికే వేలాది ఎకరాల్లో మక్కజొన్న, వేరు శనగ లాంటి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. వేరుశనగ పంటకు మొలుకలు వచ్చే పరిస్థితి ఏర్పడిందని, మరో వైపు మామిడి పూత రాలిపోయిందన్నారు. దీని వల్ల లక్షలాది ఎకరాల్లో రైతులు పంటలు నష్టపోయారన ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో కోట్లాది రూపాయల పంట నష్టం సంభవించిందన్నారు. నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని చాడ విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం వెంటనే పంటల నష్టపరిహారాన్ని అంచనా వేయడానికి, రెవిన్యూ, వ్యవసాయాధికారులను పంపాలని, నష్టపోయిన వాణిజ్య పంటలకు ఎకరాకు 20 వేల పరిహారం చెల్లించి రైతులను ఆదుకోవాలన్నారు.

జ్ఞాపకశక్తికి మంచి కొలమానం.. నడక

మునుపటిలా వేగంగా నడవలేకపోతున్నారా? అంగలు దూరంగా పడటం లేదా? నడుస్తున్నప్పుడు తూలిపోతున్నారా? అయితే జ్ఞాపకశక్తి తగ్గుతుందేమో కూడా ఒకసారి గమనించుకోండి. నడక సమస్యలతో బాధపడేవారికి జ్ఞాపకశక్తి, ఆలోచన సామర్థ్యం తగ్గుముఖం పడుతున్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి మరి. మనం యథాలాపంగా నడిచేస్తుంటాం గానీ ఇది చాలా క్లిష్టమైన ప్రక్రియ. కాళ్ల మీద లేచి నిలబడటం, శరీరం తూలిపోకుండా స్థిరంగా ఉండటం ఒక ఎత్తయితే.. ఎక్కడికి వెళ్లాలో, ఎంత వేగంతో వెళ్లాలో, అందుకు ఎంత పెద్ద అంగలు వేయాలో నిర్ణయించుకోవటం మరో ఎత్తు. వీటన్నింటినీ మెదడు లిప్తకాలంలోనే గ్రహించేస్తుంది. వాటిని గుర్తుపెట్టుకొని అవసరమైనప్పుడు తిరిగి జ్ఞాపకం వచ్చేలా చేస్తుంది. ఎక్కడికంటే అక్కడికి నడిచి వెళ్లటానికి తోడ్పడుతుంది. అంటే ఒకరకంగా నడక మన జ్ఞాపకశక్తికి మంచి కొలమానం అన్నమాట. అందుకే విషయగ్రహణ, జ్ఞాపకశక్తి తగ్గే ముప్పు గలవారిని గుర్తించేందుకు మేయో క్లినిక్ పరిశోధకులు నడక తీరుపై దృష్టి సారించారు. అంగల దూరం, కదిలే వేగం, లయ, నడిచిన దూరం, చేతులు ముందుకీ వెనక్కీ కదిలించటం.. వంటి వాటిని కంప్యూటర్ దృశ్యాల ద్వారా నిశితంగా పరిశీలించారు. జ్ఞాపకశక్తి, ఆలోచనా సామర్థ్యం, భాషా నైపుణ్యాలు తగ్గటానికీ నడిచే తీరులో మార్పులకూ సంబంధం ఉంటున్నట్టు తేల్చారు. వయసు మీద పడుతున్నకొద్దీ నడిచే తీరులో మార్పులు సైతం ఎక్కువవుతున్నాయని, ఇవి రోజువారీ పనులపై.. ముఖ్యంగా వృద్ధులపై గణనీయమైన ప్రభావాన్ని చూపుతున్నాయని పరిశోధకులు చెబుతున్నారు. కాబట్టి నడక తీరులో ఏవైనా మార్పులు కనిపిస్తే వెంటనే డాక్టర్‌ను సంప్రదించటం మంచిదని సూచిస్తున్నారు.



కర్పూరంతో ప్రయోజనాలెన్నో..

కర్పూరం ఆరోగ్యానికి కూడా ఎన్నో రకాలుగా మేలు చేస్తుంది. ముఖ్యంగా పచ్చ కర్పూరంతో అనేక ప్రయోజనాలు ఉన్నాయి.




- ▲ ఒకటి లేదా 2 పలుకుల కర్పూరాన్ని మంచి గంధం లేదా వెన్నతో కలిసి తమలపాకులో పెట్టి నమిలి రసాన్ని మింగినట్టయితే తక్షణం వేడి తగ్గిస్తుంది.
- ▲ పచ్చకర్పూరాన్ని మూడు పూటలా ఒకటి లేదా రెండు పలుకులు తీసుకుంటే బలంతో పాటు రక్తపుష్టి కలుగుతుంది.
- ▲ కళ్లు బైర్లుకమ్మడం, తలతిరగడం, కడుపులో వికారం, అతిగా శరీరానికి చెమట పట్టడం వంటివి తగ్గిపోతాయి.
- ▲ లైంగిక సామర్థ్యంతో పాటు రక్తపోటు అదుపులో ఉంటుంది. కంటి జబ్బులు, రక్తస్రావాన్ని అరికడతాయి.
- ▲ రక్తపోటుతో బాధపడేవారు వీటిని తీసుకున్నట్టయితే బీపీ అదుపులో ఉంటుంది.
- ▲ పచ్చ కర్పూరంతో కళ్ళమంటలు, కళ్లు ఎరుపెక్కడం, నీరు కారడం, తలనొప్పి వంటివి తగ్గుతాయి.
- ▲ ముఖ్యంగా, జాజికాయ, జాపత్రి, పచ్చకర్పూరంలను మెత్తగా నూరి, ఇందులో ఎండుద్రాక్ష వేసి చిన్నటి మాత్రలా తయారు చేసుకుని రాత్రి పడుకునేముందు వేసుకుంటే వీర్యవృద్ధి కలుగుతుందని గృహవైద్య నిపుణులు పేర్కొంటున్నారు.
- ▲ వేసవికాలంలో పచ్చ కర్పూరాన్ని తీసుకుంటే వడదెబ్బతో పాటు అతిదాహం, తపన, శరీరం చిటపటలాడటం, శోష తగ్గటం వంటివి తగ్గిపోతాయి.

విటమిన్ సి లోపం ఏర్పడకుండా ఉండాలంటే..



విటమిన్ 'సి'కి జలుబు తగ్గించే గుణం ఉందని మనం బలంగా నమ్ముతాం. ఇక నుంచి ఆ నమ్మకాన్ని కాస్త సడలించుకోవాలేమో! ఎందుకంటే విటమిన్ సి సమగ్ర ఆరోగ్య రక్షణకు అత్యవసరమే కానీ జలుబు రాకుండా చూస్తుందనేది అవాస్తవం అంటున్నాయి తాజా అధ్యయనాలు. తక్కిన అత్యావస్యక విటమిన్ల మాదిరిగానే విటమిన్ సి పిల్లల ఎదుగుదలకి చాలా అవసరం. ఈ విటమిన్ వ్యాధినిరోధక శక్తిని పెంచుతుంది. ఆ క్రమంలో జలుబు చేసినప్పుడు ఆ తీవ్రతని తగ్గించి ఎక్కువ రోజులు జలుబు లేకుండా చేయొచ్చేమో కానీ అసలు రాకుండా చూస్తుంది అనేది సరైన అభిప్రాయం కాదట. మరి విటమిన్ సి ఆవశ్యకత ఏంటి అంటే... నాడీమండలం పనితీరు చురుగ్గా ఉండటంలో విటమిన్ సి కీలకపాత్ర పోషిస్తుంది. విటమిన్ సి లోపం తలెత్తితే చర్మం బరకగా మారడం, చర్మం మొద్దుబారడం, భావోద్వేగాల్లో తీవ్రత వంటివన్నీ తలెత్తుతాయి. ఆ సమస్యలు రాకుండా ఉండాలంటే సి విటమిన్ అధికంగా ఉండే నారింజ, బత్తాయి వంటి పుల్లని పండ్లతో పాటూ రోజువారీ ఆహారంలో టొమాటో, మిర్చి వంటి వాటిని కూడా చేర్చుకోవాలి. దాంతో విటమిన్ సి లోపం ఏర్పడకుండా ఉంటుంది.

గుండెకు మేలు చేసే ప్రత్యేక కణాలు...



మాక్రోఫేగస్ అనే ప్రత్యేక కణాలు గుండెజబ్బుతో దెబ్బతిన్న గుండెకు మరమ్మతు చేసేందుకు.. కొన్ని సందర్భాల్లో మళ్లీ ఆరోగ్యకరంగా మార్చేందుకు ఉపయోగ పడతాయని గుర్తించారు పీటర్ మంక్ కార్డియాక్ సెంటర్ శాస్త్రవేత్తలు. పసిపిల్లల్లోని కణాల మాదిరిగా వ్యవహరించే ఈ మాక్రోఫేగస్‌లు గుండెజబ్బు తరువాత పసిపిల్లల్లో మాదిరిగానే అవయవాల ఎదుగుదలకు ఉపయోగపడతా యని ఈ పరిశోధనల్లో పాల్గొన్న శాస్త్రవేత్త లొరెట్టా రోగర్స్ తెలిపారు. అయితే శరీరంలో మొత్తం నాలుగు రకాల మాక్రోఫేగస్‌లు ఉన్నాయని... గుండెజబ్బు తరు వాత వీటి సంఖ్య 11కు చేరుతుందని తాము పరిశోధ ల్లో గుర్తించామని చెప్పారు. గుండెజబ్బు తరువాత ముందుగా పసిపిల్లల స్థాయిలో ఉండే మాక్రోఫేగస్‌లు నాశనమవుతా యని... పసిపిల్లల్లో మాత్రం వీటి సంఖ్య గణనీయంగా పెరుగుతాయని తద్వారా రక్తనాళాలు, గుండె కండరాలు ఎదిగేందుకు సాయపడతాయని వివరించారు. గుండె పోటు తరువాత కొంత ఆలస్యంగానైనా ఈ మాక్రోఫేగస్‌లు గుండెను చేరుకుంటాయని.. వీటిల్లో కొన్ని పసిపిల్లల స్థాయి కణాలుగా మారతాయని కాకపోతే.. ఈ కణాలు గుండెను చేరుకునే సమయానికి అక్కడి కణాలన్నీ నాశనమైపోయిన కండరం దెబ్బతిని ఉంటుందని వివరిం చారు. గుండెపోటు తరువాత గుండె ఎలా ప్రవర్తిస్తుందో పూర్తిగా తెలుసుకోగలిగితే సరికొత్త, మరింత సమర్థమైన చికిత్సలు అందించేందుకు వీలేర్పడుతుందని.. ఈ పరిశోధనలు అందుకు ఉపయోగపడతాయని లొరెట్టా తెలిపారు.

పీచు పదార్థాలతో గుండెజబ్బుల నివారణ

మన పేవుల్లోని బ్యాక్టీరియా పుట్టించే.. కొన్ని రకాల పీచుపదార్థాల్లో ఉండే రసాయనం ఒకటి అధిక రక్తపోటుతోపాటు గుండె నాళాల్లో కొవ్వు పేరుకుపోవడాన్ని కూడా నిరోధిస్తుందని జర్మనీలోని ఓ పరిశోధన సంస్థ శాస్త్రవేత్తలు గుర్తించారు. ఎలుకలపై జరిగిన ప్రయోగాల్లో ప్రొపయోనైట్ అనే రసాయనం రోగ నిరోధక వ్యవస్థ కణాలను శాంత పరచడం ద్వారా రక్తపోటును నియంత్రిస్తుందని తాము గుర్తించినట్లు మాక్స్ డెల్బర్ తెలిపారు. మన కడుపు/ పేవుల్లో ఉండే బ్యాక్టీరియా ఆహారం నుంచి శరీరానికి అవసరమైన పోషకాలను అందిస్తుందని ఆయన వివరించారు. అధిక రక్తపోటు ఉన్న ఎలుకలకు ప్రొపయోనైట్‌ను అందించినప్పుడు గుండెకొట్టుకునే వేగంలో మార్పులు (అరిథ్రిమియా) ప్రమాదం గణనీయంగా తగ్గిందని నాడులకు జరిగే నష్టమూ తక్కువని చెప్పారు. అధిక రక్తపోటు, గుండెజబ్బులు ఉన్నవారికి ప్రొపయోనైట్‌ను అందిం చడం ఒక కొత్త చికిత్స పద్ధతి కావచ్చునని సూచిం చారు. ప్రొపయోనైట్ కారణంగానే గుండెజబ్బుల నివారణకు పీచుపదార్థాలు ఎక్కువగా ఉన్న ఆహారం తీసుకొవాలని సూచిస్తారని, వీటిల్లో పండ్లు, కాయగూరల్లో ఉండే ఇన్సులిన్ పీచు పదార్థాలను ఉపయోగించుకుని పేవుల్లోని బ్యాక్టీరియా ప్రొపయోనైట్‌ను ఉత్పత్తి చేస్తుందని అన్నారు.



చర్మానికి మేలుచేసే నూనెలు



చలికాలంలో పడిపోయే ఉష్ణోగ్రత, వీచే చలిగాలులు చర్మాన్ని చాలా ఇబ్బంది పెడుతుంటాయి. చర్మానికి ఈ రుతువులో అదనపు రక్షణ చాలా అవసరం. ఆ రక్షణను అందించే నూనెలను చర్మం మీద మర్దన చేసినప్పుడు అవి చర్మాన్ని నునుపుగా చేస్తాయి. అందుకు ఉపకరించే నూనెలు...

నువ్వుల నూనె : ఈ నూనెలో ఉన్న విటమిన్ బి, ఇ లు చర్మానికే కాదు, ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయి. దీనిలోని కాల్షియమ్, మెగ్నీషియం ద్వారా చర్మం లబ్ధిపొందుతుంది. సూర్య కాంతి ప్రభావం చర్మం మీద పడకుండా రక్షిస్తుంది. నువ్వుల నూనెతో శరీరం మర్దన చేయించుకుంటే అలసట పోతుంది. చర్మానికి తాజాదనం సమకూరి ఉత్సాహాన్ని తెచ్చిపెడుతుంది.

ఆలివ్ నూనె : చర్మ సౌందర్యానికి చక్కని సాధనం ఆలివ్ నూనె. దీనిలో ఉన్న విటమిన్ ఇ, యాంటీ ఆక్సిడెంట్స్ వలన చర్మం వయసుతో వచ్చే మార్పులకు గురికానివ్వదు. ఆలివ్ నూనెను మర్దన చేస్తే చర్మం ఎంతో చక్కని తేజస్సును పొందుతుంది.

కొబ్బరి నూనె : దీనిలో లవణాలు అధికం. కాబట్టి కొబ్బరి నూనెను చలికాలంలో శరీరానికి రాసుకుంటే ముడుతలు రాకుండా కాపాడుకోవచ్చు. చర్మం ఏ తరహాకి చెందినదైనా కొబ్బరి నూనె వాడకం సరైనదే. పలు రకాల చర్మరోగాలు సోకకుండా కాపాడే శక్తి కొబ్బరినూనెకుంది.

లండన్‌లో శ్రుతి లైవ్ షో..



కథానాయిక శ్రుతిహాసన్ ఇప్పటికే విదేశాల్లో పలు షోలలో ప్రదర్శన ఇచ్చిన సంగతి తెలిసిందే. తాజాగా మరోసారి తన చక్కటి స్వరంతో అందర్నీ ఆకట్టుకున్నారు. కొన్ని రోజుల క్రితం శ్రుతి లండన్‌లోని హోటల్ నెడ్‌లో షో ఇచ్చారు. ఇప్పుడు లండన్‌లోని ట్రూబాడూర్ అనే ప్రముఖ రెస్టారెంట్‌లో ఏర్పాటు చేసిన వేడుకలో సందడి చేశారు. శ్రుతి తాను రూపొందించిన 'ఒరిజినల్ నంబర్' ఆల్బమ్‌లోని పాటలతో ఈ ప్రదర్శన ఇచ్చారు. త్వరలో ఇది విడుదల కాబోతోందట. ఈ సందర్భంగా శ్రుతి ట్వీట్ చేశారు. కార్యక్రమానికి వచ్చిన వారందరికీ ధన్యవాదాలు తెలిపారు. షోకు సంబంధించిన ఫొటోలు ప్రస్తుతం సోషల్‌మీడియాలో చక్కర్లు కొడుతున్నాయి. శ్రుతి స్వరం ఎంతో బాగుందని నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. శ్రుతి 'కాటమ రాయుడు', 'బెహెన్ హోగీ తెరి' సినిమాల్లో 2017లో చివరిసారి వెండితెరపై కనిపించారు. దీని తర్వాత కొత్త ప్రాజెక్టుకు సంతకం చేయలేదు. తమిళంలో ప్రతిష్ఠాత్మకంగా తెరకెక్కించడానికి సన్నాహాలు చేస్తున్న 'సంగమిత్ర' చిత్రానికి ఆమె ఒప్పుకొన్నారు కానీ.. కొన్ని కారణాల వల్ల వైదొలిగారు. ప్రస్తుతం శ్రుతి 'శభాష్‌నాయుడు' చిత్రంలో నటిస్తున్నారు.

నాలుగు సినిమాలతో నందమూరి హీరో.!



నందమూరి నటవారసుడిగా ఎంట్రీ ఇచ్చిన స్టార్ ఇమేజ్ కోసం కష్టపడుతున్న యంగ్ హీరో కల్యాణ్ రామ్. కెరీర్‌లో అతనొక్కడే, పటాస్ లాంటి హిట్స్ ఉన్నా కెరీర్‌ను మలుపు తిప్పే సినిమా మాత్రం ఇంతవరకు పడలేదు. అయితే సక్సెస్ విషయం పక్కన పెడితే ఈ యంగ్ హీరో ఈ ఏడాది ఓ ఇంట్రస్టింగ్ ఫీట్ చేసేందుకు రెడీ అవుతున్నాడు. ఈ జనరేషన్ హీరోలు సంవత్సరానికి ఒక్క సినిమా చేయడానికి కష్టపడుతుంటే కల్యాణ్ రామ్ ఈ ఏడాది ఏకంగా నాలుగు సినిమాలతో అలరిస్తున్నాడు. కల్యాణ్ రామ్ గెస్ట్ అపియరెన్స్ ఇచ్చిన యన్.టి.ఆర్ కథానాయకుడు సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు వచ్చింది. ఈ సినిమాకు సీక్వల్‌గా రూపొందుతున్న యన్.టి.ఆర్ మహానాయకుడులో కల్యాణ్ రామ్ కీలక పాత్రలో కనిపించనున్నాడు. ఈ సినిమా ఫిబ్రవరిలో రిలీజ్ కానుంది. ఇక కేవీ గుహన్ దర్శకత్వంలో యాక్షన్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న 118 కూడా మార్చిలో రిలీజ్ చేసేందుకు ప్లాన్ చేస్తున్నారు. ఇటీవల ఉయ్యాల జంపాల ఫేం విరించి వర్మ దర్శకత్వంలో కల్యాణ్ రామ్ హీరోగా ఓ సినిమా చేస్తున్నట్టు తెలుస్తోంది. అంతేకాదు ఈ సినిమాను కూడా ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసే ప్లాన్‌లో ఉన్నాడు నందమూరి హీరో.

సీక్రెట్‌గా హీరోయిన్ నిశ్చితార్థం



ఒకప్పుడు టాలీవుడ్ లో హాట్ టాపిక్‌గా మారిన హీరోయిన్ అనీషా ఆంబ్రోస్. పవన్ కల్యాణ్ సరసన సర్దార్ గబ్బర్ సింగ్ సినిమాలో ఈ భామ హీరోయిన్‌గా నటించాల్సి ఉంది. అయితే చివరి నిమిషంలో ఆ అవకాశం అనీషా చేజారింది. తరువాత మనమంతా, ఒక్కడు మిగిలాడు లాంటి సినిమాల్లో నటించిన అనీషాకు ఆశించిన స్థాయిలో గుర్తింపు రాలేదు. ప్రస్తుతం డిఫరెంట్ కాన్సెప్ట్‌తో తెరకెక్కుతున్న 7 సినిమాలో నటిస్తోంది అనీషా. తాజాగా అనీషాకు సంబంధించిన మరో వార్త టాలీవుడ్‌లో హల్‌చల్ చేస్తోంది. త్వరలో ఈ భామ పెళ్లిపీటలెక్కనుందట. జేఎంఆర్ కన్‌స్ట్రక్షన్ ఈడీ గుణ జక్కను అనీషా పెళ్లి చేసుకోబోతోంది. అంతేకాదు ఇప్పటికే సీక్రెట్‌గా వీరి ఎంగేజ్మెంట్ కూడా జరిగిపోయిందట. ఈ కార్యక్రమానికి అత్యంత సన్నిహితులు మాత్రమే హాజరయ్యారు.

ఓవర్సీస్‌లో దుమ్ములేపుతున్న 'ఎఫ్2'



వంద కోట్ల గ్రాస్‌ను దాటి సంచలనం సృష్టించిన ఎఫ్2.. ఓవర్సీస్‌లోనూ దూసుకు పోతోంది. వెంకటేష్, వరుణ్ తేజ్ కెరీర్‌లోనే బిగ్గెస్ట్ హిట్‌గా ఈ చిత్రం నిలిచింది. సంక్రాంతి బరిలో దిగి.. సూపర్‌హిట్‌గా నిలిచింది ఎఫ్2. ఇప్పటికీ అన్ని ఏరియాల్లో విజయవంతంగా రన్ అవుతోంది. ఈ చిత్రం ఓవర్సీస్‌లో రెండు మిలియన్ల మార్కును చేరినట్లు చిత్రయూనిట్ ప్రకటించింది. కామెడీ ఎంటర్‌టైనర్‌గా అన్ని వర్గాల ప్రేక్షకులను ఆకట్టుకునేలా అనిల్ రావిపూడి ఈ చిత్రాన్ని మలిచారు. తమన్నా, మెహరీన్ కథానాయికలుగా నటించిన ఈ చిత్రానికి దేవీ శ్రీ ప్రసాద్ సంగీతమందించారు.

విశాలాంధ్ర సినిమా



వరుణ్ తేజ్ కొత్త సినిమా ఇదే!

ఫిదా', 'తొలిప్రేమ', 'అంతరిక్షం', 'ఎఫ్2' వంటి విభిన్న చిత్రాలతో ఘనవిజయాలు అందుకున్న మెగాప్రిన్స్ వరుణ్‌తేజ్ హీరోగా 14 రీల్స్ ప్లస్ పతాకంపై పవర్‌ఫుల్ డైరెక్టర్ హరీష్ శంకర్ దర్శకత్వంలో రామ్ ఆచంట, గోపీ ఆచంట నిర్మిస్తున్న భారీ చిత్రం 'వాల్మీకి'. ఈ చిత్రం జనవరి 27న హైదరాబాద్‌లోని రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. వరుణ్ తేజ్‌పై చిత్రీకరించిన ఫస్ట్‌షాట్‌కు నిహారిక కొణిదెల క్లాప్ నివ్వగా, రామ్ బొబ్బ కెమెరా స్విచ్చాన్ చేశారు. సెన్సేషనల్ డైరెక్టర్ వి.వి. వినాయక్ ఫస్ట్ షాట్‌ను డైరెక్ట్ చేశారు. బ్రిలియంట్ డైరెక్టర్ సుకుమార్ పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఈ చిత్రానికి సంబంధించిన మిగతా వివరాలు త్వరలోనే తెలియజేస్తారు. ఈ చిత్రానికి సంగీతం: రాక్‌స్టార్ దేవి శ్రీప్రసాద్, సినిమాటోగ్రఫీ: అయనంకా బోస్, కథ: కార్తీక్ సుబ్బరాజ్, స్క్రీన్‌ప్లే: మధు, చైతన్య, ఆర్ట్: అవినాష్ కొల్ల, ఎడిటింగ్: ఛోటా కె.ప్రసాద్, ఫైట్స్: రామ్‌లక్ష్మణ్, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: హరీష్ కట్టా, నిర్మాతలు: రామ్ ఆచంట, గోపీ ఆచంట, మాటలు-దర్శకత్వం: హరీష్ శంకర్.

బాలీవుడ్ మెగాస్టార్‌ను కలిసిన 'ఎలక్ట్రిక్' స్టార్!

బాలీవుడ్ మెగాస్టార్ అమితాబ్ బచ్చన్‌కు.. 'ఎలక్ట్రిక్ స్టార్' రణ్‌వీర్ సింగ్ ఎదురయ్యాడు. ఇంకేముంది.. బిగ్‌బిని చూడగానే రణ్‌వీర్ ఆనందంతో వెంటనే వెళ్లి ఆయన్ను ఆలింగనం చేసుకున్నారు. ఆ సమయంలో వీరిద్దరూ దిగిన ఫొటో సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతోంది. ఈ ఫొటోను అమితాబ్ ట్విటర్‌లో పోస్ట్ చేస్తూ.. 'గణతంత్ర దినోత్సవం నేపథ్యంలో ఓ పోలీసు ఫంక్షన్‌లో పాడేందుకు రిహార్సల్స్‌కు వెళ్లాను. అక్కడ నాకు ఎలక్ట్రిక్, ఎలక్ట్రిక్ రణ్‌వీర్ తారసపడ్డాడు' అని క్యాప్షన్ ఇచ్చారు. ఇందుకు రణవీర్ స్పందిస్తూ.. 'మీరు నన్ను పొగడటానికి వాడిన పదాలు నాకు నచ్చాయి. మిమ్మల్ని చూసినందుకు గొప్పగా ఫీలవుతున్నాను బచ్చన్ సాబ్' అని పేర్కొన్నారు. బిగ్‌బి ఫొటోను పోస్ట్ చేసిన కొద్దిసేపటికే సామాజిక మాధ్యమాల్లో విపరీతంగా వైరల్ అయింది. ఇప్పటివరకు ఈ ఫొటోను మూడు లక్షలకు మందికి పైగా లైక్ చేశారు. 'ఇద్దరు గొప్ప వ్యక్తులు ఒకే స్టేజ్‌పై..' అంటూ కామెంట్లు పెడుతున్నారు.



'యాత్ర' ప్రీ రిలీజ్ ఈవెంట్ డేట్ ఫిక్స్!



దివంగత నేత వైఎస్ రాజశేఖర్ రెడ్డి చేపట్టిన పాదయాత్ర ఘట్టాన్ని సినిమాగా రూపొందిస్తున్న సంగతి తెలిసిందే. యాత్రగా ప్రేక్షకుల ముందుకు రాబోతోన్న ఈ మూవీలో మలయాళ మెగాస్టార్ మమ్ముట్టి వైఎస్ రాజశేఖర్ రెడ్డి పాత్రలో నటిస్తున్నారు. ఇప్పటికే రిలీజ్ చేసిన పోస్టర్స్, టీజర్, సాంగ్స్‌తో మంచి అంచనాలు ఏర్పడ్డాయి. తాజాగా ఈ సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌ను ఏర్పాటు చేయబోతున్నట్లు మేకర్స్ ప్రకటించారు. ఫిబ్రవరి ఒకటో తేదీన హైద్రాబాద్‌లోని ఎన్ కన్వెన్షన్‌లో ఈ ఈవెంట్ జరుగనున్నట్లు నిర్మాతలు తెలిపారు. శివ మేక సమర్పణలో విజయ్ చిల్లా, శశి దేవిరెడ్డి నిర్మించిన ఈ సినిమాకు 'ఆనందో బ్రహ్మ' ఫేమ్ మహి వి. రాఘవ్ దర్శకత్వం వహించారు. ఈ చిత్రం ఫిబ్రవరి 8న తెలుగు, తమిళ, మలయాళ భాషల్లో విడుదలకానుంది.



'హెల్ బాయ్', 'ప్రిడేటర్' సృష్టికర్త మృతి

హెల్ బాయ్, ద నట్టీ ప్రొఫెసర్, ప్రిడేటర్ లాంటి ఎన్నో అద్భుతమైన పాత్రలను వెండితెర మీద ఆవిష్కరించిన గ్రేట్ మేకప్ ఆర్టిస్ట్, క్రీచర్ క్రియేటర్ మాట్ రోజ్ మ ృతి చెందారు. ఎన్నో వింత పాత్రలకు రూపమిచ్చిన మాట్ మృతి పట్ల హాలీవుడ్ ప్రముఖులు సంతాపం వ్యక్తం చేస్తున్నారు. ఆయనతో కలిసి పనిచేసిన అనుభవాలను సోషల్ మీడియా ద్వారా పంచుకుంటున్నారు. 'మేకప్ ఆర్టిస్ట్‌ల స్వర్ణయుగంలో ఆయన ఓ అద్భుతం. అందరితో స్నేహంగా ప్రేమగా ఉండే వ్యక్తి' అంటూ ఆయన సన్నిహితులు గుర్తు చేసుకున్నారు.

సీవీసీపై చర్యకు మార్గదర్శకాల్లేవు

ఆర్టీఐ ప్రశ్నకు సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ సమాధానం

న్యూఢిల్లీ : చీఫ్ విజిలెన్స్ కమిషనర్ (సీవీసీ) అవినీతిపై వచ్చిన ఫిర్యాదులను పరిష్కరించేందుకు ఎటువంటి మార్గదర్శకాలు లేవని, అందువల్ల ప్రభుత్వం ఎటువంటి చర్య తీసుకోలేకపోతోందని సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. సీవీసీ కేవీ చౌదరికి వ్యతిరేకంగా దాదాపు సంవత్సరం క్రితం ప్రభుత్వానికి రెండు ఫిర్యాదులు అందాయని, అయితే, మార్గదర్శకాలు లేకపోవడంతో ఈ విషయంలో ప్రభుత్వం ఏమీ చేయలేకపోతోందని మంత్రిత్వ శాఖ తెలిపింది. ఈ విధమైన మార్గదర్శకాలను రూపొందించే క్రమాన్ని ప్రభుత్వం ప్రారంభించాలని ఆ మంత్రిత్వ శాఖ పేర్కొంది. సీవీసీ నివేదికతో పాటు ఇతర వాస్తవాలను పరిశీలించిన తరువాత సీబీఐ డైరెక్టర్ అలోక్ వర్మను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని బృందం జనవరి 10న పదవి నుంచి తొలగించిన తరువాత ఈ సూచనకు ప్రాధాన్యత కలిగింది.



"చీఫ్ విజిలెన్స్ కమిషనర్/విజిలెన్స్ కమిషనర్ల అవినీతి లేదా ఇతర దుష్ప్రవర్తన ఫిర్యాదుల పరిష్కారానికి ఎటువంటి మార్గదర్శకాలు లేవు" అని ప్రజావేగు ఇండియన్ ఫారెస్టు సర్వీస్ (ఐఎఫ్ఎస్) అధికారి సంజీవ్ చతుర్వేది సమాచార హక్కు చట్టం (ఆర్టీఐ) క్రింద అడిగిన ప్రశ్నకు సమాధానంగా సిబ్బంది వ్యవహారాల మంత్రిత్వ శాఖ తెలిపింది. చీఫ్ విజిలెన్స్ కమిషనర్/విజిలెన్స్ కమిషనర్‌కు వ్యతిరేకంగా వచ్చిన ఆరోపణలు/ఫిర్యాదులు పరిష్కరించేందుకు మార్గదర్శకాలను రూపొందించే క్రమాన్ని సిబ్బంది వ్యవహారాలు, శిక్షణ విభాగం చేపట్టిందని పేర్కొన్నది. ఇక్కడి అఖిల భారత వైద్య, విజ్ఞాన సంస్థ (ఎయిమ్స్)పై అవినీతి ఆరోపణల కేసు దర్యాప్తు మూసివేయాలని సిఫార్సు చేసినందుకు చౌదరికి వ్యతిరేకంగా చర్య తీసుకోవాలని 2017లో చతుర్వేది రాష్ట్రపతిని లిఖితపూర్వకంగా కోరారు. సీవీసీకి వ్యతిరేకంగా తమ వద్ద రెండు ఫిర్యాదులు ఉన్నాయనీ, మార్గదర్శకాలు రూపొందించిన తరువాత వాటిపై చర్య తీసుకుంటామని మంత్రిత్వ శాఖ తెలిపింది. సీవీసీ చట్టం 2003లో అమలులోకి వచ్చింది.

అందరికీ వైద్యమే లక్ష్యం

- ఆరోగ్యానికి ఎయిమ్స్ ఓ బ్రాండ్
- అవినీతి, బంధుప్రీతిపై పోరు
- ఆర్థిక నేరగాళ్లను వదలం
- ప్రధాని నరేంద్రమోడీ ఉద్ఘాటన
- మదురైలో ఎయిమ్స్‌కు ప్రధాని శంకుస్థాన



మదురై : సార్వజనీన ఆరోగ్య సంరక్షణకు సంబంధించి పటిష్ట చర్యలకు ఎన్డీఏ ప్రభుత్వం కట్టుబడి ఉందని ప్రధాని నరేంద్రమోడీ చెప్పారు. అందులో భాగంగానే దేశంలోని అనేక ప్రాంతాలకు ఎయిమ్స్‌ను ఓ బ్రాండ్‌గా తీసుకెళుతున్నామని తెలిపారు. మదురైకి సమీపంలోని తొప్పూరులో రూ.1264 కోట్ల అంచనా వ్యయంతో నిర్మించే ఎయిమ్స్‌కు ఆదివారం శంకుస్థాపన చేసిన అనంతరం మోడీ ప్రసంగించారు. ఆరోగ్యరంగంపై కేంద్ర ప్రభుత్వం అధికశ్రద్ధ వహిస్తున్నదని మోడీ అన్నారు. 'ఏక్ భారత్..శ్రేష్ఠ భారత్' దృక్పథానికి ఎయిమ్స్ ప్రతిబింబమని వ్యాఖ్యానించారు. ఆరోగ్య పరిరక్షణకు సంబంధించి న్యూఢిల్లీలోని ఎయిమ్స్‌కు ఓ బ్రాండ్ ఉందని, ఇప్పుడు మదురైలోనూ అలాంటి ఎయిమ్స్‌ను నిర్మిస్తున్నామని ప్రధాని చెప్పారు. ఎయిమ్స్‌ను కన్యాకుమారి నుంచి కాశ్మీరు, మదురై వరకూ, గువహతి నుంచి గుజరాత్ వరకూ విస్తరింప చేస్తామన్నారు. మదురైలో ఏర్పాటు చేస్తున్న ఎయిమ్స్ తమిళనాడు మొత్తానికి లబ్ధి చేకూరుస్తుందన్నారు. అందరికీ ఆరోగ్యం కల్పించాలన్న లక్ష్యంతో ఎన్డీఏ ప్రభుత్వం పనిచేస్తున్నదన్నారు. అదేసమయంలో అందరికీ అందుబాటు ధరలో వైద్యం అందాల్సిన ఆవశ్యకతను ఉద్ఘాటించారు. ప్రధానమంత్రి స్వస్థ్య సురక్ష యోజన కింద దేశవ్యాప్తంగా అన్ని ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రభుత్వం అభివృద్ధి చేస్తోందని చెప్పారు. తమిళనాడు ప్రభుత్వ మెడికల్ కాలేజీలలో కొత్త సూపర్ స్పెషాలిటీ బ్లాక్‌లు ప్రారంభించడం తనకు సంతోషంగా ఉందన్నారు. తమిళనాడులో 12 పాస్‌పోర్టు ఆఫీసు సేవా కేంద్రాలను ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు. మన ప్రజలకు జీవనాన్ని సులభతరం చేయడం దీనికో ఉదాహరణ అని వ్యాఖ్యానించారు. ప్రతిపాదిత 750 పడకల ఎయిమ్స్ నిర్మాణం పూర్తయితే ఇందులో 100 మందికి ఎంబీబీఎస్ సీట్లు ఇవ్వవచ్చని చెప్పారు. అవినీతి, బంధుప్రీతికి వ్యతిరేకంగా పోరాటం చేస్తానని మోడీ ప్రతినబూనారు. దేశ ఆర్థిక నేరగాళ్లను కఠినంగా శిక్షిస్తామని ప్రకటించారు. అవినీతికి నిలయమైన ప్రతిపక్షాల మహాకూటమికి వ్యతిరేకంగా పోరు సాగిస్తానని చెప్పారు. దేశాన్ని మోసగించే...దోపిడీ చేసే వారిని కచ్చితంగా శిక్షిస్తామన్నారు. ఆర్థిక నేరగాళ్లు భారత్‌లో ఉన్నా...విదేశాల్లో తలదాచుకున్నా వదిలేది లేదని చెప్పుకొచ్చారు. పెద్దఎత్తున బ్యాంక్ రుణాలు తీసుకొని..వాటిని సకాలంలో చెల్లించకుండా తప్పించుకు తిరుగుతున్న ఆర్థిక నేరగాళ్లు-విజయ్‌మాల్యా, నీరవ్ మోడీ, మెహుల్ చోక్సీలను వదిలేది లేదన్నారు. వారంతా ఇప్పుడు విదేశాల్లో తలదాచుకుంటున్నారన్నారు. అవినీతి, బంధుప్రీతి నుంచి దేశానికి విముక్తి కలిగించేందుకు కేంద్ర ప్రభుత్వం సమర్థవంత చర్యలు తీసుకుంటుందన్నారు. తమిళనాడుకు ఎయిమ్స్ సదుపాయం కల్పించినందుకు మోడీకి ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి పళనిస్వామి కృతజ్ఞతలు తెలిపారు. వెనుకబడిన రామనాథపురం జిల్లాలో వైద్య కళాశాలను ఏర్పాటు చేయాల్సిందిగా ప్రధానికి విజ్ఞప్తి చేశారు.

అంతకుముందు ఇక్కడ దిగిన మోడీకి వ్యతిరేకంగా ఎండీఎంకే చీఫ్ వైగో నాయకత్వంలో ఆ పార్టీ కార్యకర్తలు నల్లజెండాలతో నిరసన తెలిపారు. తమిళనాడు ప్రయోజనాలను మోడీ దెబ్బతీశారని నిందించారు. దీంతో ఆందోళనకారులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. గో బ్యాక్ మోడీ అంటూ ఎండీఎంకే కార్యకర్తలు నినాదాలు చేశారు. నల్లబెలూన్లు ప్రదర్శించారు. కావేరీ, ఇతర సమస్యలపై తమిళనాడు ప్రయోజనాలకు ప్రధాని విఘాతం కలిగించారని ఆరోపించారు. దీనికి బదులుగా వైగోకు స్వాగతం తెలుపుతూ బీజేపీ యువమోర్చా కార్యకర్తలు పోస్టర్లు ప్రదర్శించారు. తమ నిరసన ఎయిమ్స్‌కు వ్యతిరేకంగా కాదని ఎండీఎంకే కార్యకర్తలు స్పష్టంచేశారు. ఎండీఎంకే నిరసనను బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు తమిళిసాయి సౌందరరాజన్, కేంద్రమంత్రి పొన్ రాధాకృష్ణన్ తీవ్రంగా ఖండించారు.

పౌరసత్వ బిల్లు రాజకీయ లబ్ధి కోసమే : రాహుల్

న్యూఢిల్లీ : ఈశాన్య రాష్ట్రాల్లో రాజకీయ లబ్ధి కోసమే బీజేపీ ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతోందని కాంగ్రెస్ అధ్యక్షుడు రాహుల్ గాంధీ ఆరోపించారు. పౌరసత్వ సవరణ బిల్లుపై ట్విట్టర్ వేదికగా రాహుల్, అసోంకు చెందిన బీజేపీ సీనియర్ నేత హిమాంత విశ్వశర్మ మధ్య మాటల యుద్ధం కొనసాగింది. పాకిస్థాన్, బంగ్లాదేశ్, అఫ్ఘానిస్థాన్ నుంచి వచ్చిన ముస్లిమేతరులకు భారత పౌరసత్వం కల్పించేందుకు నిర్దేశించిన బిల్లుపై ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతున్న తరుణంలో వీరి వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. 'ఈశాన్య రాష్ట్రాల్లో నెలకొన్న హింసాత్మక వాతావరణం నన్ను తీవ్రంగా కలచివేస్తోంది. మతం, సంప్రదాయం అనే అంశాలను ఆయుధాలుగా చేసుకుని ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొడుతున్నారు. ఇలాంటి ద్వేషపూరిత చర్యలకు స్వస్తి పలకాలి' అని రాహుల్ అన్నారు. రాహుల్ వ్యాఖ్యలపై స్పందించిన హిమాంత విశ్వ శర్మ ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధికి కాంగ్రెస్ దశాబ్దాలుగా అడ్డుపడుతోందని ఆరోపించారు. కొంత మంది నకిలీ నిరసనకారులు అక్కడ అశాంతి సృష్టించేందుకు ప్రయత్నిస్తున్నారన్నారు. ఆందోళనకారులకు ప్రజల మద్దతు లేదని అభిప్రాయపడ్డారు. ఈశాన్య భారతంలో ఎలాంటి ఆందోళనకర పరిస్థితులు లేవని, శాంతి నెలకొల్పడానికి కట్టుబడి ఉన్నామని ట్విట్టర్ వేదికగా శర్మ తెలిపారు. పౌరసత్వ సవరణ బిల్లుకు శీతాకాల సమావేశాల సందర్భంగా లోక్‌సభలో ఆమోదం లభించగా, రాజ్యసభలో మాత్రం ఇంకా ఆమోదం లభించలేదు. రానున్న బడ్జెట్ సమావేశాల్లో ఈ బిల్లు చర్చకు రానుందని సమాచారం. దీనిపై ఇప్పటికే ఈశాన్య రాష్ట్రాల్లో తీవ్ర నిరసన వ్యక్తమవుతోంది. ఈ బిల్లుకు నిరసనగా అసోం ప్రభుత్వంలో భాగస్వామిగా ఉన్న అస్సాం గణ పరిషత్ ఎన్‌డీఏకు మద్దతు ఉపసంహరించుకుంది. ఆ రాష్ట్రంలో సొంత పార్టీ ఎమ్మెల్యేలే దీనిపై బహిరంగంగా నిరసన వ్యక్తం చేయడంతో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి రామ్ మాధవ్ వెంటనే దిద్దుబాటు చర్యలకు పూనుకున్నారు.

బోరుబావిలో చిన్నారి సురక్షితం

భోపాల్ : మధ్యప్రదేశ్‌లోని సింగ్రౌలి జిల్లా కెర్వార్‌లో 70 అడుగుల లోతైన బోరుబావిలో పడిపోయిన రెండేళ్ల బాలుడు తేజ్‌ప్రతాప్ సింగ్‌ను సహాయక బృందాలు సురక్షితంగా బయటకు తీశాయి. ఆదివారం ఉదయం బాలుడు బోరు బావిలో పడగా, జిల్లా కలెక్టర్ అనురాగ్ చౌదరి వెంటనే స్పందించారు. సహాయ బృందాలను రంగంలోకి దించి సహాయ చర్యలు చేపట్టారు. ఎట్టకేలకు బాలుడిని సురక్షితంగా బయటకు తీసినట్లు అనురాగ్ చౌదరి మీడియాకు తెలిపారు. గ్రామంలో బోరుబావి ఉన్న ప్రాంతంలో తేజ్‌ప్రతాప్ ఆడుకుంటూ ఒక్కసారిగా అందులో పడిపోయాడు. ఈ ఘటనపై సమాచారం అందుకున్న జిల్లా అధికారులు, సహాయక సిబ్బంది ఆ ప్రాంతానికి చేరుకుని, బోరుబావి పక్కన దానికి సమాంతరంగా మరో రంధ్రాన్ని తవ్వి ఆ చిన్నారిని సురక్షితంగా బయటకు తీశారు. తేజ్ శరీరంపై చిన్నపాటి గాయం కూడా కాలేదు. 'బాలుడు క్షేమంగా ఉన్నాడు. అతడి ఒంటిపై చిన్నపాటి గాయం కూడా కనపడలేదు. అయినప్పటికీ, కొన్ని గంటలు వైద్యుల పర్యవేక్షణలో ఉంచుతాం. తర్వాత అతడి తల్లిదండ్రులకు అప్పగిస్తాం. ఆ బాలుడు బోరుబావిలో పడ్డాడని సమాచారం అందిన 45 నిమిషాల్లోపు సహాయక సిబ్బంది ఇక్కడకు చేరుకున్నారు. బోరుబావి పక్కన మరో రంధ్రం తవ్వారు. ఆ బాలుడిని మాట్లాడిస్తూ సహాయక చర్యలు కొనసాగించారు. ఆ బోరుబావి పక్కన తవ్విన రంధ్రంలోకి 10 మీటర్ల లోతులోకి దిగిన సహాయక సిబ్బందిలోని ఒకరు ఆ బాలుడిని బయటకు తీసుకొచ్చారు. ఆ బోరుబావిని అనుమతులు లేకుండా తవ్వారు. దాని యజమానిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాం' అని అనురాగ్ చౌదరి వివరించారు.

కోట్లాది కేసుల పెండింగ్

- హైకోర్టుల్లో 47.68 లక్షల కేసులు
- సబార్డినేట్ కోర్టుల్లో 2.91కోట్ల కేసులు పెండింగ్
- న్యాయమూర్తుల కొరతే ప్రధాన కారణం
- న్యాయశాఖ గణాంకాల వెల్లడి



న్యూఢిల్లీ : కోర్టులలో పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్‌లో ఉండిపోతున్నాయి. ఒక్కొక్క హైకోర్టు న్యాయమూర్తి దాదాపు 4,500 పెండింగ్ కేసుల భారాన్ని మోయాల్సి ఉన్నదని న్యాయమంత్రిత్వ శాఖ గణాంకాలు తెలిపాయి. అదేసమయంలో సబార్డినేట్ కోర్టుల న్యాయమూర్తి దాదాపు 1,300 పెండింగ్ కేసులను పరిష్కరించాల్సి ఉన్నదని ఆ గణాంకాలు పేర్కొన్నాయి. హైకోర్టులు, దిగువ కోర్టులలో పెండింగ్ కేసుల సంఖ్య భారీగా పెరిగిపోతుండడంతో న్యాయ మంత్రిత్వ శాఖ మంజూరైన న్యాయమూర్తుల సంఖ్య ప్రాతిపదికన సగటు పెండింగ్ కేసులను లెక్కించడాన్ని ప్రారంభించింది. నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ (ఎన్‌జేడీజి) ప్రకారం 2018 సంవత్సరాంతానికి జిల్లా, సబార్డినేట్ కోర్టులలో 2.91 కోట్ల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. దేశంలోని 24 హైకోర్టులలో 47.68 లక్షల కేసులు పెండింగ్‌లో ఉన్నాయి. జనవరి 1వ తేదీ నుంచి తెలంగాణకు సొంత హైకోర్టు పనిచేస్తోంది. దీనితో దేశంలో హైకోర్టుల సంఖ్య 25కి చేరింది. హైకోర్టులలో ఒక్కొక్క న్యాయమూర్తికి 1,288, దిగువ కోర్టులలో 1,288 కేసులు ఒక్కొక్క న్యాయమూర్తికి పెండింగ్‌లో ఉన్నాయని ఆ డేటా తెలిపింది. సబార్డినేట్ కోర్టులలో వాస్తవానికి 22,644 జ్యుడీషియల్ అధికారుల పోస్టులు మంజూరు చేయగా 17,509 పోస్టులు భర్తీఅయ్యాయి. 5,135కు పైగా జ్యుడీషియల్ అధికారుల పోస్టులు ఖాళీగా ఉన్నాయని ఆ గణాంకాలు తెలిపాయి. అదేవిధంగా హైకోర్టులలో 1,079 న్యాయమూర్తుల పోస్టులు మంజూరుకాగా కేవలం 695 మంది మాత్రమే పనిచేస్తున్నారు. 384 మంది న్యాయమూర్తుల కొరత ఉన్నది. పార్లమెంటరీ వినియోగం కోసం ఈ డేటాను సేకరించారు. దిగువ కోర్టులలో న్యాయమూర్తుల ఖాళీలను భర్తీ చేయమని చాలా కాలంగా న్యాయశాఖ మంత్రులు రాష్ట్రాల హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులకు రాస్తూనే ఉన్నారు. ప్రస్తుత న్యాయశాఖ మంత్రి రవిశంకర్ ప్రసాద్ కూడా ఈ విషయంపై దృష్టిపెట్టారు. దిగువ కోర్టుల జ్యుడీషియల్ అధికారుల పోస్టులను భర్తీచేసే క్రమాన్ని వేగిరపరచమని రాష్ట్రాల హైకోర్టు న్యాయమూర్తులకు ఇటీవల కూడా ఆయన లేఖ రాశారు. ఖాళీలు ఎక్కువగా ఉండడం కూడా న్యాయమూర్తుల పోస్టులు భర్తీలో జాప్యంకావడానికి ఒక కారణంగా భావిస్తున్నారు. దిగువ కోర్టుల కోసం న్యాయమూర్తులను నియమించేందుకు ఎప్పటికప్పుడు పరీక్ష, ఇంటర్వ్యూ నిర్వహించాలని ప్రధాన న్యాయమూర్తికి మంత్రి విజ్ఞప్తి చేశారు.

రైతులకు మేలు చేయని ఫసల్‌బీమా

కేజ్రీవాల్ విమర్శ



జింద్ : ఆమ్ ఆద్మీ పార్టీ జాతీయ కన్వీనర్, ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ప్రధానమంత్రి నరేంద్ర మోడీపై తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. కేంద్ర ప్రభుత్వం చేపట్టిన పంట బీమా పథకం రైతాంగానికి లబ్ధి చేకూర్చడంలో విఫలమైందని పేర్కొన్నారు. సమాజాన్ని కులం ప్రాతిపదికన ఎన్డీయే విభజిస్తోందని విమర్శించారు. ప్రకృతి వైపరీత్యాల కారణంగా రైతు పంటనష్టపోతే లబ్ధి చేకూర్చే లక్ష్యంతో ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన (పీఎంఎఫ్‌బీవై)ని కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. హర్యానాలోని జింద్ అసెంబ్లీ నియోజకవర్గ ఉప ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఇక్కడ ర్యాలీలో కేజ్రీవాల్ ప్రసంగించారు. ఐఎన్ఎల్‌డీ ఎమ్మెల్యే హరి చంద్ మిద్దా మృతి కారణంగా ఇక్కడ ఉప ఎన్నిక జరుగుతోంది. ఈ నెల 28వ తేదీన ఇక్కడ పోలింగ్ నిర్వహిస్తారు. ఎన్నికల ర్యాలీలో కేజ్రీవాల్ ప్రసంగిస్తూ, "2014 లోక్‌సభ ఎన్నికల సందర్భంగా పంట బీమా పథకంపై మోడీ హామీ ఇచ్చారు.. ఇప్పుడు , రైతుల పంట నష్టపోతే, బీమా కంపెనీలు పరిహారం చెల్లించేందుకు నిరాకరిస్తున్నాయి. 70 శాతం పంట నష్టపోతేనే పరిహారం చెల్లిస్తామని బీమా కంపెనీలు చెపుతున్నాయి" అని విమర్శించారు. పంటల బీమా పథకం ద్వారా రైతులకు లబ్ధి చేకూరుస్తామన్న మోడీ హామీ ఫలితాలు ఇవ్వడంలో విఫలమైందన్నారు. 2014 సార్వత్రిక ఎన్నికల సందర్భంగా హామీ ఇచ్చిన విధంగా స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను ప్రధానమంత్రి ఇంకా అమలు చేయలేదని విమర్శించారు. "మోడీ, హర్యానా ముఖ్యమంత్రి మనోహర్ లాల్ ఖట్టర్ బీజేపీకి ఓటు వేయమని కోరుతూ మళ్లీ మీ దగ్గరకు వస్తే, బీమా సంస్థల నుంచి ఇవి ఇప్పించమని మీరు అడగండి అని ఓటర్లకు నేను విజ్ఞప్తి చేస్తున్నాను" అని కేజ్రీవాల్ చెప్పారు. "హర్యానాలో పంట నష్టపోయిన రైతులు పరిహారం కోసం ఖట్టార్ వద్దకు వెళితే, బీమా కంపెనీల వద్దకు వెళ్లమని రైతులకు చెపుతున్నారు" అని అన్నారు.

సమాజాన్ని కులాల ప్రాతిపదికన విభజించేందుకు బీజేపీ ప్రయత్నిస్తోందని కూడా కేజ్రీవాల్ విమర్శించారు. "కేంద్రంలోని, హర్యానాలోని బీజేపీ ప్రభుత్వాలు కులం ప్రాతిపదికన సమాజాన్ని విభజించేందుకు ప్రయత్నిస్తున్నాయి. ఇంత విశృంఖల కులతత్వాన్ని నేను ఎన్నడూ చూడలేదు" అని చెప్పారు.

వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా ట్రైన్ 18

పీయూష్ గోయల్



న్యూఢిల్లీ : దేశ రాజధాని ఢిల్లీ నుంచి వారణాసి వరకు గంటకు 160 కిలో మీటర్ల వేగంతో నడపనున్న ట్రైన్ 18 ఎక్స్‌ప్రెస్ పేరును రైల్వేశాఖ 'వందే భారత్'గా మార్చింది. దేశీయంగా తయారు చేసిన ఈ రైలుకు వందే భారత్ అని నామకరణం చేయటం వల్ల మేడ్ ఇన్ ఇండియా స్టేటస్ కనిపిస్తుందని రైల్వేశాఖ మంత్రి పీయూష్ గోయల్ ఆదివారం న్యూఢిల్లీలో వెల్లడించారు. త్వరలోనే ఈ రైలును ప్రధాని మోడీ ప్రారంభించనున్నట్లు తెలిపారు. 16 కోచ్‌లున్న ఈ రైలును ఏడాదిన్నరలో రూ.97 కోట్లతో రాయ్‌బరేలీలోని కోచ్ ఫ్యాక్టరీలో తయారు చేసినట్లు చెప్పారు. 30 ఏళ్ల క్రితం శతాబ్ది ఎక్స్‌ప్రెస్‌ను తయారు చేయగా, ఇప్పుడు వందే భారత్‌ను తయారు చేసినట్లు పేర్కొన్నారు. న్యూఢిల్లీ వారణాసి మధ్య తిరిగే పూర్తి ఏసీ రైలు కాన్పూర్, అలహాబాద్‌లో ఆగనున్నట్లు తెలిపారు. పూర్తిగా దేశంలో తయారైన ఈ రైలుకు ప్రజలు అనేక ప్రతిపానలు పంపించారన్నారు. చివరకు వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌గా నామకరణం చేశామన్నారు.

బూడిద నియంత్రణకు కసరత్తు

న్యూఢిల్లీ : థర్మల్ విద్యుత్ తయారీలో బూడిదను నియంత్రించేందుకు విధివిధానాలను రూపొందిస్తున్నామని పర్యావరణ మంత్రిత్వశాఖ వెల్లడించింది. బొగ్గునుంచి వెలువడే కార్బన్ డై ఆక్సైడ్, సల్ఫర్ డై ఆక్సైడ్, బూడిదను తగ్గించేంకు సూచనలు ఇవ్వాలని మంత్రిత్వశాఖ అధికారులు, ప్రైవేటు రాష్ట్రప్రభుత్వాల ఆధీనంలోని థర్మల్ కేంద్రాలు, పర్యావరణ సంస్థలను కోరారు. పవర్ ప్లాంట్ల వద్ద బూడిదకుప్పలు, గాలిలో కార్బన్‌డైఆక్సైడ్ వ్యాప్తిని నిరోధించేందుకు నాణ్యత గలిగిన బొగ్గును ఉపయోగించే విధంగా థర్మల్ విద్యుత్ పరిశ్రమలకు మార్గదర్శనం చేయాలని పర్యావరణ శాఖ భావిస్తోంది. అత్యధిక ఉష్ణోగ్రత వద్ద బొగ్గును మండించడం ద్వారా విషవాయువులు వెలువడటంతో వాతావరణ కాలుష్యం తీవ్రతరం అవుతుందన్నారు. బొగ్గును ముందే క్లీన్ చేసి వాడటం వల్ల ఉద్గారాలను తగ్గించవచ్చని అధికారులు వెల్లడించారు. దేశంలో 80 శాతం బొగ్గును కోల్ ఇండియా లిమిటెడ్ అందిస్తుంది. రాష్ట్ర అధీనంలోని ఎన్‌టీపీసీ, మిగతా థర్మల్ విద్యుత్ ప్లాంట్లు నాణ్యమైన బొగ్గును అందించాలని ఏళ్లతరబడి కోరుతున్నాయి. 2018 అక్టోబరులో బొగ్గును కడగటం ద్వారా కాలుష్యాన్ని నియంత్రించ వచ్చని సమావేశంలో వెల్లడించారు. మధ్యప్రదేశ్ సింగ్రౌలిలోని 100 శాతం బూడిదను ఉపయోగించడం ద్వారా వాతావరణ కాలుష్యాన్ని నివారించగలిగారన్నారు. బొగ్గును జల్లించడం ద్వారా పనికిరాని బొగ్గు ముక్కలను మళ్లీ ఒక గోతిలో వేసేందుకు స్థలం ఉంచుకోవాలని పరిశ్రమలను కోరుతున్నారు.

బతికున్నా... బీమా క్లెయిమ్...!

- థానేలో ముఠా అరెస్టు
- రూ.81 లక్షలు కైంకర్యం
- మరో రూ.55 లక్షలకు దరఖాస్తు
- 13 నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు
- అందులో పది ఆంధ్రప్రదేశ్‌లో బతికున్న వారివే

థానే (మహారాష్ట్ర) : బతికున్న వారి పేరుతో నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు, క్రిమిటోరియం సర్టిఫికెట్‌లు సమర్పించి లక్షలాది రూపాయల బీమా క్లెయిమ్‌లను కాజేసే ముఠాను మహారాష్ట్రలోని థానే పోలీసుల ఆదివారం అరెస్టు చేశారు. బతికున్న వారు మృతి చెందినట్లుగా, మృతదేహాలను క్రిమిటోరియంలో దహనం చేసినట్లు డాక్టర్లు, కార్పొరేషన్ నుంచి నకిలీ ధృవీకరణ పత్రాలను బీమా కంపెనీలకు సమర్పించి ఇప్పటికే రూ.81 లక్షలను ఆ ముఠా కైంకర్యం చేసింది. మరో రూ.55 లక్షలు రాబట్టేందుకు బీమా కంపెనీలకు దరఖాస్తు కూడా చేసింది. ఈ నేపథ్యంలో ముఠా వ్యవహారాన్ని పోలీసులు బట్టబయలు చేసింది. ఈ ముఠాలో థానేలోని కల్యాణ్ ప్రాంతానికి చంద్రకాంత్ నరసింహులు షిండే ప్రధాన సూత్రధారిగా థానే క్రైం బ్రాంచ్ పోలీసులు తేల్చారు. పోలీసులు అరెస్టు చేసిన ముఠాలో ఇద్దరు డాక్టర్లు అబ్దుల్ మోహిద్ సిద్దిఖీ, ఇమ్రాన్ సిద్దిఖీ, ఒక క్రిమిటోరియం సిబ్బంది తేజ్‌పాల్ రామ్‌వీర్ మెహ్రూల్, నకిలీ సర్టిఫికెట్‌లతో క్లెయిమ్ పొందిన భార్యాభర్తలు లక్ష్మీ షిండే, నారాయణ్ షిండే ఉన్నారు. థానే క్రైం బ్రాంచ్ సీనియర్ ఇన్‌స్పెక్టర్ సంజూ జాన్ కథనం ప్రకారం ముంబ్రా ప్రాంతానికి చెందిన ఇద్దరు డాక్టర్లు ఈ ముఠాకు నకిలీ డెత్ సర్టిఫికెట్‌లను సరఫరా చేస్తున్నట్లు గుర్తించామన్నారు. ఇందుకోసం వారిద్దరూ ఒక్కో సర్టిఫికెట్‌కు రూ.2 వేలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇప్పటి వరకు మొత్తం 13 నకిలీ మరణ ధృవీకరణ పత్రాలు ఇవ్వగా, అందులో పద ఆంధ్రప్రదేశ్‌లో బతికున్న వారివేనని తెలిపారు. అయితే వారి పేర్లను మాత్రం వెల్లడించలేదు. ప్రధాన నిందితుడు చంద్రకాంత్ తన బంధువులకు ప్రైవేటు కంపెనీలలో బీమా చేయించేవాడని తెలిపారు. అనంతరం వారు మరణించినట్లుగా డాక్టర్ల నుంచి నకిలీ డెత్ సర్టిఫికెట్లు, శవాలను క్రిమిటోరియంలో దహనం చేసినట్లు ముంబ్రా క్రిమిటోరియం నుంచి సర్టిఫికెట్ పొంది, వాటిని బీమా కంపెనీలకు సమర్పించేవాడని తెలిపారు. చంద్రకాంత్ తన బంధువులు లక్ష్మీ షిండేకి కూడా బీమా పరిహారం ఇప్పించాడని, ఇందుకు ఆమె భర్త మృతి చెందినట్లు నకిలీ ధృవీకరణ పత్రాలను సమర్పించినట్లు పేర్కొన్నారు. దీంతో వారిద్దరిని అరెస్టు చేశామన్నారు. ఇప్పటి వరకు రూ.81 లక్షల బీమా క్లెయిమ్‌లను పొందగా, మరో రూ.55 లక్షలకు సంబంధించిన క్లెయిమ్‌లు కూడా నకిలీ మరణ ధృవీకరణ పత్రాలను సమర్పించారన్నారు. ఆరుగురిపై విట్టల్‌వాడీ పోలీస్ స్టేషన్‌లో చీటింగ్, ఫోర్జరీ కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఆయన వివరించారు.

ప్రాజెక్టుల సందర్శనకు పాక్ బృందం

లాహోర్ : పాకిస్థాన్ ఇండస్ వాటర్స్ కమిషనర్ సయ్యద్ మెహర్ ఆలీషా నేతృత్వంలోని ముగ్గురు సభ్యుల ఉన్నతస్థాయి బృందం దేశంలోని పలు ప్రాజెక్టుల సందర్శనకు ఆదివారం భారత్ చేరుకుంది. ఈ బృందం ఈ నెల 28 నుంచి 31 వరకు భారత్, పాక్ సరిహద్దు ప్రాంతాల్లోని పలు ప్రాజెక్టులను సందర్శించనుంది. ప్రధానంగా ఈ బృందం జమ్మూ కాశ్మీర్‌లోని పాకల్ దుల్ డ్యామ్, లోవర్ కల్నై హైడల్ పవర్ ప్రాజెక్టులను సందర్శించనుంది. ఇండస్ వాటర్స్‌పై గతేడాది లాహోర్‌లో ఇరు దేశాల మధ్య ద్వైపాక్షిక చర్చలు జరిగాయి. చేనాబ్ నదిపై నిర్మిస్తున్న వెయ్యి మెగా వాట్‌ల విద్యుత్‌ను ఉత్పత్తి చేసే పాకల్ దుల్ డ్యామ్, 48 మెగా వాట్‌ల లోవన్ కల్నై హైడల్ పవర్ ప్రాజెక్టులపై ఆ చర్చలలో పాక్ వ్యక్తం చేసిన అభ్యంతరాలను తిరస్కరించిన విషయం విధితమే. ఈ రెండు డ్యామ్‌లపై పాకిస్థాన్ ఆందోళన చెందుతుంగా, స్వయంగా పరిశీలించేందుకు ఉన్నతస్థాయి బృందాన్ని పంపించాలని భారత్ సూచించింది. అందులో భాగంగానే కమిషనర్ ఆలీషా నేతృత్వంలోని బృందం భారత్ చేరుకుంది.



రాహుల్ సమర్థుడే

- ప్రధానికాగల అర్హతలన్నీ ఉన్నాయి
- ఆయన ప్రతిష్టను దిగజార్చడానికి బీజేపీ వేలకోట్ల ఖర్చు
- అయినా ఎన్నికల తర్వాతే ప్రధానిని నిర్ణయిస్తాం
- బీజేపీ, సంఘ్ ఓటమికి శక్తివంచన లేకుండా కృషి
- పీటీఐ ఇంటర్వ్యూలో తేజస్వి యాదవ్ స్పష్టీకరణ

న్యూఢిల్లీ : ఓ మంచి ప్రధాని కావడానికి గల అన్ని అర్హతలు కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీకి ఉన్నాయని ఆర్జేడీ నాయకుడు తేజస్వి యాదవ్ చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రతిష్టను దెబ్బతీయడానికి బీజేపీ ప్రచార యంత్రాంగం వందల వేల కోట్ల రూపాయలు వెచ్చిస్తోందని నిశితంగా విమర్శించారు. అయితే, ప్రధానమంత్రి ఎవరు అనే అంశంపై 2019 సార్వత్రిక ఎన్నికల తర్వాత మహాకూటమి నాయకులు సమిష్టిగా నిర్ణయం తీసుకుంటారని స్పష్టంచేశారు. రాహుల్‌గాంధీ నాయకత్వాన్ని ప్రశ్నించాల్సిన అవసరమే లేదని వ్యాఖ్యానించారు. తేజస్వి యాదవ్ ఆదివారం పీటీఐకి ఇచ్చిన ఇంటర్వ్యూలో అనేక అంశాలను ప్రస్తావించారు. బీజేపీ ఆగడాలు, దుష్టపాలనపై నిప్పులు చెరిగారు. రాహుల్‌పై సుదీర్ఘకాలంగా దుష్ప్రచారం చేసినా ఆయన ప్రజల హృదయాలను గెలుచుకున్నారని తేజస్వి వ్యాఖ్యానించారు. రాహుల్ నాయకత్వంలో మూడు ప్రధాన రాష్ట్రాలు రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్‌లో కాంగ్రెస్ పార్టీ విజయం సాధించిందని, అదే పార్టీకి మంచి శక్తిని, ఉత్సాహాన్ని, విశ్వాసాన్ని కల్పించాయని తెలిపారు. 2014 ఎన్నికల్లో నరేంద్రమోడీకి 69శాతం మంది ఓట్లు వేయలేదని గుర్తు చేశారు. మంచి ప్రధాని కావడానికి గల అన్ని అర్హతలు రాహుల్‌కు ఉన్నాయా అని అడుగగా 'అవును. ఆయనకు అన్ని అర్హతలు ఉన్నాయి. సుదీర్ఘచరిత్ర గల అతిపెద్ద జాతీయ పార్టీకి రాహుల్ అధ్యక్షుడు. దీనికితోడు గడచిన 15ఏళ్లుగా ఆయన లోక్‌సభ సభ్యుడిగా సేవలందిస్తున్నారు. దేశంలో ఐదుగురు ముఖ్యమంత్రి ఆయన పార్టీ నాయకులు ఉన్నారని మర్చిపోవద్దు. వారికి ఆయన నాయకత్వం వహిస్తున్నారు. అందుకే రాహుల్ నాయకత్వం, అర్హతపై ప్రశ్నించాల్సిన అవసరం లేదు' అని తేజస్వి స్పష్టంగా చెప్పారు. రాహుల్‌గాంధీ ప్రధానమంత్రి అభ్యర్థిత్వానికి డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ గతనెలలలో మొదటిసారిగా సంపూర్ణ మద్దతు ప్రకటించారు. నరేంద్రమోడీ ప్రభుత్వాన్ని ఓడించడానికి మహాకూటమి ప్రధానమంత్రి అభ్యర్థిగా రాహుల్‌గాంధీ ఉంటారని స్టాలిన్ బహిరంగంగా ప్రకటించారు. దీనిపై విమర్శలు వచ్చినా తన వైఖరి నుంచి స్టాలిన్ వెనక్కి తగ్గలేదు. భారతదేశానికి నాయకత్వం వహించే అవకాశం రాహుల్‌కు వస్తుందా అని అడుగగా భారత్ అతిపెద్ద ప్రజాస్వామ్యదేశం. తమ ప్రతినిధులను ప్రజలు ఎన్నుకుంటారు. ఆ ప్రతినిధులు ఎన్నుకునే నాయకుడే ప్రధానమంత్రి అవుతారని తేజస్వి చెప్పారు. ప్రజాస్వామ్యం ఎప్పుడే ప్రజలు కేంద్రంగా నడుస్తుంది. వ్యక్తులు ముఖ్యంకాదు. ప్రభుత్వ ఏర్పాటు నియంతృత్వంగా ఉండాలని తాము కోరుకోవడం లేదు. ప్రస్తుతం బీజేపీ అదే సమస్యతో సతమతమవుతోంది. ఆ సంస్కృతిని తాము ఆకాంక్షించడం లేదని తేజస్వి వివరించారు. కూటమి అంటే కొన్ని పార్టీల కలయిక. అది ఒక సింగిల్ పార్టీ కాదు. నాయకుడు ఒక్కడు కాదని అన్నారు. మహాకూటమి పేరుతో ముందు ఎన్నికలకు వెళితే...ఆ తర్వాత అంతా కూర్చొని చర్చించుకుంటామని, అప్పుడు కూటమి నాయకుడిని ఎన్నుకుంటామని తెలిపారు. దీనికి ఇప్పుడే తొందరేమీ లేదని చెప్పారు. 2004లో మన్మోహన్‌సింగ్ ప్రధానమంత్రి అభ్యర్థేమీ కాదని, ఆ తర్వాత ఆయన పదేళ్లు ప్రభుత్వాన్ని విజయవంతంగా నడిపారని గుర్తుచేశారు. మీ తండ్రి లాలు మాదిరిగా మీరు కూడా ప్రతిపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి ప్రయత్నిస్తున్నారా అని ప్రశ్నించగా ప్రతిపక్ష శిబిరంలో తాను అతి పిన్న వయస్సు నేతను. తాను ఇంకా నేర్చుకుంటున్నాను. ఇంకా నాయకుడిని కాదని హుందాగా చెప్పారు.'అవును యూపీఏ-1 ఏర్పాటులో మా నాన్న కీలక పాత్ర పోషించారు. 2014 నుంచి ప్రతిపక్షాలన్నింటినీ ఏకతాటిపైకి తీసుకురావడానికి పూర్తిగా ప్రయత్నిస్తున్నారు. మా నాన్న పాత్ర పార్టీ నుంచి ఎవరు చేసినా నేను సంతోషిస్తా'నని అన్నారు. ప్రతిపక్ష కూటమిలోకి భావసారూప్యత గల పార్టీలను తీసుకురావడానికి శక్తివంచన లేకుండా ప్రయత్నిస్తానని తేజస్వి ధీమాగా చెప్పారు. బీహారులో విజయవంతంగా ఆ పని చేయగలిగామని అన్నారు. సీబీఐ, ఈడీ, ఐటీ వంటి తన సంకీర్ణ భాగస్వాముల సహాయంతో బీజేపీ తనను తప్పుడు కేసుల్లో ఇరికించిందని ఆరోపించారు. తాము నిర్భయంగా రాజకీయాలు చేస్తున్నామని, అందువల్ల కేసులకు తాము భయపడేది లేదని తేల్చిచెప్పారు. బీజేపీ, సంఘ్ అధికారంలోకి రాకుండా చేయడానికి ఎంత దాకైనా వెళతానని తేజస్వి స్పష్టంచేశారు.



5వ నెం. జాతీయ రహదారి విస్తరణ వేగవంతం

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : 5వ జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా సాగుతున్నాయి. విశాఖ జిల్లాలో అనకాపల్లి-ఆనందపురం జాతీయ రహదారి నిర్మాణ పనులు దక్కించుకున్న దిలీప్ బిల్డ్ ఖాన్ సంస్థ డిసెంబర్ నుంచి పనులు ప్రారంభించింది. 50.78 కి.మీ. పొడవు గల ఈ రహదారి విస్తరణ పనులు అందుబాటులోకి వస్తే నగరంలో ట్రాఫిక్ సమస్య చాలా వరకు తగ్గుతుంది. ఈ రహదారి నిర్మాణం పూర్తయితే రోడ్డుప్రమాదాలు కూడా తగ్గుతాయని అధికారులు కూడా భావిస్తున్నారు. ప్రధాన రహదారికి అనుబంధంగా రెండువైపుల సర్వీస్ రోడ్లను నిర్మిస్తున్నారు. మొత్తం పదికి పైగా వంతెనలు, పది భూగర్భ మార్గాలు, తక్కువ ఎత్తు కలిగిన 11 భూగర్భ మార్గాలు, మూడు వంతెనలు, మూడు ఇంటర్ చేంజులు, వందకు పైగా కల్వర్టులతో పాటు ట్రక్కులు నిలిపే ప్రాంగణం నిర్మిస్తున్నారు. ఇప్పటికే ఆనందపురం నుంచి అనకాపల్లి వెళ్లే మార్గంలో రహదారి ఎత్తుకు తగ్గట్టుగా మట్టిని లెవెల్ చేస్తున్నారు. రెడీమిక్స్ కాంక్రీట్ ప్లాంటును కూడా ఏర్పాటు చేశారు. దాదాపు రోజుకు 650 మంది కార్మికులు పనులు చేస్తున్నారు. ప్రభుత్వం నుంచి అనుమతులు రావడంతో పనులు వేగవంతంగా సాగుతున్నాయి. మరో పక్క ఆనందపురం నుంచి భోగాపురం, శ్రీకాకుళం జాతీయ రహదారి ఆరు లైన్ల విస్తరణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. కోల్‌కతా నుంచి చెన్నైకు వెళ్లే 5వ నెంబర్ జాతీయ రహదారిని రూ.800 కోట్లతో ఆరులైన్ల రహదారిగా విస్తరణకు కేంద్ర ప్రభుత్వం మంజూరు చేసిన విషయం తెలిసిందే. జాతీయ రహదారి ఆనందపురం నుంచి అనకాపల్లి వైపు మళ్లించడంతో విశాఖ నగరానికి భారీ వాహనాలతో పాటు రవాణా ట్రక్కుల తాకిడి తగ్గింది. ఈ రహదారి పూర్తిగా అందుబాటులోకి వస్తే జాతీయ రహదారిగా ఉన్న ఆనందపురం నుంచి హనుమంతవాక మీదుగా మద్దిలపాలెం, ఎన్ఏడీ, గాజువాక అనకాపల్లి వరకు ట్రాఫిక్ సమస్య నుంచి నగర ప్రజలకు ఉపశమనం కలగనుంది.

2021 నాటికి పూర్తి చేస్తాం
ఎన్‌హెచ్ఏఐ పీడీ వెంకటరత్నం


ఆనందపురం-అనకాపల్లి జాతీయ రహదారి విస్తరణ పనులు వేగవంతంగా చేపడుతున్నామని ఎన్‌హెచ్ఏఐ పీడీ వెంకటరత్నం తెలిపారు. 2021 నాటికి ఈ రహదారి పూర్తిచేయడానికి అన్ని ఏర్పాట్లు చేస్తున్నామన్నారు. ఇప్పటికే కాంట్రాక్టర్ పనులు ప్రారంభించారని, భూసేకరణకు సంబంధించి చిన్న చిన్న అడ్డంకులు తొలగితే మరింత వేగవంతంగా పనులు జరగడానికి అవకాశం ఉంటుందన్నారు. రోజుకు 1500 మంది కార్మికులతో పనులు చేయడానికి ఆ సంస్థ సిద్ధంగా ఉందన్నారు.

శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షునిగా 'ఐలాపురం'



విశాలాంధ్ర - విజయవాడ (గాంధీనగర్) : ఆంధ్రప్రదేశ్ శాలివాహన సంఘం రాష్ట్ర అధ్యక్షులుగా మాజీ ఎమ్మెల్సీ ఐలాపురం వెంకయ్య తిరిగి మరోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. విజయవాడలోని ఐలాపురం హోటల్‌లో ఆదివారం సంఘం రాష్ట్ర కార్యవర్గ సమావేశం జరిగింది. 13 జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులతోపాటు కీలక నేతలు తరలివచ్చారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షులు ఐలాపురం వెంకయ్య మాట్లాడుతూ శాలివాహనుల సమస్యల పరిష్కారం కోసం చిత్తశుద్ధితో కృషి చేస్తానన్నారు. 45 సంవత్సరాల వయస్సు దాటిన ప్రతి కుమ్మర కులవృత్తిదారునికి రూ.3 వేల పెన్షన్ ఇవ్వాలన్నారు. మట్టికుంటలు, చెరువులపై కుమ్మరులకు హక్కు కల్పించేలా జీవో విడుదల చేయాలన్నారు. తెలంగాణలో నూతన టెక్నాలజీ వినియోగంతో కుమ్మర్ల అభివృద్ధికి అక్కడి ప్రభుత్వం బాటలు వేస్తుందని, మన రాష్ట్రంలోనూ పాలకులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. అన్ని నగరాల్లో కుమ్మర్లు తయారు చేసే వస్తువుల విక్రయానికి మున్సిపల్ కాంప్లెక్స్‌లలో షాపులు కేటాయించాలన్నారు. విద్యుత్‌తో నడిచే కుమ్మ చక్రాల(శారి)ను ప్రభుత్వం ఉచితంగా అందించాలన్నారు. ఫెడరేషన్ రుణాలను బ్యాంకులతో సంబంధం లేకుండా ఇవ్వాలన్నారు. సమావేశంలో సంఘం రాష్ట్ర కార్యదర్శి జీఎస్ఆర్.శంకర్, కోశాధికారి ఎంవీ కృష్ణారావు పాల్గొన్నారు.

మూఢనమ్మకాల నిర్మూలన చట్టం అవసరం



విశాలాంధ్ర - విజయవాడ (కృష్ణలంక) : సమాజాన్ని పట్టిపీడిస్తున్న మూఢ నమ్మకాల నిర్మూలనకు రెండు తెలుగు రాష్ట్రాల శాసనసభల్లో చట్టం చేసేలా ప్రజాప్రతినిధులు, అధికారులపై ఒత్తిడి తీసుకు వచ్చేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఆంధ్రప్రదేశ్ హేతువాద సంఘం రాష్ట్ర అధ్యక్షులు నార్నె వెంకటసుబ్బయ్య పిలుపునిచ్చారు. మూఢ నమ్మకాల నిర్మూలన చట్ట సాధన కమిటీ రాష్ట్ర సమావేశం ఆదివారం విజయవాడలోని స్వాతంత్ర్య సమరయోధుల భవనంలో జరిగింది. జనవిజ్ఞానవేదిక, నాస్తిక కేంద్రం, హేతువాద సంఘం, అరసం, విరసం, విద్యార్థి, యువజన సంఘాలు, ప్రజానాట్యమండలి ప్రతినిధులు పాల్గొన్నారు. నేటి ఆధునిక సమాజంలో చేతబడులు, క్షుద్రపూజలు, దొంగస్వాములు పెరిగిపోతున్నారన్నారు. ఇటీవలి కాలంలో అనేక మంది బాబాలు, పాస్టర్లు దైవత్వం, భక్తి ముసుగులో చేస్తున్న అత్యాచారాలు, అరాచకాలకు సంబంధించి పలు కేసుల్లో జైలుకు వెళ్నారన్నారు. నూతన రాజధాని భూములను ఆధ్యాత్మిక కేంద్రాలకు, దేవాలయాలకు ధారాదత్తం చేయడం సరికాదన్నారు. రెండు రాష్ట్ర ప్రభుత్వాలు మూఢ నమ్మకాల నిర్మూలన కోసం చిత్తశుద్ధితో పటిష్ట చట్టాలు తీసుకురావాలని నేతలు కోరారు. సమావేశంలో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర అధ్యక్షులు జంపా కృష్ణకిషోర్, నాస్తిక సమాజం రాష్ట్ర కార్యదర్శి మోతుకూరు అరుణ్‌కుమార్, పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షులు ఎం.రామకృష్ణ, డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షులు రామన్న, ఆంధ్రప్రదేశ్ ప్రజా నాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.చంద్రనాయక్, హేతువాద సంఘం నాయకులు ఉప్పు గణేష్ పాల్గొన్నారు. మూఢనమ్మకాల నిర్మూలన చట్టం సాధన కమిటీ గౌరవాధ్యక్షులుగా ప్రముఖ మానసిక వైద్యులు ఇండ్ల రామసుబ్బారెడ్డి, రాష్ట్ర కన్వీనర్‌గా మోతుకూరి అరుణ్‌కుమార్, వర్కింగ్ కార్యదర్శిగా నార్నె వెంకటసుబ్బయ్యలను ఎన్నుకున్నారు.

రోశయ్యకు 'నన్నపనేని' విశిష్ట పురస్కారం



విశాలాంధ్ర - తెనాలి : నిరంతరం పేదలకు అండగా నిలుస్తూ సమానత్వం కోసం తపించిన బహుముఖ ప్రజ్ఞాశాలి నన్నపనేని వెంకట్రావు అని, ఆయన విశిష్ట పురస్కారం అందుకోవడం గర్వకారణమని మాజీ ముఖ్యమంత్రి కొణిజేటి రోశయ్య అన్నారు. నన్నపనేని వెంకట్రావు ట్రస్టు ఆధ్వర్యంలో గుంటూరు జిల్లా తెనాలిలోని నాజరుపేట ఎన్వీఆర్ కన్వెన్షన్ సెంటర్ హాలులో ఆదివారం 2019వ సంవత్సరానికి సంబంధించి నన్నపనేని విశిష్ట పురస్కారాన్ని రోశయ్యకు ప్రదానం చేశారు. వేలాది మంది కరతాళ ధ్వనుల మధ్య రాష్ట్ర శాసనసభాపతి డాక్టర్ కోడెల శివప్రసాద్, రాష్ట్ర మంత్రి నక్కా ఆనందబాబు పురస్కారం అందజేశారు. ఆంధ్రప్రదేశ్ మహిళా కమిషన్ చైర్‌పర్సన్ నన్నపనేని రాజకుమారి అధ్యక్షతన జరిగిన సభలో పురస్కార గ్రహీత రోశయ్య మాట్లాడుతూ మంచి స్నేహితునిగా, గొప్ప రాజకీయ నేతగా, దేశ భక్తునిగా సమాజంలో వెంకట్రావు నిర్వహించిన పాత్ర మరువలేనిదన్నారు. శాసన సభ్యులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, డాక్టర్ దక్షిణామూర్తి, నన్నపనేని వెంకట్రావు ట్రస్టు నిర్వాహకులు నన్నపనేని సుధాకర్, నన్నపనేని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

కార్మికులంతా ఏకమై పోరాడదాం

చలసాని రామారావు



విశాలాంధ్ర - నరసరావుపేట : కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్మిక, ఉద్యోగ, ప్రజా వ్యతిరేక విధానాలను అడ్డుకునేందుకు కార్మికులంతా ఏకమై పోరాటాలకు సిద్ధం కావాలని ఏఐటీయూసీ రాష్ట్ర గౌరవాధ్యక్షులు చలసాని వెంకట రామారావు పిలుపునిచ్చారు. గుంటూరు జిల్లా నరసరావుపేట పట్టణంలోని అవ్వారి భావనారాయణ ఏఐటీయూసీ భవన్‌లో ఆదివారం జరిగిన ఏఐటీయూసీ జిల్లా కౌన్సిల్ సమావేశంలో చలసాని ముఖ్యఅతిథిగా ప్రసంగించారు. ఏఐటీయూసీ నేత పి.నాగాంజనేయులు అధ్యక్షతన జరిగిన సమావేశంలో రామారావు మాట్లాడుతూ మోడీ, చంద్రబాబు పాలనలో అమలు చేస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలు ప్రమాదకరంగా మారాయన్నారు. వీటిని అడ్డుకోలేకపోతే ఎన్నో త్యాగాల పోరాటాలతో సాధించుకున్న కార్మిక చట్టాలకు తూట్లు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు. ఫిబ్రవరి 4వ తేదీన మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం చేపట్టిన ధర్నాను విజయవంతం చేయాలన్నారు. ఏఐటీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ వెలుగూరి రాధాకృష్ణమూర్తి మాట్లాడుతూ ఏఐటీయూసీని అన్ని రంగాలకు, ప్రాంతాలకు విస్తరించేలా కృషి చేయాలని కోరారు. ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి కాసా రాంబాబు, ఆర్.అంజిబాబు, ఎ.గురవయ్య, సీపీఐ జిల్లా కార్యదర్శి జంగాల అజయ్‌కుమార్, ఏరియా కార్యదర్శి ఆలూరి రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

అంతర్గత మార్కులపై కన్ను!

- నేటి నుంచి ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో తనిఖీలు
- రంగంలోకి విద్యాశాఖ ప్రత్యేక కమిటీలు
- మూడు స్థాయిల్లో విద్యార్థుల జవాబుపత్రాల ధ్రువీకరణ

విశాలాంధ్రబ్యూరో - అనంతపురం : ఈ ఏడాది పదవ తరగతి విద్యార్థులకు వివిధ పరీక్షల్లో ఉపాధ్యాయులు కేటాయించిన అంతర్గత మార్కుల విధానాన్ని సోమవారం నుంచి రాష్ట్రవ్యాప్తంగా విద్యాశాఖ ప్రత్యేక అధికారుల బృందాలు తనిఖీ చేయనున్నాయి. ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో విద్యార్థుల జవాబుపత్రాలను స్వయంగా పరిశీలించనున్నారు. ప్రైవేటు పాఠశాలలు తమ విద్యార్థులకు అంతర్గత మార్కులు 20కి 20 వేసుకోవడంతో అత్యధిక పాఠశాలల్లో 10 జీపీఏలు వచ్చాయన్న ఆరోపణల నేపథ్యంలో పాఠశాల విద్యాశాఖ ఈ ఏడాది ముందుగానే అప్రమత్తమయ్యింది. పాఠశాల స్థాయిలో సమ్మెటివ్-1 పరీక్షతోపాటు నాలుగు ఫార్మేటివ్ పరీక్షలు జరుగుతాయి. వీటిలో అవకతవకలు జరుగుతున్నాయన్న సమాచారంతో విద్యాశాఖ ఆయా పరీక్షల్లో మార్కులు ఎలా వేశారో ప్రత్యక్షంగా పరిశీలించాలని భావించింది. విద్యార్థులు రాసిన జవాబుపత్రాల ఆధారంగా మార్కులు వేశారా, ఉదారంగా వేశారా చూడనున్నారు. మండల, డివిజన్ స్థాయి అధికారులు, సీనియర్ ప్రధానోపాధ్యాయులు, డైట్ కళాశాల ప్రిన్సిపాల్, ఎస్ఎస్ఏ సెక్టోరియల్ అధికారుల పర్యవేక్షణలో ఈ తనిఖీలు కొనసాగనున్నాయి. ఈ పరిశీలనలో సందేహాలు, లోపాలు ఉంటే మరో కమిటీ అప్రమత్తం చేయనుంది.

అంతర్గత మార్కుల కింద సమ్మెటివ్-1 పరీక్షలకు 10 మార్కులు, నాలుగు ఫార్మేటివ్ పరీక్షలకు 10 మార్కులను ఉపాధ్యాయులు కేటాయిస్తున్నారు. పరీక్షలు ఎలా రాశారు, అభ్యసన సామర్థ్యాలు, ప్రాజెక్టు పని, మౌఖిక పరీక్షలు, స్లిప్ టెస్ట్‌లో మార్కులు, క్రమశిక్షణ తదితర అంశాలను పరిగణనలోకి తీసుకుని సంబంధిత పాఠశాల ఉపాధ్యాయులు అంతర్గత మార్కులు వేస్తారు. ఇక్కడే కొన్ని ప్రైవేటు, కార్పొరేట్ పాఠశాలల యాజమాన్యాలు దారితప్పడంతో 10 జీపీఏలు ఎక్కువ వచ్చాయనే ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థుల్లో సామర్థ్యాలు, క్రమశిక్షణ లేకపోయినా 20కి 20 మార్కులు వేసుకుని గొప్పలు చెప్పుకున్నారనే విమర్శలు వచ్చాయి. ఈ నేపథ్యంలో విద్యాశాఖ మండల, డివిజన్, జిల్లా స్థాయిలో తనిఖీ బృందాలు ఒక్కో తరగతి, పాఠశాల నుండి 20 శాతం మంది జవాబు పత్రాలను పరిశీలించనున్నాయి. ఈ పరిశీలనలో ఏమైనా తప్పులు దొర్లితే మరో కమిటీ గుర్తిస్తుంది. విద్యార్థుల జవాబుపత్రాలపై వేసిన మార్కులు, సీఎస్ఈ వెబ్‌సైట్‌లో నమోదు చేసిన మార్కులు రెండు ఒక్కటేనా, కాదా అన్నది పరిశీలిస్తుంది. ఇక్కడ తప్పులుంటే సరిదిద్దాలని విద్యాశాఖ సూచించింది.

తనిఖీ ఇలా..

మండల స్థాయిలో ఈ నెల 28న మొదలై ఫిబ్రవరి 5వ తేదీతో తనిఖీలు ముగించాలి. డివిజన్ స్థాయిలో ఫిబ్రవరి 5 నుంచి 13 వరకు, జిల్లా స్థాయిలో ఫిబ్రవరి 5 నుంచి 13 వరకు పరిశీలించాలని విద్యాశాఖ నిర్ణయించింది. రాష్ట్రంలోని కృష్ణాజిల్లా మినహా అన్ని జిల్లాల్లో ప్రారంభం కానుంది.

సభ్యులు ఎవరంటే..

మండల స్థాయి కమిటీలో ఎంఈఓ, పాఠశాల సముదాయ హెచ్ఎం, మండలంలో సీనియర్ ప్రధానోపాధ్యాయుడు సభ్యులు, డివిజన్ స్థాయిలో డీవైఈవో, మండలంలో సీనియర్ హెచ్ఎం, ఎస్ఎస్ఏ నుంచి సెక్టోరియల్ అధికారి, జిల్లా స్థాయిలో డీఈవో, అసిస్టెంట్ కమిషనర్ (పరీక్షల విభాగం) డీసీఈబీ కార్యదర్శి, డైట్ ప్రిన్సిపాల్ సభ్యులుగా ఉంటారు.



పోలవరం సందర్శన యాత్రలో విషాదం

విశాలాంధ్ర - పోలవరం : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్రలో ఆదివారం విషాదం చోటుచేసుకుంది. ఓ వృద్ధుడు గుండెపోటుతో మృతి చెందిన ఘటన పోలవరం మండలం పట్టిసీమ జరిగింది. ప్రకాశం జిల్లా గుంటుపల్లి మండలం పెద అంబడిపూడి గ్రామానికి చెందిన కూరపాటి సుబ్బారావు (70) పోలవరం ప్రాజెక్టు సందర్శన యాత్ర బస్సులో ఉదయం పట్టిసీమకు చేరుకున్నారు. కాలకృత్యాలు తీర్చుకునేందకు వెళ్లిన సుబ్బారావు అక్కడిక్కడే కుప్పకూలిపోయారు. మిగిలిన సందర్శకులు, స్థానికులు 108కు సమాచారం ఇచ్చారు. సుబ్బారావు అప్పటికే మృతి చెందినట్లు వైద్యసిబ్బంది నిర్ధారించారు.





మంటల్లో ప్రైవేటు కాలేజీ బస్సు

- ఎమర్జెన్సీ డోర్లు పగులగొట్టి దూకేసిన విద్యార్థినులు
- త్రుటిలో తప్పిన పెనుప్రమాదం
- నెల్లూరు నగరంలో ఘటన

విశాలాంధ్ర బ్యూరో - నెల్లూరు : నెల్లూరు నగరంలో ఆదివారం పెనుప్రమాదం తప్పింది. విద్యార్థులు అప్రమత్తం కావడంతో భారీ ముప్పు తప్పింది. కొంచెం ఆలస్యమైనా ఊహించడానికే భయానక పరిస్థితులు. నెల్లూరులోని రామలింగాపురం శ్రీచైతన్య కళాశాలకు చెందిన బస్సు 55 మంది విద్యార్థినులతో ఆదివారం సాయంత్రం జాతీయ రహదారి నుంచి అప్రోచ్ రోడ్డు మీదుగా మైపాడు రోడ్డులోకి ప్రవేశించింది. ఆకస్మికంగా బస్సు ముందు భాగంలో ఇంజన్ నుంచి పొగలు వచ్చాయి. ఏం జరిగిందో డ్రైవర్ తెలుసుకునే లోపే పొగలు బస్సు మొత్తం వ్యాపించాయి. డ్రైవర్ హెచ్చరికలతో కొందరు విద్యార్థినులు ఎమర్జెన్సీ డోర్ పగులగొట్టి, మరికొందరు కేకలు వేస్తూ ముందున్న డోర్ నుంచి కిందకు దూకేశారు. కొద్ది సమయంలో ఇంజన్‌లో మంటలు చెలరేగి బస్సు మొత్తం పూర్తిగా కాలిపోయింది. అగ్నిమాపక కేంద్రం సిబ్బంది ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. క్షణాల్లో కళ్ల ముందు బస్సు మొత్తం మంటల్లో కాలిపోవడంతో విద్యార్థినులు భయాందోళనకు గురయ్యారు. బస్సు దిగడం కొంచెం ఆలస్యమైతే మా పరిస్థితి ఏంటని కొందరు బాలికలు కంటతడి పెట్టారు. బస్సుల ఫిట్‌నెస్‌పై యాజమాన్యాల నిర్లక్ష్యంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు.

విశాఖ ఉత్తరంపై ఉత్కంఠ

అన్ని పార్టీల్లో తేలని అభ్యర్థుల ఎంపిక

విశాలాంధ్ర - విశాఖ సిటీ బ్యూరో : విశాఖ ఉత్తర నియోజక వర్గంపై ప్రతిసారీ ఉత్కంఠే. ఈ నియోజక వర్గంలో స్థానికులకన్నా వలస రాజకీయ నేతలే పట్టుకు ఆరాటపడుతున్నారు. అన్ని పార్టీల్లో ఇద్దరి నుంచి ముగ్గురు పోటీపడుతుండటంతో అభ్యర్థుల ఎంపిక అన్ని పార్టీలకు తలనొప్పిగానే మారింది. గత 2014 ఎన్నికల్లో బీజేపీ, టీడీపీ పొత్తులో భాగంగా బీజేపీకి కేటాయించడంతో ప్రస్తుతం ఈ నియోజకవర్గం ఎమ్మెల్యేగా విష్ణు కుమార్ రాజు ఉన్నారు. మరో నాలుగునెలల్లో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో ఈ నియోజక వర్గం నుంచి అన్ని పార్టీలు పోటీపడుతున్నాయి. 2009లో కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేగా గెలుపొందిన తైనాల విజయ కుమార్‌కు కూడా ప్రస్తుతం వైసీపీలో టికెట్టు వస్తుందని ప్రచారం సాగుతోంది. కాంగ్రెస్ నుంచి వైసీపీలో చేరిన తైనాల గడచిన అయిదేళ్లుగా ఉత్తరం టికెట్టు కోసం ఆశ పెట్టుకున్నారు. తాజాగా వైసీపీలో చేరిన కె.కె.రాజును ఈ నియోజకవర్గం సమన్వయ కర్తగా ఆ పార్టీ అధినేత జగన్‌మోహన్ రెడ్డి నియమించడం తైనాలకు తలనొప్పి తెచ్చిపెట్టింది. ఇక చొక్కాకుల వెంకటరావు కూడా ఈ నియోజకవర్గంపైనే ఆశలు పెట్టుకున్నారు. ఇక టీడీపీ విషయానికి వస్తే వలస వచ్చే నేతలకే టికెట్టు దక్కే అవకాశం కనిపిస్తున్నది.

బీజేపీ నుంచి విష్ణుకుమార్‌రాజు టీడీపీలో చేరితే ఆయనకు టికెట్టు ఖాయమని ప్రచారం సాగుతుండగా, మాజీ ఎంపీ, మాజీ మేయర్ సబ్బంహరి కూడా టీడీపీలో చేరితే ఉత్తర నియోజకవర్గమే అడుగుతున్నట్లు తెలుస్తున్నది. అలాగే టీడీపీలో ఇటీవల చేరిన స్వాతీ ప్రమోటర్స్ అధినేత కృష్ణారెడ్డి కూడా ఆశలు పెట్టుకున్నారు. మరో పక్క అనకాపల్లి ఎంపీ అవంతి శ్రీనివాస్, యలమంచిలి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు కూడా ఉత్తరం పైనే పట్టు పట్టినట్లు తెలుస్తున్నది. ఇక కాంగ్రెస్‌కు అభ్యర్థులు కరవు కాగా జనసేనకు మాత్రం ఇద్దరు పోటీపడుతున్నారు. ఇటు కాంగ్రెస్ పార్టీ నుంచి జనసేనలో చేరిన గుంటూరు భారతి, వైసీపీ ఉత్తర నియోజకవర్గం సమన్వయకర్తగా వున్న పసుపులేటి ఉషాకిరణ్‌ను తప్పించి కె.కె.రాజుకు అప్పగించడంతో అసంతృప్తికి గురై పార్టీ మారి జనసేనలో చేరిన ఉషాకిరణ్ కూడా ఉత్తరంలోనే జనసేన నుంచి పోటీచేయాలని భావిస్తున్నారు. మొత్తానికి నగరంలోని ఉత్తర నియోజకవర్గంలో అభ్యర్థుల ఎంపిక రసవత్తరంగా మారింది. మిగతా నియోజకవర్గాల్లో రెబల్స్ బెడద అంతగా లేనప్పటికీ ఉత్తరంలోని అన్ని పార్టీల్లో ఉత్కంఠ నెలకొంది.

నూతన ప్రత్యామ్నాయానికి మద్దతివ్వండి

ప్రజాచైతన్య యాత్రలో సీపీఐ అనంతపురము జిల్లా కార్యదర్శి డి.జగదీష్

విశాలాంధ్ర - అనంతపురము : రాష్ట్రంలో నూతన రాజకీయ ప్రత్యామ్నాయం అనివార్యమని, సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీలతో కూడిన కూటమిని రాబోయే ఎన్నికల్లో ఆదరించాలని సీపీఐ అనంతపురము జిల్లా కార్యదర్శి డి.జగదీష్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. అనంతపురములోని తాడిపత్రి బస్టాండ్ కూడలి వద్ద ఆదివారం ప్రజా చైతన్యయాత్రను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా జనసేన, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు అధ్యక్షత వహించిన సభలో జగదీష్ మాట్లాడుతూ ప్రజల కోసం పనిచేసే నాయకులు చట్టసభలకు ఎన్నిక కావాలన్న లక్ష్యంతో సీపీఐ, సీపీఎం, జనసేన కలసి ప్రజాకూటమిగా ఆవిర్భవించాయన్నారు. ప్రస్తుతం ప్రజాప్రతినిధులు అధికారాన్ని ప్రజాసేవకు కాకుండా ధనం, ఆస్తుల సంపాదనకు వినియోగించుకుంటున్నారన్నారు. రాబోయే ఎన్నికలకు సమాయత్తమవుతున్న అధికార టీడీపీ, ప్రధాన ప్రతిపక్షం వైసీపీ అధిష్టానాలు తమ అభ్యర్థులు ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో రూ.10 కోట్ల ఖర్చుతో ఓట్లు కొనుగోలు చేయాలని సంకేతాలు ఇవ్వడం బాధాకరమన్నారు. పెద్ద మొత్తం డబ్బు ఖర్చుపెట్టి గెలుపొందిన ఎమ్మెల్యేలు వాటిని రాబట్టుకునేందుకు అడ్డదారులు తొక్కుతూ ప్రజా సొమ్మును లూటీ చేస్తున్నారన్నారు. దీంతో అవినీతి పెరిగిపోతోందన్నారు. ధన రాజకీయాలను తిప్పికొట్టడంతో పాటు సమాజంలో మార్పు కోసం ఏర్పడిన నూతన రాజకీయ ప్రత్యామ్నాయ వేదికను బలపర్చాలని కోరారు. 2,8,9,10 డివిజన్లలో సీపీఐ, సీపీఎం, జనసేన పార్టీల నాయకులు ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శులు సి.జాఫర్, పి.నారాయణస్వామి, సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఓ.నల్లప్ప, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు సి.లింగమయ్య, టి.నారాయణస్వామి, ఏఐటీయూసీ, మహిళా సమాఖ్య గౌరవ అధ్యక్షురాలు శకుంతలమ్మ, ఐద్వా జిల్లా కార్యదర్శి సావిత్రమ్మ, సీపీఐ, సీపీఎం నగర కార్యదర్శులు శ్రీరాములు, నాగేంద్రకుమార్, జనసేన నగర నాయకులు నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.



ప్రజాచైతన్య యాత్రను ప్రారంభిస్తున్న జగదీష్

'కాయకల్ప'పై ఆశలు

- పీహెచ్‌సీ, సీహెచ్‌సీల పరిశీలన పూర్తి
- రాష్ట్ర కమిటీ కోసం ఎదురుచూస్తున్న విజయనగరం ఆసుపత్రులు
- కేంద్ర గుర్తింపు వస్తే ఒక్కో ఆసుపత్రికి భారీ నగదు ప్రోత్సాహకం

విశాలాంధ్ర - విజయనగరం : గ్రామీణ ప్రభుత్వ ఆసుపత్రులను ప్రోత్సహించేందుకు కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన కాయకల్ప ప్రోత్సాహక పథకంపై విజయనగరం జిల్లాలోని ఆసుపత్రులు ఎన్నో ఆశలు పెట్టుకున్నాయి. వైద్య శాఖపరంగా రాష్ట్ర ప్రభుత్వం ఇస్తున్న నిధులు చాలకపోవడంతో ఈ ఆసుపత్రులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయి. ఈ నేపథ్యంలో కేంద్రం కాయకల్ప పేరుతో ప్రోత్సాహకాలు అనగానే ఈ ఆసుపత్రులకు అదనపు నిధులు సమకూరుతాయన్న ఆశ మొదలైంది. కానీ ఏడాది గడుస్తున్నా ఇప్పటి వరకు జిల్లా ఆసుపత్రులకు తగిన ప్రోత్సాహకాలు అందకపోవడంతో చాలీచాలని నిధులతో కొట్టామిట్టాడుతున్నాయి. దీంతో పాటు పీహెచ్‌సీలకు అంతర్ జిల్లా కమిటీల పరిశీలన పూర్తికాగా జిల్లా కేంద్రాసుపత్రికి, పార్వతీపురం రూరల్ ఆసుపత్రికి మాత్రం రాష్ట్ర స్థాయి కమిటీ పరిశీలన చేయాల్సి ఉంది. కానీ ఇంతవరకు కమిటీ రాకపోవడంతో ఆసుపత్రుల కమిటీలు, వైద్యాధికారులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతా అభియాన్‌లో భాగంగా పీహెచ్‌సీ నుంచి జిల్లా ఆసుపత్రి వరకు అన్నింటికీ ప్రోత్సాహకంగా నగదును అందించేలా కాయకల్ప విధానాన్ని ఏర్పాటుచేసింది. పీహెచ్‌సీ, సీహెచ్‌సీల స్థాయిలో పరిశీలనకు అంతర్ జిల్లాల వైద్యాధికారులను తనిఖీలకు నియమించారు. ముందుగా జిల్లాలో ఐదు సీహెచ్‌సీలతో పాటు 5 పీహెచ్‌సీలను ఎంపికచేశారు. వీటికి పరిశీలన పూర్తిచేసిన కమిటీలు నివేదికను ప్రభుత్వానికి అందజేశారు. ఈ కమిటీ తన పరిశీలనలో రోగులకు అందిస్తున్న చికిత్స, సేవలు, సదుపాయాలను, వసతి సౌకర్యాలను పరిగణనలోకి తీసుకుంటుంది. ఈ నివేదిక ఇచ్చి నెలలు గడుస్తున్నాయి. కాయకల్పలో భాగంగా కేంద్రం గుర్తింపు వస్తే మొదటి, ద్వితీయ బహుమతులను అందజేస్తారు. ఈ నిధులతో ఆసుపత్రులను అభివృద్ధి చేసుకోవచ్చు. పీహెచ్‌సీలకు మొదటి బహుమతిగా రూ.2 లక్షలు, రెండవ బహుమతిగా రూ.1లక్ష వస్తుంది. సీహెచ్‌సీలకు రూ.5 లక్షలు, 2 లక్షలుగా వస్తాయి. గత ఏడాది పరిశీలన పూర్తిచేయగా కేవలం పూసపాటిరేగ పీహెచ్‌సీకి మాత్రమే రూ.1లక్ష వచ్చినట్లుగా తెలుస్తోంది. అలాగే జామి మండలంలోని అలమండ పీహెచ్‌సీకి కన్సోలేషన్ బహుమతిగా రూ.50 వేలు వచ్చినట్లు వైద్యాధికారి తూర్పాటి వెంకటరావు తెలిపారు. ఈ ఏడాది మరోసారి పోటీలో ఉంటామని అంటున్నారు. అయితే చాలా ఆసుపత్రులకు కనీసం ఈ నిధుల వివరాలు కూడా తెలియని పరిస్థితి ఉంది.



పరిశీలన కోసం ఎదురుచూస్తున్న జిల్లా ఆసుపత్రి

జిల్లా ఆసుపత్రికి గుర్తింపు వస్తే రూ.15 లక్షలు వచ్చినట్లే..

ప్రస్తుతం కాయకల్పలో భాగంగా జిల్లా కేంద్రాసుపత్రి, పార్వతీపురం రూరల్ ఆసుపత్రిలో పరిశీలన జరగాల్సి వుంది. ఈ ఆసుపత్రులను రాష్ట్ర స్థాయి కమిటీ తనిఖీలు నిర్వహించాలి. కాయకల్ప ఏర్పాటుచేసి నెలలు గడుస్తున్నా ఇప్పటి వరకు కమిటీ రాకపోవడంతో ఆసుపత్రి వర్గాలు నిరుత్సాహంతో ఉన్నాయి. కాయకల్ప పరిశీలన అనంతరం కమిటీ నివేదికను కేంద్రానికి పంపించాలి. ఈసమయంలో కేంద్రంనుంచి తగిన గుర్తింపు వస్తే రూ.15లక్షలు మొదటి బహుమతిగాను, రెండవ బహుమతిగా రూ.10లక్షలు వస్తాయి. ప్రస్తుతం అభివృద్ధి దిశగా అడుగులు వేస్తున్న జిల్లా ఆసుపత్రికి, అనుసంధానంగా వున్న ఘోషాసుపత్రికి నిధుల ఆవశ్యకత చాలా వుంది. ఈనేపథ్యంలో కేంద్రం నుంచి వచ్చే నిధులు చాలా ఉపయోగపడతాయని కేంద్ర ఆసుపత్రి సూపరింటెండెంట్ కె. సీతారామరాజు తెలిపారు. రాష్ట్ర కమిటీ పరిశీలన జరిగితే మార్చిలోగా నిధులు వచ్చే అవకాశాలు ఉన్నాయని పలువురు అభిప్రాయం వ్యక్తంచేస్తున్నారు.



బ్యాక్‌లాగ్ ఖాళీ పోస్టులు భర్తీచేయాలి

విశాలాంధ్ర - విజయనగరంటౌన్ : ప్రభుత్వశాఖల్లో బ్యాక్ లాగ్ పోస్టుల ఖాళీలను తక్షణం రాష్ట్ర ప్రభుత్వం భర్తీ చేయాలని విద్యార్థి సంఘాల జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. జేఏసీ ఆధ్వర్యంలో ఆదివారం విజయనగరంలోని సీపీఐ జిల్లా కార్యాలయం (అమర్ భవన్)లో రౌండ్‌టేబుల్ సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా అఖిల భారత యువజన సమాఖ్య (ఏఐవైఎఫ్) రాష్ట్ర సహాయ కార్యదర్శి పి.చంద్రశేఖర్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 2 లక్షల 40 వేల ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయడం ద్వారా నిరుద్యోగ సమస్య పరిష్కారానికి చొరవ చూపాలన్నారు. అన్ని గ్రూప్ పరీక్షలను ఆఫ్‌లైన్‌లోనే నిర్వహించాలన్నారు. ఎన్నికల్లో నిరుద్యోగులకు ప్రస్తుత ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలను నెరవేర్చాలన్నారు. సమావేశంలో ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, ఏపీజీఎస్, కేవీపీఎస్, బీఎస్‌యూ, జనసేన నాయకులు రామ్మోహన్, సురేష్, ప్రదీప్, ఎన్.నాగభూషణం, కోట అప్పన్న, అప్పలరాజు దొర, ఆనంద్, లక్ష్మీరాజ్, పి.నవీన్ పాల్గొన్నారు.

అంతరిక్ష పరిశోధనలో మన యువత

- కలాంశాట్ దేశానికే గర్వకారణం
- మన్ కీ బాత్‌లో నరేంద్రమోడీ



న్యూఢిల్లీ : దేశ శాస్త్రవేత్తలపై ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ప్రశంసల జల్లు కురిపించారు. 'ఈ రోజు మన అంతరిక్ష కార్యక్రమం అనేక మంది యువ శాస్త్రవేత్త లను తయారుచేస్తోంది" అని అన్నారు. 'మన్ కీ బాత్' కార్యక్రమంలో భాగంగా మోడీ దేశ ప్రజలను ఉద్దేశించి ఆదివారం మాట్లా డారు. ఈ సందర్భంగా ఆయన నేతాజీ సుభాష్ చంద్ర బోస్, శివకుమార స్వామికి నివాళులర్పించారు. మన్ కీ బాత్‌లో మాట్లాడుతూ, అంతరిక్షంలో పరిశోధనలు చేసే స్థాయికి ఈ రోజు మన దేశ యువత ఎదిగింది. ఇది గర్వించదగ్గ సమయం. మన దేశానికి చెందిన విద్యార్థులు ఉపగ్రహాలు పంపే స్థాయికి చేరుకున్నారు. అలాంటి వారిని మనం ప్రోత్సహించాలి. దేశ ప్రజలు గర్వించదగ్గ కలాం శాట్‌ను మన విద్యార్థులే తయారు చేసి ప్రారంభించారు. యువత ఇంతకంటే ఉన్నతస్థానాలకు చేరు కోవాలని కోరుకుంటున్నాను' అని అన్నారు. అంతరిక్ష వాహకం నుంచి ఒకే సమయంలో 104 ఉపగ్రహాలను పంపించి భారత్ ప్రపంచ రికార్డు సృష్టించిందని చెప్పారు. చంద్ర యాన్-2 ప్రచారం ద్వారా త్వరలో చంద్రునిపై భారత్ త్వరలో కాలు మోపనున్నదని తెలిపారు. కలాం శాట్‌ను తీసుకువెళ్లే పీఎస్ఎల్‌వీ- సీ44 వాహకాన్ని భారత్ విజయవంతంగా ప్రయోగించింది. ఈ సమాచార ఉపగ్రహాన్ని విద్యార్థులు తయారుచేశారు. మన్ కీ బాత్' కార్యక్రమం ఏర్పాటు చేసింది రాజకీయ ఉపన్యాసాలు ఇవ్వడా నికి కాదు. మీతో(దేశ ప్రజలు) కాసేపు ముచ్చటిం చాలన్నదే దీని ఉద్దేశం. ఇక్కడ ఎలాంటి రాజకీయ అంశాలకు తావు లేదు. నెలకోసారి మీతో మాట్లాడే అదృష్టం నాకు కలిగింది. ప్రతి నెలా ఈ కార్యక్ర మాన్ని వినే వారి సంఖ్య పెరుగుతోంది. ప్రజల అభిప్రాయాలు ఫోన్లు, ఈ-మెయిళ్లు, సందేశాల ద్వారా అందిస్తున్నారు. ఇది నాకు శుభపరిణామం' అని మోడీ అన్నారు.

గ్రీన్‌గోల్డ్ మోసాలు

వెలుగు చూస్తున్న వాస్తవాలు

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్ : తొంభై రోజులు... రూ.150 కోట్లు లక్ష్యం...ఇదీ గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ నిర్వాహకుడి పథకం. గతంలో మాదిరిగా పోలీసులకు దొరికిపోకుండా ఉండాలని పకడ్బందీ ప్లాన్‌తో గొలుసుకట్టు వ్యాపారానికి పూనుకొన్నాడు. తన మోసం బయటకు రాకపోతే రూ.150 కోట్లు వసూలు చేసి విదేశాలకు చెక్కేసేవాడే. పారిపోయే ముందు ఎవరికీ అనుమానం రాకుండా ఉండేందుకు తన వద్ద నమ్మకంగా పనిచేస్తున్న ఏజెంట్లకు ఖరీదైన ఫార్చ్యూనర్ కార్లను బహుమతిగా ఇవ్వాలని నిర్ణయించుకున్నాడట. ఇదీ ఉప్పల్ కేంద్రంగా అమాయకులను పల్లినూనె పేరుతో పెద్ద ఎత్తున మోసం చేసి పోలీసులకు చిక్కిన గ్రీన్‌గోల్డ్ బయోటెక్ సంస్థ నిర్వాహకుడు శ్రీకాంత్ బాగోతం. బాధితుల ఫిర్యాదుతో రంగంలోకి దిగిన పోలీసులు శ్రీకాంత్ కార్యాలయంలో కంప్యూటర్ హార్డ్ డిస్కులు, పెన్‌డ్రైవ్‌లు, ఫైళ్లను విశ్లేషిస్తున్నారు. విచారణలో పోలీసులే విస్తుపోయే వాస్తవాలు వెలుగుచూస్తున్నాయి. మార్చిలో విదేశాలకు పారిపోయేందుకు వేసుకొన్న పథకం వివరాలు, వివిధ సందర్భాల్లో డిపాజిట్‌దారులు, ఇతరులతో జరిపిన సంభాషణల రికార్డ్ వాయిస్‌లు పెన్‌డ్రైవ్‌లో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

ఎవరెవరికి డబ్బు ఇచ్చింది, మామూళ్లు తీసుకొన్నవారి వివరాలను శ్రీకాంత్ నోట్ చేసిపెట్టుకొన్నాడు. పారిపోయేందుకు వేసుకొన్న రూట్‌మ్యాప్ దొరకడంతో అతడికి సహకరించినవారు, వెనకుండి గొలుసుకట్టు వ్యాపారాన్ని ప్రోత్సహించిన పెద్దమనుషుల వ్యవహారంపై పోలీసులు దృష్టిపెట్టారు. శ్రీకాంత్ తన మోసాలకు గృహిణులనే టార్గెట్‌గా ఎంచుకొన్నాడు. రూ.లక్ష డిపాజిట్ చేస్తే పల్లినూనె తీసే యంత్రంతోపాటు 200 కిలోల పల్లీలు ఇస్తానని చెప్పాడు. నూనె తీసి తిరిగి తనకే విక్రయిస్తే కేజీకి రూ.30 నుంచి రూ.35 ఇవ్వడంతో పాటు అదనంగా నెలకు పదివేల రూపాయల గౌరవ వేతనం ఇస్తానని ఒప్పందపత్రం రాసిస్తాడు. సభ్యత్వం తీసుకొన్న వారు కనీసం 40 లీటర్ల నూనె తీయాలని అగ్రిమెంట్‌లో నిబంధన పెట్టి సంతకం పెట్టించుకొంటాడు. ఆ మాటలు నమ్మిన చాలామంది మహిళలు లక్ష చొప్పున డిపాజిట్ చేసి యంత్రాలు, పల్లీలు తీసుకొన్నారు. అయితే శ్రీకాంత్ ఏ ఒక్కరికీ నగదు చెల్లించకుండా బుకాయిస్తూ కాలం వెళ్లదీస్తున్నాడు. మోసపోయామని అనుమానించిన ఇద్దరు మహిళలు ఉప్పల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో శ్రీకాంత్ గుట్టురట్టయింది. ఇప్పటివరకు ఇతగాడు రూ.20 కోట్లకుపైగా డిపాజిట్లు వసూలు చేసినట్లు పోలీసులు అంచనా వేస్తున్నారు.

ఉద్యోగాల భర్తీ వేగవంతం

విశాలాంధ్ర బ్యూరో-హైదరాబాద్: ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ వేగం పుంజుకోనున్నది. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) ఆధ్వర్యంలో ఉద్యోగాల భర్తీ ప్రక్రియను వేగంగా చేపడతామని టీఎస్‌పీఎస్సీ ఛైర్మన్ ఘంటా చక్రపాణి తెలిపారు. పెండింగ్‌లో ఉన్న 3 వేల ఉద్యోగాలను రాబోయే వారం రోజుల్లో భర్తీ చేస్తామని ఆయన స్పష్టం చేశారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు దాదాపు 18 వేల ఉద్యోగాలు భర్తీ చేశామని, గతేడాది 10 వేల ఉద్యోగాలు భర్తీ చేశామన్నారు. నాలుగేళ్లలో 20 వేల ఉద్యోగాలు ఇవ్వడం మామూలు విషయం కాదని తెలిపారు. ప్రభుత్వ ఉత్తర్వుల్లో సమస్యలు, కోర్టు కేసుల ఇబ్బందుల నేపథ్యంలో టీఎస్‌పీఎస్సీకి సంబంధం లేనప్పటికీ విమర్శలు ఎదుర్కోవాల్సి వస్తున్నదన్నారు. కొన్ని శాఖలు రిక్రూట్‌మెంట్ బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నాయని, గ్రూప్ పరీక్షలు, పాలనా పరమైన ఉద్యోగాల భర్తీ మాత్రమే టీఎస్‌పీఎస్సీ పని అని తెలిపారు.

ట్యూటర్లు, పారామెడికల్, టీచర్ పోస్టుల భర్తీ పూర్తి అయితే దాదాపు అన్ని పూర్తయినట్లేనన్నారు. టీఎస్‌పీఎస్సీ నిర్వహించాల్సిన పరీక్షలు, విడుదల చేయాల్సిన నోటిఫికేషన్లు ఏమీ లేవన్నారు.

విద్య జాతీయ సంపద

- జీడీపీలో 6శాతం నిధులు కేటాయించాలి
- ఎస్‌టీయూ విద్యా సదస్సులో వక్తలు



సదస్సులో మాట్లాడుతున్న కత్తి నరసింహారెడ్డి, పక్కన జేవీఎస్ఎన్‌మూర్తి, నాగేశ్వరరావు, సుధీర్ తదితరులు

విశాలాంధ్ర-విశాఖసిటీ : విద్యను జాతీయ సంపదగా భావించి, ప్రభుత్వాలు నిధులు కేటాయించినప్పుడే దేశం అన్నిరంగాల్లో అభివృద్ధి చెందుతుందని వక్తలు వెల్లడిం చారు. ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ యూనియన్ (ఎస్‌టీయూ) ఆధ్వర్యంలో విశాఖపట్నంలో ఆదివారం 'విద్యా పరిరక్షణ-జాతి పరిరక్షణ' అనే అంశంపై విద్యా సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు ముఖ్య అతిధిగా పాల్గొన్న పశ్చిమ రాయలసీమ శాసనమండలి సభ్యులు కత్తి నర సింహారెడ్డి మాట్లాడుతూ మన దేశంలో విద్యను వ్యాపా రంగా ప్రభుత్వాలు చూస్తున్నాయన్నారు. దేశ జీడీపీలో 6 శాతం విద్యారంగానికి కేటాయించాల్సి ఉండగా, 3 శాతానికి మించి కేటాయింపులు జరపలేదన్నారు. దేశంలో 74 శాతం మందికి మాత్రమే చదవడం, రాయడం వచ్చని ఇటీవల వెల్లడించిన గణాంకాలు స్పష్టం చేశాయన్నారు. 95 శాతం మంది ప్రాథమిక పాఠశాల స్థాయి వరకు విద్యనభ్యసించినా, ఉన్నత పాఠశాల వరకు వెళ్లింది కేవలం 31 శాతం మంది మాత్రమేనని, కళాశాల స్థాయికి 25 శాతం మంది మాత్రమే వెళ్తున్నారన్నారు. ఇది చాలా ఆవేదన కలిగించే అంశమన్నారు. చరిత్ర తీసుకుంటే మనదేశంలో అప్పట్లో 10 వేల మంది విదేశీయులు విద్యను అభ్యసిస్తే, నేడు మనదేశం నుంచి 6 లక్షల మంది విదేశాలకు ఉన్నత విద్య కొరకు వెళ్తున్నారన్నారు. శ్రీలంకలో 97 శాతం మంది, మాస్కోలో 99.9 శాతం మంది ఉన్నత విద్య అభ్యసిస్తున్నారన్నారు. ప్రభుత్వ పాఠశాలలో మనవద్ద కేవలం 55 శాతం మంది మాత్రమే విద్యనభ్య సిస్తున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యను ప్రైవేట్ పరం చేయాలని చూస్తున్నాయన్నారు. విద్యారంగానికి సంబంధించి కేంద్రం 50 శాతం మేర బకాయిలు ఉంటు న్నాయన్నారు. దీంతో రాష్ట్ర ప్రభుత్వం పై భారం పడి జీతాలు సరైన సమయానికి ఇవ్వలేకపోవటం వంటి సమస్యలు వస్తున్నాయన్నారు. ప్రస్తుతం ఉన్న ప్రభుత్వ విశ్వవిద్యాలయాలు బలోపేతం చేయకుండా ప్రైవేట్ విశ్వ విద్యాలయాలు ఎందుకని ప్రశ్నించారు. ప్రభుత్వ విద్యా సంస్థల్లో ఉన్న ఖాళీ పోస్టులు భర్తీచేయడం లేదన్నారు. రాష్ట్రంలో విద్యారంగాన్ని అభివృద్ధి చేయడానికి ప్రపంచం లోని ఇతర దేశాలను చూసి నేర్చుకోనక్కర్లేదని మన దేశంలో తమిళనాడు, కేరళ, న్యూఢిల్లీలో ఉన్న విద్యా వ్యవస్థను ఆదర్శంగా తీసుకుంటే చాలన్నారు. పాఠశాల, కళాశాల విద్యను ఒకే యాజమాన్యం కింద నిర్వర్తించాల్సి ఉందన్నారు.

రాష్ట్రంలో విద్యారంగాన్ని ప్రైవేట్‌పరం చేసే ప్రయత్నాలు

ఆంధ్రప్రదేశ్‌లో రాష్ట్రంలో విద్యారంగాన్ని పూర్తిగా ప్రైవేట్ పరం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి సత్యనారాయణ మూర్తి ఆవేదన వ్యక్తం చేశారు. ఒక మంత్రికి చెందిన విద్యాసంస్థలో విద్యాశాఖా మంత్రి మాట చెల్లుబాటు కావడం లేదని ఆరోపించారు. ఈ ఇద్దరు మంత్రులు కలసి విద్యారంగాన్ని రాష్ట్రంలో భ్రష్టుపట్టిస్తున్నారన్నారు. ప్రభుత్వ విద్యాసంస్థల్లో అధ్యాపకుల్లో నిబద్ధత ఎక్కువన్నారు. విద్యారంగంలో పెట్టిన పెట్టుబడులు ప్రభుత్వాలు ఉత్పత్తిగా భావించాలన్నారు. చట్టసభల్లో ఉన్నవారు సొంత పనుల కోసమే పనిచేస్తున్నారని ఆరోపించారు. ఉదాహరణకు విశాఖలోని ఏయూకి వచ్చే ప్రాజెక్టులు మరో ప్రైవేట్ యూనివర్సిటీ తన్నుకుపోతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇంకా ప్రారంభం కాని జియో విద్యాసంస్థకి కేంద్రం ఎమినెన్స్ హోదా ఇచ్చిందన్నారు. ప్రైవేట్ విద్యాసంస్థలతో పోటీపడే స్థాయిలో ప్రభుత్వ విద్యాసంస్థల అధ్యాపకులు, విద్యార్థులు ఉన్నారని, కానీ ప్రభుత్వాలు అలసత్వం ప్రదర్శిస్తున్నా యన్నారు. కార్యక్రమంలో ఏయూ వీసీ ఆచార్య జి.నాగేశ్వర రావు, ఎస్‌టీయూ రాష్ట్ర అధ్యక్షులు జోసెఫ్ సుధీర్‌బాబు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి జి.నాగేశ్వరరావుతో పాటు ఉత్తరాంధ్ర జిల్లాలకు చెందిన ఉపాధ్యాయులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



వాతావరణ మార్పులు, నివారణా చర్యలు

ఐరాస భద్రతా మండలి బహిరంగ చర్చ

ఐక్యరాజ్యసమితి: ప్రపంచ శాంతి, భద్రతలపై వాతావరణ మార్పుల ప్రభావం, గ్లోబల్ వార్మింగ్ ప్రభావాన్ని తగ్గించేందుకు తీసుకోవాల్సిన చర్యలపై ఐరాస భద్రతా మండలి శుక్రవారం బహిరంగ చర్చా కార్యక్రమాన్ని నిర్వహి ంచింది. ఈ చర్చా కార్యక్రమానికి సంధానకర్తగా వ్యవహరించిన ఐరాస రాజకీయ వ్యవహారాల ఛీఫ్ రోజ్‌మేరీ డికార్లో మాట్లాడుతూ వాతావరణ మార్పులతో ముడిపడు తున్న ప్రకృతి వైపరీత్యాలు సమీప భవిష్యత్తును మన కళ్లకు కడుతున్నాయన్నారు. ప్రస్తుతం ప్రపంచ వ్యాప్తంగా వున్న కోట్లాది మంది ప్రజలు ఈ వాస్తవాలను గమనిస్తున్నారని ఆమె చెప్పారు. వాతావరణ మార్పుల కారణంగా ఎదురవు తున్న విపత్తులను తట్టుకొనేందుకు ఐరాస చేపడుతున్న రాజకీయ ప్రాంతీయ వ్యూహాలను ఆమె వివరించారు.

విపత్తులపై ముందస్తు అంచనా వ్యవస్థలతో పాటు విశ్లేషణా సామర్థ్యాన్ని బలోపేతం చేయాల్సిన అవసరం వుందని ఆమె చెప్పారు. ఈ దిశగా మనం చెప్పే మాటలన్నీ చేతల రూపంలోకి మార్చటం అత్యంత ప్రధానమని ఆమె అన్నారు. ప్రధాన దేశాలు, సంస్థలు వాతావరణ సంబంధిత ముప్పులను ఎదుర్కోవాల్సిన అవసరాన్ని దీర్ఘకాలం క్రితమే గుర్తించాయన్నారు. ఇప్పుడు మనం ఈ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు కృతనిశ్చయంతో వ్యవహరించాల్సిన అవసరం వుందని. దీనిపై ప్రజలను చైతన్యవంతులను చేయాలని, ముఖ్యంగా బడుగు, బలహీన వర్గాలకు చెందిన ప్రజలు మన ప్రయ త్నాలకు కేంద్ర బిందు వు కావాలని ఆమె సూ చించారు. ఈ కార్యక్ర మానికి ఫోన్ ద్వారా తన సందేశాన్ని పంపిన ఐరాస అభివృద్ధి కార్యక్రమం (యుఎన్‌డిపి) అడ్మినిస్ట్రేటర్ అచిమ్ స్టీనర్ మాట్లాడుతూ వాతావరణ మార్పులు కేవలం వాతావర ణాన్ని మాత్రమే కాక జీవ వైవిధ్యాన్ని కూడా ఛిద్రం చేస్తున్నా యని, ప్రపంచం ఈ సవాలును గమనించటం లేదని అన్నారు. వాతావరణ మార్పులకు సంబంధించిన శాస్త్రీయ ఆధారాలను భద్రతా మండలి గుర్తించాలని, గ్లోబల్ వార్మిం గ్‌ను కట్టడి చేసేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలని ఆయన పిలుపునిచ్చారు. వాతావరణ మార్పుల ప్రభావం నుండి ప్రజలను కాపాడేందుకు అవసరమైన ప్రాజెక్టుల్లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. చరిత్రలో తొలిసా రిగా ఈ సదస్సుకు ఐరాస వాతావరణ విభాగం (డబ్ల్యు ఎంఓ) భద్రతా మండలి సభ్యులను ఆహ్వానించి వాతావరణ మార్పులపై అవగాహన కల్పించేందుకు ప్రయత్ని చటం విశేషం. శుక్రవారం జరిగిన కార్యక్రమంలో డబ్ల్యు ఎంఓ చీఫ్ సైంటిస్ట్ పావెల్ కాబట్ తాను సేకరించిన శాస్త్రీయ సమా చారాన్ని చర్చకు పెట్టారు. ఈ సదస్సులో భద్రతా మండలి సభ్యదేశాలకు చెందిన 75 మంది ప్రతినిధులతో పాటు ఐరాస సభ్యదేశాలకు చెందిన నేతలు కూడా పాల్గొన్నారు.

చిన్న పట్టణాలపై.. పెద్ద ఫోకస్

- రిటైల్ విస్తరణకు రిలయన్స్ కొత్త వ్యూహం
- దిగ్గజాల వ్యాప్తి లేని ప్రాంతాలే టార్గెట్...
- వేగంగా విస్తరణ అవకాశమూ కారణం..
- లక్ష్యం మధ్యతరగతి ప్రజల మార్కెట్
- భవిష్యత్తులో చిన్నవ్యాపారులకు చిక్కులే!



ముంబై: భారత్‌లో వేగంగా విస్తరిస్తున్న రిటైల్ రంగంలో పాగా వేసేందుకు కార్పొరేట్ దిగ్గజం రిలయన్స్ వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే జియో అనుసంధానంతో ప్రత్యేక ఈ కామర్స్ ప్లాట్‌ఫామ్‌ను అందుబాటులోకి తేనున్నట్టుగా రిలయన్స్ ప్రకటించింది. ఇందుకు తగ్గట్టుగా దేశ వ్యాప్తంగా ఏర్పాట్లు చేసు కుంటోంది. రిటైల్ వ్యాపార విస్తరణకు గాను ఇప్పటికే దేశ వ్యాప్తంగా ప్రముఖ చిన్న వ్యాపారులతో చేతులు కలపాలని భావిస్తున్న సంస్థ దీనికి అవసరమైన సమాచార సేకరణ చేసి సంప్రదింపులు ప్రారంభించినట్టుగా సమాచారం. అయితే మిగతా సంస్థల్లా కాకుండా రిలయన్స్ గ్రామీణ భారతాన్ని లక్ష్యంగా చేసుకొని విస్తరణను వేగంగా ముందుకు తీసుకుపోవాలని భావిస్తున్నట్టు సమాచారం. దీనికి గాను సంస్థ మూడో శ్రేణి, నాలుగో శ్రేణి నగరాలపై ప్రధానంగా దృష్టి సారిస్తున్నట్టుగా తెలుస్తోంది. 75,000 జనాభా దాటిన ప్రతి నగరానికి రిటైల్ వ్యాపార విస్తృతి జరిపేలా కంపెనీ వ్యూహం రచిస్తోంది. ఇప్పటికే మార్కెట్లో రిటైల్ దిగ్గజాలుగా వెలుగొందుతున్న సంస్థల వ్యాప్తి పెద్ద నగరాలు, ద్వితీయ శ్రేణి నగరాలకే పరిమితమైనందున.. రిలయన్స్ అందుకు భిన్నంగా మూడో శ్రేణి, నాలుగో శ్రేణి నగరాలను తమ వ్యాప్తికి వేదికలుగా వాడుకోవాలని భావిస్తున్నట్టుగా తెలుస్తోంది. పోటీలేని చోట కొత్తగా స్టోర్స్ ఏర్పాటు చేస్తే ప్రజలకు చేరడం సులువవుతుందన్నది సంస్థ వ్యూహంగా కనిపిస్తోంది. దీనికి తోడు సంస్థ పెద్దనగరాల్లోని దిగ్గజ సంస్థలతో పోటీ పడేందుకు కూడా వ్యూహాలను తయారు చేసుకొని వాటిని దశల వారీగా ముందుకు తీసుకుపోనుంది. దీంతో చిన్న పట్టణాలలోని చిన్న వర్తకుల వ్యాపార అవకాశాలకు గండి పడే అవకాశం ఉందని మార్కెట్ విశ్లేషకులు చెబుతున్నారు. రిలయన్స్ మోడల్ కారణంగా కేవలం రిలయన్స్‌తో సహా ఇతర రిటైల్ దిగ్గజ సంస్థల నెట్‌వర్క్‌తో అనుసంధానమైన సంస్థలే భవిష్యత్తులో నిలిచే అవకాశం ఉందని.. చిన్న వ్యాపారులు, కుటుంబ వ్యాపారులకు రిలయన్స్ మోడల్‌తో పెద్ద దెబ్బేనని వారంటున్నారు.

మెరుగైన ఆదాయమే కారణం..

రిలయన్స్ రిటైల్ సంస్థ దేశ వ్యాప్తంగా దాదాపు 540 స్టోర్లను కలిగి ఉంది. రిలయన్స్ ఫ్రెష్, రిలయన్స్ స్మార్ట్, క్విక్ మార్కెట్ల పేరుతో సంస్థ ఈ రిటైల్ స్టోర్లను నిర్వహిస్తోంది. డిసెంబరుతో ముగిసిన త్రైమాసికంలో సంస్థకు రిఫైనరీ తరువాత మూడో అతిపెద్ద ఆదాయపు వనరుగా రిటైల్ వ్యాపారం రిలయన్స్‌కు ముఖ్య దన్నుగా నిలుస్తోంది. అందుబాటులో ఉన్న లెక్కల ప్రకారం సంస్థకు దాదా పు17% ఆదాయం రిటైల్ రంగం నుంచే లభిస్తుండడం విశేషం. చిన్న పట్టణాల్లో మధ్య తరగతి ప్రజను ఆకర్షించడమే లక్ష్యంగా కంపెనీ ముందుకు సాగుతోంది. ఇందుకు సంబంధించి సంస్థ మిడియాల్లో ప్రచారాన్ని మొదలు పెట్టింది. వ్యాపార విస్తరణలో భాగంగా కంపెనీ తెలుగు రాష్ట్రాలలోని వరంగల్, కర్నూలు, విజయ నగరం, కాకినాడతో సహా వివిధ పట్టణాలలో తొలిసారిగా రిపబ్లిక్‌డేను పురస్కరిం చుకొని ఐదు రోజుల 'ఫుల్ పైసా వసూల్' కార్యక్రమాన్ని ప్రారంభించింది.

ఈకామర్స్ వ్యాప్తికి వ్యూహాలు..

మొదటి దశలో దేశంలోని దాదాపు 10వేల రిలయన్స్ రిటైల్ స్టోర్లతో వ్యాపారులను అను సంధానిస్తారు. వీరికి కామన్ ఇన్వెంటరీ మేనేజ్‌మెంట్ వ్యవస్థను సమకూర్చనున్నారు. దీంతోపాటు సరళంగా ఉండేలా చెల్లింపు టెర్మినల్స్‌ను కూడా ఏర్పాటు చేయనున్నారు. ఇది ఈ కామర్స్ దిగ్గజాలకు నేరుగా పోటీ ఇస్తుంది. ఇప్పటికే రిలయన్స్ రిటైల్ నెట్‌వర్క్ మొత్తం 6,500 ఊళ్లకు విస్తరించింది. దీనికి 50 గోదాములు కూడా ఉన్నాయి. దీంతో పంపిణీ వ్యవస్థను మెరుగ్గా నిర్వహించే అవ కాశం ఉంది. భారత్‌లోని మొత్తం 500 మిలియన్ల మంది ఇంటర్నెట్ విని యోగదారుల్లో 200 మిలియన్లు గ్రామీణ ప్రాంతాల వారు. వీరిలో చాలా మంది నెలకు ఒకసారి మాత్రమే ఆన్‌లైన్‌లో కొనుగోళ్లు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో వీరి సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే చౌకైన 4జీ సేవలతో జియో గ్రామీణ ప్రాంతాల్లోకి చొచ్చుకుపోయింది. ఈ నేపథ్యంలో పల్లెలు, చిన్న పట్టణా ల్లోని దుకాణాలు కూడా హైబ్రీడ్ ఆఫ్ లైన్ ఆన్‌లైన్ మోడల్స్‌లో వినియోగ దారులతో లావాదేవీలు జరిపే అవకాశం ఏర్పడింది. ఆన్‌లైన్ వినియోగదారుల సంఖ్య ఈ ఏడాదిలోనే 120 మిలియన్లను దాటవచ్చని అంచనా.

ప్రధాన కారణాలు ఇవేనా..

పెద్ద నగరాలతో పాటు చిన్న పట్టణాలకు కూడా రిలయన్స్‌ను విస్తరించడానికి ప్రధాన కారణం గ్రామాలు, చిన్న పట్టణాలలోని ప్రజల ఆదాయం పెరగడమేనని తెలుస్తోంది. ప్రభుత్వ అమలు చేస్తున్న వివిధ ఆర్థిక లబ్ది చేకూర్చే సంక్షేమ పథకాలతో పాటు, పింఛన్లు పెరగడం, మెరుగైన వర్షపాతంతో సాగు ఆదాయం పెరుగుతుండడం కూడా రిలయన్స్ నిర్ణయానికి కారణంగా తెలుస్తోంది. దీనికి తోడు చిన్న పట్టణాలకు పక్కనే ఉన్న గ్రామాల నుంచి వస్తులను, వ్యవసాయ ఉత్పత్తులను తరలించి విక్రయించడం తక్కువ ఖర్చు, ప్రయాసతో కూడుకున్న పని కావడం కూడా ఇందుకు మరో కారణంగా తెలుస్తోంది. ఇప్పటికే రిటలై దిగ్గజాలుగా ఉన్న సంస్థలు తమ వ్యాపారాన్ని విస్తరించక ముందే ఎక్కువ జనాభా ఉన్న చిన్న పట్టణాలలో తమ వ్యాప్తిని పెంచుకోవడం కూడా ఒక కారణంగా కనిపిస్తోంది.

బీసీలకు పెద్దన్నలా...

(మొదటిపేజీ తరువాయి)

26ను అమలు చేస్తామని తెలిపారు.

విదేశీ విద్యకు రూ.15 లక్షలు

బీసీ విద్యార్థులు విదేశాల్లో చదువుకునేందుకు ప్రస్తుతం ఇస్తున్న రూ.10 లక్షలను రూ.15 లక్షలకు పెంచనున్నట్లు చంద్రబాబు వెల్లడించారు. బీసీ విద్యార్థుల కోసం రాష్ట్రంలో 69 రెసిడెన్షియల్ పాఠశాలలను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.100 కోట్లతో అత్యంత వెనుకబడిన కులాల (ఎంబీసీ) కార్పొరేషన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఎంబీసీలకు ప్రస్తుతం ఇస్తున్న రూ.30 వేల రుణాలను రూ.50 వేలకు పెంచటంతోపాటు ఆ కుటుంబాలకు 100 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ను అందిస్తామన్నారు. స్వయం ఉపాధి అర్హత వయస్సును 60 ఏళ్లకు పెంచుతామని చంద్రబాబు హామీ ఇచ్చారు. చేనేతకు 100 యూనిట్ల ఉచిత విద్యుత్‌ను 150 యూనిట్లకు పెంచనున్నట్లు తెలిపారు. గీత కార్మికులకు రూ.35 కోట్లు, రజకులకు రూ.70 కోట్లు ఇవ్వగా, మత్స్యకారులకు రూ.4 వేల భృతి చెల్లిస్తున్నట్లు తెలిపారు. బీసీలకు పలు కార్పొరేషన్ల ద్వారా అందిస్తున్న కార్ల సబ్సిడీని 25 శాతానికి పెంచనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలో 175 ఎంఎస్ఎంఈలను ఏర్పాటు చేసి ప్రత్యేక ప్రోత్సాహకాలను అందించటం ద్వారా బీసీలను పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దుతామని తెలిపారు.



జయహో బీసీ సభలో అభివాదం చేస్తున్న చంద్రబాబు, మంత్రులు

గొర్రెలకు బీమా ప్రీమియాన్ని ప్రభుత్వమే భరిస్తుం దని సభలో చంద్రబాబు ప్రకటించారు. జనాభాలో 50 శాతంగా ఉన్న బీసీలకు ఉద్యోగాల్లో 27 శాతం రిజర్వేషన్లను అమలు చేశామని తెలిపారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలోని 25 పార్లమెంట్, 150 అసెంబ్లీ స్థానాల్లో టీడీపీ విజయం సాధిస్తుందని చెప్పారు. బీసీలు సంఘటితశక్తిగా మారితే తిరుగుండదని, ప్రతిపక్షాల గుండెల్లో రైళు పరిగెత్తించాలని పిలుపునిచ్చారు.

హోదా కోసం పోరాటం

రాష్ట్ర విభజన నేపథ్యంలో కట్టుబట్టలతో వచ్చామని, అందుకే రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వాలని, విభజన హామీలను అమలు చేయాలని చంద్రబాబు డిమాండు చేశారు. వీటి సాధన కోసం పోరాటం చేస్తామన్నారు. పోలవరం ప్రాజెక్టు డీపీఆర్ పంపించినా, కేంద్రం దానిని అమలు చేయటంలేదని విమర్శించారు. ఈ సంద ర్భంగా ఆయన బీజేపీతోపాటు వైసీపీ, జనసేనపై విమర్శలు గుప్పించారు. బీసీలు వెన్నంటి ఉన్నంత వరకు ఎవరూ ఏమీ చేయలేరన్నారు. జయహో బీసీ పేరుకు తగ్గట్టు తొలి ప్రాధాన్యం బీసీలకే ఇస్తానని చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సభలో ఉప ముఖ్యమంత్రులు కేఈ కృష్ణమూర్తి, నిమ్మకాయల చినరాజప్ప, మంత్రులు యనమల రామకృష్ణుడు, కాల్వ శ్రీనివాసులు, కె అచ్చెన్నాయుడు, కళా వెంకట్రావు, పితాని సత్యనారాయణ, దేవినేని ఉమామహేశ్వరరావు, పరిటాల సునీత, నారా లోకేష్ ఎంపీలు మాగంటి మురళీ మోహన్, కింజరాపు రామ్మోహన్నాయుడు, కొనకళ్ల నారాయణ, మేయర్ పంతం రజనీ శేషసాయి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పొరేషన్, ఫెడరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు పాల్గొన్నారు.

మార్పు కోసం పోరు

(మొదటిపేజీ తరువాయి)

నేను సీఎం కావాలని అనుకోవడం లేదు. వారసత్వ రాజకీయాలకు తావులేదు. ప్రజల కోసం చావడానికి సిద్ధమై వచ్చా. నాలాంటి వారు మౌనంగా ఉంటే అవినీతిపరులు రాజ్యమేలుతారు' అని పవన్ పేర్కొన్నారు. పాలకులు చేసిన తప్పులకు తెలంగాణ ప్రజలు మనల్ని ద్రోహులుగా చూశారన్నారు. యువతను అన్ని పార్టీలు ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయని విమర్శించారు. వచ్చే 30 ఏళ్లు తానే సీఎం కావాలని జగన్, మళ్లీ నేనే రావాలి.. నా తరువాత నా కొడుకు రావాలని చంద్రబాబు తాపత్రయ పడుతున్నారన్నారు. రాష్ట్రంలో అవినీతిని పూర్తిస్థాయిలో తగ్గించకపోయినా కనీసం పది శాతమైన తగ్గిస్తామన్నారు. ఒక్క వార్డు మెంబరు లేకపోయిన ఇంత మంది ప్రజలు వచ్చేది ఒక్క జనసేన పార్టీకే అని పేర్కొన్నారు. పాతగుంటూరులో డయేరియాతో 20 మంది చనిపోయారని, రాజధాని నగరంలోనే కలుషిత నీటితో చావులా? మంచినీరు అందించలేని పాలన ఎందుకంటూ చంద్రబాబును ప్రశ్నించారు. వామపక్షాలు దేశభక్తులతో సమానమనీ, అందుకే వారితో కలిశానని చెప్పారు. మేధావులు, ఆర్థికవేత్తలు అంతా కనుమరుగై పోయారని, రాజకీయాలలోకి రావాలంటేనే భయపడుతున్నారన్నారు. 'నాకు అధికారం కావాలనుకుంటే గత ఎన్నికలలోనే నన్ను ఆపేవారెవరూ లేరు. అనుభవం రావాలనే గత ఎన్నికలలో పోటీకి దిగలేదు. నన్ను ఎవరూ బెదిరించలేరు. అన్నింటికి సిద్ధపడే రాజకీయాల్లోకి వచ్చా. నిన్న తెలంగాణ నేతలతో మాట్లాడాను. అందరితో మర్యాదగా ఉంటాను. అలాగని ఎవరికీ తలవంచే వాడిని కాదు. నలిపేయడానికి, తొక్కేయడానికి నేనేమీ బలహీనుడిని కాదు. సామరస్యంగా ఉంటాను. నన్ను తొక్కేయాలని చూస్తే నా తలో..ఎదుటివాడి తలో తెగిపడిపోవాల్సిందే. నేను గుంటూరులో పుట్టిన వాడినే. పల్నాటి పౌరుషం నాలోనూ ఉంది. కులాల పేరు చెప్పి నాయకులు బాగుపడుతున్నారు గానీ కులాలు బాగుపడటం లేదు. కులంలో ఎవరో ఒకరిద్దరు తప్పు చేస్తే కులం మొత్తాన్ని మనం తప్పుపట్టడం సరికాదు' అని పవన్ చెప్పారు. మీ పదవుల కోసం జనసేన కావాలి.. మీరు అధికారంలోకి రావడానికి జనసేన కావాలిగానీ..జనసేన సభలు నిర్వహించుకోకూడదా అని పవన్ పరోక్షంగా చంద్రబాబును ప్రశ్నించారు. డ్వాక్రా మహిళలు డబ్బు కోరుకోవడం లేదని, జీవితాలు బాగుపడాలని కోరుకుంటున్నారన్నారు. పాఠశాలలు, వైద్యశాలలు ప్రజలందరికీ అందుబాటులో ఉండాలన్నారు. త్వరలో గుంటూరు మిర్చియార్డు రైతులతో సమావేశమవుతానన్నారు. 'మీరు ఎప్పుడు నాకు సీఎంగా అవకాశం ఇస్తారో తెలియదు కానీ మీ కోసం నేను జీవితాంతం పోరాటం చేస్తానని పవన్ అన్నారు. మంత్రి గంటా లాంటి వ్యక్తుల వల్లే ప్రజారాజ్యం కనుమరుగైందని విమర్శించారు. గంటా కోసం భీమిలిలో ప్రచారం చేశానని, ఇప్పుడు ఆయన జనసేన సభలకు ఆటంకాలు సృష్టిస్తున్నారన్నారు. జగన్, చంద్రబాబుతో తనకు వ్యక్తిగత వైరమేమీలేదన్నారు. 2019 ఎన్నికలు చాలా క్లిష్టంగా ఉంటాయన్నారు. గుంటూరు జిల్లాలో బలమైన నాయకులు ఉన్నారని, 2014లో తోట చంద్రశేఖర్ తన వల్లే ఓడిపోయారని తెలిపారు. తోట చంద్రశేఖర్ ఓడిపోయిన గుంటూరు నుంచే 2019లో గెలిపిస్తానని మాట ఇచ్చానని పేర్కొన్నారు. నాదెండ్ల మనోహర్ తెనాలి నుంచే పోటీ చేయనున్నారని ప్రకటించారు. బడుగు, బలహీనవర్గాలను అక్కున చేర్చుకుని అమరావతిని స్వాధీనం చేసుకుంటామని, అమరావతి గడ్డపై జనసేన జెండాను ఎగురవేస్తామన్నారు. మోడీ హోదాను పక్కన పెట్టారని, గజిని చంద్రబాబుకు అప్పుడప్పుడు ప్రత్యేక హోదా గుర్తుకు వస్తుందని, జగన్‌కు అయితే అసలు హోదానే పట్టదని విమర్శించారు. అందరూ ఒకే వేదికపైకి వచ్చి హోదా కోసం పోరాటం చేద్దామని పిలుపునిచ్చారు. ఆంధ్రప్రదేశ్‌లా ఉత్తరప్రదేశ్‌ను నాలుగు ముక్కలు చేసే వరకు జనసేన నిద్రపోదన్నారు. టీడీపీ, వైసీపీ మర్చిపోతుందేమో గాని ఉత్తరాది అహంకారం దించే వరకు జనసేన విశ్రమించదన్నారు. కార్యక్రమంలో శాసనసభ మాజీ స్పీకర్ నాదెండ్ల మనోహర్, జనసేన ప్రధాన కార్యదర్శి తోట చంద్రశేఖర్, నాయకులు రావెల కిషోర్‌బాబు, బైరా దిలీప్, మాదా రాధా, సయ్యద్ బాబు తదితరులు పాల్గొన్నారు.

విశాలాంధ్ర

క్రీడలు



దుమ్ములేపిన జకోవిచ్

ఆస్ట్రేలియా ఓపెన్ కైవశం

మెల్‌బోర్న్ : అస్ట్రేలియన్ ఓపెన్ విజేతగా ప్రపంచ నంబర్ వన్ నొవాక్ జకోవిచ్ నిలిచాడు. ఫైనల్‌లో ప్రపంచ నంబర్ 2 నాదల్‌పై 6-3, 6-2, 6-3 తేడాతో మూడు వరుస సెట్లలో గెలుపొంది జకోవిచ్ టైటిల్‌ను కైవసం చేసుకున్నాడు. జకోవిచ్ ఆస్ట్రేలియన్ టైటిల్ గెలవడం ఇది ఏడోసారి. ఈ విజయంతో జకోవిచ్ ఖాతాలో 15వ గ్రాండ్‌స్లామ్ టైటిల్ చేరింది. దీంతో గ్రాండ్‌స్లామ్ టైటిళ్లలో పీట్ సంప్రాస్(14)ను నొవాక్ అధిగమించాడు. 15 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో జకోవిచ్ మూడో స్థానంలో ఉన్నాడు. 17 గ్రాండ్‌స్లామ్ టైటిళ్లతో నాదల్ రెండో స్థానంలో.. 20 టైటిళ్లతో మొదటి స్థానంలో ఫెదరర్ కొనసాగుతున్నాడు.



'ఇండో మాస్టర్స్' విజేత సైనా

ఈ ఏడాది తొలి టైటిల్

జకార్తా : ఇండోనేషియా మాస్టర్స్ చాంపియన్ టోర్నీ విజేతగా భారత బ్యాడ్మింటన్ క్రీడాకారిణి, తెలుగు తేజం సైనా నెహ్వాల్ నిలిచింది. ఈ టోర్నీ ప్రారంభం నుంచి అదరగొట్టిన సైనా ఫైనల్స్‌లో కరోలినా మారిన్‌తో తలపడింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో మారిన్ 10-4తో ముందంజలో ఉన్నప్పటికీ రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగింది. దీంతో ఇండోనేషియా మాస్టర్స్ చాంపియన్‌ను సైనా గెలుచుకుంది. కొన్ని రోజుల క్రితం జరిగిన మలేసియా మాస్టర్స్ సెమీస్‌లో మారిన్ చేతిలో సైనా పరాజయం పాలైంది. ఇండోనేషియా మాస్టర్స్ చేజిక్కించుకోవడం సైనాకిదే తొలిసారి. దీంతో పాటు ఈ ఏడాది తొలి టైటిల్‌ను సైనా తన ఖాతాలో వేసుకుంది.

మా నాన్నను వారు గుర్తించలేదు

ధ్యాన్‌చంద్‌కు భారతరత్న ఇవ్వకపోవడంతోపై కుమారుడు అశోక్‌కుమార్ ఆవేదన



న్యూఢిల్లీ : హాకీ దిగ్గజం, మేజర్ ధ్యాన్‌చంద్ సేవలను అర్థం చేసుకోవడంలో యూపీఏ, ఎన్‌డీఏ ప్రభుత్వాలు విఫలమయ్యాయని ఆయన కుమారుడు అశోక్ కుమార్ ఆరోపించారు. ధ్యాన్ చంద్‌కు 'భారతరత్న' ఇవ్వాలని పంపించిన నామినేషన్లు తిరస్కరించడంతో ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. 2013లో క్రీడాకారులకు భారతరత్న ఇవ్వాలని నిబంధనలు సవరించిన తర్వాత తొలిసారి సచిన్ టెండూల్కర్‌కు ఈ పురస్కారం అందజేశారు. ఏళ్లుగా ధ్యాన్‌చంద్‌కు దేశ అత్యున్నత పురస్కారం అందించాలని కోరినా ఇంకా ఇవ్వకపోవడం గమనార్హం. 'ప్రపంచమంతా హాకీకి ధ్యాన్‌చంద్ చేసిన సేవలు గుర్తించింది. ఆయన విగ్రహాలను భారత్‌లోనే కాదు బ్రిటన్, ఇంగ్లాండ్‌లోనూ ప్రతిష్ఠించారు. కాంగ్రెస్, బీజేపీ ప్రభుత్వాలు క్రీడా ప్రపంచానికి ఆయన చేసిన సేవలు, తెచ్చిన ప్రతిష్ఠలను అర్థం చేసుకోలేకపోతున్నాయి. మేం బాధపడుతున్నాం. మేమే కాదు క్రీడా ప్రేమికులంతా ధ్యాన్‌చంద్‌కు భారత్‌రత్న ఇవ్వాలని కోరుతున్నారు. ప్రభుత్వం భారత రత్నం విలువను గుర్తించాలి. రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గొద్దు' అని అశోక్ కుమార్ అన్నారు. భారత హాకీకి ప్రపంచంలో ఒక అస్థిత్వం, గుర్తింపు తీసుకొచ్చిన మహానుభావుడు మేజర్ ధ్యాన్‌చంద్. 1928 (ఆమ్‌స్టర్ డ్యామ్), 1932 (లాస్ ఏంజిలెస్), 1936 (బెర్లిన్) ఒలింపిక్స్‌లో దేశానికి వరుసగా మూడు సార్లు స్వర్ణపతకాలు అందించారు.

కుల్దీప్ గుగ్లీని బాగా ఉపయోగిస్తాడు : స్టెడ్



మౌంట్ మాంగనీ : భారత చైనామన్ బౌలర్ కుల్దీప్ యాదవ్‌పై న్యూజిలాండ్ జట్టు కోచ్ గ్యారీ స్టెడ్ ప్రశంసల జల్లు కురిపించాడు. శనివారం న్యూజిలాండ్‌తో జరిగిన రెండో వన్డేలో ఈ ఎడమ చేతి మణికట్టు స్పిన్నర్ ఆ జట్టు బ్యాటింగ్ ఆర్డర్ నడ్డి విరిచి భారత జట్టు విజయంలో కీలక పాత్ర పోషించిన విషయం తెలిసిందే. తొలి వన్డేలో నాలుగు వికెట్లు పడగొట్టిన కుల్దీప్ రెండో వన్డేలో అదే తరహా ప్రదర్శనను పునరావృతం చేసి కివీస్ బ్యాట్స్‌మెన్‌ను కోలుకోలేని దెబ్బతీశాడు. ఈ నేపథ్యంలో కివీస్ కోచ్ గ్యారీ మాట్లాడుతూ.. కుల్దీప్ ఓ తెలివైన బౌలరని కొనియాడాడు. 'ఎడమ చేతి మణికట్టు స్పిన్నర్లు చాలా అరుదు. అతను గూగ్లీలను అద్భుతంగా సంధిస్తాడు. అతన్ని ఎదుర్కొనే మార్గాన్ని కనిపెట్టాం. తొలి వన్డేలో 7 ఓవర్ల వరకు ఒక్క వికెట్ తీయకపోవడంతో కుల్దీప్ బౌలింగ్‌ను మా బ్యాట్స్‌మెన్ సమర్థవంతంగా ఎదుర్కొంటున్నారని భావించాను. కానీ అతని తన కోటా పూర్తయ్యే లోపే మమ్మల్ని దెబ్బతీశాడు. అతనికి చిక్కకుండా మేం ఆడితే మా జట్టుకు విజయం దక్కే అవకాశం ఉంది.' అని చెప్పుకొచ్చాడు. ఇక తొలి వన్డేలో (4/39) అదరగొట్టిన కుల్దీప్.. రెండో వన్డేలోను (4/45)తో రాణించి భారత్ 90 పరుగుల విజయన్నందుకోవడంలో కీలక పాత్ర పోషించాడు. ఈ గెలుపుతో భారత్ ఐదు వన్డేల సిరీస్‌లో 2-0తో ఆధిక్యం సాధించగా మూడో వన్డే సోమవారం జరగనుంది.

68 ఏళ్లకు రిటైరైన క్రికెటర్



హైదరాబాద్: సాధారణంగా అన్ని దేశాల్లోనూ ఉద్యోగ విరమణ వయసు దాదాపుగా 60 ఏళ్లు ఉంటుంది. అదే క్రీడాకారులైతే దాదాపు 40 ఏళ్లలోపే వీడ్కోలు చెప్పేస్తారు. న్యూజిలాండ్ మాజీ క్రికెటర్ ఈవెన్ ఛాట్‌ఫీల్డ్ మాత్రం అందుకు మినహాయింపు! ఆయన 68 ఏళ్ల వయసులో ఆటకు వీడ్కోలు పలికి అందరి చేతా ఔరా అనిపించుకున్నారు. 'ది నానే ఎక్స్‌ప్రెస్'గా గుర్తింపు పొందిన ఛాట్‌ఫీల్డ్ లేటు వయసులో ఈ నిర్ణయం తీసుకున్నారు. వెల్లింగ్టన్‌లో శనివారం నానే ఓల్డ్ బాయ్స్ జట్టుకు ఆడిన తర్వాత క్రికెట్‌కు వీడ్కోలు పలుకుతున్నట్టు ప్రకటించారు. 'ఇది నవ్వు తెప్పించొచ్చు. 68 ఏళ్ల వయసులోనూ నాకు కొన్ని ప్రమాణాలు ఉన్నాయి. నేనా ప్రమాణాల ప్రకారం ఆడకపోతే వీడ్కోలు పలకాలని భావించా' అని ఛాట్‌ఫీల్డ్ అన్నారు. దిగ్గజ క్రికెటర్ రిచర్డ్ హ్యాడ్లీతో 70, 80ల్లో ఆయన బౌలింగ్ చేశారు. తన విధ్వంసకర బ్యాటింగ్‌తో పదకొండో బ్యాట్స్‌మన్‌గా పేరు పొందారు. చివర్లో బ్యాటింగ్‌కు వచ్చి ప్రత్యర్థి జట్టును ఇబ్బంది పెట్టేవారు. ఇంగ్లండ్‌తో 1975లో జెఫ్ హోవర్త్‌తో చివరి వికెట్ 44 పరుగుల భాగస్వామ్యం నెలకొల్పారు. అదే ఆయన అరంగేట్రం మ్యాచ్ కావడం విశేషం. అదే మ్యాచ్‌లో ఛాట్‌ఫీల్డ్ వేసిన రాకాసి బౌన్సర్‌కు ప్రత్యర్థి బ్యాట్స్‌మన్ పీటర్ లీవర్ తల పగిలింది. కాసేపు గుండె కొట్టుకోవడం ఆగిపోయింది. ఇంగ్లండ్ ఫిజియో థెరపిస్టు బెర్నార్డ్ థామస్ సమయస్ఫూర్తితో వెనువెంటనే సీపీఆర్ ప్రక్రియ ద్వారా లీవర్ ప్రాణాలు కాపాడారు. క్రికెట్‌కు వీడ్కోలు పలికే ముందు ఛాట్‌ఫీల్డ్ శతకం సాధించాలని ఆశించారు. కానీ తొలి బంతికే ఔటై గోల్డెన్ డక్‌గా వెనుదిరిగారు. మరో విశేషం ఏమిటంటే తన వీడ్కోలు వార్తకు ఎలాంటి శీర్షిక పెట్టాలో ఆయనే చెప్పారు. ఇంతకీ అదేమిటంటే.. 'నానే ఎక్స్‌ప్రెస్‌లో ఇంధనం అయిపోయింది' అని.

పాక్ కెప్టెన్‌పై వేటు



దుబాయ్: దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఆండిల్ పెహ్లువాకియాపై వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేసిన పాకిస్థాన్ క్రికెట్ జట్టు సారథి సర్ఫరాజ్ అహ్మద్‌పై వేటు పడింది. అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్(ఐసీసీ) నిబంధనావళిని అతిక్రమించిన సర్ఫరాజ్‌పై నాలుగు మ్యాచ్‌ల నిషేధాన్ని విధించింది. దీంతో దక్షిణాఫ్రికాతో జరగబోయే చివరి రెండు వన్డేలు, రెండు టీ20లకు దూరమవనున్నాడు. పాక్ సీనియర్ ఆటగాడు షోయాబ్ మాలిక్ తాత్కాలిక సారథిగా వ్యవహరించనున్నాడు. ఆటగాళ్లను వ్యక్తిగతంగా గానీ, కుటుంబం సభ్యులపై గానీ, వర్ణ, జాతి వివక్షలు, అంపైర్లపై అసహనాన్ని ప్రదర్శిచడం ఐసీసీ ప్రవర్తనా నియమావళిని అతిక్రమించడమేనని పేర్కొంది.

అసలేం జరిగిందంటే..?

దర్బన్ వేదికగా దక్షిణాఫ్రికాతో జరిగిన రెండో వన్డే మ్యాచ్‌లో క్రీడాస్ఫూర్తిని మరిచి పాక్ సారథి సర్ఫరాజ్ అహ్మద్ వర్ణ వివక్ష వ్యాఖ్యలు చేశాడు. దక్షిణాఫ్రికా ఆల్‌రౌండర్ ఆండిల్ పెహ్లువాకియా నలుపు రంగును ఉద్దేశించి వివాదస్పద వ్యాఖ్యలు చేయడం పట్ల మాజీ క్రికెటర్లు, అభిమానులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 'ఏ నల్లోడా.. మీ అమ్మ ఎక్కడ కూర్చుంది. నీకు ఏం కావాలని ఆమెను ప్రార్థించమన్నావ్?' అంటూ ఒళ్లు మరిచి మాట్లాడటం స్టంప్స్ మైక్‌లో రికార్డయ్యాయి. దీనిపై దక్షిణాఫ్రికా జట్టు అధికారికంగా ఫిర్యాదు చేయకపోయినా... ఐసీసీ స్వతంత్ర విచారణ చేపట్టింది. సరదాగా స్లెడ్జింగ్ కాకుండా ఇవి వర్ణ వివక్ష వ్యాఖ్యలు కావడంతో దోషిగా తేలితే సర్ఫరాజ్‌కు పెద్ద శిక్షే పడవచ్చు. మరోవైపు మ్యాచ్ తర్వాతి రోజు సర్ఫరాజ్ దీనిపై క్షమాపణలు కోరాడు. 'మ్యాచ్‌లో అసహనాన్ని ప్రదర్శిస్తూ నేను చేసిన వ్యాఖ్యలతో ఎవరైనా బాధపడితే మన్నించండి. ఎవరినీ కావాలని ఆ మాటలు అనలేదు. మరెవరినీ బాధపెట్టే ఉద్దేశం నాకు లేదు. ప్రపంచవ్యాప్తంగా సహచర క్రికెటర్లను నేను ఎప్పుడైనా గౌరవిస్తాను' అని సర్ఫరాజ్ ట్వీట్ చేసిన విషయం తెలిసిందే.

ఇంజీ కృషితో తగ్గిన శిక్ష

టీ20 జట్టును ప్రకటించినప్పుడు సారథి సర్ఫరాజ్ అహ్మద్‌పై ఐసీసీ నాలుగు మ్యాచ్‌ల నిషేధం విధించిన సంగతి తెలియదని పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) అధికారి ఒకరు తెలిపారు. దక్షిణాఫ్రికా క్రికెటర్ అండిలె ఫెలుక్‌వాయోపై జాతి వివక్ష వ్యాఖ్యలు చేయడంతో సర్ఫరాజ్‌పై వేటు వేశారు. 'ఐసీసీ ఎప్పుడు, ఎలాంటి శిక్ష విధిస్తుందో మాకు తెలియలేదు. ఫెలుక్‌వాయోకు, దక్షిణాఫ్రికా ఆటగాళ్లకు బహిరంగంగా క్షమాపణ చెప్పిన తర్వాత నిషేధం విధిస్తారా లేదా అని సందేహం కలిగింది. సర్ఫరాజ్ తానేం చేశాడో తెలుసుకొనేందుకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేస్తాం. వ్యాఖ్యలు చేసిన వెంటనే క్షమాపణలు చెప్పడం మంచిదైంది. ప్రస్తుత నిషేధం అతడికి జీవిత కాల పాఠంగా ఉంటుంది' అని పీసీబీ వెల్లడించింది. సర్ఫరాజ్‌కు దాదాపు ఎనిమిది మ్యాచ్‌ల వరకు ఐసీసీ నిషేధం విధిస్తారని పీసీబీ అధికారులు భావించారట. కాగా నాలుగు మ్యాచులే నిషేధం విధించడంతో కాస్త సంతోషపడ్డారని తెలిసింది. ప్రస్తుతం దక్షిణాఫ్రికాలోనే ఉన్న పాక్ ప్రధాన సెలక్టర్ ఇంజమామ్.. సర్ఫరాజ్‌కు తక్కువ శిక్ష పడేలా దిద్దుబాటు చర్యలు తీసుకున్నారని తెలిసింది. సఫారీ జట్టులోని హషీమ్ ఆమ్లా, ఇమ్రాన్ తాహిర్‌తో మాట్లాడి తీవ్రతను తగ్గించాడట. ఉద్రిక్తతను పెంచొద్దని విజ్ఞప్తి చేశాడు. సర్ఫరాజ్ వ్యాఖ్యలపై జట్టు సభ్యులంతా మూకుమ్మడిగా ఫిర్యాదు చేయకుండా ఈ ముగ్గురూ ఒప్పించారని తెలిసింది. నేరుగా ఫిర్యాదు చేసుంటే శిక్ష మరింత పెరిగేది.

'కూచ్‌బెహార్'కు ఒంగోలు ఆతిథ్యం

- ఆంధ్ర-విదర్భ మధ్య క్వార్టర్ ఫైనల్ మ్యాచ్
- నిర్ణయించిన బీసీసీఐ



ఒంగోలు : రాష్ట్ర విభజన తర్వాత ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని క్రికెట్ మైదానాలకు మహర్దశ పడుతోంది. దేశవాళీ క్రికెట్‌లో ప్రత్యేక స్థానం ఉన్న కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ మ్యాచ్‌ను ఒంగోలులోని శర్మ క్రికెట్ మైదానంలో నిర్వహించేందుకు బీసీసీఐ నిర్ణయించింది. దేశవాళీ క్రికెట్‌లో రంజీ ట్రోఫీ తర్వాత కూచ్‌బెహర్ ట్రోఫీకి అంతటి ప్రాధాన్యం ఉంది. అండర్-19 విభాగంలో నిర్వహించే ఈ ట్రోఫీలో లీగ్ మ్యాచ్‌లు ముగియడంతో నాలుగు క్వార్టర్ ఫైనల్స్‌కు సంబంధించి వేదికలను బీసీసీఐ ఖరారు చేసింది. ఇందులో భాగంగా ఒంగోలు శర్మ కళాశాలకు చెందిన క్రికెట్ మైదానంలో ఒక క్వార్టర్ ఫైనల్ మ్యాచ్ నిర్వహించేందుకు పచ్చజెండా ఊపింది. ఈనెల 28 నుంచి 31 వరకు జరగనున్న ఆంధ్ర-విదర్భ మ్యాచ్‌ను ఒంగోలు శర్మ క్రికెట్ మైదానంలో నిర్వహించాలని నిర్ణయించింది. మారుమూల ప్రాంతాల్లో క్రికెట్‌కు ప్రాచుర్యం కల్పించేందుకు సాధారణ మైదానాలకు సైతం బీసీసీఐ కొన్ని మ్యాచ్‌లు కేటాయిస్తుంది. నాకౌట్ మ్యాచ్‌లకు మాత్రం పిచ్ తీరు, మైదానంలో సదుపాయాలు, స్థానిక క్రికెట్ సంఘం నిర్వహణ తీరును పరిగణనలోకి తీసుకుని అవకాశాలు ఇస్తోంది. ఆ పరీక్షలన్నీ నెగ్గి శర్మ కళాశాల క్రికెట్ మైదానం కూచ్ బెహర్ ట్రోఫీ క్వార్టర్ ఫైనల్ నిర్వహణకు ఆతిథ్యం సాధించింది. అద్భుతమైన అవుట్ ఫీల్డ్, ఏసీ డ్రెసింగ్ రూం, ఎలక్ట్రికల్ స్కోర్‌బోర్డ్, ఆటగాళ్ల సేదతీరేందుకు ఐస్‌బాత్‌లాంటి సౌకర్యాలు ఇక్కడున్నాయి. బ్యాటింగ్, బౌలింగ్ రెండింటికి మధ్య చక్కని పోరు సాగేలా ఉండే పిచ్ శర్మ కళాశాల క్రికెట్ మైదానానికి ఉన్న మరో ప్రత్యేకత. టీమిండియా నయా సంచలనం పృథ్వీషాను బీసీసీఐ సెలక్ట్ చేసింది ఒంగోలు శర్మ కళాశాల మైదానంలో ఆడిన ఆంధ్ర-ముంబై రంజీ మ్యాచ్ తర్వాతే. అదే మ్యాచ్‌లో ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించిన హనుమ విహారి సైతం ఇటీవల భారత టెస్ట్ జట్టులో చోటు దక్కించుకున్నాడు. ఇదే స్ఫూర్తితో భవిష్యత్‌లో రంజీ నాకౌట్ మ్యాచ్‌లు నిర్వహించే స్థాయికి ఈ మైదానం ఎదుగుతుందని క్రీడాకారులు ఆశాభావం వ్యక్తంచేస్తున్నారు.



సంఘీభావం తెలుపుతున్న కొణతాల రామకృష్ణ, జేవీఎస్ఎన్ మూర్తి తదితరులు

రైల్వేజోన్ ఇవ్వని బీజేపీని సాగనంపుదాం

- రైల్వేజోన్ సాధన సమితి కన్వీనర్ జేవీఎస్ఎన్
- విశాఖలో జనఘోష రైలుయాత్ర ప్రారంభం

విశాలాంధ్ర-విశాఖ సిటీ బ్యూరో : విభజన హామీలు అమలుచేయని బీజేపీ ప్రభుత్వాన్ని సాగనంపాలని, ఏపీకి ప్రత్యేక హోదా సహా విశాఖకు రైల్వేజోన్ ఇవ్వాలని డిమాండు చేస్తూ ఉత్తరాంధ్ర చర్చావేదిక ఆధ్వర్యంలో జనఘోష రైలు యాత్రను చేపట్టారు. యాత్రలో భాగంగా ఆదివారం విశాఖ రైల్వేస్టేషన్ నుంచి ఏపీ ఎక్స్‌ప్రెస్‌లో ఆందోళనకారులు ఢిల్లీకి బయలుదేరారు. విశాఖ కేంద్రంగా రైల్వేజోన్, వెనుకబడిన ఉత్తరాంధ్ర జిల్లాలకు ప్రత్యేక ప్యాకేజీ, విభజన హామీలు అమలు చెయ్యని బీజేపీని రానున్న ఎన్నికలలో బంగాళాఖాతంలో కలపాలని విశాఖ రైల్వేజోన్ సాధన సమితి కన్వీనర్, సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి పిలుపునిచ్చారు. జనఘోష రైలుయాత్ర నిర్వహిస్తున్న మాజీమంత్రి, ఉత్తరాంధ్ర చర్చావేదిక కన్వీనర్ కొణతాల రామకృష్ణకు సీపీఐ సంపూర్ణ మద్దతు తెలిపింది. సీపీఐ తరపున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లి కొణతాల యాత్రకు బాసటగా నిలిచారు. జేవీఎస్ఎన్ మాట్లాడుతూ ఈ ఆఖరి బడ్జెట్‌లోనైనా విశాఖ రైల్వేజోన్ ప్రకటించాలని, గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు. హామీలు తుంగలో తొక్కి ఉత్తరాంధ్ర ప్రజలను, ముఖ్యంగా విశాఖ జిల్లా ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. కొణతాల రామకృష్ణ ఉత్తరాంధ్ర చర్చావేదిక తరపున ఈ నెల 29, 30, 31 తేదీలలో దేశ రాజధాని ఢిల్లీలో నిర్వహిస్తున్న ఈ పోరాటంలో సీపీఐ తరపున తాను స్వయంగా పాల్గొంటానని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా, నగర కార్యదర్శులు బాలేపల్లి వెంకట రమణ, ఎం.పైడిరాజు, జిల్లా నగర సహాయ కార్యదర్శులు జేవీ ప్రభాకర్, జేడీ నాయుడు, కార్యవర్గ సభ్యులు ఎ.విమల, రాజన దొరబాబు, ఎం.రాజబాబు, అర్.శ్రీను, జి.రాంబాబు, ఎస్‌కే రెహ్మాన్, కె.లక్ష్మణరావు, బి.ప్రశాంత్, సీహెచ్ గురుమూర్తి, వై.త్రినాథ్, జి.రవిశేఖర్, ఏఐవైఎఫ్, ఏఐఎస్ఎఫ్, వివిధ రాజకీయ, వామపక్ష పార్టీలు, ప్రజాసంఘాల నేతలు, ప్రతినిధులు కార్యకర్తలు పాల్గొన్నారు.



కిరోసిన్

- తప్పని ఆన్‌లైన్ కష్టాలు
- ఈనెల నుంచే అమల్లోకి ఈ పాస్ విధానం
- గడువులోగా సరఫరా చేయని హోల్‌సేల్ డీలర్లు
- ఆన్‌లైన్ ఆంక్షలతో సరఫరా బంద్

హైదరాబాద్: తెలంగాణలోని చౌక దుకాణాల ద్వారా వినియోగదారులకు పంపిణీ చేస్తున్న కిరోసిన్‌కు ఈనెల కోత పడింది. చాలామందికి పంపిణీ నిలిచిపోయింది. దుకాణాల్లో బియ్యం, కిరోసిన్ సరఫరాలో అక్రమాల నిరోధానికి ప్రభుత్వం చర్యలు చేపట్టిన సంస్కరణలు కిరోసిన్ పంపిణీకి ఆటంకమైంది. బియ్యం పంపిణీలో కొంతవరకు అక్రమాలను నిరోధించినా.. కిరోసిన్ సరఫరాలో మాత్రం కొనసాగుతూనే ఉన్నది. ఈ నేపథ్యంలో కిరోసిన్‌లోనూ అక్రమాలను అరికట్టాలనే ఉద్దేశంతో ఈనెల జనవరి 1 నుంచి ఆన్‌లైన్‌లో ఈ-పాస్ విధానాన్ని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ వర్తింపజేసింది. దీంతో ఈ పాస్ విధానం ద్వారానే అధికారులు లబ్ధిదారులకు కిరోసిన్ పంపిణీకి చర్యలు తీసుకున్నారు. అయితే, ఈ విధానం నెలలో మొదటి 15 రోజులు మాత్రమే పనిచేస్తుంది. ఆ తరువాత అది ఆగిపోతుంది. ఇలా ఉండగా, నెల చివరిలో రేషన్ దుకాణాలకు హోల్ సేల్ డీలర్ల ద్వారా కిరోసిన్ సరఫరా జరుగుతుంది. ఒక్క లీటర్ కిరోసిన్‌పై రూ.8 సబ్సిడీ భరించి రూ.19కే ప్రతినెల 11,500 కిలో లీటర్ల కిరోసిన్‌ను పేదలకు ప్రభుత్వం సరఫరా చేస్తున్న సంగతి తెలిసిందే. రాష్ట్రంలో మొత్తం 85.64లక్షల రేషన్ కార్డులు, 2.75 కోట్ల లబ్ధిదారులు ఉన్నారు. 17,600మంది డీలర్ల ద్వారా వీరికి కిరోసిన్ పంపిణీ జరుగుతున్నది. అయితే, రాష్ట్రంలో ఈ పాస్ విధానం పూర్తి స్థాయిలో అందు బాటులోకి రాకపోవడం, 15 లోగా సరఫరా కాకపోవడంతో 5,500 దుకాణాలకు కిరోసిన్ అందలేదు. దీంతో లబ్ధిదారులుకు పంపిణీ నిలిపిపోయింది. గడువులోగా అందని కిరోసిన్ రేషన్ దుకాణాల్లో అక్రమాలు అరికట్టేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని అమల్లోకి తెచ్చినా, ఆ మేరకు సరకులను రేషన్ దుకాణాలకు చేర్చడంలో అధికారులు విఫలమవుతున్నారనే విమర్శలున్నాయి. ఈ-పాస్ విధానం ద్వారానే బియ్యం పంపిణీ చేస్తుండగా, 15వ తేదీలోగా సరకుల పంపిణీని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈనెల నుంచే కిరోసిన్‌ను అదే గడువులోగా పంపిణీ చేయాలని గతనెల మొదటి వారంలోనే పౌరసరఫరాల శాఖ నుంచి ఆదేశాలు వచ్చినా, క్షేత్రస్థాయిలో ఇది అమలు కావడం కష్టంగా మారింది. ఈనెల నుంచే ఈ-పాస్ విధానాన్ని పౌరసరఫరాల శాఖ కిరోసిన్‌కు వర్తింపజేసినట్టుగా హోల్‌సేల్ డీలర్లకు ముందుగానే సమాచారం ఇచ్చినా, హోల్ సేల్ డీలర్లు సరఫరా చేయడంలో ఆలస్యం చేశారు. దీంతో ఈ నెల 15 సాయంత్రం నుంచి ఈ-పాస్ ఆగిపోవడంతో రేషన్ డీలర్లు కిరోసిన్‌ను సరఫరా చేయలేదు. ఈ కారణంగా ఈనెల కోటా కిరోసిన్ లబ్ధిదారులకు అందలేదు. దీన్ని ఫిబ్రవరిలో ఇస్తారా లేదా అన్న అనుమానం లబ్ధిదారుల్లో నెలకొంది. ఈ విషయంపై అధికారులు స్పష్టత ఇవ్వలేకపోతున్నారు.



శాఖలో సంస్కరణలు

చౌకధరల దుకాణాల ద్వారా లబ్ధిదారులకు అందజేస్తున్న నిత్యావసర సరకుల్లో పారదర్శకత కోసం ప్రభుత్వం దశల వారీగా సంస్కరణలు తీసుకొస్తున్నది. మొదట్లో రేషన్‌కార్డుకు ఆధార్ నెంబర్‌ను అనుసంధానం చేసి బోగస్ కార్డులను ఏరివేసింది. ఆ తర్వాత ప్రయోగాత్మకంగా ఈ-పాస్ మిషన్లను అందుబాటులోకి తెచ్చి వేలి ముద్రల ద్వారా సరకులను పంపిణీ చేస్తున్నది. ఫలితంగా రేషన్ దుకాణాల నుంచి బియ్యం పక్కదారి పట్టడంలో సగానికి పైగా అరికట్టారు. కూలీ పనులు చేసేవారు, కార్మికులు, వృద్ధులకు సంబంధించిన వేలిముద్రలు సరిగ్గా పడకపోవడంతో వారి కోసం ఈ నెల నుంచే ఐరిస్ విధానాన్నీ అమలు చేస్తున్నారు. వినియోగ దారులు వారికి సమీపం లోని ఏ దుకాణం లోనైనా ఈ-పాస్ విధానంతో సరుకులను తీసుకునే వెసులు బాటును కల్పిస్తున్నారు. ప్రతినెల 15వ తేదీలోగానే సరకులు తీసుకునేలా గడువును విధించారు. 15 దాటితే పౌర సరఫరాల శాఖ ఈ-పాస్ యంత్రాలు పనిచేయకుండా నిలిపివేస్తున్నది. ఆ నెలలో సరుకులు తీసుకోని వినియోగదారులు మరో నెలలో సరకులను తీసుకునేందుకు వీల్లేదు. ఏ నెల కోటాను ఆ నెలలోనే తీసుకోవాల్సి ఉంటుంది. దీంతో ఈనెల కిరోసిన్ పొందని వినియోగదారులకు వచ్చే నె?ల అందే అవకాశం లేదు. కిరోసిన్ సరఫరాలో జరిగిన కొంత ఆలస్యానికి 15వ తేదీలోగా అందరికీ కిరోసిన్‌ను అందించలేకపోయామని అధికారులు అంగీకరిస్తు న్నారు. వచ్చే నెలలో పూర్తిస్థాయిలో పంపిణీ చేస్తామని తెలిపారు. బియ్యం, కిరోసిన్ వేర్వేరు సమయాల్లో సరఫరా కావడం, క్షేత్రస్థాయిలో అధికారులు, ఆయిల్ కంపెనీలు, డీలర్లకు మధ్య సమన్వయం లోపించడంతో కిరోసిన్ సరఫరాపై ప్రత్యేక దృష్టి సారించలేకపోతున్నామని, అందువల్లే కిరోసిన్ పక్కదారి పడుతున్నదని తెలిపారు. సరఫరా విధానం మెరుగుపర్చడానికి ప్రస్తుతం పీడీఎస్ కేటాయింపులు జరుపుతున్నట్టే ఇక నుంచి కిరోసిన్ కేటాయింపులు చేస్తామని అన్నారు.

Printed & published by Edupuganti Nageswara Rao on behalf of Visalaandhra Vignana Samithi, Printed at Visalaandhra Press, Chandram Buildings, Machavaram, Vijayawada, Andhra Pradesh. Published at Visalaandhra Vignana Samithi, 33-22-2, Visalaandhra Road, Chuttugunta, Vijayawada - 520004, Andhra Pradesh. EDITOR : MUTYALA PRASAD. RNI No. 1138/57, Postal: Regd. No.VJA: VJ/042/2018-20, Phones : Editorial :2430220, Manager : 2431301, Fax No. 0866 2431780, E-Mail : ap.visalaandhra@gmail.com.